సత్యమేవ జయతే

సాక్షి

'గ్రామాల్లో సంపద పెరగాలి.
పెరిగిన సంపద
గ్రామీణ ప్రజలకే చెందాలి'

WWW.SAKSHI.COM

పేజీలు: 16+8+20 వెల: ₹ 5.00

సంపుటి: 11
సంచిక: 305

శనివారం 26-1-2019

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి స్పోర్ట్స్
శనివారం
26-1-2019



అంతర్జాతీయ స్థాయిలో 19 ఏళ్లుగా భారత కీర్తి పతాకాన్ని ఎగురవేస్తోన్న ఆంధ్రప్రదేశ్ చెస్ క్రీడాకారిణి ద్రోణవల్లి హారిక కెరీర్‌లో మరో కలికితురాయి చేరింది. గ్రాండ్‌మాస్టర్ హారికకు కేంద్ర ప్రభుత్వ పౌర పురస్కారం 'పద్మశ్రీ' లభించింది. 70వ గణతంత్ర దినోత్సవ నేపథ్యంలో శుక్రవారం కేంద్రం పద్మ పురస్కారాలను ప్రకటించింది. క్రీడా విభాగంలో మొత్తం తొమ్మిది మందికి ఈ అవార్డులు రాగా... ఉత్తరాఖండ్‌కు చెందిన పర్వతారోహకురాలు బచేంద్రీ పాల్‌కు 'పద్మభూషణ్' దక్కింది. మిగతా ఎనిమిది మందిని 'పద్మశ్రీ' వరించింది.

'పద్మశ్రీ' హారిక

ఆంధ్రప్రదేశ్ చెస్ స్టార్‌కు కేంద్ర ప్రభుత్వ పౌర పురస్కారం


- పర్వతారోహకురాలు బచేంద్రీ పాల్‌కు 'పద్మ భూషణ్'
- క్రికెటర్ గంభీర్, ఫుట్‌బాలర్ సునీల్ చెత్రి, రెజ్లర్ బజరంగ్, టీటీ ప్లేయర్ శరత్ కమల్‌లకు 'పద్మశ్రీ'
- క్రీడా విభాగంలో తొమ్మిది మందికి 'పద్మ' అవార్డులు

న్యూఢిల్లీ: క్రీడా ప్రపంచంలో తమ ప్రతిభాపాటవాలతో దేశ ప్రతిష్టను ఇనుమడింపజేసిన భారత క్రీడాకారులను కేంద్ర ప్రభుత్వం 'పద్మ' పురస్కారాలతో గౌరవించింది. వివిధ రంగాల నుంచి మొత్తం 112 మందికి ఈ అవార్డులు రాగా... క్రీడా విభాగం నుంచి తొమ్మిది మంది ఉన్నారు. మౌంట్ ఎవరెస్ట్‌ను అధిరోహించిన తొలి భారతీయ మహిళ బచేంద్రీ పాల్‌కు 'పద్మ భూషణ్' లభించింది. ఉత్తరాఖండ్‌కు చెందిన 64 ఏళ్ల బచేంద్రీ పాల్ 1984లో మౌంట్ ఎవరెస్ట్‌ను అధిరోహించారు. గతేడాది కామన్వెల్త్ గేమ్స్, ఆసియా క్రీడల్లో స్వర్ణాలు, ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రజతం గెలిచిన రెజ్లర్ బజరంగ్ పూనియా... 2007 టి20 ప్రపంచకప్, 2011 వన్డే ప్రపంచ కప్ గెలిచిన భారత క్రికెట్ జట్టు సభ్యుడు గౌతమ్ గంభీర్... భారత ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్ సునీల్ చెత్రి... 'ట్రిపుల్ ఒలింపియన్' టేబుల్ టెన్నిస్ ప్లేయర్ ఆచంట శరత్ కమల్... భారత కబడ్డీ జట్టు కెప్టెన్ అజయ్ ఠాకూర్‌లకు 'పద్మశ్రీ' అవార్డులు లభించాయి. గతేడాది కామన్వెల్త్ గేమ్స్‌లో పురుషుల టీమ్ విభాగంలో భారత్‌కు స్వర్ణం దక్కడంలో 36 ఏళ్ల శరత్ కమల్ కీలక పాత్ర వహించాడు. 2016 కబడ్డీ ప్రపంచకప్ భారత్‌కు దక్కడంలో అజయ్ ఠాకూర్ ముఖ్యపాత్ర పోషించాడు. తెలంగాణలోని సికింద్రాబాద్‌లో జన్మించిన సునీల్ చెత్రి జాతీయ పోటీల్లో ఢిల్లీకి ప్రాతినిధ్యం వహిస్తాడు.


అంచెలంచెలుగా...

ఆరేళ్ల ప్రాయంలో చెస్‌లో ఓనమాలు దిద్దుకున్న హారిక ఒక్కో మెట్టు ఎక్కుతూ నేడు అంతర్జాతీయ చెస్‌లో మేటి క్రీడాకారిణిగా గుర్తింపు పొందింది. 1991 జనవరి 12న గుంటూరులో జన్మించిన హారిక 2000లో స్పెయిన్‌లో జరిగిన ప్రపంచ యూత్ చాంపియన్‌షిప్‌లో అండర్–10 బాలికల విభాగంలో రజతం గెలిచి వెలుగులోకి వచ్చింది. ఈ దశలో క్రీడా ప్రేమికులైన హారిక తల్లిదండ్రులు రమేశ్, స్వర్ణ తమ అమ్మాయికి మరింత మెరుగైన శిక్షణ ఇప్పించారు. కోచ్ ఎన్‌వీఎస్ రామరాజు వద్ద శిక్షణ తీసుకుంటూ హారిక మరింత రాటుదేలింది. అనంతరం ప్రపంచ యూత్ చాంపియన్‌షిప్‌లో అండర్–12 విభాగంలో రజత, కాంస్యాలు సాధించింది. 2006లో ప్రపంచ యూత్ చాంపియన్‌షిప్‌లో అండర్–18 విభాగంలో స్వర్ణం... 2008 ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్‌లో పసిడి సాధించిన హారిక... 2009లో ఆసియా మహిళా చాంపియన్‌గా... 2010లో కామన్వెల్త్ చాంపియన్‌గా అవతరించింది. 2011లో గ్రాండ్‌మాస్టర్ (జీఎం) హోదా పొందిన ఆమె వరుసగా మూడు ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో (2012, 2015, 2017) కాంస్య పతకాలను కూడా దక్కించుకుంది. 28 ఏళ్ల హారిక ప్రస్తుతం స్పెయిన్‌లో జరుగుతున్న జిబ్రాల్టర్ అంతర్జాతీయ టోర్నమెంట్‌లో పాల్గొంటోంది. హారికకు 'పద్మశ్రీ' పురస్కారం రావడంపట్ల ఆమె తల్లిదండ్రులు రమేశ్, స్వర్ణ సంతోషాన్ని వ్యక్తం చేశారు.


బచేంద్రీ పాల్


గంభీర్


సునీల్ చెత్రి


బజరంగ్


శరత్ కమల్

క్రీడా పద్మాలు వీరే..

పద్మ భూషణ్: బచేంద్రీ పాల్ (ఉత్తరాఖండ్–పర్వతారోహణ)
పద్మశ్రీ: ద్రోణవల్లి హారిక (ఆంధ్రప్రదేశ్–చెస్); బజరంగ్ పూనియా (హరియాణా–రెజ్లింగ్); సునీల్ చెత్రి (తెలంగాణ–ఫుట్‌బాల్) గంభీర్ (ఢిల్లీ–క్రికెట్); ఆచంట శరత్ కమల్ (తమిళనాడు–టేబుల్ టెన్నిస్); బొంబేలా దేవి (మణిపూర్–ఆర్చరీ); ప్రశాంతి సింగ్ (ఉత్తర ప్రదేశ్–బాస్కెట్‌బాల్); అజయ్ ఠాకూర్ (హిమాచల్‌ప్రదేశ్–కబడ్డీ)

కావాలి... మరో గెలుపు

నేడు న్యూజిలాండ్‌తో రెండో వన్డే

- మార్పుల్లేని జట్టుతో భారత్!
- సౌతీ స్థానంలో సోధిని ఆడించనున్న కివీస్

ఉదయం 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

అలవోక గెలుపుతో న్యూజిలాండ్ పర్యటనలో శుభారంభం చేసిన టీమిండియా... ఆ ఊపును రెండో మ్యాచ్‌లోనూ కొనసాగించేందుకు సమాయత్తం అవుతోంది. అటు బౌలర్లు, ఇటు బ్యాట్స్‌మెన్ సమష్టిగా రాణించడంతో కోహ్లి సేన ఆత్మవిశ్వాసం రెట్టింపైంది. తొలి వన్డేలో స్పిన్నర్ల ప్రతాపాన్ని రుచి చూసిన ఆతిథ్య న్యూజిలాండ్... ఆ మేరకు తమ కూర్పులో మార్పుతో బరిలో దిగనుంది. ఆధిక్యాన్ని మరింత పెంచుకోవాలని భారత్ భావిస్తుండగా... సొంతగడ్డపై పట్టు జారకుండా చూసుకునే ప్రయత్నంలో కివీస్ ఉంది.

మౌంట్ మాంగనీ: సాదాసీదాగా సాగి... తక్కువ స్కోర్లతో అభిమానులను నిరుత్సాహపరిచింది తొలి వన్డే. అయితే, పరుగుల వరద పారే పిచ్‌తో ఆ లోటును సంపూర్తిగా తీర్చేందుకు సిద్ధమైంది మౌంట్ మాంగనీలోని మైదానం. ఈ నెల ప్రారంభంలో ఇక్కడ జరిగిన మ్యాచ్‌ల స్కోర్లను పరిశీలిస్తే... భారత్, న్యూజిలాండ్ మధ్య శనివారం నాటి రెండో వన్డే ప్రేక్షకులను కనువిందు చేయనుండటం ఖాయంగా కనిపిస్తోంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 1–0 ఆధిక్యంలో ఉన్న టీమిండియా గత మ్యాచ్ జట్టునే కొనసాగించనుండగా, న్యూజిలాండ్ పేసర్ టిమ్ సౌతీ స్థానంలో స్పిన్నర్ ఇష్ సోధిని ఆడించే అవకాశం కనిపిస్తోంది. మంచి బ్యాట్స్‌మెన్ ఉన్నప్పటికీ నేపియర్‌లో తడబడి కుప్పకూలిన కివీస్... ఈసారి భారత బౌలర్లను ఎలా ఎదుర్కొంటుందో చూడాలి.

మార్పేమీ లేకుండా...

ఆస్ట్రేలియాతో చివరి వన్డేకు తప్పించిన అంబటి రాయుడును అనూహ్యంగా న్యూజిలాండ్‌తో తొలి వన్డే ఆడించారు. ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా బదులు కుల్దీప్‌ను ఎంచుకున్నారు. ఈ అవకాశాన్ని కుల్దీప్ ఉపయోగించుకున్నాడు. ఇక రాయుడిపై మరోసారి నమ్మకం ఉంచుతూ మార్పుల్లేకుండా రెండో వన్డే ఆడనుంది టీమిండియా. మరోవైపు ఓపెనర్లలో ధావన్ ఫామ్‌లోకి రావడం శుభపరిణామం. 4, 5 వన్డేలు, టి 20 సిరీస్‌కు సారథ్యం చేపట్టనున్నందున ఓపెనర్ రోహిత్ శర్మ ఈ మ్యాచ్‌లో రాణించాల్సిన అవసరం ఉంది. ఆసీస్‌పై తొలి వన్డేలో సెంచరీ తర్వాత అతడు మళ్లీ స్థాయికి తగిన ఇన్నింగ్స్ ఆడలేదు. ఇక్కడి బ్యాటింగ్ పిచ్‌పై వీరిద్దరూ మంచి ప్రారంభం ఇస్తే... కెప్టెన్ విరాట్ కోహ్లి సహా తర్వాత వచ్చే బ్యాట్స్‌మెన్ దానిని మరింత పైకి తీసుకెళ్లే వీలుంటుంది. పేసర్ మొహమ్మద్ షమీ బౌలింగ్ పదునేంటో నేపియర్‌లో కివీస్‌కు తెలిసొచ్చింది. అతడితో పాటు భువనేశ్వర్‌ను ప్రత్యర్థి ఎదుర్కొనలేకపోయింది. వీరితో పాటు కుల్దీప్, యజువేంద్ర చహల్ మణికట్టు స్పిన్ మాయతో చుట్టేస్తే ఆతిథ్య జట్టుకు ఇక్కట్లు తప్పవు.

స్పిన్నర్‌కు అవకాశం

ఫ్లాట్ పిచ్‌పై ఏం జరుగుతుందో తెలుసుకునే లోపే తొలి వన్డేలో కివీస్ కుప్పకూలింది. సొంతగడ్డపై చెలరేగుతారని ఊహించిన బ్యాట్స్‌మెన్ కనీస స్కోర్లూ చేయకలేకపోయారు. కెప్టెన్ విలియమ్సన్ ఒక్కడే పోరాడాడు. రెండో వన్డేలో భారత బౌలింగ్ దళానికి విధ్వంసక గప్టిల్, మున్రో, రాస్ టేలర్, నికోల్స్ ఎలా జవాబిస్తారో చూడాలి. నలుగురు పేసర్లతో బరిలో దిగినా, స్కోరు బోర్డుపై పెద్దగా పరుగులు లేకపోవడంతో వారు చేసేదేమీ లేకపోయింది. భారత స్పిన్నర్ల బౌలింగ్ తీరు చూశాక పొరపాటును గ్రహించినట్లుంది. దీంతో శనివారం మ్యాచ్‌కు సౌతీని తప్పించి స్పిన్నర్ సోధిని ఆడించనుంది. ఏదేమైనా బ్యాట్స్‌మెన్ రాణింపుపైనే న్యూజిలాండ్ విజయావకాశాలు ఆధారపడి ఉంటాయి.

పిచ్, వాతావరణం

మౌంట్ మాంగనీ పిచ్ బ్యాటింగ్‌కు పూర్తిగా అనుకూలం. ఇటీవల న్యూజిలాండ్–శ్రీలంక మధ్య ఇక్కడ జరిగిన రెండు వన్డేల్లోనూ పరుగులు పోటెత్తాయి. తొలుత పేసర్లకు అనుకూలించినా, మ్యాచ్ సాగేకొద్దీ వారి ప్రభావమూ నామమాత్రమే అవుతుంది.



6
ఈ మైదానంలో భారత్, కివీస్ తొలిసారి తలపడనున్నాయి. న్యూజిలాండ్ మాత్రం ఈ వేదికపై ఆరు మ్యాచ్‌లు ఆడింది. మూడింటిలో గెలిచి, మరో మూడింటిలో ఓడిపోయింది.

తుది జట్లు అంచనా

భారత్: రోహిత్, ధావన్, కోహ్లి (కెప్టెన్), రాయుడు, ధోని, జాదవ్, శంకర్, కుల్దీప్, చహల్, భువనేశ్వర్, షమీ.

న్యూజిలాండ్: గప్టిల్, మున్రో, విలియమ్సన్ (కెప్టెన్), రాస్ టేలర్, లాథమ్, నికోల్స్, సాన్‌ట్నర్, సౌతీ/సోధి, ఫెర్గూసన్, బ్రాస్‌వెల్, బౌల్ట్.

హాకా... హాకా..!

భారత క్రికెటర్లకు మౌంట్ మాంగనీ మైదానంలో 'పౌహిరి' సాంప్రదాయ రీతిలో స్వాగతం లభించింది. ఇందులో భాగంగా స్థానిక మావోరీ తెగకు చెందిన వారు ముందుగా 'హాకా డ్యాన్స్'ను టీమిండియా ఆటగాళ్ల ముందు ప్రదర్శించారు. ఆవేశంగా రెండు కాళ్లతో నేలను బలంగా కొట్టడంతో పాటు 'హాకా హాకా' అంటూ గట్టిగా అరవడం ఈ డ్యాన్స్‌లో కనిపిస్తుంది. అనంతరం ఎదురెదురుగా వెళ్లి షేక్‌హ్యాండ్ ఇవ్వడం సహా ఒకరి నుదురు, ముక్కులను మరొకరి నుదురు, ముక్కుతో రాయడం కూడా పౌహిరిలో భాగమే. దీనిని 'హోంగి'గా వ్యవహరిస్తారు. వేర్వేరు క్రీడాంశాలకు చెందిన న్యూజిలాండ్ ఆటగాళ్లు తరచుగా దీనిని మైదానంలో ప్రదర్శిస్తుండగా... జాతీయ రగ్బీ టీమ్ మాత్రం 'హాకా'కు బాగా ప్రాచుర్యం కల్పించింది. కోహ్లి మైదానానికి రాకపోవడంతో రోహిత్ శర్మ జట్టును ముందుండి నడిపించాడు. ఇది చాలా సరదాగా అనిపించిందని, వారి దీవెనలు అందుకున్నట్లుగా అనిపించిందని దీనిపై శిఖర్ ధావన్ వ్యాఖ్యానించాడు.



రంజీ ఫైనల్లో విదర్భ

వాయనాడ్ (కేరళ): తొలిసారి రంజీ ట్రోఫీ సెమీఫైనల్లో అడుగు పెట్టి మరో అడుగు ముందుకు వెళ్లాలనుకున్న కేరళ ఆశలు ఫలించలేదు. డిఫెండింగ్ చాంపియన్ విదర్భ ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా రెండో రోజే మ్యాచ్‌ను ముగించి ఫైనల్లోకి అడుగు పెట్టింది. రెండో ఇన్నింగ్స్‌లోనూ ఉమేశ్ యాదవ్ (5/31) పేస్‌కు బ్యాట్స్‌మెన్ చేతులెత్తేయడంతో కేరళ 91 పరుగులకే కుప్పకూలింది. ఫలితంగా ఇన్నింగ్స్, 11 పరుగుల తేడాతో విదర్భ ఘన విజయం సాధించింది. ఓపెనర్ అరుణ్ కార్తీక్ (36; 5 ఫోర్లు, సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలవగా, ఎనిమిది మంది ఒక అంకె స్కోర్‌కే పరిమితమయ్యారు. ఉమేశ్‌కు తోడుగా రజనీశ్ గుర్బాని 4 వికెట్లతో చెలరేగాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 171/5తో శుక్రవారం ఆట కొనసాగించిన విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 208 పరుగులకు ఆలౌటై 102 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. కేరళ పేసర్ సందీప్ వారియర్‌కు 5 వికెట్లు దక్కాయి.

ఆధిక్యం ఎవరికో...

బెంగళూరు: కర్ణాటక, సౌరాష్ట్ర మధ్య జరుగుతున్న రెండో సెమీఫైనల్లో ఆధిక్యం కోసం ఇరు జట్లు పోరాడుతున్నాయి. రెండో రోజు ఆట ముగిసేసరికి సౌరాష్ట్ర తమ తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్ల నష్టానికి 227 పరుగులు చేసింది. స్నెల్ పటేల్ (85; 15 ఫోర్లు) అర్ధసెంచరీ సాధించగా... షెల్డన్ జాక్సన్ (46; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), పుజారా (45; 3 ఫోర్లు, సిక్స్) ఫర్వాలేదనిపించారు. రోనిత్ మోరె 5 వికెట్లు పడగొట్టాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 264/9తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన కర్ణాటక మరో తొమ్మిది పరుగులు జోడించి 275 పరుగులకు ఆలౌటైంది. ప్రస్తుతం చేతిలో 3 వికెట్లు ఉన్న సౌరాష్ట్ర మరో 48 పరుగులు వెనుకబడి ఉంది. సీనియర్ బ్యాట్స్‌మన్ అర్పిత్ (26 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉన్నాడు. ఈ నేపథ్యంలో ఆధిక్యం ఎవరికి లభిస్తుందనేది ఆసక్తికరం.

ఆసీస్‌కు ఆధిక్యం

బ్రిస్బేన్: మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్ ట్రావిస్ హెడ్ (187 బంతుల్లో 84; 10 ఫోర్లు), లబ్‌షేన్ (150 బంతుల్లో 81; 3 ఫోర్లు) కీలక అర్ధ సెంచరీలతో రాణించడంతో... శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టుపై ఆస్ట్రేలియాకు పట్టు చిక్కింది. ఓవర్‌నైట్ స్కోరు 72/2తో ఆట రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్ 323 పరుగులకు ఆలౌటైంది. ఫలితంగా ఆ జట్టుకు 179 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. లంక బౌలర్లలో సురంగ లక్మల్ 5 వికెట్లు పడగొట్టాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక ఆట ముగిసే సమయానికి వికెట్ కోల్పోయి 17 పరుగులు చేసింది. ప్రస్తుతం ఆ జట్టు మరో 162 పరుగులు వెనుకబడి ఉంది.

హోల్డర్ సెంచరీ

బ్రిడ్జ్‌టౌన్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో వెస్టిండీస్ విజయంపై కన్నేసింది. మ్యాచ్ మూడో రోజు వెస్టిండీస్ తమ రెండో ఇన్నింగ్స్‌లో టీ విరామానికి 6 వికెట్ల నష్టానికి 349 పరుగులు చేసింది. కెప్టెన్ జేసన్ హోల్డర్ (195 బంతుల్లో 155 బ్యాటింగ్; 19 ఫోర్లు, 5 సిక్సర్లు) సెంచరీతో చెలరేగగా, డౌరిచ్ (191 బంతుల్లో 97 బ్యాటింగ్; 8 ఫోర్లు, 1 సిక్స్) కూడా రాణించాడు. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కలిపి విండీస్ ఏకంగా 561 పరుగులు ముందంజలో నిలిచింది. ఫలితంగా ఇంగ్లండ్‌కు అందనంత లక్ష్యాన్ని నిర్దేశించేందుకు సిద్ధమైంది. రెండో ఇన్నింగ్స్‌లో 120 పరుగుల వద్దే విండీస్ ఆరో వికెట్ కోల్పోయినా హోల్డర్, డౌరిచ్ అద్భుతంగా ఆడి భారీ భాగస్వామ్యం నెలకొల్పారు.



జొకో జోరు

తన కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించిన వేదికపై సెర్బియా స్టార్ నొవాక్ జొకోవిచ్ మరోసారి చెలరేగిపోయాడు. సెమీఫైనల్లో తన ప్రత్యర్థికి కేవలం నాలుగు గేమ్‌లు మాత్రమే కోల్పోయిన అతను ఘనవిజయంతో ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్ విభాగంలో ఏడోసారి ఫైనల్లోకి ప్రవేశించాడు. గతంలో ఫైనల్‌కు చేరిన ఆరుసార్లూ విజేతగా నిలిచిన ఈ ప్రపంచ నంబర్‌వన్ ప్లేయర్ ఆదివారం జరిగే ఫైనల్లో మాజీ చాంపియన్ రాఫెల్ నాదల్‌తో అమీతుమీ తేల్చుకుంటాడు. ఈసారీ జొకోవిచ్ గెలిస్తే ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను అత్యధికంగా ఏడుసార్లు సాధించిన తొలి క్రీడాకారుడిగా చరిత్ర పుటల్లోకి చేరుతాడు.

- ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఏడోసారి ఫైనల్లోకి
- సెమీస్‌లో లుకాస్ పుయిపై గెలుపు
- ఆదివారం నాదల్‌తో టైటిల్ పోరు

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్ విభాగంలో జొకోవిచ్ ఏడోసారి ఫైనల్లోకి దూసుకెళ్లాడు. శుక్రవారం రాడ్ లేవర్ ఎరీనాలో జరిగిన సెమీఫైనల్లో జొకోవిచ్ 6–0, 6–2, 6–2తో 28వ సీడ్ లుకాస్ పుయి (ఫ్రాన్స్)పై గెలుపొందాడు. 83 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జొకోవిచ్ అద్వితీయ ఆటతీరుతో అదరగొట్టాడు. మ్యాచ్ మొత్తంలో ఆరు ఏస్‌లు సంధించిన అతను ఒక్క డబుల్ ఫాల్ట్ కూడా చేయకపోవడం విశేషం. ఐదు అనవసర తప్పిదాలు చేసిన అతను ఏడుసార్లు పుయి సర్వీస్‌ను బ్రేక్ చేశాడు. 24 విన్నర్స్ కొట్టిన జొకోవిచ్ నెట్ వద్దకు 14 సార్లు వచ్చి తొమ్మిదిసార్లు పాయింట్ సాధించాడు. గతంలో ఆరుసార్లు ఫైనల్ చేరిన జొకోవిచ్ (2016, 2015, 2013, 2012, 2011, 2008) ఆరుసార్లూ చాంపియన్‌గా నిలువడం విశేషం. ఆదివారం రాఫెల్ నాదల్‌తో జరిగే ఫైనల్లో జొకోవిచ్ గెలిస్తే అత్యధికంగా ఏడుసార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ నెగ్గిన క్రీడాకారుడిగా రికార్డు సృష్టిస్తాడు. గతంలో రాయ్ ఎమర్సన్ (ఆస్ట్రేలియా), ఫెడరర్ (స్విట్జర్లాండ్) ఆరుసార్లు చొప్పున ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను సాధించారు. ముఖాముఖి రికార్డులో జొకోవిచ్ 27–25తో నాదల్‌పై ఆధిక్యంలో ఉన్నాడు. వీరిద్దరు 2012 ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో తలపడగా... జొకోవిచ్ 5 గంటల 53 నిమిషాల్లో నాదల్‌ను ఓడించాడు.



నెగ్గిన వారు నంబర్‌వన్

నేడు మహిళల సింగిల్స్ ఫైనల్
ఒసాకా X క్వితోవా

అద్భుతమైన ఫామ్‌లో ఉన్న పెట్రా క్విటోవా (చెక్ రిపబ్లిక్), నయోమి ఒసాకా (జపాన్) తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ కోసం తలపడనున్నారు. ఈ ఇద్దరిలో ఎవరు గెలిచినా తొలిసారి ప్రపంచ నంబర్‌వన్‌గా నిలుస్తారు.

మధ్యాహ్నం గం. 2 నుంచి సోనీ సిక్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

సెమీఫైనల్లో సైనా

సింధు, శ్రీకాంత్ ఓటమి • ఇండోనేసియా మాస్టర్స్ టోర్నీ

జకార్తా: ఈ సీజన్‌లో వరుసగా రెండో అంతర్జాతీయ టోర్నమెంట్‌లో భారత బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. ఇండోనేసియా మాస్టర్స్ వరల్డ్ సూపర్–500 టోర్నమెంట్‌లో వరుసగా మూడో విజయంతో సైనా తన జోరు కొనసాగించింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ఎనిమిదో సీడ్ సైనా 21–7, 21–18తో పోర్న్‌పవీ చోచువోంగ్ (థాయ్‌లాండ్)పై గెలిచింది. నేడు జరిగే సెమీఫైనల్లో ప్రపంచ ఏడో ర్యాంకర్ హి బింగ్‌జియావో (చైనా)తో సైనా తలపడుతుంది. పోర్న్‌పవీతో జరిగిన మ్యాచ్‌లో సైనా తొలి గేమ్‌లో ఆరంభం నుంచి పూర్తి ఆధిపత్యం చలాయించింది. తొలుత 3–0తో ముందంజ వేసిన ఆమె అదే జోరు కొనసాగిస్తూ ఆధిక్యాన్ని 8–2కి పెంచుకుంది. పోర్న్‌పవీ తేరుకునేలోపే సైనా ఖాతాలో తొలి గేమ్ చేరిపోయింది. రెండో గేమ్‌లోనూ తొలుత 3–0 ఆధిక్యాన్ని సంపాదించిన సైనా ఆ తర్వాత వరుసగా నాలుగు పాయింట్లు కోల్పోయింది. ఆధిక్యం దోబూచులాడినా... కీలకదశలో సైనా పైచేయి సాధించి రెండో గేమ్‌తో సహా మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. మరో క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ మూడో ర్యాంకర్ పీవీ సింధు (భారత్) 11–21, 12–21తో ప్రస్తుత ప్రపంచ, ఒలింపిక్ చాంపియన్ కరోలినా మారిన్ (స్పెయిన్) చేతిలో ఓడింది. 37 నిమిషాల పాటు జరిగిన ఈ పోరులో సింధు ఏ దశలోనూ మారిన్‌కు పోటీనివ్వలేకపోయింది. రెండు గేముల్లోనూ ఒక్కసారి కూడా స్కోరు సమం కాకపోవడం గమనార్హం. పురుషుల సింగిల్స్ విభాగంలో కిడాంబి శ్రీకాంత్ పోరాటం కూడా క్వార్టర్ ఫైనల్లోనే ముగిసింది. జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా)తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో శ్రీకాంత్ 18–21, 19–21తో ఓటమి చవిచూశాడు. 48 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో శ్రీకాంత్ కీలక సమయాల్లో అనవసర తప్పిదాలు చేయడమే కాకుండా నెట్ గేమ్‌లోనూ తడబడి మూల్యం చెల్లించుకున్నాడు.



నేటి సెమీఫైనల్స్

ఉదయం గం.10.30 నుంచి
స్టార్ స్పోర్ట్స్ సెలెక్ట్-1లో ప్రత్యక్ష ప్రసారం

శనివారం 26-1-2019



'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+8+20 వెల: ₹ 5.00

సంపుటి: 11
సంచిక: 305

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


LOT
LOT 150 STORES
REPUBLIC DAY SALE
FREE GIFTS
EASY EMI
CASH BACK
PRICE DROP
LOT BEST DEALS
LOT EXCLUSIVE
ZERO COST ONE TIME
SCREEN REPLACEMENT
ON SELECTED MOBILES
ACCESSORIES
on sale @ ₹1
1 YEAR
BRAND WARRANTY + EXTENDED WARRANTY
SAMSUNG Galaxy J4+ NOW ₹8490/- Old Price ₹9990/-
2GB | 32GB
oppo F9 Pro INDUCTION STOVE FREE
vivo Y93 NEW ARRIVAL ₹101 DOWN PAYMENT @ ₹13990/-
NOKIA Connecting People 3.1+ NOW ₹9999/- Old Price ₹11499/-
3GB | 32GB
honor HOLLY 4+ ANTI THEFT BAG FREE
@ ₹9999/-
LAVA Z60S WIRELESS BLUETOOTH SPEAKER FREE
UPGRADE OFFER
SAMSUNG
Galaxy A9 8GB | 128GB ₹4000/- CASH BACK
Galaxy S9+ 64 GB ₹9000/- CASH BACK
Galaxy Note9 128 GB ₹9000/- CASH BACK
mi
Redmi 6 Pro
3+32 ₹10,299 ₹11,499
4+64 ₹12,499 ₹13,499
Redmi Note 5 Pro
4+64 ₹13,499 ₹15,999
6+64 ₹14,499 ₹17,999
Redmi Y2
3+32 ₹9,299 ₹10,499
4+64 ₹11,499 ₹13,499
LOT
HOT DEAL only @ ₹5999/- SMART JODI
micromax X751 SPORTS BOTTLE FREE
Karbonn only @ ₹1499/- JODI OFFER
Jio ₹501/- Exchange Offer
BRANDED ACCESSORIES AVAILABLE
iPhone
SONY
SAMSUNG
LG
Jabra
SYSKA
SanDisk
mi
Is Your Phone Protected?
BEST HANDSET PROTECTION PLANS
from ₹100/- onwards
BAJAJ FINSERV
upto ₹57,000/-
CASH BACK VOUCHERS FREE
*Conditions Apply
www.lotmobiles.com | Helpline: 1800 123 3567 | Follow us on
GIFTS ON MOBILE PURCHASE
0% DOWN PAYMENT
BAJAJ FINSERV
CAPITAL FIRST
HOME CREDIT
HDB
HDFC BANK
LOT



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 16+8+20 వెల: ₹ 5.00

సంపుటి: 11
సంచిక: 305

శనివారం 26-1-2019

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

భారతరత్న ప్రణబ్‌దా



‘నాకిచ్చిన ఈ గొప్ప గౌరవాన్ని దేశ ప్రజల పట్ల పూర్తి కృతజ్ఞతా భావం, విధేయతతో స్వీకరిస్తున్నా. నేను ఎప్పటికీ చెప్పేదాన్నే మళ్లీ చెబుతున్నా. ఈ గొప్ప దేశ ప్రజలకు నేను చేసిన దానికన్నా నాకే వారు ఎక్కువిచ్చారు’

– ప్రణబ్ ముఖర్జీ

భూపేన్ హజారికా, నానాజీ దేశ్‌ముఖ్‌లకు మరణానంతరం దేశ అత్యున్నత పౌర పురస్కారం

ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం.. వారి సేవల్ని శ్లాఘించిన మోదీ, రాహుల్

- విధేయతతో స్వీకరిస్తున్నా: ప్రణబ్
- అభినందనలు తెలిపిన ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్


న్యూఢిల్లీ:

మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీని దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న వరించింది. జనసంఘ్ నాయకుడు నానాజీ దేశ్‌ముఖ్, అస్సామీ వాగ్గేయకారుడు భూపేన్ హజారికా కూడా ఈ అవార్డుకు ఎంపిక య్యారు. సుమారు నాలుగేళ్ల తరువాత శుక్రవారం కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిష్టాత్మక అవార్డును ప్రకటించింది. ఈ ముగ్గురితో కలిపి ఇప్పటిదాకా భారతరత్న పొందిన ప్రముఖుల సంఖ్య 48కి చేరింది. ప్రణబ్ ముఖర్జీ 2012–17 మధ్య కాలంలో భారత 13వ రాష్ట్రపతిగా పనిచే యగా, దేశ్‌ముఖ్, హజారికాలు మరణా నంతరం ఈ అవార్డుకు ఎంపికయ్యారు. గతేడాది ఆరెస్సెస్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రణబ్ విమర్శలు ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. బీజేపీ మాతృ సంస్థ జనసంఘ్ వ్యవస్థాపకుల్లో దేశ్‌ముఖ్ ఒకరు కాగా, ఈశాన్య భారత్ నుంచి సినీరంగానికి సేవలందించిన ప్రముఖుల్లో హజారికా ఒకరు. దేశ ప్రజలకు తాను చేసిన దానికన్నా ప్రజలే తనకు ఎక్కువిచ్చారని ప్రణబ్ ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేశారు. ‘నాకిచ్చిన ఈ గొప్ప గౌరవాన్ని దేశ ప్రజల పట్ల

మిగతా 4వ పేజీలో ▶

‘సిరివెన్నెల’కు పద్మశ్రీ





హారిక



వెంకటేశ్వరరావు

వ్యవసాయ జర్నలిస్టు యెడవల్లి వెంకటేశ్వరరావు, చెస్ క్రీడాకారిణి హారికకూ పురస్కారాలు

ఈ ఏడాదికిగాను మొత్తం 112 మంది ప్రముఖులను వరించిన పద్మ అవార్డులు

నలుగురికి పద్మవిభూషణ్, 14 మందికి పద్మభూషణ్, 94 మందికి పద్మశ్రీ

– వివరాలు 7లో

శతాబ్దానికొక్క అవకాశం!



ఓటు హక్కు వినియోగించుకోవడం పవిత్ర కార్యం. శతాబ్దంలో ఒక్కసారి మాత్రమే దక్కే అరుదైన అవకాశంగా భావించండి. దేశానికి ఇది పరీక్షా సమయం. ఇప్పుడు వేసే ఓటు ఈ శతాబ్దంలో దేశం గతిని నిర్ణయిస్తుంది. పేదలకు రిజర్వేషన్ల కల్పన గాంధీ కలల సాకారం దిశగా పడిన అడుగు.

– 70వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతినుద్దేశించి రాష్ట్రపతి కోవింద్ ప్రసంగం


7 లో

ప్రతిపక్షం ఓట్లపై వేటు!

- విజయనగరం జిల్లాలో సర్వే పేరుతో ఓట్లు తొలగించే యత్నం
- ప్రైవేటు సిబ్బందిని పట్టుకుని పోలీసులకు అప్పగించిన వైఎస్సార్‌సీపీ నేతలు
- పెద్దల ఒత్తిడితో ప్రతిపక్ష నేతలపైనే కేసులు.. అర్ధరాత్రి దాటిన తర్వాత అరెస్ట్
- నేతలను విడుదల చేయాలని వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆందోళనలు
- పలు జిల్లాల్లో సర్వే చేస్తున్న యువకులను పోలీసులకు అప్పగించిన నాయకులు

ఓట్ల దొంగలొచ్చారు..

2 లో



అండగా ఉండండి!

- ఎన్నికలయ్యే వరకు నా కోసం పనిచేయండి
- నన్ను కాపాడుకోవాల్సిన బాధ్యత మీదే
- డ్వాక్రా మహిళలకు మూడు దఫాల్లో రూ.10 వేలు చెల్లింపు..
- ఈ సొమ్ముతో లక్షలు సంపాదించాలి
- అధికారంలోకి వస్తే తొలి సంతకం హోదాపైనే
- ‘పసుపు–కుంకుమ’ సభల్లో సీఎం చంద్రబాబు

– వివరాలు 9లో

మోసాలే ‘పెట్టుబడి’గా..

- డ్వాక్రా మహిళలను మరోసారి వంచించే యత్నాలు
- ఎన్నికల ముంగిట పెట్టుబడి నిధి డబ్బుల పేరుతో చెక్కుల పంపిణీ
- గత ఎన్నికల్లో ఇచ్చిన డ్వాక్రా రుణాల మాఫీ హామీకి ఎగనామం
- రూ.14,205 కోట్ల నుంచి రూ.25,421 కోట్లకు పెరిగిన పొదుపు సంఘాల అప్పులు

– వివరాలు 9లో

ఇక అన్ని పోస్టులకూ ‘స్క్రీనింగ్’ తప్పనిసరి!

- కొత్త విధానంపై ఏపీపీఎస్సీ కసరత్తు

– వివరాలు 8లో

జయ జయ జయ జయహే

- మన గణతంత్రమెంతో ఘనం!
- వందల సవరణలు జరిగినా చెదరని రాజ్యాంగ మౌలిక స్వరూపం

– ఫుల్ అవుట్ IV, Vలో

ఓట్ల దొంగలొచ్చారు!

- రాష్ట్రవ్యాప్తంగా సంచరిస్తున్న బోగస్ సర్వే బృందాలు
- పథకం ప్రకారం విపక్షం ఓట్ల తొలగింపు..
- వ్యక్తిగత వివరాలు ఆరా తీస్తూ ట్యాబ్‌ల్లో నమోదు
- టీడీపీకి సానుకూలం కాదని తేలితే ఓట్లు తొలగింపు
- సర్వే బృందాల వద్ద టీడీపీ సభ్యత్వ గుర్తింపు కార్డులు
- వైఎస్సార్ సీపీ మద్దతుదారుల ఓట్లను తొలగించేందుకే రంగంలోకి ఈ టీమ్‌లు
- పలు ప్రాంతాల్లో నకిలీ బృందాలను అడ్డుకుని పోలీసులకు అప్పగిస్తున్న ప్రజలు
- ఓట్ల తొలగింపు హక్కును బోగస్ సర్వే బృందాలకు కట్టబెట్టడంపై ప్రజాస్వామ్యవాదుల్లో విస్మయం

రాష్ట్రవ్యాప్తంగా ప్రతిపక్ష పార్టీ సానుభూతిపరుల ఓట్లను తొలగించేందుకు అధికార పక్షం కుయుక్తులు పన్నుతున్నట్లు స్పష్టమవుతోంది. ప్రభుత్వ పాలన ఎలా ఉందో వివరాలు సేకరిస్తున్నామంటూ ట్యాబ్‌లతో రకరకాల పేర్లతో పలుచోట్ల సర్వేలు నిర్వహిస్తున్న బృందాల సభ్యుల వద్ద టీడీపీ సభ్యత్వ గుర్తింపు కార్డులు బయటపడుతుండటం దీనికి బలం చేకూరుస్తోంది. బోగస్ బృందాలు గ్రామాల్లో తిరుగుతూ దశలవారీగా వివరాలు సేకరించి ఆధార్, ఓటరుకార్డు సంఖ్యలను ట్యాబ్‌ల్లో నమోదు చేస్తూ టీడీపీ సర్కారుకు సానుకూలం కాదని తేలిన పక్షంలో సర్వేలో పాల్గొంటున్న వారి ఓట్లను వెంటనే తొలగిస్తుండటం గమనార్హం. ట్యాబ్‌లో డిలీట్ బటన్ నొక్కగానే ఓటర్ల వివరాలు జాబితా నుంచి మాయమవుతున్నాయి. ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన ఓటు హక్కును తొలగించే అధికారం ఈ నకిలీ సర్వే బృందాలకు ఎలా వచ్చిందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కేవలం ఎమ్మార్వో స్థాయి అధికారికి మాత్రమే ఉండే అధికారాలను ట్యాబ్‌లతో తిరిగే టీడీపీ అనుకూల బృందాలకు అప్పగించడం ప్రజాస్వామ్య వ్యవస్థను రాష్ట్ర సర్కారు ఎలా అపహాస్యం పాలు చేస్తోందో రుజువు చేస్తోందని పరిశీలకులు పేర్కొంటున్నారు. వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల ఓట్లను తొలగించేందుకు సర్వేల పేరుతో అధికార పార్టీ నకిలీ బృందాలను రంగంలోకి దించినట్లు ఈ వ్యవహారాల ద్వారా స్పష్టమవుతోంది. 'మీకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? ఎవరంటే ఇష్టం? ఏ పార్టీకి ఓటు వేస్తారు? సాక్షి టీవీ చూస్తారా? ఈటీవీ చూస్తారా?' అంటూ సర్వే బృందాలు ప్రజల నాడి పసిగట్టి ప్రభావితం చేసేందుకు వివరాలు సేకరిస్తున్నాయి. దీనిపై వైఎస్సార్‌సీపీ శ్రేణులతోపాటు, ప్రజలు తిరగబడుతున్నారు. కొన్నిచోట్ల సర్వే బృందాలను అడ్డుకుని పోలీసులకు అప్పగిస్తున్నా వారిని వదిలిపెట్టాలంటూ అధికార పార్టీ నేతలు తీవ్రంగా ఒత్తిళ్లు తెస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

విపక్ష మద్దతుదారుల ఇళ్ల వద్దే సర్వే..


కొత్తచెరువులో సర్వేకు వచ్చిన యువకులను విచారిస్తున్న పోలీసులు(ఫైల్)

అనంతపురం జిల్లా పుట్టపర్తి నియోజకవర్గంలో పబ్లిక్ సర్వే పేరుతో జనవరి 25న వివరాలు సేకరిస్తున్న బెంగళూరుకు చెందిన యువకులను వైఎస్సార్‌సీపీ నాయకులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. కొత్తచెరువు, బుక్కపట్నం మండలాల్లో వీరంతా వారం రోజుల పాటు పలు గ్రామాల్లో తిరిగారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఇళ్ల వద్దకు మాత్రమే వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. కొత్తచెరువులో సర్వే చేస్తున్న కొందరు యువకులను వైఎస్సార్ సీపీ నేతలు పోలీసులకు అప్పగించారు. గుంతకల్లులో డిసెంబర్ 18న రహస్యంగా సర్వే నిర్వహిస్తున్న 40 మంది సభ్యులను కూడా పోలీసులకు అప్పగించారు. హిందూపురంలో స్పార్క్ సోషియో పొలిటికల్ ఎనాలసిస్ అండ్ రిఫ్రెష్ సెంటర్ పేరిట టీడీపీ నాయకులే సర్వేలు నిర్వహిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్లు, ప్రజలను ప్రభావితం చేసే నాయకుల వ్యక్తిగత వివరాలను సేకరిస్తున్నారు. హిందూపురంలో ఇద్దరు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లకు నేరుగా ఫోన్ చేసి బెదిరిస్తూ బేరసారాలకు దిగడంతో పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అయితే ఎమ్మెల్యే బాలకృష్ణ ఒత్తిడి మేరకు సర్వే యువకులపై దాడి చేసినట్లు వైఎస్సార్‌సీపీ నాయకులపై కేసులు బనాయించారు.

నరసాపురంలో ఆధార్ వివరాలు అడుగుతూ...

పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో ఓటరు జాబితాలను సర్వే చేస్తున్న ఓ బృందాన్ని 3 నెలల క్రితం స్థానికులు అడ్డుకున్నారు. 60 మంది యువకులతో కూడిన ఈ బృందం పట్టణంలోని ఓ హోటల్‌లో వారం పాటు మకాం వేసింది. ఓటు ఎవరికి వేస్తారు? మీ కులం ఏమిటి? అని ఆరా తీయడంతోపాటు ఆధార్ వివరాలు సేకరిస్తుండటంతో అనుమానించిన స్థానికులు వారిని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. భారత్ టెలీసర్వీస్ కంపెనీ నుంచి తాము సర్వే చేస్తున్నామని వారు పేర్కొన్నారు. వారిని విచారించిన అనంతరం పోలీసులు విడిచిపెట్టారు.

సర్కారుకు వ్యతిరేకంగా సమాధానాలిస్తే ఓట్లు గల్లంతే

వైఎస్సార్ జిల్లా పాత కడపలో సర్వే పేరుతో ఓట్లు తొలగిస్తున్న నరేష్, రవి, జగదీష్, సురేష్, బాబు, అశోక్‌కుమార్ అనే ఆరుగురు యువకులను శుక్రవారం రాత్రి స్థానికులు పట్టుకున్నారు. వారి దగ్గరి నుంచి ట్యాబ్‌లు స్వాధీనం చేసుకొని పోలీసులకు అప్పగించారు. వీరంతా అనంతపురం జిల్లా కదిరి పట్టణానికి చెందినవారుగా చెబుతున్నారు. పబ్లిక్ పాలసీ రీసెర్చ్ గ్రూప్ తరపున సర్వే కోసం తమను నియమించారని, నెలకు రూ.15 వేలు చొప్పున జీతం ఇస్తామని చెప్పారని వారు పేర్కొంటున్నారు. వీరివద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేవు. మూడు దశల్లో ఈ సర్వే సాగుతోంది. ఓటరు కార్డు నంబర్ చెబితే సంబంధిత వ్యక్తుల ఇంట్లో ఉన్న ఓటర్ల వివరాలు అందులో కనిపిస్తున్నాయి. ప్రభుత్వానికి అనుకూలంగా సమాధానాలు ఇవ్వని పక్షంలో మూడో దశలో వారి ఓట్లన్నీ తొలగించి నిష్క్రమిస్తున్నట్లు వెల్లడవుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ ఓటమి భయంతోనే ఈ దొంగ సర్వేలు నిర్వహిస్తూ ఓట్లను తొలగిస్తున్నారని 1వ డివిజన్ కార్పొరేటర్ ఇసుకపల్లి చైతన్య, 47వ డివిజన్ కార్పొరేటర్ పాకా సురేష్‌కుమార్ ఆరోపించారు. గత ఎన్నికల్లో కడపలో వైఎస్సార్ సీపీకి అత్యధిక మెజార్టీ రావడంతో 1.25 లక్షల ఓట్లను తొలగించారన్నారు. ఓటర్ల జాబితా వివరాలు సర్వే బృందాలకు ఎలా వచ్చాయని ప్రశ్నించారు.

మైదుకూరు మండలంలో అడ్డుకున్న స్థానికులు..

వైఎస్సార్ జిల్లా మైదుకూరు నియోజకవర్గం దువ్వూరు మండలం చింతకుంట, బయపనల్లె, సంగటి తిమ్మాయపల్లె, మీర్జాఖాన్‌పల్లె తదితర గ్రామాల్లో పబ్లిక్ పాలసీ రీసెర్చ్ గ్రూప్ ఐడీ కార్డులతో సంచరించిన కొందరు యువకులు ట్యాబ్‌ల్లో వివరాలు నమోదు చేసేందుకు ప్రయత్నించడం శుక్రవారం కలకలం రేపింది. ట్యాబ్‌ల్లో ఓటర్ల వివరాలు ఉండటాన్ని గుర్తించిన స్థానికులు వారిని అడ్డుకున్నారు. తమ ఓట్లు తొలగించేందుకే గ్రామాల్లోకి వచ్చారని గ్రామస్తులు మండిపడ్డారు. సర్వే బృందాలను పంపిన కంపెనీ నిర్వాహకులు తమ గ్రామానికి వచ్చేవరకు వారిని విడిచిపెట్టబోమని హెచ్చరించారు. అయితే సాయంత్రం వరకు కంపెనీ ప్రతినిధులు ఎవరూ అక్కడకు రాకపోవడం గమనార్హం. ఒక్కో బూత్‌లో 25 మందిని సర్వే చేస్తే తమకు రూ.800 చొప్పున చెల్లిస్తారని సర్వే బృందం వెల్లడించింది. ఓటర్ల వివరాలన్నీ ట్యాబ్‌లో నిక్షిప్తం చేయడాన్ని మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి గ్రామస్తులు ఫోన్ ద్వారా తెలిపారు.


సర్వే చేసేందుకు వచ్చిన యువకులను చుట్టుముట్టిన వైఎస్సార్ జిల్లా చింతకుంట గ్రామస్తులు

ట్యాబ్‌ల్లో ఓటర్ల జాబితాలు...

వైఎస్సార్ జిల్లా సిద్దవటంలో సర్వే పేరుతో వ్యక్తిగత వివరాలు సేకరిస్తున్న కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన నరసింహులు అనే వ్యక్తిని స్థానికులు శుక్రవారం పోలీసులకు అప్పగించారు. పీపుల్స్ సర్వే పేరుతో ట్యాబ్‌తో తిరుగుతూ ఓటరు కార్డు, ఆధార్ కార్డు ఇవ్వాలని అడగడంతో అనుమానించిన గ్రామస్థులు అతడిని పోలీసులకు అప్పగించారు. ట్యాబ్‌లో సిద్దవటంకు చెందిన ఓటర్ల జాబితా మొత్తం ఉందని స్థానికులు తెలిపారు.

ఏ పార్టీకి ఓటేస్తారంటూ ఆరా

రాజంపేట మండలం తాళ్లపాకలోనూ రెండురోజుల క్రితం ఇద్దరు యువకులు సర్వే పేరుతో ఇంటింటికి వెళ్లి ఫోన్ నంబర్, ఓటరు కార్డు వివరాలను సేకరించారు. ఏ పార్టీకి ఓటు వేస్తారంటూ ఆరా తీశారు. వీరి వ్యవహార శైలి అనుమానాస్పదంగా ఉండండంతో గ్రామస్తులు వారిని పోలీసులకు అప్పగించారు. తాళ్లపాక, ఎల్లాగడ్డతో పాటు పలు గ్రామాల్లో సర్వే బృందాలు సర్వే చేస్తున్నాయి. రాజంపేట పట్టణం మన్నూరులో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను గుర్తించి ఓట్లను తొలగించేందుకు సర్వే బృందాలు చేస్తున్న ప్రయత్నాలను స్థానికులు అడ్డుకున్నారు.

కర్నూలులో బోగస్ సర్వే... 29 వేల ఓట్ల తొలగింపు!

కర్నూలు జిల్లాలో వైఎస్సార్ సీపీ మద్దతుదారుల ఓట్ల తొలగింపే లక్ష్యంగా పలు నియోజకవర్గాల్లో బోగస్ సర్వేలు జరుగుతున్నాయి. ఎమ్మిగనూరుతోపాటు కడిమెట్ల, ఎర్రకోట, గుడేకల్, కొటేకల్ తదితర గ్రామాల్లో ముగ్గురు నలుగురితో కూడిన సర్వే బృందం సంచరిస్తోంది. వీరిని స్థానికులు అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. సర్వే బృందాలు వివరాలను నమోదు చేసుకుంటున్న ట్యాబ్‌లలో ఓటర్ల తొలగింపు ఆప్షన్ ఉన్నట్లు సమాచారం. పత్తికొండ నియోజకవర్గం వెల్దుర్తి మండలం చెరుకులపాడు, గోవర్ధనగిరి, ఎల్.బండ, వెల్దుర్తి, రత్నపల్లె, బొమ్మిరెడ్డిపల్లె, కృష్ణగిరి మండలం టి.గోకులపాడు, ఎస్.హెచ్.ఎర్రగుడి, ఎరుకలి చెరువు గ్రామాల్లో బోగస్ సర్వేలు జరిగాయి. వెల్దుర్తి మండలంలో 12 వేల ఓట్లను తొలగించినట్లు తెలుస్తోంది. ఆలూరు నియోజకవర్గం హొళగుంద మండలం గజ్జహల్లి, హెబ్బటం గ్రామాల్లో నకిలీ సర్వే బృందాలను వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. హాలహర్వి మండలం నిట్రవట్టి గ్రామంలో బోగస్ సర్వే జరిగింది. మంత్రాలయం నియోజకవర్గం కౌతాళం మండలం రొడూరు, కామవరంలోనూ నకిలీ బృందాలు సర్వే చేశాయి. ఆదోని, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లోనూ ఈ సర్వేలు జరిగాయి. కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గంలో బోగస్ సర్వేలతో 29 వేల ఓట్లను తొలగించినట్లు తెలుస్తోంది.

'తూర్పు' సర్వే బృందాల వద్ద టీడీపీ గుర్తింపు కార్డులు


సర్వే బృందం వద్ద ఉన్న ట్యాబ్‌ను పరిశీలిస్తున్న రాజోలు ఎస్సై


టీడీపీ గుర్తింపు కార్డుతో సర్వే

విపక్షం ఓట్లను తొలగిస్తున్న ఓ బృందాన్ని తూర్పు గోదావరి జిల్లాలో పార్టీ శ్రేణులు నవంబరు 12వ తేదీన అడ్డుకున్నాయి. అంబాజీపేట, రాజోలు మండలాల్లోని మాచవరం, వాకలగరవు గ్రామాల్లో 11 మంది యువకులు రెండు బృందాలుగా సర్వే నిర్వహించారు. మాచవరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఆరుగురు యువకులను వైఎస్సార్‌సీపీ నేతలు నిలదీయడంతో 'సోషియో పొలిటికల్ ఎనాలసిస్' (స్పా) సంస్థ నుంచి వచ్చినట్లు వెల్లడించారు. వారిని గుర్తింపు కార్డులు చూపాలని కోరడంతో జి.సాయి, గణేష్, నరేంద్ర, రాహుల్ మణికంఠ, వెంకటేశ్వరరావులుగా పేర్లు చెప్పుకున్న వ్యక్తులు పొంతనలేని సమాధానాలిచ్చారు. వారి వెంట వచ్చిన మిగతావారు జారుకోవడంతో అనుమానించిన స్థానికులు ఈ బృందాన్ని అంబాజీపేట పోలీస్ స్టేషన్‌లో అప్పగించి ఫిర్యాదు చేశారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు తాటిపాకలోని సాయితేజ లాడ్జిలో తనిఖీలు చేయగా 'స్పా' బృంద సభ్యులు అక్కడ ఉన్నట్లు గుర్తించారు. వారి వద్ద టీడీపీ సభ్యత్వ గుర్తింపు కార్డులు, ల్యాప్‌ట్యాప్, ట్యాబ్‌లు బయట పడటం గమనార్హం. ఈ సర్వే ఎందుకు నిర్వహిస్తున్నారని ప్రశ్నించడంతో ఓ వ్యక్తి పరారైనట్లు వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ కొండేటి చిట్టిబాబు తెలిపారు.

గుంటూరు జిల్లాలో 4 నెలలుగా సంచారం...

వైఎస్సార్ సీపీ అభిమానుల ఓట్ల తొలగింపే లక్ష్యంగా గుంటూరు జిల్లాలో గత నాలుగు నెలలుగా సర్వే బృందాలు తిరుగుతున్నాయి. గత ఏడాది అక్టోబర్‌లో సర్వే పేరుతో విపక్షం ఓట్లను తొలగిస్తున్న స్పా (సెంటర్ ఫర్ సోషియో పొలిటికల్ ఎనాలసిస్) బృందం సభ్యులు గుంటూరు తూర్పు, మంగళగిరి, పెదకూరపాడు, తెనాలి, వినుకొండ నియోజకవర్గాల్లో పట్టుబడ్డారు. అయితే ఆ మరుసటి రోజే పోలీసులు వారిని వదిలేశారు. తెనాలి నియోజకవర్గం సంగంజాగర్లమూడిలో సర్వేల పేరుతో ఓట్లు తొలగిస్తున్న స్పా సంస్థ సభ్యులను పట్టుకుని ప్రశ్నించిన వైఎస్సార్ సీపీ నాయకులపై గత నవంబర్ నెలలో కేసులు నమోదు చేయడం గమనార్హం.

వాట్సాప్ డీపీలో లోకేష్ ఫొటో : 'స్పా' సంస్థ తరపున సర్వే చేస్తున్న యువకుల వాట్సాప్ గ్రూప్‌లో మంత్రి నారా లోకేష్ ఫొటో డీపీగా ఉండటం గమనార్హం. ఇటీవల గురజాల నియోజకవర్గం జంగమహేశ్వరపురంలో సర్వే పేరుతో వివరాలు సేకరిస్తున్న టీడీపీ బూత్ కమిటీ సభ్యుడు యలమందను స్థానికులు అడ్డుకున్నారు. అతడిని ప్రశ్నించిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అమరారెడ్డితో పాటు మరో ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయడం గమనార్హం.

నోట్‌బుక్‌లో టీడీపీ కార్యకర్తల వివరాలు...


అహ్మద్‌తో మాట్లాడుతున్న ఆనం(ఫైల్)

యూట్యూబ్ చానల్ సర్వే పేరుతో శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం బ్రహ్మదేవిలో ఇల్లిల్లూ తిరుగుతూ సర్వే చేస్తున్న ముగ్గురు వ్యక్తులను వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు శుక్రవారం అడ్డుకున్నారు. సోషల్ సర్వేయర్ పేరుతో చింతాల అనీల్‌కుమార్ అనే యువకుడు వివరాలు సేకరిస్తున్నట్లు గుర్తించారు. అయితే అతడి వద్ద ఉన్న నోట్‌బుక్‌ను పరిశీలించగా అందులో టీడీపీ కార్యకర్తల పేర్లు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. దీంతో అనుమానించిన వైఎస్సార్ సీపీ మండల బూత్ కమిటీ కన్వీనర్ షేక్ మస్తాన్, కోఆప్షన్ సభ్యుడు బషీర్‌లు అతడిని స్థానిక పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా సంచరించవద్దని పోలీసులు అతడిని హెచ్చరించి పంపేశారు.

ఎన్డీటీవీ తరపున అంటూ... : గతేడాది నవంబర్ 1వ తేదీన ఇదే జిల్లా మనుబోలు మండలం మడమనూరు గ్రామంలో ఎన్డీటీవీ తరపున ఎన్నికల సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పుకుంటున్న నూర్‌అహ్మద్ అనే వ్యక్తి ఆధార్, ఓటరు గుర్తింపు కార్డు వివరాలను నమోదు చేస్తుండటంతో అనుమానించిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పార్టీ నేత ఆనం రాంనారాయణరెడ్డి సూచనల మేరకు పోలీసులకు అప్పగించారు.

ప్రతిపక్షం ఓట్లపై వేటు!


జామి పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్త పరిస్థితి


జామి పోలీస్ స్టేషన్‌లో మజ్జి శ్రీనివాస్ తదితరులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా నెగ్గడమే లక్ష్యంగా ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల ఓట్లను అధికార టీడీపీ అడ్డగోలుగా తొలగిస్తోంది. ఇందుకోసం అధికార బలాన్ని ప్రయోగిస్తోంది. టీడీపీ కుతంత్రాన్ని అడ్డుకున్న విజయనగరం జిల్లా వైఎస్సార్‌సీపీ నేతలను పోలీసులు అరెస్టు చేయడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అలాగే రాష్ట్రంలో పలు జిల్లాల్లో యువకులు దొంగ సర్వే చేస్తుండగా వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుకున్నారు. వారిని పోలీసులకు అప్పగించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం రోజే ఈ పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం.

అసలేం జరిగింది?

విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం కుమిలి గ్రామంలో గురువారం ఓటర్ల జాబితాలను చేతపట్టుకుని, ఇంటింటికీ తిరుగుతూ సర్వే చేస్తున్న ముగ్గురు వ్యక్తులను వైఎస్సార్‌సీపీ నాయకులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వారిని పోలీసులు విచారించకుండా వదిలిపెట్టారు. దీనిపై పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ తీవ్రంగా స్పందించారు. డీజీపీ, రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసేందుకు సిద్ధపడ్డారు. ఈ క్రమంలో సర్వే చేస్తూ పట్టుబడ్డ వ్యక్తుల నుంచి ట్యాబ్‌లను లాక్కున్నారంటూ ప్రైవేటు సంస్థ ఫిర్యాదు చేసిందని, ఆ ట్యాబ్‌లను తిరిగి ఇచ్చేయాలంటూ పోలీసులు అర్ధరాత్రి వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్లకు వెళ్లారు. పూసపాటిరేగ మండల పార్టీ అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, నాయకులు పతివాడ అశ్వినీకుమార్, వెన్నె మహేష్, పతివాడ సన్యాసి నాయుడు, బుర్లే శ్రీనులను రెల్లివలస గ్రామంలో గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత వారి స్వగృహాల్లో అరెస్ట్ చేసి, చీపురుపల్లి నియోజకవర్గం గుర్ల పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లారు. ఆ సమయంలో నేతలపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. కుమిలి ఎంపీటీసీ సభ్యురాలు గాబు భాగ్యలక్ష్మిని బయటకు రావాలని, ట్యాబ్ ఇవ్వాలని అరుచుకుంటూ ఇంటి నుండి 100 అడుగుల దూరం తీసుకెళ్లారు. ఆమె ఎదురు తిరగడంతో వదిలేశారు. మహిళనని కూడా చూడకుండా కేవలం వైఎస్సార్‌సీపీ సానుభూతిపరురాలిననే కక్షతోనే పోలీసులు దౌర్జన్యం చేశారని కుమిలి మాజీ సర్పంచ్ గుజ్జు కృష్ణవేణి ఆవేదన వ్యక్తం చేశారు. కుమిలి గ్రామానికి చెందిన 8 మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి, నెల్లిమర్ల స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేశారు.

సంబంధం లేని మజ్జి శ్రీనివాస్ అరెస్టు

వైఎస్సార్‌సీపీ విజయనగరం జిల్లా రాజకీయ వ్యవహారాల సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు ఇంటివద్దకు శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు భారీగా చేరుకున్నారు. ట్యాబ్‌లు ఇవ్వకపోతే అరెస్ట్ చేస్తామని హెచ్చరించారు. తనవద్ద ట్యాబ్‌లు లేవని ఆయన చెబుతున్నా వినకుండా అరెస్ట్ చేసి, ఊరంతా తిప్పి చివరికి ఎస్.కోట నియోజకవర్గం జామి పోలీస్ స్టేషనుకు తరలించి నిర్బంధంలో ఉంచారు. పార్టీ ఎమ్మెల్సీ కోలగట్ల వీరభద్రస్వామితోపాటు ముఖ్యనాయకులు స్టేషన్‌కు శుక్రవారం ఉదయానికే చేరుకుని శ్రీనివాసరావును విడుదల చేయాలని డీఎస్పీని కోరారు. వాంగ్మూలం తీసుకుని విడిచిపెడతామన్న డీఎస్పీ మధ్యాహ్నం 2 గంటల వరకూ ఆ పని చేయలేదు. అనంతరం డీఐజీ జి.పాలరాజు ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ నేతలను పోలీసులు నోటీసు ఇచ్చి విడుదల చేశారు.

అరెస్టులపై వైఎస్సార్‌సీపీ ఆందోళన

సర్వేల పేరిట గ్రామాల్లో తిరుగుతున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులను అరెస్టు చేయడం పట్ల పార్టీ కార్యకర్తలు ఆగ్రహంతో రగిలిపోయారు. ఓట్ల తొలగింపుపై తమ పార్టీ నాయకులు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా ప్రైవేటు వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అరెస్టులు చేయడం ఏమిటని మండిపడ్డారు. మజ్జి శ్రీనివాసరావును నిర్బంధంలో ఉంచిన జామి పోలీస్ స్టేషన్ వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. పూసపాటిరేగ మండలంలోని రెల్లివలస, కుమిలి గ్రామాలకు చెందిన నాయకులను అరెస్టు చేసి, నిర్బంధించిన గుర్ల, నెల్లిమర్ల పోలీస్‌స్టేషన్‌ల వద్ద ఆందోళన చేశారు. రాస్తారోకో చేశారు.

జిల్లావ్యాప్తంగా 700 మందితో సర్వే

పీపుల్స్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ అనే ప్రైవేటు సంస్థ విజయనగరం జిల్లాలో దాదాపు 700 మంది యువకులను నియమించుకుని సర్వే చేపడుతోంది. యువకులకు రోజుకు రూ.800 చొప్పున చెల్లిస్తూ వారి చేతికి ట్యాబ్‌లు ఇచ్చి గ్రామాల్లోకి పంపుతోంది. వీరిలో ఎక్కువ మంది తెలుగుదేశం పార్టీ విద్యార్థి విభాగం, తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్(టిఎన్ఎస్ఎఫ్)కు చెందిన వారే ఉండడం గమనార్హం. వీరు తమకు ఇచ్చిన ట్యాబ్‌లలో ఉన్న ఓటర్ల జాబితా ఆధారంగా కొన్ని ఇళ్లకు వెళ్లి మాట్లాడుతున్నారు. ప్రభుత్వ పనితీరుపై ఓటర్ల అభిప్రాయాలను అడిగి తెలుసుకుంటున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా అభిప్రాయం వ్యక్తం చేసిన వారి ఓట్లను తొలగిస్తున్నారని ప్రతిపక్షం ఆరోపిస్తోంది. శుక్రవారం బొబ్బిలి, సాలూరు, చీపురుపల్లి, పార్వతీపురం మండలాల్లో సర్వేలు చేసేందుకు వచ్చిన యువకులను స్థానిక నాయకులు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

సర్వే తప్పు కాదు: డీఐజీ

ఓటర్ల జాబితాలను ట్యాబ్‌లో పొందుపరుచుకుని సర్వే నిర్వహించడం నేరం కాదని విశాఖ రేంజ్ డీఐజీ జి.పాలరాజు తెలిపారు. జిల్లాలో జరుగుతున్న పరిణామాలపై ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సర్వేపై అభ్యంతరాలుంటే ఫిర్యాదు చేయాలే తప్ప ట్యాబ్‌లు లాక్కొని దౌర్జన్యం చేయడం చట్టరీత్యా నేరమని, ఆ కేసులోనే వైఎస్సార్‌సీపీ నేతలను అరెస్ట్ చేశామని వివరించారు.

రాష్ట్ర చరిత్రలో చీకటి రోజు

వైఎస్సార్‌సీపీ ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ఉంది. అన్యాయంగా ఓట్లు తొలగిస్తున్నారని ఫిర్యాదు చేసిన వారిని అరెస్టు చేయడం దారుణం. రాష్ట్ర చరిత్రలో ఇదొక చీకటి రోజు. అమరావతి నుంచి ఆదేశాలిచ్చి అక్రమ అరెస్టులకు దిగుతున్నారు. ఎన్నికల సంఘం మాకు తప్పకుండా న్యాయం చేస్తుందని నమ్ముతున్నాం.

– మజ్జి శ్రీనివాసరావు, విజయనగరం జిల్లా వైఎస్సార్‌సీపీ రాజకీయ వ్యవహారాల సమన్వయకర్త

ఓట్ల తొలగింపు ముమ్మాటికీ నిజమే

వైఎస్సార్‌సీపీ నేతలను అరెస్టులు చేసిన తీరును చూస్తే ఓట్ల తొలగింపు అన్నది అనుమానం కాదు ముమ్మాటికీ నిజమేనని తేటతెల్లం అవుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారు. సర్వేల పేరుతో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు, నాయకుల ఇళ్లకు వచ్చి ఓట్ల తొలగింపుకు సిద్ధపడ్డారు. దొంగ సర్వేలు చేస్తున్న వారిని వదిలేసి, వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లల్లోకి చొరబడి అర్ధరాత్రి అరెస్టులకు తెగబడటం సిగ్గుచేటు

– కోలగట్ల వీరభద్రస్వామి, ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల కన్వీనర్

టీడీపీ వ్యతిరేక ఓట్లు తొలగిస్తున్నారు

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి, డీజీపీకి ఫిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ నేతలు


రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి గోపాల కృష్ణ ద్వివేదికి ఫిర్యాదుచేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు

సాక్షి, అమరావతి: విజయనగరం జిల్లాలో సర్వేల పేరుతో ఇళ్లకు వెళ్తున్న సర్వే బృందాలు టీడీపీ వ్యతిరేక ఓట్లను తొలగిస్తున్నాయని, వారిని పట్టుకుని అప్పగిస్తే అరెస్టు చేయాల్సిన పోలీసులు వైఎస్సార్‌సీపీ నేతల్ని నిర్బంధించి దౌర్జన్యం చేస్తున్నారని పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. ఆయనతోపాటు పార్టీ నేతలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాస్, చెల్లుబోయిన వేణు, లేళ్ల అప్పిరెడ్డి, నందిగం సురేష్ తదితరులు సచివాలయంలో ఎన్నికల సంఘం ప్రధాన అధికారి గోపాలకృష్ణ ద్వివేదిని, మంగళగిరిలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో డీజీపీ ఆర్పీ ఠాకూర్‌ను శుక్రవారం కలిసి ఫిర్యాదు చేశారు. సర్వే చేయడానికి వచ్చిన ఎన్నికల కమిషన్ ఉద్యోగులమంటూ టీడీపీ కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ వైఎస్సార్‌సీపీ, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ అభిమానులుగా పేర్కొన్న వారిని గుర్తించి, వారి ఓట్లను తొలగిస్తున్నారని ద్వివేది దృష్టికి తెచ్చారు. విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం కుమిలి గ్రామంలో ఉద్యోగులుగా చెప్పుకుంటూ సర్వేలు చేస్తున్న ఓ ప్రైవేట్ సంస్థ సిబ్బంది నుంచి స్వాధీనం చేసుకున్న కొన్ని ట్యాబ్‌లను ఆయనకు అందజేశారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా విజయనగరం జిల్లాలో ఓట్లు తొలగించే టీడీపీ సర్వే బృందాలకు పోలీసులు వత్తాసు పలుకుతున్నారని, సర్వే పేరుతో ఓట్లు తొలగిస్తున్న యువకులను పట్టుకుని అప్పగిస్తే పోలీసులు వదిలేశారని డీజీపీ దృష్టికి తెచ్చారు.

అక్రమాలను అడ్డుకుంటాం

ఎన్నికల ప్రధాన అధికారిని, డీజీపీని కలిసిన తర్వాత పార్టీ నేత బొత్స మీడియాతో మాట్లాడారు. అధికారం కోసం చంద్రబాబు ఇలాంటి అడ్డదారులు తొక్కడం దారుణమని, వీటిని అడ్డుకుంటామని అన్నారు. శుక్రవారం జాతీయ ఓటర్ల దిన్సోతవమని.. అదే రోజున ఇలాంటివి జరగడం దేశ ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని వ్యాఖ్యానించారు. ఉద్యోగులుగా చెప్పుకుంటూ గ్రామాల్లో సర్వేలకొస్తున్న టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీకి అనుకూలురైనవారి ఓట్లను ట్యాబ్‌లో ఓటర్ల జాబితాలో మార్కు చేసుకొని, ఆ వివరాలను పైకి చేరవేస్తున్నారని చెప్పారు. విజయనగరంలో వీటిని అడ్డుకున్న తమ పార్టీ నేతలను పోలీసులు అరెస్టు చేయడం ప్రభుత్వ అక్రమాలకు పరాకాష్ట అని దుయ్యబట్టారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజక వర్గంలోనూ ఇలా సర్వేల ద్వారా గుర్తించిన వారి ఓట్లను 30 వేల దాకా అక్రమంగా తొలగించారని మండిపడ్డారు. ఇలా సర్వేల పేరుతో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓట్ల తొలగింపునకు వినియోగిస్తున్న ట్యాబ్‌లపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తామని ఎన్నికల ప్రధాన అధికారి, డీజీపీ హామీ ఇచ్చారన్నారు. డీజీపీ తీసుకునే చర్యలను బట్టి తమ భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ నేతలతోపాటు లీగల్ సెల్ ప్రతినిధులు కోటంరాజు వెంకటేశ్వర శర్మ, సుజాతశర్మ, బి.సతీష్, పార్టీ సంయుక్త కార్యదర్శి అడపా శేషు ఉన్నారు.

డీజీపీకిచ్చిన ఫిర్యాదులో..

విజయనగరం జిల్లాలో సర్వే బృందాలు చేస్తున్న అక్రమాల వివరాలు, జరిగిన ఘటన, పోలీసుల తీరు తదితర అంశాలను బొత్స డీజీపీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. గురువారం విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం కుమిలిలో టీడీపీకి చెందిన గొల్లు కృష్ణ, గొల్లు దేముడుబాబు, తొత్తు దేముడు అనే యువకులు ప్రభుత్వ అధికారులమని చెప్పుకుంటూ ఇంటింటికీ తిరుగుతూ సర్వే చేశారని వివరించారు. వారు ట్యాబ్‌లు తీసుకొచ్చి అందులో ఓటర్ల జాబితాలు ఉంచుకుని ఎవరికి అనుకూలంగా ఉంటారు? ఏ పేపర్ చదువుతారు? ప్రభుత్వ పథకాలు బాగున్నాయా? అధికార పార్టీకి వ్యతిరేకమా? అనుకూలమా? అని ఓటర్ల నుంచి సమాధానాలు రాబట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సర్వేపై అనుమానం వచ్చిన గ్రామస్తులు కొందరు వైఎస్సార్‌సీపీ నేతల్ని పిలిచి చెప్పారని, నేతలు ఆ యువకులను ప్రశ్నించడంతో వారు తడబడ్డారని తెలిపారు. పబ్లిక్ పాలసీ రీసెర్చ్ గ్రూప్ పేరుతో సర్వే చేస్తున్నవారు టీడీపీకి చెందినవారేనని, ఇంటింటికీ తిరిగి అభిప్రాయాలు అడిగిన తర్వాత ఓటర్ల లిస్ట్‌లో వారి ఓట్లు మాయమవుతున్నాయని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు సర్వే చేస్తున్న యువకులను పోలీసులకు అప్పగించగా పోలీసులు ఆ యువకులను పంపేశారని, ఆ ట్యాబ్‌లలో ఏముందో విచారించాలని కోరినా వినకుండా ఆ ట్యాబ్‌లను తమకు అప్పగించారని డీజీపీ దృష్టికి తెచ్చారు. విజయనగరం పోలీసులు అర్ధరాత్రి సమయంలో పార్టీ నేత మజ్జి శ్రీనివాసరావుతోపాటు ఇతర నేతల్ని అక్రమంగా నిర్బంధించి ఆ ట్యాబ్‌లను యువకుల వద్ద నుంచి లాక్కున్నారంటూ అక్రమ కేసులు నమోదు చేశారని ఫిర్యాదు చేశారు.

ఇదండీ సంగతి



బాలకృష్ణ డబ్బుల పంపిణీపై కౌంటర్ దాఖలు చేయండి

- కేంద్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశం
- తదుపరి విచారణ మూడు వారాలకు వాయిదా

సాక్షి, అమరావతి: నంద్యాల ఉప ఎన్నిక సందర్భంగా ఓటర్లకు బహిరంగంగా డబ్బులు పంపిణీ చేసిన హిందూపురం శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణపై చర్యలు తీసుకునే విషయంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్, న్యాయమూర్తి జస్టిస్ మల్లవోలు సత్యనారాయణ మూర్తిలతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. బహిరంగంగా డబ్బులు పంపిణీ చేసిన బాలకృష్ణపై ప్రజా ప్రాతినిధ్య చట్ట నిబంధనల కింద కేసు నమోదు చేసేలా ఎన్నికల అధికారులను ఆదేశించాలని కోరుతూ కె.శివకుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై శుక్రవారం ఏసీజే ఆధ్వర్యంలోని ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాది యర్రంరెడ్డి నాగిరెడ్డి వాదనలు వినిపిస్తూ, టీడీపీ తరఫున ప్రచారం నిర్వహించిన బాలకృష్ణ నంద్యాలలో రోడ్‌షో నిర్వహించారని, ఓటర్లకు బహిరంగంగా డబ్బు పంపిణీ చేశారని తెలిపారు. ఓటర్లకు డబ్బు పంపిణీ చేస్తున్న దానిపై పక్కా ఆధారాలున్నాయని, ఈ ఆధారాలను కూడా సమర్పించినా కూడా అధికారులు కేసు నమోదు చేయడం లేదన్నారు. ఇటువంటి విషయాల్లో చట్ట నిబంధనల ప్రకారం ఎన్నికల అధికారే ఫిర్యాదు చేయాలన్నారు. అయితే ఎన్నికల అధికారి తన విధులను నిర్వర్తించడం లేదన్నారు. తరువాత ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, బాలకృష్ణ చర్యలు ప్రజా ప్రాతినిధ్య చట్టం కిందకు రావన్నారు. అవి ఐపీసీ కిందకు వస్తాయన్నారు. వాదనలు విన్న ధర్మాసనం, పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

రాజకీయ వ్యవస్థను భ్రష్టు పట్టించింది బాబే

ఎమ్మెల్సీ సోమువీర్రాజు మండిపాటు

కొత్తపేట: ఈ దేశంలో రాజకీయ వ్యవస్థను భ్రష్టు పట్టించిన వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది చంద్రబాబే అని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా కొత్తపేటలో శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం ఆధ్వర్యంలో ఆ పార్టీ జిల్లా పదాధికారుల సమావేశం జరిగింది. వీర్రాజు మాట్లాడుతూ..జాతీయ రాజకీయాల్లోకి వెళ్లి ఒకసారి నేషనల్ ఫ్రంట్‌తో, మరోసారి ఎన్డీఏతో చేతులు కలిపి చంద్రబాబు నీచ రాజకీయాలు చేశారని మండిపడ్డారు. చంద్రబాబుకి తన వ్యక్తిగత ప్రయోజనాలే ముఖ్యమని విమర్శించారు. దేశంలోని అగ్రకులాల్లో పేదలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత మోదీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

ప్రణబ్ ముఖర్జీకి 'భారతరత్న' ఆనందం కలిగించింది

- ప్రతిపక్ష నేత, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్
- తెలుగు వారు పద్మ పురస్కారాలు పొందడం హర్షణీయం



సాక్షి, అమరావతి: భారత మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌కుమార్ ముఖర్జీకి భారతరత్న అవార్డు లభించడం తమకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని ఏపీ ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అవార్డులు ప్రకటించిన వెంటనే ఓ ప్రకటనలో జగన్ స్పందిస్తూ ప్రణబ్‌ముఖర్జీ ఈ అవార్డుకు అన్నివిధాలా తగిన వాడని వ్యాఖ్యానించారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ప్రణబ్ ముఖర్జీ మంచి రాజనీతిజ్ఞతను ప్రదర్శించారని పేర్కొన్నారు. భారత ప్రజాస్వామ్యంలో ఎన్నో ఒడిదుడుకులను, రాజకీయాల్లో ఉదారమైన, గర్వించదగిన ఘటనలకు 'సాక్షి' అయిన ప్రణబ్ ఏమాత్రం తొట్రుపాటు లేకుండా వాటన్నిటినీ ఎదుర్కొన్నారని జగన్ ప్రశంసించారు.అలాగే ప్రఖ్యాత గాయకుడు భూపేన్ హజారికా, ప్రముఖ సామాజిక సేవా కార్యకర్త నానాజీ దేశ్‌ముఖ్‌కు మరణానంతరం భారత రత్న గౌరవం దక్కడంపై జగన్ సంతోషం వ్యక్తం చేశారు. పద్మ పురస్కారాలను పొందిన తెలుగువారందరికీ మరో ప్రకటనలో జగన్ హృదయ పూర్వక అభినందనలు తెలిపారు.

రాజ్యాంగ హక్కులే ప్రజాస్వామ్యాన్ని కాపాడుతున్నాయి

వైఎస్ జగన్ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భారతీయులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచంలోనే అత్యున్నతమైన, అత్యుత్తమమైన రాజ్యాంగం అమల్లోకి వచ్చి 69 ఏళ్లు పూర్తయిందన్నారు. ప్రతి పౌరుడికి ప్రజాస్వామ్య బద్ధంగా రాజ్యాంగం ప్రతిపాదించిన హక్కులే మన ప్రజాస్వామ్య సౌధాన్ని కాపాడుతున్నాయని పేర్కొన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడిచే శక్తుల నుంచి రాజ్యాంగాన్ని కాపాడుకోవటానికి అందరం కలిసి పనిచేయడం నేడు అవసరమని అన్నారు.

ఇస్రో శాస్త్రవేత్తలకు ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ అభినందనలు

సాక్షి, అమరావతి: అంతరిక్ష పరిశోధనలో మరో ముందడుగు వేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ శుక్రవారం అభినందనలు తెలిపారు. వేర్వేరు కక్ష్యల్లోకి కలాంశాట్, ఇండియన్ డిఫెన్స్‌కు ఉపయోగపడే మైక్రో శాట్ – ఆర్ ఉపగ్రహాలను పీఎస్ఎల్‌వీ సీ44 ద్వారా విజయవంతంగా అంతరిక్షంలోకి పంపించటం గర్వకారణమన్నారు. ఇదొక అద్భుతమైన ప్రయోగమని, భవిష్యత్‌లో ఇటువంటి మరెన్నో ప్రయోగాలు విజయవంతం కావాలని వైఎస్ జగన్ ఆకాంక్షించారు.

పల్లి మురిసింది

అనకాపల్లితో సిరివెన్నెలకు విడదీయరాని బంధం

ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు): సందేశాత్మక సినీ గేయ రచయితగా సుప్రసిద్ధులైన సిరివెన్నెల సీతారామశాస్త్రికి పద్మశ్రీ పురస్కారం లభించడం పట్ల అనకాపల్లితో పాటు జిల్లా వ్యాప్తంగా హర్షతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. సిరివెన్నెల సీతారామశాస్త్రి అసలు పేరు చేబోలు సీతారామశాస్త్రి. ఆయన తండ్రి సీవీ యోగి వేదపండితుడు. తల్లి అమ్మాజి గృహిణి. విశాఖపట్నం జిల్లా అనకాపల్లిలోని గాంధీనగర్‌లో వారి నివాసం. ఆయనకు ఇద్దరు అక్కలు, ఇద్దరు సోదరులు ఉన్నారు. అనకాపల్లిలోని మునిసిపల్ స్కూల్‌లో పాఠశాల విద్యను పూర్తిచేసిన ఆయన ఆంధ్ర మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం చేరారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువును మధ్యలోనే ఆపేసి బీఎస్ఎన్ఎల్ అనకాపల్లి శాఖలో ఉద్యోగంలో చేరారు. 1983లో కాకినాడలో జరిగిన ఒక కార్యక్రమంలో సినీ దర్శకుడు కె.విశ్వనాథ్‌ను కలుసుకునే అవకాశం ఆయనకు లభించింది. సీతారామశాస్త్రి ప్రతిభను గుర్తించిన విశ్వనాథ్ ఆయన చిత్రం సిరివెన్నెలలో పాటలు రాసే అవకాశాన్ని ఇచ్చారు. సినిమాలో ఆ పాటలకు మంచి గుర్తింపు లభించి సీతారామశాస్త్రి ఇంటి పేరు సిరివెన్నెలగా సుపరిచితమైంది.

ఇద్దరికి రాష్ట్రపతి విశిష్ట, 15 మందికి ప్రతిభా పురస్కారాలు

- విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసులకు మెడల్స్
- గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటించిన కేంద్రం
- తెలంగాణ నుంచి ఒకరికి విశిష్ట, 13 మందికి ప్రతిభా పురస్కారాలు

సాక్షి, న్యూఢిల్లీ: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పోలీసులకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం కేంద్ర ప్రభుత్వం సేవా పతకాలను ప్రకటించింది. ఏపీ నుంచి ఇద్దరికి రాష్ట్రపతి విశిష్ట, 15 మందికి ప్రతిభా పురస్కారాలు దక్కాయి. తెలంగాణ నుంచి ఒకరికి రాష్ట్రపతి విశిష్ట, 13 మందికి ప్రతిభా పురస్కారాలు వరించాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి స్పెషల్ ఇంటెలిజెన్స్ (బీఆర్ఏ) ఎస్పీ అడ్డాల వెంకటరత్నం, విశాఖ డీఎస్పీ కె.వెంకట రామకృష్ణప్రసాద్‌లకు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు వరించాయి. తెలంగాణ నుంచి హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.మధుసూదన్‌రెడ్డికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం దక్కింది.

ఏపీ నుంచి ప్రతిభా పురస్కారాలు దక్కించుకున్నవారు..

1. ఎస్.హరికృష్ణ, ఎస్పీ ఇంటెలిజెన్స్, విజయవాడ
2. వి.సత్తిరాజు, డీఎస్పీ (ఏఆర్), రాజమహేంద్రవరం
3. కె.ఎస్.వినోద్‌కుమార్, డీఎస్పీ, కర్నూలు
4. కె.జనార్దననాయుడు, డీఎస్పీ, ఇంటెలిజెన్స్, తిరుపతి
5. పి.మోహన్‌ప్రసాద్, అడిషనల్ కమాండెంట్, విశాఖపట్నం
6. పి.కిరణ్‌కుమార్, అస్సాల్‌కమాండర్ గ్రేహౌండ్స్, హైదరాబాద్
7. వి.వేణుగోపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, సీఐ సెల్, విజయవాడ
8. బి.రాజశేఖర్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (పీటీసీ), ఒంగోలు
9. ఎం.వెంకటగణేష్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, ఏసీబీ, విశాఖ
10. ఎన్.గుణశేఖర్, ఎస్ఐ రోడ్ సేఫ్టీ, బంగారుపాల్యం
11. షేక్ ముస్తాక్ అహ్మద్‌బాషా, ఏఆర్ ఎస్ఐ ఎస్ఏఆర్ సీపీఎల్, హైదరాబాద్
12. జి.వెంకటరామారావు, హెడ్‌కానిస్టేబుల్, విశాఖ
13. గోపిశెట్టి సుబ్బారావు, హెడ్‌కానిస్టేబుల్ ఆర్మ్‌డ్‌రిజర్వ్, విజయవాడ సిటీ
14. వై.వీరవెంకట సత్యసాయి ప్రకాశ్, హెడ్‌కానిస్టేబుల్, పోరంకి
15. జి.వెంకటేశ్వరరావు, రైల్వే పోలీస్ కానిస్టేబుల్, విజయవాడ

జైళ్ల శాఖ అధికారులకు కేంద్ర పురస్కారాలు

ఏపీ నుంచి ముగ్గురికి, తెలంగాణ నుంచి ఇద్దరికి మెడల్స్

సాక్షి, న్యూఢిల్లీ: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జైళ్ల శాఖ అధికారులకు కేంద్రం శుక్రవారం 'కరెక్షనల్ సర్వీస్ మెడల్స్' ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ నుంచి గుంటూరు జిల్లా సత్తెనపల్లి సబ్‌జైలు హెడ్‌వార్డర్ వేమూరి వెంకటకోటి వీరదుర్గాప్రసాద్‌కు విశిష్ట సేవా పతకం లభించింది. జైళ్ల శాఖ ఐజీ జి.జయవర్ధన్‌కు, రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ పి.గంగ సాయిరామ్ ప్రకాశ్‌లకు ప్రతిభా పురస్కారాలు దక్కాయి. అలాగే.. తెలంగాణ నుంచి మహబూబాబాద్ సబ్‌జైల్ చీఫ్ హెడ్‌వార్డర్ ఎస్.వెంకటేశ్వర్లు, నల్లగొండ జిల్లా జైలు చీఫ్ హెడ్‌వార్డర్ గండ్ల ముక్తేశ్వర్‌లను ప్రతిభా పురస్కారాలు వరించాయి.

భారతరత్న ప్రణబ్‌దా

▶ మొదటి పేజీ తరువాయి

పూర్తి కృతజ్ఞతా భావం, విధేయతతో స్వీకరిస్తున్నా. నేను ఎప్పటికీ చెప్పేదాన్నే మళ్లీ చెబుతున్నా. ఈ గొప్ప దేశ ప్రజలకు నేను చేసిన దానికన్నా నాకే వారు ఎక్కువిచ్చారు' అని ట్వీట్ చేశారు. చివరగా 2015లో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి, బెనారస్ హిందూ యూనివర్సిటీ వ్యవస్థాపకుడు మదన్ మోహన్ మాలవీయకు భారతరత్నను ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రణబ్, దేశ్‌ముఖ్, హజారికాలకు ప్రధాని మోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా శుభాకాంక్షలు తెలిపారు.

అభివృద్ధి మార్గంపై చెరగని ముద్ర: మోదీ

ప్రణబ్ ముఖర్జీ, దేశ్‌ముఖ్, హజారికాల సేవల్ని కొనియాడుతూ ప్రధాని మోదీ ట్వీట్లు చేశారు. దశాబ్దాల పాటు నిస్వార్థంగా ప్రజాసేవచేసిన ప్రణబ్ ముఖర్జీ సమకాలీన రాజనీతిజ్ఞుల్లో గొప్పవారని, దేశ అభివృద్ధి మార్గంపై ఆయన చెరగని ముద్ర వేశారని ప్రశంసించారు. 'ప్రణబ్‌దాకు భారతరత్న రావడం పట్ల సంతోషంగా ఉంది. ఆయన తెలివి, ప్రజ్ఞకు సాటిగా నిలిచేవారు కొందరే ఉన్నారు' అని అన్నారు. గ్రామీణాభివృద్ధిలో విశేష కృషిచేసిన దేశ్‌ముఖ్..గ్రామీణుల సాధికారతా విషయంలో గొప్ప మార్పులకు నాందిపలికారని కొనియాడారు. 'అణగారిన, వెనకబడిన వర్గాల పట్ల కరుణ, విధేయత కనబరచిన దేశ్‌ముఖ్ నిజమైన భారతరత్న' అని పేర్కొన్నారు. ఇక హజారికా సేవల్ని ప్రశంసిస్తూ ఆయన



రిపబ్లిక్ డే పరేడ్‌లో సైనిక వందనం స్వీకరిస్తున్న ప్రణబ్ (ఫైల్)

గేయాలు తరాలకు అతీతంగా గౌరవం పొందాయని అన్నారు. 'హజారికా పాటలు న్యాయం, సమైక్యత, సోదరభావం అనే సందేశాలిస్తాయి. భారత సంగీత సంప్రదాయాల్ని ఆయన విశ్వవ్యాప్తం చేశారు. భూపేన్ హజారికాకు భారతరత్న దక్కడం ఆనందంగా ఉంది' అని మోదీ అన్నారు. ప్రజాసేవ చేసిన తమలో ఒకరికి ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం రావడం పట్ల కాంగ్రెస్ గర్విస్తోందని ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. హజారికా, దేశ్‌ముఖ్‌లకు కూడా ఈ అవార్డు ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు.


రాజేంద్రప్రసాద్, సర్వేపల్లి సరసన ప్రణబ్..

కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో పనిచేసిన ప్రణబ్ ముఖర్జీ ఆర్థిక, విదేశాంగ, రక్షణ శాఖ మంత్రిగా సేవలందించారు. 1982లో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టి, ఆ ఘనత సాధించిన అత్యంత పిన్న వయస్కుడిగా గుర్తింపు పొందారు. భారతరత్న పొందిన రాష్ట్రపతులు సర్వేపల్లి రాధాకృష్ణన్, రాజేంద్ర ప్రసాద్, జాకీర్ హుస్సేన్, వీవీ గిరి సరసన తాజాగా ప్రణబ్ చేరారు. 2010లో మరణించే వరకు దేశ్‌ముఖ్ ఆరెస్సెస్‌తో సంబంధాలు కొనసాగించారు. ఎమర్జెన్సీ సమయంలో జయప్రకాశ్ నారాయణ్ ఉద్యమ రూపకల్పనలో, 1977లో తొలి కాంగ్రెసేతర ప్రభుత్వ ఏర్పాటులో ముఖ్య పాత్ర పోషించారు. రుద్రాలీ, దార్మియాన్, గాజాగామిని, డామన్ లాంటి బాలీవుడ్ చిత్రాలతో పాటు పలు అస్సాం సినిమాలకు హజారికా సంగీతం సమకూర్చారు.

బెంగాల్ నుంచి ప్రణబ్‌కు వెల్లువెత్తిన శుభాకాంక్షలు..

భారతరత్న పొందిన ప్రణబ్ ముఖర్జీకి సొంత రాష్ట్రం పశ్చిమ బెంగాల్ నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. దేశంలోని ప్రముఖ రాజకీయ నాయకుల్లో ఒకరిగా నిలిచిన ప్రణబ్ భారతరత్నకు ఎంపికవడం బెంగాల్ ప్రజలకు గర్వకారణమని కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌధరి అన్నారు. అధికార తృణమూల్, ప్రతిపక్ష సీపీఎంలు కూడా ప్రణబ్‌కు శుభాకాంక్షలు తెలిపాయి. ఆయన ఈ దేశానికి గొప్ప పుత్రుడు మాత్రమే కాదని, గొప్ప మానవతావాది కూడా అని తృణమూల్ ప్రధాన కార్యదర్శి పార్థా ఛటర్జీ పేర్కొన్నారు.

సీఎం చంద్రబాబు రిపబ్లిక్ డే శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎందరో మహనీయుల కృషి, పోరాటాల ఫలితంగానే భారతదేశం సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, గణతంత్ర ప్రజాస్వామ్య రాజ్యంగా అవతరించిందని గుర్తుచేశారు.

ప్రణబ్ ముఖర్జీకి 'భారతరత్న' సముచిత గౌరవం

మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి దేశ అత్యున్నత 'భారతరత్న' పురస్కారం లభించడం సముచితమని ముఖ్యమంత్రి చెప్పారు. భారత రాష్ట్రపతిగా, కేంద్ర ఆర్థిక, రక్షణ మంత్రిగా ప్రణబ్ దేశానికి అందించిన సేవలు అనితర సాధ్యమైనవని అన్నారు. అలాగే, నానాజీ దేశ్‌ముఖ్, భూపెన్ హజారికాకు మరణానంతరం భారతరత్న పురస్కారాలు దక్కడం సంతోషదాయకమని అన్నారు. ప్రముఖ సినీ గీత రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి, చదరంగ క్రీడాకారిణి ద్రోణవల్లి హారికకు పద్మ పురస్కారాలు దక్కడం అభినందనీయమని సీఎం అన్నారు.

రాజనీతిజ్ఞుడికి అసలైన గౌరవం!

దేశ రాజకీయాల్లో ఓ అరుదైన వ్యక్తిత్వం. విదేశాంగ, రక్షణ, ఆర్థిక, వాణిజ్యం వంటి భిన్నమైన మంత్రిత్వ శాఖలను సమర్థవంతంగా నిర్వహించిన సామర్థ్యం. దశాబ్దాల రాజకీయ జీవితంలో స్ఫూర్తిదాయక వ్యవహారశైలితో ఆదర్శంగా నిలిచిన మహామనీషి. చిన్న వయసులోనే రాజనీతిజ్ఞుడిగా, దౌత్యవేత్తగా, రచయిత, జర్నలిస్టుగా, అధ్యాపకుడిగా ఇలా అవకాశం దొరికిన ప్రతి రంగంలోనూ సత్తా చాటుకున్న సమర్థుడు. ఇవన్నీ భారతదేశానికి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేని మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ గురించిన కొన్ని అంశాలు మాత్రమే. 2012 నుంచి 2017 భారత 13వ రాష్ట్రపతిగా సేవలందించిన ప్రణబ్ దా.. నాటి ప్రధాని ఇందిరా గాంధీ నుంచి.. మొన్నటి మన్మోహన్ సింగ్ వరకు కాంగ్రెస్, యూపీఏ ప్రభుత్వాల్లో వివిధ మంత్రిత్వ శాఖలను సమర్థవంతంగా నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నేతగా.. ఆ పార్టీ అత్యున్నత నిర్ణాయక మండలికి 23 ఏళ్లపాటు సీడబ్ల్యూసీ సభ్యుడిగా బాధ్యతలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఇబ్బందుల్లో పడినపుడల్లా ట్రబుల్ షూటర్‌గా వ్యవహరించి గట్టెక్కించారు. దేశ రాజకీయాల్లో ప్రణబ్ సేవలను గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించిన నేపథ్యంలో ఈ మహనీయుడి గురించిన కొన్ని విశేషాలు.

నరనరాన దేశభక్తి

1935 డిసెంబర్ 11న పశ్చిమబెంగాల్‌లోని బిర్భుమ్ జిల్లా మిరాటీలో స్వాతంత్ర సమరయోధుల కుటుంబంలో ప్రణబ్ దా జన్మించారు. ఆయన తండ్రి కమద కింకార్ ముఖర్జీ, తల్లి రాజలక్ష్మి. తండ్రి స్వాతంత్ర్య పోరాటాన్ని



కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టేందుకు వస్తున్న ప్రణబ్ (ఫైల్)

చూస్తూనే ఆయన పెరిగి పెద్దవాడయ్యారు. చరిత్ర, రాజనీతి శాస్త్రంలో పీజీ పూర్తిచేశారు. ఆ తర్వాత కలకత్తా యూనివర్సిటీ నుంచి న్యాయశాస్త్రంలో పట్టాపొందారు. టీచర్‌గా వృత్తిపరమైన జీవితాన్ని ప్రారంభించిన ప్రణబ్ దా.. చాలా రోజుల పాటు 'దేశేర్ దక్'(మాతృభూమి పిలుపు) అనే పత్రికకు జర్నలిస్టుగా పనిచేశారు. తండ్రి అప్పటికే కాంగ్రెస్ సీనియర్ నేత కావడంతో.. ఆయన అడుగుజాడల్లోనే ప్రణబ్ కూడా కాంగ్రెస్ ద్వారానే క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చారు.

ఇందిర ప్రియశిష్యుడిగా..

జాతీయ రాజకీయాల్లో ప్రణబ్ జోరుకు బీజం పడింది మాత్రం 1969లోనే. ప్రణబ్ చొరవను, నాయకత్వ లక్షణాలను గుర్తించిన ఇందిరాగాంధీ.. ఆయన్ను ప్రియశిష్యుడిగా చేసుకున్నారు. 1969లో రాజ్యసభ సభ్యుడిగా అవకాశం ఇచ్చారు. 1979లో రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికవగానే.. సభలో పార్టీ ఉపనేతగా, ఇందిర కేబినెట్లో మంత్రిగా స్థానం సంపాదించారు. 1980లో రాజ్యసభ పక్ష నేతగా ఎన్నికయ్యారు. ప్రణబ్ సామర్థ్యాన్ని గుర్తించిన ఇందిర.. 1982లో కీలకమైన ఆర్థిక శాఖ బాధ్యతలను అప్పజెప్పారు. పార్టీలో, ప్రభుత్వంలో ఇందిర తర్వాతి స్థానం ప్రణబ్‌దే అనుకునేవారు. అయితే 1984లో ఇందిర హత్యతో పరిస్థితి తారుమారైంది. పార్టీలో ప్రణబ్ ఎదుగుదలను ఓర్వలేని నేతలంతా ఏకమై.. పార్టీలో ఆయన్ను పక్కనబెట్టేలా రాజీవ్‌పై ఒత్తిడి తీసుకొచ్చారంటారు. 1991లో రాజీవ్ గాంధీ హత్య వరకు పార్టీలో ప్రణబ్ పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. పీవీ నరసింహారావు ప్రధాని కాగానే.. ప్రణబ్‌ను కేంద్ర మంత్రి బాధ్యతలు ఇవ్వడంతోపాటు ప్లానింగ్ కమిషన్ డిప్యూటీ చైర్మన్‌గా నియమించారు. 1995–96ల్లో భారత విదేశాంగ మంత్రిగా కూడా ఆయన బాధ్యతలు నిర్వహించారు. 2004లో మళ్లీ యూపీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. 2012 వరకు పార్టీ లోక్‌సభాపక్ష నేతగా ఉన్నారు. ఈ సమయంలోనే రక్షణ, విదేశీ వ్యవహారాలు, ఆర్థికశాఖ బాధ్యతలు నిర్వర్తించారు.

సొంత కూటమి పెట్టినా..

ఇందిర మరణం తర్వాత పార్టీలో ఎదురవతున్న అవమానాలతో.. ఆయన కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చేశారు. 1987లో రాష్ట్రీయ సమాజ్‌వాదీ కాంగ్రెస్ పార్టీని స్థాపించారు. అయితే.. తదనంతర పరిణామాలతో 1989లో ఈ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేశారు.

దౌత్యవేత్తగా విశేషానుభవం

రాజకీయవేత్తగానే కాదు.. దౌత్యవేత్తగానూ దేశానికి ప్రణబ్ దా సేవలందించారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకు, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు, ఆఫ్రికన్ డెవలప్‌మెంట్ బ్యాంకులకు బోర్డ్ ఆఫ్ గవర్నర్‌గా వ్యవహరించారు. కామన్వెల్త్ దేశాల ఆర్థిక మంత్రుల సమావేశాలకు 1982, 83, 84ల్లో భారత బృందానికి నేతృత్వం వహించారు. 1995లో అక్‌లాండ్‌లో జరిగిన కామన్వెల్త్ హెడ్స్ ఆఫ్ గవర్నమెంట్స్ సదస్సులోనూ భారత బృందానికి నాయకత్వం వహించారు.

మంత్రిగా ప్రణబ్..

కేంద్ర మంత్రిగా ఉన్న భారత్– అమెరికా పౌర అణు ఒప్పందంపై ఇరుదేశాల సంతకాలు. ఎన్ఎస్‌జీలో భారత సభ్యత్వంపై అమెరికాను ఒప్పించిందీ ప్రణబ్ హయాంలోనే. జెన్ఎన్‌యూఆర్ఎమ్ సహా పలు సామాజిక సంక్షేమపథకాలకు రూపకల్పన చేశారు. 1980ల్లో తొలిసారి ఆర్థిక శాఖ బాధ్యతలు చేపట్టిన సమయంలో.. తీసుకొచ్చిన మార్పులతో భారత ఆర్థిక వ్యవస్థ సంస్కరణవాదిగా పేరుతెచ్చుకున్నారు. 2008లో పద్మవిభూషణ్ అవార్డును అందుకున్న ప్రణబ్.. 2010లో ఆసియాలో అత్యుత్తమ ఆర్థిక మంత్రి అవార్డు పొందారు. 2013లో బంగ్లాదేశ్ రెండో అత్యుత్తమ పౌర పురస్కారాన్ని అందుకున్నారు. 1957లో సువ్ర ముఖర్జీతో ఆయన వివాహం జరిగింది. వీరికి ముగ్గురు సంతానం. 2015లో ప్రణబ్ దా భార్య కన్నుమూశారు.

రచయితగా ప్రణబ్..

జర్నలిస్టుగా పనిచేసిన అనుభవంతో.. వీలున్నపుడల్లా తన భావాలకు అక్షరరూపం ఇవ్వడాన్ని మాత్రం ప్రణబ్ మరిచిపోలేదు. 1987లో 'ఆఫ్ ద ట్రాక్'పుస్తకాన్ని 1992లో 'సాగా ఆఫ్ స్ట్రగుల్ అండ్ సాక్రిఫైస్', చాలెంజెస్ బిఫోర్ ద నేషన్ పుస్తకాలను.. 2014లో 'ద డ్రమాటిక్ డెకేడ్: ద డేస్ ఆఫ్ ఇందిరాగాంధీ ఇయర్స్'అనే పుస్తకాలను రచించారు. ఇందిర పాలనను, అధికారాన్ని దగ్గరగా చూసిన అనుభవం.. దౌత్యవేత్తగా ప్రపంచంలో భారత్ స్థానాన్ని అవగతం చేసుకున్న సమర్థుడిగా.. కిందిస్థాయి నుంచి వచ్చిన వ్యక్తిగా దేశంలోపల సమస్యలను చూసిన వ్యక్తిగా తన అనుభవాలను, దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను ఈ పుస్తకాల్లో పేర్కొన్నారు. భారత 13వ రాష్ట్రపతిగా ఆయన పదవీకాలం ప్రభావవంతంగా సాగింది. లైంగిక నేరాలను తీవ్రంగా పరిగణించేలా.. ఐపీసీ, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌ల్లో సవరణలు చేసిన 'క్రిమినల్ లా (సవరణ) ఆర్డినెన్స్ – 2013'కు ఆమోదముద్ర పడింది ఈయన రాష్ట్రపతిగా ఉన్న సమయంలోనే.

సమాజ సేవకుడు నానాజీ

- గ్రామీణ, విద్య, వైద్య రంగాల్లో సేవలు
- సామాజిక అసమానతలు రూపుమాపేందుకు కృషి

నానాజీ దేశ్‌ముఖ్.. సమాజ సేవకుడిగా, రాజకీయ నాయకుడిగా ఆయన సేవలు ప్రశంసనీయం. బయటి ప్రపంచానికి పెద్దగా పరిచయం లేకున్నా.. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, వెనుకబడిన, బలహీన వర్గాల ఉద్ధరణకు నడుంబిగించి.. ఆ దిశగా గణనీయమైన మార్పును తీసుకొచ్చారు. గ్రామీణ స్వరాజ్యంతోపాటు దేశవ్యాప్తంగా విద్య, వైద్య రంగాల్లో మార్పులకోసం తీవ్రంగా శ్రమించారు. 1916లో మహారాష్ట్రలోని హింగోలీ జిల్లాలో నానాజీ జన్మించారు. ఆయన అసలు పేరు చండికాదాస్ అమృత్‌రావ్ దేశ్‌ముఖ్. 12 ఏళ్ల వయసులోనే స్వయం సేవక్‌గా జీవితాన్ని ప్రారంభించారు. చదువుకోవాలనే తన ఆశకు ఆర్థికపరమైన ఇబ్బందులు అడ్డంకిగా మారడంతో కూరగాయలు విక్రయించి వచ్చే డబ్బులతో చదువుకున్నారు. బాలా గంగాధర్ తిలక్ స్ఫూర్తిగా సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారు. బిర్లా కాలేజీ (నేటి బిట్స్)లో విద్యాభ్యాసం చేశారు. భారతీయ జన్‌సంఘ్ క్రియాశీల కార్యకర్తగా మారారు. ఆ తర్వాత బీజేపీలోనూ కీలక నేతగా బాధ్యతలు నిర్వహించారు. తను ఎదుర్కొన్న సమస్యలు సమాజంలో ఎవరికీ రావొద్దని భావించి.. పేదలు, గ్రామీణ ప్రాంతాల వారికి విద్య, వైద్యం అందేలా తనవంతు కృషిచేశారు. దేశవ్యాప్తంగా సరస్వతీ విద్యామందిరాలను ఆయన ప్రారంభించారు. మంథన్ అనే పత్రికను స్థాపించి.. చాలా ఏళ్లపాటు తనే సొంతగా నిర్వహించారు. పుట్టింది మహారాష్ట్రలోనైనా.. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లలోనే నానాజీ విస్తారంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్థిక, సామాజిక అసమానతలు తొలగించేందుకు మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోని 500 గ్రామాల్లో సామాజిక పునర్నిర్మాణ కార్యక్రమాలను నిర్వహించారు. 1977లో లోక్‌సభ ఎంపీగా గెలిచారు. 1999లో ఎన్డీయే ప్రభుత్వం ఆయన్ను రాజ్యసభకు నామినేట్‌చేసింది. దేశంలోనే తొలి గ్రామీణ యూనివర్సిటీగా పేరొందిన మధ్యప్రదేశ్‌లోని 'చిత్రకూట్ గ్రామోదయ విశ్వవిద్యాలయ'నానాజీ ఆలోచనల ఫలితమే. 1974నాటి జయప్రకాశ్ నారాయణ్ ఉద్యమ రూపకర్తల్లో నానాజీ కూడా ఒకరు. 94 ఏళ్ల వయసులో 2010 ఆయన కన్నుమూశారు.

బ్రహ్మపుత్ర కవి..సుధాకాంత

- భూపేన్ హజారికా నేపథ్యమిదీ..



ఈశాన్య ప్రాంత సంస్కృతి, జానపద సంగీతాన్ని హిందీ ప్రేక్షకులకు పరిచయం చేసిన భూపేన్ హజారికా..బ్రహ్మపుత్ర కవి, సుధాకాంత పేరుతో సుప్రసిద్ధులు. మానవత్వం, సోదరభావం, సార్వత్రిక న్యాయం ఉట్టిపడేలా ఆయన అస్సామీ భాషలో రాసిన గేయాలు, పాటలు ఇతర భాషలు ముఖ్యంగా బెంగాలీ, హిందీలోకి తర్జుమా అయ్యాయి. అసోం, పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్‌లో ఆయన పాటలకు విపరీత ఆదరణ లభించింది. తన గాత్రంతో కొన్ని తరాలను ఉర్రూతలూగించారు. నేపథ్య గాయకుడు, సంగీతకారుడు, రచయిత, సినీ దర్శకుడిగా భారతీయ సినీరంగంపై తనదైన ముద్ర వేసిన హజారికాను జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు వరించాయి. 1926 సెప్టెంబర్ 8న అస్సాంలోని సాదియాలో హజారికా జన్మించారు. పది మంది సంతానంలో పెద్దవాడైన హజారికా బాల్యం నుంచే తల్లి నుంచి అస్సామీ సంగీతంలో ఓనమాలు నేర్చుకున్నారు. పదేళ్ల వయసులో ఓ కార్యక్రమంలో అస్సామీ భక్తి గీతాలు ఆలపిస్తుండగా ప్రముఖ రచయిత జ్యోతిప్రసాద్ అగర్వాలా, సినీ దర్శకుడు విష్ణుప్రసాద్ రాభా దృష్టిలో పడ్డారు. తరువాత 1939లో అగర్వాలా సినిమాలో రెండు పాటలు పాడారు. 13 ఏళ్ల వయసులో సొంతంగా పాట రాశారు. 1946లో బెనారస్ హిందూ వర్సిటీలో ఎంఏ పూర్తిచేసిన హజారికా కొంతకాలం ఆకాశవాణిలో పనిచేశారు. ఆ తరువాత కొలంబియా యూనివర్సిటీలో చదువుకునేందుకు ఉపకారవేతనం లభించడంతో 1949లో న్యూయార్క్ వెళ్లారు. అక్కడ ప్రముఖ హక్కుల కార్యకర్త పాల్ రాబ్సన్‌తో ఏర్పడిన పరిచయం ఆయన జీవితంపై చాలా ప్రభావం చూపింది. కొలంబియా యూనివర్సిటీలోనే తనకు పరిచయమైన ప్రియంవదా పటేల్‌ను 1950లో వివాహమాడారు. 1953లో స్వదేశం తిరిగొచ్చారు. 1967–72 మధ్య కాలంలో అసోం అసెంబ్లీ సభ్యుడిగా పనిచేసిన హజారికా, 2004లో బీజేపీ తరపున గువాహటి నుంచి లోక్‌సభకు పోటీచేసి ఓటమిపాలయ్యారు. 1998–2003 వరకు సంగీత నాటక అకాడమీకి చైర్మన్‌గా వ్యవహరించారు. 2011 నవంబర్ 5న ముంబైలో కన్నుమూశారు. బ్రహ్మపుత్ర తీరంలో జరిగిన ఆయన అంత్యక్రియలకు సుమారు 5 లక్షల మంది హాజరయ్యారు.

హజారికా పొందిన పురస్కారాలు..

- జాతీయ ఉత్తమ సంగీత దర్శకుడు(1975)
- సంగీత నాటక అకాడమీ అవార్డు(1987)
- పద్మశ్రీ(1977)
- పద్మభూషణ్(2001)
- దాదాసాహెబ్‌ఫాల్కే(1992)
- సంగీత నాటక్ ఫెలోషిప్(2008)
- పద్మవిభూషణ్(మరణానంతరం) (2012)
- భారతరత్న(2019)

చండీయాగం పరిసమాప్తం

- విశాఖ శారదా పీఠాధిపతి ఆధ్వర్యంలో పూర్ణాహుతి
- పూజల్లో పాల్గొన్న కేసీఆర్ దంపతులు, కుటుంబ సభ్యులు



యాగంలో స్వామీ స్వరూపానందేంద్ర సరస్వతి, కేసీఆర్ దంపతులు

గజ్వేల్/జగదేవ్‌పూర్: బంగారు తెలంగాణ కల సాకారం కావాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో ఐదు రోజులపాటు చేపట్టిన మహారుద్ర సహిత సహస్ర చండీయాగం పరిసమాప్తమైంది. యాగం చివరి రోజైన శుక్రవారం ఎనిమిది మండపాల్లో పూర్ణాహుతితో ఈ మహా క్రతువు పూర్తయింది. విశాఖ పీఠాధిపతి స్వామీ స్వరూపానందేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులతోపాటు కుటుంబ సభ్యులు ప్రతి మండపానికీ వెళ్లి పూర్ణాహుతిలో పాల్గొన్నారు. రాజశ్యామల, బగలాముఖి, నవగ్రహ, రుగ్వేద, యజుర్వేద, సామ, అథర్వణవేద మండపాల్లో పూర్ణాహుతి తర్వాత ప్రధాన యాగశాల చండీమాత మహామండపంలో పూర్ణాహుతి చేపట్టారు. ఐదు రోజులపాటు జరిగిన ఈ క్రతువుతో ఎర్రవల్లిలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.

రాజశ్యామలదేవికి పూజలు: ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు శుక్రవారం ఉదయం ముందుగా రాజశ్యామలదేవి మండపంలో పూజలు నిర్వహించారు. సమస్తత్వమే రాజశ్యామల మాతాకీ జై అంటూ వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య పూజలు జరిగాయి. బగలాముఖిదేవి మండపంలో జరిగిన పూజల్లో వేద పండితులు 'జయ పీతాంబర ధారిణి, దివ్య వేదోక్త మహానీరాజనం సమర్పయామి' అంటూ పూజలు చేశారు. నవగ్రహ మండపంలో నవగ్రహ, మహారుద్ర, చతుర్వేద మండపాల్లో సైతం పూర్ణాహుతి జరిగింది. మహాపూర్ణాహుతిలో భాగంగా చండీయాగ మండపంలోని అన్ని యజ్ఞకుండాల అగ్నిని ప్రధాన యజ్ఞ కుండంలోకి తీసుకొచ్చి మహాపూర్ణాహుతి ప్రారంభించారు. అదే విధంగా మహారుద్ర, రాజశ్యామల, బగలాముఖి, చతుర్వేద, నవగ్రహ యాగ మండపాల్లో కూడా షోఢశోపచార పూజలు చేసి హోమాల అనంతరం పూర్ణాహుతితోపాటు సువాసిని పూజ, మహదాశీర్వచనం, రుత్విక్ సన్మానం నిర్వహించారు.

నేడు, రేపు వడగళ్ల వాన!

సాక్షి, విశాఖపట్నం: వాతావరణంలో తలెత్తిన మార్పులతో రాష్ట్రంలో వానలు కురవడానికి వీలు ఏర్పడింది. ప్రస్తుతం ఆగ్నేయ బంగాళాఖాతానికి ఆనుకుని హిందూ మహా సముద్రంలో భూమధ్య రేఖ పరిసర ప్రాంతాల్లో కొద్దిరోజుల క్రితం ఏర్పడిన అల్పపీడనం స్థిరంగా కొనసాగుతోంది. మరోవైపు దక్షిణ మధ్యప్రదేశ్ నుంచి కర్ణాటక వరకు ఉపరితల ద్రోణి విస్తరించి ఉంది. అదే సమయంలో తూర్పు, పశ్చిమ గాలులు కలయిక కొనసాగుతోంది. వీటన్నిటి ప్రభావంతో శని, ఆదివారాల్లో కోస్తాంధ్రలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పాటు వడగళ్ల వాన కురిసే అవకాశాలున్నాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) శుక్రవారం రాత్రి నివేదికలో వెల్లడించింది. అలాగే రానున్న మూడు రోజులు కోస్తాంధ్రలో కొన్నిచోట్ల, రాయలసీమలో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురవొచ్చని తెలిపింది. అలాగే శని, ఆదివారాల్లో కోస్తాంధ్రలో పొగమంచు కూడా కొనసాగుతుందని పేర్కొంది. ఇక పగటి, రాత్రి ఉష్ణోగ్రతల్లోనూ ఒక్కసారిగా పెరుగుదల మొదలైంది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణంకంటే 1– 2 డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రతలు 2– 4 డిగ్రీలు చొప్పున అధికంగా నమోదవుతున్నాయి. దీంతో రాత్రి పూట చలి ప్రభావం బాగా తగ్గుముఖం పట్టింది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు రాష్ట్రంలో అత్యల్పంగా ఆరోగ్యవరంలో 17 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది.

రాష్ట్రంలో నమోదైన కనిష్ట ఉష్ణోగ్రతలు

ప్రాంతం	ఉష్ణోగ్రత
ఆరోగ్యవరం	17
నంద్యాల	18
విశాఖపట్నం	18
కళింగపట్నం	18
బాపట్ల	19
తిరుపతి	19

మన్మోహన్‌కు ‘పీవీ నర్సింహారావు’ పురస్కారం

ఫిబ్రవరి 28న ప్రదానం

హైదరాబాద్: మాజీ ప్రధాని, దివంగత నేత పీవీ నర్సింహారావు పేరిట అందించే జీవన సాఫల్య పురస్కారాన్ని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు అందించనున్నారు. ఫిబ్రవరి 28న ఢిల్లీలోని తీన్‌మూర్తి భవన్‌లో మన్మోహన్‌కు ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. ఇండియా నెక్ట్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జ్యూరీ కమిటీ ఈ మేరకు వెల్లడించింది. శుక్రవారం ఇక్కడ ప్రెస్‌క్లబ్‌లో సమావేశమైన జ్యూరీ సభ్యులు లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ, సాక్షి ఎడిటోరియల్ డైరెక్టర్ రామచంద్రమూర్తి, ఇండియా నెక్ట్స్ సలహా మండలి సభ్యుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు రాపోలు ఆనంద్ భాస్కర్‌లు పీవీ నర్సింహారావు జీవన సాఫల్య పురస్కారానికి మన్మోహన్‌ను అన్ని విధాలా అర్హుడిగా నిర్ణయించినట్లు ప్రకటించారు. విశ్రాంత న్యాయమూర్తి ఎంఎన్ వెంకటాచలయ్య అధ్యక్షతన డాక్టర్ సుభాష్ కశ్యప్, డాక్టర్ కార్తికేయన్ తదితర



జ్యూరీ కమిటీ సభ్యులందరం కలిసి మన్మోహన్ సింగ్‌ను ఈ అవార్డుకు అర్హుడిగా ఎన్నుకున్నట్లు జయప్రకాష్ నారాయణ తెలిపారు. సాక్షి ఎడిటోరియల్ డైరెక్టర్ రామచంద్రమూర్తి మాట్లాడుతూ.. పీవీ నర్సింహారావు జీవన సాఫల్య పురస్కారం మన్మోహన్ సింగ్‌కు ఇవ్వడం సముచితమని అన్నారు. ఇండియా నెక్ట్స్ జాతీయ కన్వీనర్ ఎస్‌వి.సూర్యప్రకాశ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీ, తెలంగాణ కోఆర్డినేటర్ శ్రీలక్ష్మి, యూత్ కోఆర్డినేటర్ కిరణ్మయి శృతి పాల్గొన్నారు.

30న మంత్రివర్గ సమావేశం

సాక్షి, అమరావతి: వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో ఈనెల 30వ తేదీన మధ్యాహ్నం 3.00 గంటలకు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరుగుతుందని ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి. అలాగే ఈనెల 28వ తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు సీఎం చంద్రబాబు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తారని పేర్కొన్నాయి.

కాపులు, ఈబీసీల మధ్య చంద్రబాబు చిచ్చు

రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్

సాక్షి, అమరావతి: కేంద్రం ప్రకటించిన 10 శాతం ఈబీసీ రిజర్వేషన్లలో ఐదు శాతం కాపులకు కేటాయించడం ద్వారా రాష్ట్రంలో కాపులకు, ఈబీసీలకు మధ్య ముఖ్యమంత్రి చంద్రబాబు చిచ్చు పెడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు విమర్శించారు. ఈ నిర్ణయం న్యాయపరంగా చెల్లదని తెలిసి కూడా ఈ ఎన్నికల్లో పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారంటూ ట్వీట్



చేశారు. గత ఎన్నికల సమయంలో కాపులను బీసీలుగా చేరుస్తానని ఆచరణ సాధ్యం కాని వాగ్దానం చేసి ఎన్నికల్లో గెలిచారని చెప్పారు. ఆ పంచాయతీ కాపు బీసీల మధ్య రగడకు దారి తీసేట్లు చేశారని.. ఇప్పుడు కాపులకు మిగిలిన ఈ బీసీలకు మధ్య చిచ్చు పెడుతున్నారని విమర్శించారు. చిత్తశుద్ధి లేని ఇలాంటి చర్యలను ఎవరూ నమ్మడం లేదని ఐవైఆర్ కృష్ణారావు తెలిపారు.

సాక్షి

శనివారం, జనవరి, 26

వెలుగునీడల 'గణతంత్రం'

దేశంలో గణతంత్ర వ్యవస్థ ఆవిర్భవించి నేటికి డబ్భైయ్యేళ్లవుతోంది. బ్రిటిష్ వలసపాలకులపై సాగిన అహింసాయుత సమరానికి నేతృత్వంవహించి పరదాస్య శృంఖలాలు తెగిపడేందుకు దోహదపడిన మహాత్ముడి 150వ జయంతి కూడా ఈ ఏడాదే రాబోతోంది. భారతావని సమైక్యంగా, సమష్టిగా సాధించుకున్న స్వరాజ్యాన్ని సురాజ్య స్థాపన దిశగా తీసుకెళ్లడానికి ఉద్దేశించిన భారత రాజ్యాంగం ఏర్పడి ఏడు పదులవుతున్న ఈ సందర్భంలో సమీక్షించుకోవాల్సినవి చాలా ఉన్నాయి. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలే మూల స్తంభాలుగా రూపొందిన ఆ రాజ్యాంగం మన గణతంత్ర వ్యవస్థ ప్రగతి పథ ప్రస్థానానికి ఎంతవరకూ తోడ్పడిందో...సామాజిక అసమానతలను, పెత్తందారీ పోకడలను ఏమేరకు తరిమికొట్టగలిగామో... ఆకలి, అనారోగ్యాలను ఎంతవరకూ నిర్మూలించగలిగామో... మానవ వనరుల సంపూర్ణ వినియోగంలో సాధించినదెంతో చర్చించాల్సిన సందర్భమిది. మిగిలినవాటి మాటెలా ఉన్నా ప్రజాస్వామ్యం పేరు చెప్పి మన దేశంలో క్రమం తప్పకుండా జరుగుతున్నవి ఎన్నికలు మాత్రమే. ఇతరాలన్నీ సామాన్యులకు దేవతావస్త్రాలుగానే మిగిలిపోతున్నాయి.

గణతంత్ర వ్యవస్థ ఆవిర్భావంనాటికే మన దేశం ఎన్నో క్లేశాలను చవిచూసింది. ప్రజల్ని మతం పేరిట విభజించాలని చూశారు. లేనిపోని వదంతులు సృష్టించి పరస్పర అవిశ్వాసాన్ని, అపనమ్మకాన్ని నాటేందుకు ప్రయత్నించారు. ఈ దేశం సమైక్యంగా ముందుకెళ్లగలదా... అసలు మనుగడ సాగించగలదా అని ప్రపంచవ్యాప్తంగా పలువురు సందేహపడే స్థాయిలో ఇదంతా కొనసాగింది. అంతటి ఉద్రిక్త పరిస్థితుల్లోనే మన రాజ్యాంగ నిర్ణాయక సభ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేతృత్వంలో చర్చోపచర్చలు సాగించి ప్రపంచంలోనే అతి పెద్దదైన ఉత్కృష్టమైన రాజ్యాంగాన్ని అందించింది. జాతికి దిశానిర్దేశం చేసింది. వలసపాలకులు ఈ దేశాన్ని వదిలిపోతూ సాగించిన దుష్ప్రచారం అంతా ఇంతా కాదు. తమ ప్రమేయంలేని ఈ దేశం పరస్పర ఘర్షణల్లో అతి త్వరలో విచ్ఛిన్నమైపోతుందని జోస్యం చెప్పారు. భారతీయులకు పాలన చేతగాదన్నారు. గణతంత్ర వ్యవస్థ స్థాపన కలగానే మిగులుతుందని, ఏర్పడినా అది ఎంతోకాలం మనుగడ సాగించలేదని లెక్కలేశారు. కానీ వారివన్నీ అక్కసు మాటలేనని మనం రుజువు చేయగలిగాం. సాధించిన విజయాలెన్నో ఉన్నాయి. కానీ వాటినే చూసి మురుస్తూ వైఫల్యాలను గమనించకపోతే అది ఆత్మవంచన అవుతుంది.

ఒకప్పుడు తిండిగింజలకు కటకటలాడిన దేశం ఇప్పుడు స్వయంసమృద్ధి సాధించడం మాత్రమే కాదు.. భారీయెత్తున ఎగుమతులు చేస్తోంది. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మనం సాధించిన పురోగతి ప్రపంచాన్నే ఆశ్చర్యపరిచింది. ప్రాణాంతక వ్యాధుల్ని చెప్పుకోదగ్గ రీతిలో అదుపు చేయగలిగాం. మన దేశం చెప్పుకోదగ్గ ఆర్థిక శక్తిగా ఎదిగింది. కానీ ఎన్నో రంగాల్లో మన వైఫల్యాలు సిగ్గుపడేలా చేస్తున్నాయి. ప్రజాజీవన రంగంలో నైతిక విలువలు అడుగంటుతున్న తీరు అన్ని స్థాయిల్లోనూ ప్రస్ఫుటంగా కనబడుతోంది. దీనికి అడ్డుకట్ట వేయాల్సినవారే దోహదపడుతున్న వైనం దిగ్భ్రాంతిగొలుపుతోంది. కాసుల లాలసతో, పదవీవ్యామోహంతో పార్టీ ఫిరాయింపులకు పాల్పడి అధికార పార్టీ పంచన చేరడానికి ఏమాత్రం తటపటాయించని చవకబారు రాజకీయ నేతల హవా ఇప్పుడు నడుస్తోంది. ఇలాంటివారి వల్ల మన చట్టసభలు చట్టుబండలవుతున్నాయి. జవాబుదారీతనం కొరవడుతోంది. చట్టసభల తీరుతెన్నులిలా ఉంటే వాటి వెలుపల అరాచకం రాజ్యమేలుతోంది. గణతంత్ర దినోత్సవానికి రెండురోజుల ముందు హరియాణాలోని రోహ్‌తక్ సమీపంలో నౌషాద్ మహమ్మద్ అనే 24 ఏళ్ల యువకుణ్ణి గోరక్షక ముఠా కరెంటు స్తంభానికి కట్టి దారుణంగా కొట్టి హింసిస్తే... అదేమని ప్రశ్నించినవారు లేరు. రెండు గంటల తర్వాత ఆ ప్రాంతాని కొచ్చిన పోలీసులు అతణ్ణి ఆసుపత్రికి తీసుకెళ్లకపోగా పోలీస్‌స్టేషన్‌లో గొలుసులతో బంధించారు. ఉపాధి అవకాశాల లేమి యువతను ఇలా సంఘవిద్రోహశక్తులుగా మారడానికి పురిగొల్పుతోంది. మన వృద్ధి రేటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి 7.4 శాతం ఉండొచ్చునని ఐక్యరాజ్య సమితి నివేదిక రెండురోజుల క్రితం అంచనా వేసింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ(ఐఎంఎఫ్) కూడా దాన్ని 7.5 వరకూ ఉండొచ్చునని లెక్కేసింది. కానీ విచారించదగ్గ విషయమేమంటే వృద్ధిరేటుకు అనుగుణంగా మన దేశంలో ఉద్యోగిత పెరగడం లేదు. 'సమ్మిళిత వృద్ధి' దరిదాపుల్లో కనబడటం లేదు.

యువతలో నైపుణ్యాన్ని పెంచుతామని గత యూపీఏ ప్రభుత్వం చెప్పింది. 50 కోట్లమందిని నిపుణులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రారంభించిన కార్యక్రమాలను ఎన్‌డీఏ ప్రభుత్వం కూడా కొనసాగించింది. అయిదారేళ్లు గడిచాక చూస్తే ఏముంది... నిపుణులు పెరిగారుగానీ, వారికి ఉద్యోగాల్లేవు. యువత ఉద్యోగాల వేట సాగించడం కాదు... తామే ఉద్యోగాలను సృష్టించాలంటూ ఆ తర్వాత ఊదరగొట్టారు. కానీ అందుకు అనువైన పథకాల అమలూ సక్రమంగా లేదు. సాగు గిట్టుబాటు కాక, నానాటికీ రుణాల ఊబిలో కూరుకుపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మౌలిక సదుపాయాలు ఇప్పటికీ అంతంతమాత్రమే. అయిదేళ్ల లోపు పిల్లల మరణాల సంఖ్య గణనీయంగా తగ్గడం ఉపశమనం కలిగించేదే. కానీ ఏడాదిలోపు శిశు మరణాలను, పసికందుల మరణాలను అరికట్టడంలో చెప్పుకోదగ్గ రీతిలో విజయం సాధించలేకపోతున్నాం. ఆర్థిక వ్యత్యాసాలు మనల్ని వెక్కిరిస్తున్నాయి. అసమ అభివృద్ధి మన సమర్థతను ప్రశ్నార్థకం చేస్తోంది. ఇప్పటికీ నాణ్యమైన విద్య అత్యధికులకు అందుబాటులో లేదు. ఫలితంగా పేదరికమే కోట్లాది కుటుంబాల శాశ్వతంగా చిరునామాగా మారింది. అన్ని రంగాల్లోనూ మాఫియాలదే పైచేయి అవుతోంది. అవినీతి ఊడలు దిగింది. ఈ దుస్థితి మారాలంటే, మన రాజ్యాంగ నిర్మాతల కలలు ఫలించాలంటే ఆత్మవిమర్శ అవసరం. దిద్దుబాట్లు కీలకం. అందుకు ఈ గణతంత్ర దినోత్సవం ఒక సందర్భం కావాలని ఆశిద్దాం.

గ్రహం అనుగ్రహం

శ్రీ విళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం, తిథి బ.షష్ఠి రా.10.36 వరకు తదుపరి సప్తమి, నక్షత్రం హస్త రా.9.15 వరకు తదుపరి చిత్త, వర్జ్యం ఉ.6.24 నుంచి 7.55 వరకు దుర్ముహూర్తం ఉ.6.36 నుంచి 8.06 వరకు అమృతఘడియలు... ప.3.32 నుంచి 5.04 వరకు.

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం: 5.47
రాహుకాలం : ఉ. 9.00 నుంచి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుంచి 3.00 వరకు

రాజ్యాంగం వేదమంత్రమా, కరదీపికా?

విశ్లేషణ



జాస్తి చలమేశ్వర్

పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి ముందే ద్రవ్యబిల్లును పొరపాటున తన ఆమోదం కోసం తీసుకువచ్చినప్పుడు రాష్ట్రపతిగా వ్యవహరిస్తున్న నాటి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ఎమ్. హిదయతుల్లా దాన్ని తిరస్కరించారు. ఆయన రాజ్యాంగాన్ని సంప్రదాయంగా కాకుండా, కార్యనిర్వాహక కరదీపికలాగా చూశారు. కానీ నేటి రాజకీయ నాయకత్వం రాజ్యాంగంలోని సూక్ష్మభేదాలను పట్టించుకోవడం లేదు. రాబర్ట్ బొర్క్ ప్రకారం, మనం రాజ్యాంగాన్ని చదవడం కాదు.. అసలు చదవాలా అన్నదే ప్రశ్న. నేడు మనం 'రాజ్యాంగ నైతికత' యుగంలోనూ, న్యాయ ధర్మ శాస్త్రాన్ని సీల్డ్ కవర్‌లో ఉంచేసిన యుగంలోనూ జీవిస్తున్నాం. భారత ప్రజాస్వామ్యాన్ని ఆ దేవుడే రక్షించుగాక..!

అత్యంత శ్రద్ధాశక్తులతో, శ్రమకోర్చి రూపొందించిన భారత రాజ్యాంగం.. రాజకీయ పవిత్రత కలిగిన శాసన పత్రం. నూతన గణతంత్ర వ్యవస్థ నిర్మాతలు పొందుపర్చిన ఆదర్శాలతో అది ప్రతిష్ఠితమైనది. కానీ దేశంలో 70 ఏళ్లుగా సాగుతున్న క్రమబద్ధ పాలనలో అది దాని ప్రాసంగికతను, ప్రగతిశీల స్వభావాన్ని కోల్పోయిందా అని నేను భీతిల్లుతున్నాను. ఏడు దశాబ్దాలలోపే మన రాజ్యాంగం సారాంశాన్ని లేక స్ఫూర్తిని కొనసాగించకుండా, దాన్ని కేవలం ఒక పూజనీయమైన పవిత్ర గ్రంథం స్థాయికి కుదించివేశారు..

నిజానికి అది రాజ్యాంగ పరిధిలో స్థాపించిన ప్రభుత్వానికి చెందిన మూడు విశిష్ట విభాగాల దుష్పరిపాలనకు వీలుకల్పించే అధికార వనరుగా మారిపోయింది. వివిధ రాజ్యాంగ సంబంధ కార్యాలయాలు తమ అసమర్థత కారణంగా రాజ్యాంగ ప్రతిని చదవటం కానీ లేక దాని సంవిధానాన్ని అర్థం చేసుకోవడం కాని చేయలేకపోతున్నాయి. తన మహోన్నతమైన ప్రయోజనాన్ని గుర్తించడానికి బదులుగా భారత ప్రజలపై అధికారాన్ని చలాయించే వనరుగా మాత్రమే మన రాజ్యాంగం మారిపోయింది. వేదమంత్రాల స్థాయిలో రాజ్యాంగ అధికరణలను మతిహీనంగా జపిస్తున్నారు.

రాజ్యాంగ న్యాయస్థానాల్లోని న్యాయమూర్తులే భారత రాజ్యాంగం అత్యున్నత పూజారులు. చాలాకాలం క్రితమే మృతిచెందిన ఇతర దేశాలకు చెందిన న్యాయవాదులు, న్యాయమూర్తులు ప్రయోగించిన సామెతలు, నిగూఢ పదబంధాలు, ఉల్లేఖనల ప్రస్తావనలతో వీరు సంతోషపడుతున్నారు. నూతనంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కొత్త హైకోర్టు ఏర్పాటు అంశం దీనికి సంబంధించిన తాజా అభాసగా నిలుస్తోంది. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం (1956 నుంచి 2014 వరకు మనుగడలో ఉండింది) ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014 పేరిట పార్లమెంటు చేసిన చట్టం ద్వారా విభజనకు గురైంది. ఇది తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అనే రెండు రాష్ట్రాలను రూపొందించింది. రెండు కొత్త రాష్ట్రాల ఏర్పాటుకు అవసరమైన వివిధ అంశాలను ఈ చట్టంలో పొందుపర్చారు.

ప్రతి రాష్ట్రానికి ప్రత్యేకించి విడిగా హైకోర్టు ఉండాలని రాజ్యాంగంలోని 214 అధికరణ ఆదేశించి ఉన్నందున, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేకంగా హైకోర్టును 'ఏర్పాటు చేయాల్సిన' అవసరముందని, హైదరాబాద్ పరిధిలోని హైకోర్టును, తెలంగాణ రాష్ట్ర హైకోర్టుగా మార్చాలని పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 30, 31 ప్రకటించాయి. అయితే హైదరాబాద్ పరిధిలోని హైకోర్టు మునుపటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టే తప్ప మరొకటి కాదు. దాని ప్రాదేశిక అధికార పరిధి రెండు కొత్త రాష్ట్రాల సారాంశంగా ఉండేది. కానీ రెండు రాష్ట్రాల అధికార పరిధిని కలిగి ఉండిన ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఇప్పుడు తెలంగాణ ప్రాంత ప్రాదేశిక అధికార పరిధిని మాత్రమే కలిగి ఉంటోంది.

అయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హైకోర్టును 'ఏర్పర్చాల్సిన' తేదీ గురించి పునర్వ్యవస్థీకరణ చట్టం మౌనం వహించింది. అలాగే ప్రత్యేక హైకోర్టును ఏర్పర్చాల్సిన విధివిధానం గురించి కూడా ఈ చట్టం మౌనం పాటిస్తోంది. దీన్ని వివరించడానికి మనం ఆంధ్రప్రదేశ్ చట్టం 1953, సెక్షన్ 28ని ప్రస్తావించాలి. 1956 జనవరి ఒకటవ తేదీన లేక రాష్ట్రపతి ప్రకటన ద్వారా నిర్దేశించిన అంతకు మునుపటి తేదీన కానీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హైకోర్టు ఉండాలని ఇది నిర్దేశించింది. హైకోర్టు ప్రధాన పీఠం నెలకొల్పాల్సిన స్థలాన్ని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ నిర్ణయించవచ్చని సెక్షన్ 28(3) ప్రకటించింది. జార్ఖండ్, చత్తీస్‌గఢ్, గుజరాత్ రాష్ట్రాలను ఏర్పర్చిన బిహార్, మధ్యప్రదేశ్, బాంబే పునర్వ్యవస్థీకరణ చట్టాల్లో కూడా ఇదే విధమైన అంశాలను మనం చూడవచ్చు.



పైన పేర్కొన్న చట్టాలన్నింటిలోనూ నూతనంగా ఏర్పర్చిన హైకోర్టు ఉనికిలోకి వచ్చే తేదీని నిర్ధారించే నిబంధనలను, హైకోర్టు ప్రధాన పీఠం ఎక్కడ ఉండాలో నిర్ణయించే రాజ్యాంగబద్ధ అధికారి గురించి నిర్దిష్టంగా సూచించడమైనది. నూతన హైకోర్టుకు చెందిన రాజ్యాంగబద్ధ ప్రాథమిక శాసనాధికారాన్ని పార్లమెంటు అత్యంత స్పష్టంగా నిర్దేశించింది. దురదృష్టవశాత్తూ, నూతన హైకోర్టు ఉనికిలోకి రావలసిన తేదీకి సంబంధించి 2014 చట్టంలో అలాంటి శాసనసంబంధమైన నిబంధనను మనం చూడలేం. లేక అలాంటి నిర్దిష్ట తేదీని ప్రకటించే అధికారాన్ని భారత రాష్ట్రపతి లేక మరెవరైనా రాజ్యాంగబద్ధ అధికారికి కట్టబెట్టిందీ లేదు.

అయితే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన హైకోర్టు ఏర్పాటు, భారత రాష్ట్రపతి సంతకం చేసిన 2018 డిసెంబర్ 26 నాటి భారత ప్రభుత్వ గెజెట్‌లో ప్రచురించిన ప్రకటన ద్వారా ఉనికిలోకి వచ్చింది. భారత ప్రభుత్వం వర్సెస్ బి. ధనపాల్ ఎస్ఎల్‌పి 298902018 మరియు రాష్ట్రాలకు చెందిన కేసులో సుప్రీంకోర్టు తీర్పును ఈ ప్రకటన ప్రస్తావిస్తూ, ఆ తీర్పు స్ఫూర్తితో హైదరాబాద్ అధికార పరిధిలోని హైకోర్టును తెలంగాణ హైకోర్టుగా, ఆంధ్రప్రదేశ్ హైకోర్టుగా విభజించే ప్రకటనను సంబంధిత సమర్థ అధికారి చేయగలరని పేర్కొంది.

అయితే న్యాయపాలనా పవిత్ర సూత్రం పరిధిలో అలాంటి సమర్థ అధికారి ఎవరు, స్వయంగా రాజ్యాంగం ద్వారా లేక రాజ్యాంగం పరిధిలో రూపొందించిన ఏదైనా చట్టం ద్వారా రాజ్యాంగ పాలన కలిగిన దేశంలో ఏదైనా ప్రభుత్వ చట్టం ద్వారా అలాంటి అధికారాన్ని చలాయిస్తారా అన్నదే ప్రశ్న. నేను ముందే చెప్పినట్లుగా హైకోర్టు ఏర్పాటు తేదీని ఎవరు నిర్ణయించాలి అనే అంశానికి సంబంధించి పునర్వ్యవస్థీకరణ చట్టం 2014 పూర్తిగా మౌనం పాటిస్తోంది. కానీ రాష్ట్రపతి పేరుతో జారీ చేసే ప్రకటన ద్వారా ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చని ప్రభుత్వం లేక దేశ పాలకులు విశ్వసిస్తున్నారు.

అయితే ఒరిజనల్ ఆంధ్రప్రదేశ్ హైకోర్టుగా ఉండి ఇప్పుడు మారిన తెలంగాణ హైకోర్టులో కుదించిన ప్రాదేశిక న్యాయాధికార పరిధితో కొనసాగనున్న జడ్జీలుకూడా తాజాగా ప్రమాణ స్వీకారం చేయడమే ఈ మొత్తం ఉదంతంలో ఉల్లాసం కలిగించే అంశం. అయితే తాజాగా ఎలాంటి నియమకాలకు చెందిన వారంట్లనూ జారీచేయలేదు. నా అభిప్రాయంలో ఇది సరైనదే. కానీ అదేసమయంలో, రాజ్యాంగ సంవిధానాన్ని లేక రాష్ట్రపతి అధికారాలను విశ్లేషించి చూస్తే ఇలా కొత్తగా ప్రమాణం చేయవలసిన అవసరం లేదు. మాతృసంస్థ అయిన మద్రాసు హైకోర్టు నుంచి ప్రాదేశిక న్యాయాధికార పరిధిలో ఆంధ్ర హైకోర్టు 1953లో ఏర్పాటైన సందర్భంగా మదరాసు హైకోర్టులోనే ఉండిపోయిన న్యాయమూర్తులు కొత్తగా ప్రమాణం చేయలేదు. అలాగే గుజరాత్, జార్ఖండ్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల నూతన హైకోర్టులను ఏర్పర్చిన సందర్భంలోనూ బాంబే, పాట్నా, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు కొత్తగా ఎలాంటి ప్రమాణం చేయలేదు. చెప్పుకుంటే ఇలాంటివి చాలా ఉదాహరణలు ఉంటాయి. అయితే ఇప్పుడు తెలంగాణ హైకోర్టుగా పిలుస్తున్న హైదరాబాద్ అధికార పరిధిలో కొనసాగుతున్న జడ్జీలు మాత్రం తాజాగా ప్రమాణ స్వీకారం చేశారు. ఏపీ, తెలంగాణ హైకోర్టుల్లో ఇలాంటి ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగినప్పుడు సుప్రీంకోర్టు మాజీ జడ్జీలు, ప్రస్తుత సిట్టింగ్ జడ్జీలు కూడా వాటికి హాజరవటం గమనార్హం.

1969లో నాటి రాష్ట్రపతి జకీర్ హుస్సేన్ పదవిలో ఉండగానే మరణించినప్పుడు, రాష్ట్రపతిగా వ్యవహరించిన ఉపరాష్ట్రపతి, రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేయడానికి తన పదవికి రాజీనామా చేశారు. దీంతో భారత ప్రధాన న్యాయమూర్తి దేశ రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టడానికి రాజ్యాంగం రీత్యా పరిస్థితి డిమాండ్ చేసిన నేపథ్యంలో నాటి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ఎమ్ హిదయతుల్లా మరొకరి బదులుగా రాష్ట్రపతిగా అయ్యారు. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం మనీ బిల్లును ఆయన పరిశీలనకు పంపించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 117(1) ప్రకారం, రాష్ట్రపతి 'సిఫార్సు'తో మాత్రమే పార్లమెంటులో మనీ బిల్లును ప్రవేశపెట్టాల్సి ఉంది. పార్లమెంటు ఉభయసభల్లో ఈ బిల్లు నెగ్గినట్లయితే, దాన్ని మళ్లీ రాష్ట్రపతి ఆమోదానికి పంపాలి. ఇక్కడ సంక్లిష్ట పరిస్థితి ఏర్పడింది. పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టడానికే రాష్ట్రపతి సిఫార్సు చేస్తారు. రాష్ట్రపతి ఆమోదం ఆ బిల్లును శాసనంగా మారుస్తుంది.

అయితే పార్లమెంటులో ఆ బిల్లు ప్రవేశపెట్టడానికి ముందుగా నాటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి హిదయతుల్లా ముందుకు పొరపాటున ఆ ద్రవ్య బిల్లును తీసుకెళ్లారు. హిదయతుల్లా రాజ్యాంగం గురించి మరిచిపోయి ఉంటే, లేక రాజ్యాంగం గురించి తెలియకుండా ఉంటే, లేక అహంభావంతో ప్రవర్తించి ఉంటే ఆ బిల్లుకు ఆమోదం తెలుపుతూ సంతకం పెట్టేవారు. దీంతో పార్లమెంటులో దాన్ని ప్రవేశపెట్టకుండానే ఆ బిల్లు భారత ప్రామాణిక శాసనంగా మారిపోయి ఉండేది.

హిదయతుల్లా రాజ్యాంగానికి సేవ చేసిన విశిష్ట న్యాయవేత్త. ఆయన రాజ్యాంగాన్ని కార్యనిర్వాహక కరదీపికలాగా చూశారు. ఆయన కేవలం సంప్రదాయాలను గుడ్డిగా పాటించే అత్యున్నత పూజారి కాదు. అందుకే పార్లమెంటులో ప్రవేశపెట్టకుండానే తన వద్దకు వచ్చిన ఆ ద్రవ్యబిల్లును ఆమోదించడానికి ఆయన తిరస్కరించారు. దాంతో ఆయన కింది అధికారులు న్యాయమీమాంసకు సంబంధించిన ఒక పెను సంక్షోభాన్ని తప్పిస్తూ తమ తప్పును సరిదిద్దుకోవలసి వచ్చింది.

హిదయతుల్లా ఇప్పుడు లేరు. కానీ నేటి రాజకీయ నాయకత్వం రాజ్యాంగంలో పొందుపర్చి ఉన్న సూక్ష్మభేదాల గురించి పెద్దగా విచారించడం లేదు. వారితోపాటు ప్రధాన పూజారులు కూడా వాటిని లెక్కబెట్టడం లేదు. ఈ సందర్భంగా నేను రాబర్ట్ బొర్క్ ప్రకటనను గుర్తు చేస్తాను– ఈరోజుల్లో రాజ్యాంగాన్ని ఎలా చదవాలన్నది కాదు.. చదవాలా వద్దా అన్నదే ప్రశ్న. ఇప్పుడు మనం 'రాజ్యాంగ నైతికత' యుగంలోనూ, న్యాయ ధర్మశాస్త్రాన్ని సీల్డ్‌కవర్‌లో ఉంచేసిన యుగంలోనూ జీవిస్తున్నాం. భారత ప్రజాస్వామ్యాన్ని ఆ దేవుడే రక్షించుగాక!

వ్యాసకర్త సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

హిట్



"ప్రియాంకా గాంధీని ఇష్టపడటం, ఇష్టపడకపోవడంలో తప్పేమీ లేదు. అది అభిరుచికి సంబంధించినది. వాస్తవాల విషయానికి వస్తే ఆమె ఓట్లు సాధించగలదనడానికి ఎటువంటి ఆధారాలు లేవు. అంటే ఆమె సాధించలేదని నేను చెప్పడం లేదు. ఇంకా ఎవరూ ఒక్క టికెట్టయినా కొని, సినిమా చూడకుండానే సినిమా హిట్ అనడం లాంటివే ఇవన్నీ"

– సదానంద్ ధూమే
కాలమిస్టు

లౌకికత్వం



"రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్‌గారూ, మీరు రాజ్యాంగ పరిరక్షకులు. మీరూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీలాగే లౌకికత్వం అనే మాట వాడటానికి ఎందుకు ఇష్టపడరు? 'లౌకికత్వమే భారతదేశానికి గొప్ప బలం' అని మీరు చెప్పితీరాలి."

– సుధీంద్ర కులకర్ణి
సామాజిక కార్యకర్త

పాత వాసన



"రాజ్యాంగ పదవులలో కొనసాగుతున్నప్పటికీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ తమ పాత పార్టీ వాసనలను మర్చిపోయినట్టు లేరు. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సినవాళ్లు తమ హోదాకు భంగం కలిగేలా ప్రవర్తించడం విచారకరం"

– అజయ్ కామత్, నేత్ర వైద్యుడు

లబ్ధి



"జాతి, మతం పేరిట ఈశాన్య రాష్ట్రాల్లో చెలరేగుతున్న హింస ఆందోళన కలిగిస్తోంది. రాజకీయ లబ్ధి కోసం ఈ ప్రాంతాన్ని బీజేపీ వాడుకుంటోంది. సోదరుల, ఆత్మీయుల మధ్య చిచ్చుపెట్టే రాజకీయాలను ఆపాలి"

– రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధినేత


వంశపారంపర్యం



"ప్రియాంకా గాంధీ నియామకం వంశ పారంపర్య పాలనను ముందుకు తీసుకెళ్లడమేనట. ఎవరు మాట్లాడుతున్నారో చూడండి. మామగారు పరకాల శేషావతారం అనేకసార్లు మంత్రిగా పనిచేశారు, అత్తగారు కాళికాంబ ఎమ్మెల్యేగా చేశారు, భర్త పరకాల ప్రభాకర్ వివిధ పార్టీల నుంచి అనేక సార్లు పోటీ చేసి ఓడిపోయారు. రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ గారూ.. అద్దాల మేడలో నివసించేవారు ఎదుటి వారిపై రాళ్లు విసరకూడదని తెలుసుకుంటే మంచిదండీ"

– శర్మిష్టా ముఖర్జీ
మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు

ఎవరి మేళం వారిది!



శ్రీరమణ

అక్షర తూణీరం



మా ఊళ్లో పోలేరమ్మ గుడి ఉంది. ఏటా ఆ గ్రామ దేవతకి జాతర జరుగుతుంది. ఎవరి పద్ధతిలో వాళ్లు పూజలు చేస్తారు. మొక్కులు తీరుస్తారు. పోటాపోటీగా జాతర నిర్వహిస్తారు. గ్రామ దేవతకి ఊళ్లో వాద్య కళాకారులంతా తమతమ వాద్యగోష్ఠితో సంగీత నివేదన చేస్తారు. డప్పులు వాయించే కళాకారులు, డోలు వాయిద్యాలు, బాకాలూదేవారు, బ్యాండ్ సెట్‌లో ఇత్తడి బూరాలు వాయించే వాళ్లు ఇలా రకరకాల వాళ్లు అమ్మవారి గుడిచుట్టూ చేరి తమ భక్తిని అపారంగా ప్రదర్శిస్తారు.

మా ఊళ్లో రెండు వర్గాలుంటాయ్ హీనపక్షంగా. రెండో వర్గం డప్పులు, బ్యాండ్లు మంచి సెగలో వేడెక్కించి అమ్మోరి గుడిచుట్టూ మోహరించేది. తాషామరపాలు, రామ డోళ్లు, ఇంకా రకరకాల తోలు వాయిద్యాలు వాటి శ్రుతుల్లో అవి మోగిపోతూ ఉంటాయ్. నాదస్వరం, క్లారినెట్లు, మెడకి వేసుకున్న హార్మణీ పెట్టెలు వాటికొచ్చిన సంగీతాన్ని అవి సొంత బాణీల్లో వినిపిస్తూ ఉంటాయ్. వాద్యకారులందరికీ పోలేరమ్మమీద భక్తే. ఏ ఒక్కరినీ శంకించలేం. మధ్యమధ్య ఊదుడు శంఖాలున్న జంగందేవర్లు శంఖనాదాలు చేస్తుంటారు. ఇంకా బోలెడు సందళ్లు.

వీటన్నింటినీ ఏకకాలంలో మూకుమ్మడిగా గంటల తరబడి వినడమంటే ఇహ ఆలోచించండి. పైగా వర్గపోటీలో రెచ్చిపోయి వాయిస్తూ ఉంటారు. వాళ్లని ఎవ్వరూ అదుపులో పెట్టలేరు. ఆ.. వూ... అనలేరు. వింటూ చచ్చినట్టు ఆ శిక్ష అందరూ అనుభవించాల్సిందే. ఆ కారణంగా కుర్రతనంలో నాకు మొదటిసారి దేవుడు లేడేమోనని సందేహం వచ్చింది. నిజంగా ఉంటే జాతరలో భక్తులు చేస్తున్న ఈ రణగొణ ధ్వనులను ఏ అమ్మవారైనా, ఏ అయ్యోరైనా ఎందుకు వారించరు? గుడ్లురిమి ఎందుకు భయపెట్టరు? వారి మనస్సుల్లో ప్రవేశించి, గ్రామానికి శాంతి ఏల ప్రసాదించరు? ఇలా పరిపరి విధాల అనుకుంటూ దేవుడి ఉనికిని శంకించేవాణ్ణి. ఆ ముక్క చెబితే, మా నాయనమ్మ గుంజీలు తీయించి, చెంపలు వేయించి, నా చేత తలస్నానం చేయించేది. ఆ తర్వాత మళ్లీ పోలేరమ్మ మీద నమ్మకం కుదిరేది.

ఈ మహా కూటముల తిరనాళ్లు చూస్తుంటే మా వూరి జాతర మేళం గుర్తొస్తుంది. అందరి లక్ష్యమూ ఒక్కటే. ఉన్నవాళ్లని ఇప్పుడు కుర్చీలోంచి దింపాలి. వీళ్లు పవర్‌లోకి రావాలి. ఇప్పుడు ఉన్నాయన ప్రజలకు చాలా అన్యాయం చేస్తున్నారు, మేం మిమ్మల్ని రక్షిస్తాం–అనే ఉమ్మడి నినాదంతో ఇంటింటికీ వస్తారు. ర్యాలీలు, భారీ సభలు నిర్వహిస్తారు. ఓటర్లు మరొక్కసారి బోనులో పడకపోతారా అని కూటమి పిచ్చి నమ్మకంతో ఉంది.

ఈ జగత్తు యావత్తూ ఒక పెద్ద వల. తెల్లారిన దగ్గర్నించి జీవిని జీవి వలలో వేసుకోవడమే లక్ష్యం. పురుగుని కప్ప, కప్పని పాము, పాముని డేగ, డేగని వేటగాడు ఇలా ఒక వలయం చుట్టూ వేట సాగుతుంది. నిద్ర లేవకుండానే, సాలెపురుగు వల అల్లడం మొదలుపెడుతుంది. జింక కోసం పులి పొంచి ఉంటుంది. నోటి సైజులని బట్టి చేపలు చేపల కోసం పరుగులు పెడుతుంటాయ్. కొంగ ఒంటికాలి మీద జపంలో నుంచుంటుంది.

ఏ జీవి లక్ష్యమైనా కావల్సిన ఆహారం సంపాయించుకోవడమే. నాయకుడికి కావల్సిన మేత ఓట్లు. పవర్ చేతికొస్తే మనదేశంలో కామధేనువుని పాకలో కట్టేసుకున్నట్టే. కల్పతరువుని పెరట్లో నాటినట్టే. పవరుంటే సర్వభోగాలు ఉన్నట్టే. వారికి వారి నియర్ అండ్ డియర్‌కి చట్టాలు వర్తించవు. అవసరమైతే ఒక్కోసారి తెగించి వాళ్లు ప్రజాసేవ కూడా చెయ్యొచ్చు.

మిగతాప్పుడు ఎలా ఉన్నా ఈ గణతంత్ర దినోత్సవం రోజు భారత జాతి గర్వంగా, తలెత్తి జాతీయ పతాకానికి శాల్యూట్ కొడుతుంది. మూడు సింహాల మొహర్ చాలా శౌర్యాన్ని, పౌరుషాన్ని ప్రదర్శిస్తూ కనిపిస్తుంది.

బ్రహ్మదేవుడికి నాలుగు తలకాయలున్నట్టు, మనది నాలుగుసింహాల ముద్ర. వెనకపడిన నాలుగో సింహం ఏ మాత్రం చైతన్యవంతంగా లేదన్నది మాత్రం నిజం. అందుకే నాలుగో సింహానికి కూడా శాల్యూట్ కొడదాం!

(వ్యాసకర్త ప్రముఖ కథకుడు)

కొల్లాయి కట్టి... 99 ఏళ్లు!

సందర్భం



రామతీర్థ

''కొల్లాయిగట్టితేనేమీ మా గాంధీ..'' అంటూ తెలుగు నాట వీర విహారం చేసిన స్వాతంత్ర్య పోరాట గీతం రాసిన కవి బసవరాజు అప్పారావు. సినిమాలో పాటగా, 1938 మాలపిల్ల సినిమాలో సూరిబాబు పాడిన గీతం. నిజానికి ఈ కొల్లాయి కట్టే ఘట్టం ఎప్పుడు జరిగింది అంటే మనం కొంత ఆలోచిస్తాం కానీ, ఎవరీ వ్యక్తి అంటే, ఒక్క క్షణమైనా తడుముకోకుండా, కొల్లాయి కట్టినది గాంధీజీ అని చెప్పేస్తాం. పైపెచ్చు తెలుగు సాహిత్యంలో, 'కొల్లాయిగట్టితేనేమి' ఒక ప్రఖ్యాత తెలుగు నవల కూడా. 1960లలో ఈ నవల రాసింది మహీధర రామమోహనరావు. 1969లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ అవార్డ్ పొందిన నవల ఇది.

అయితే గాంధీజీ జీవితంలో కూడా ఇది జరిగింది సెప్టెంబర్ 1921లో. తన పత్రిక నవజీవన్‌లో గాంధీ ఇలా చెప్పారు. ''మదరాసు నుంచి మదురైకి రైలుబండిలో వెళ్తుండగా, ఏమీ పట్టనట్టుగా రైలు పెట్టెలో ఉన్న జనాలను చూశాను. అందరూ విదేశీ దుస్తుల్లో ఉన్నారు. వారితో మాట్లాడుతూ, ఖాదీ ధరించవలసిన ఆవశ్యకత గురించి నేను నచ్చచెప్పబోయాను. వారు తలలు అడ్డంగా ఊపి ''మేం చాలా పేదవారం, ఖాదీ ధారణ చేయడానికి, కొనాలంటే ఖాదీ చాలా ఖరీదు'' వారి మాటల అంతరార్థం నేను గ్రహించాను. నేను పూర్తి దుస్తుల్లో ఉన్నాను, తలపై టోపీతో సహా. వీరు చెప్పింది కొంతవరకూ సత్యమే అయినా, కోట్లాదిమంది ప్రజలు కేవలం ఒక్క లంగోటీతో కాలం గడుపుతూ ఇదే నిజాన్ని చెప్తున్నారనిపించింది. వారికి నేనేమని సరైన జవాబివ్వగలను, నా వంటిమీది అదనపు దుస్తులను ప్రతి అంగుళమూ గనుక వదులుకుంటే, అలా చేయడం ద్వారా, ఈ దేశపు కోట్లాది మందికి దగ్గర కాగలిగితే.. మరునాడు ఉదయం మదురై సమావేశం తరువాత, వెంటనే నేను ఆ పని చేశాను''.

అలా మదురై మహాత్మునికి కొల్లాయి కట్టించిన తల్లి. తన దుస్తుల ధారణ, జాతీయోద్యమంలో భాగం చేయగల మేధావి గాంధీజీ. కొల్లాయి గాంధీజీ బ్రాండ్‌గా ప్రజల మనసుల్లో నిలబడిపోయింది. ప్రపంచవ్యాప్తంగా ఈ అరకొర దుస్తుల ఫకీరు, అతిపెద్ద ఉపఖండ స్వాతంత్ర్య పోరాట నాయకుడని, గాంధీజీ ఆకర్షణ వలయంలో పడిపోయింది. ఈ దుస్తుల పద్ధతి, ఒకసారి అయిదో జార్జ్ చక్రవర్తిని బకింగ్‌హామ్ భవంతిలో కలవడానికి వెళ్లాల్సివచ్చినప్పుడు, ఇవే దుస్తులా అని ప్రపంచం, పాలక వర్గాలు విస్మయంలో పడ్డాయి. చక్రవర్తిని కలవడానికి వెళ్ళేటప్పుడు ఇలా చాలీ చాలని దుస్తుల్లోనే వెళ్తారా? అన్నది మీడియా ప్రశ్న. ''మా ఇద్దరికీ సరిపడా దుస్తులు చక్రవర్తి ధరించే ఉన్నారు కదా'' అన్నది గాంధీజీ ఇచ్చిన చురుకైన జవాబు. విదేశీ వస్త్ర బహిష్కరణ ద్వారా ఆ రోజుల్లో ఆ దుస్తుల అమ్మకాలను సగానికి పడిపోయేలా బ్రిటిష్ వారి పై ఆర్థిక పరమైన దెబ్బ తీశారు గాంధీజీ. ఇలా కొల్లాయి కట్టిన ఘట్టానికి నాంది, సెప్టెంబర్ 1921లో గాంధీజీ బస చేసిన మదురైలోని పడమటి మాసి స్ట్రీట్‌లోని డోర్ నంబర్ 251 ఇల్లు. ఇప్పుడు అదే భవనంలో ఖాదీ ఎంపోరియం నడుస్తున్నది.

కొల్లాయిగట్టితేనేమి, మహీధర వారి నవల 1920 డిసెంబర్–1921 ఏప్రిల్ వరకూ కథా కాలంగా నడుస్తుంది. టెక్నికల్‌గా, ఈ నవలలో కథన



డిచే కాలానికి ఇంకా గాంధీజీ (సెప్టెంబర్ 1921 దాకా) కొల్లాయి కట్టడం ప్రారంభించలేదు. అందుకే మహీధర వారు, ఎంత చారిత్రక దృష్టితో చెప్పారు అంటే, ఈ నవల కథాకాలం పూర్తి అయిన కొద్ది నెలలకు కానీ గాంధీజీ కొల్లాయి కట్టడం మొదలు కాలేదు. అంటే గాంధీజీ కొల్లాయి కట్టడానికి ముందర కాలంలో, అసలు కొల్లాయి కట్టు గురించి ఏ పాటలూ లేని కాలంలోకి వెళ్ళి (1920–21) తను 1960లో రాసిన నవలకి ఇలా పేరు పెట్టిన సంగతి వివరించారు. అలా 1921లో తన దుస్తుల ధారణ కూడా స్వాతంత్ర్య పోరాటంలో భాగం చేసిన వ్యూహకర్త గాంధీజీ. ఆ దుస్తుల వ్యూహానికి ఇది 99వ వత్సరం. 70ఏళ్ల రిపబ్లిక్ దినోత్సవ సందర్భంలో, గాంధీజీ కొల్లాయి ధారణ ఈ దేశానికి చేసిన మేలు ఎంతో, స్వదేశీ ఉత్పత్తుల సమాదరణ వల్ల ఎంత అభివృద్ధి సాధించగలమో కూడా ఇంకా మనం గ్రహించవలసి ఉన్నది.

(నేడు కృష్ణానదీ నౌకావిహార సాహిత్య సభలో మహీధర 'కొల్లాయిగట్టితేనేమీ' నవలపై సాయంత్రం 5 గంటలకు రామతీర్థ ప్రసంగం)

వ్యాసకర్త కవి, విమర్శకులు। 98492 00385



సిరివెన్నెలకు పద్మశ్రీ

- ద్రోణవల్లి హారిక, ఎడ్లపల్లి వేంకటేశ్వర రావులకూ దక్కిన పురస్కారం
- తెలుగు రాష్ట్రాల నుంచి నలుగురికి ఈ అవార్డు
- 2019 ఏడాదికి పద్మ పురస్కారాలు ప్రకటించిన కేంద్రం
- నలుగురికి పద్మ విభూషణ్, 14 మందికి పద్మభూషణ్
- 94 మందికి పద్మశ్రీ, వారిలో ఓ ట్రాన్స్‌జెండర్ నర్తకి నటరాజ్ కూడా


నర్తకి నటరాజ్


ఖాదర్ ఖాన్


కరియా ముండా


మోహన్‌లాల్

సాక్షి, న్యూఢిల్లీ: ప్రఖ్యాత సినీగేయ రచయిత సిరివెన్నెల సీతారామ శాస్త్రిని కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి నలుగురు వ్యక్తులకు ఈ ఏడాది పద్మశ్రీ పురస్కారాలు దక్కాయి. వీరిలో ఇద్దరు ఆంధ్రప్రదేశ్‌కు, ఇద్దరు తెలంగాణకు చెందినవారున్నారు. ఏపీ నుంచి ప్రముఖ చెస్ క్రీడాకారిణి ద్రోణవల్లి హారిక, వ్యవసాయ రంగం నుంచి ఎడ్లపల్లి వేంకటేశ్వరరావు, తెలంగాణ నుంచి సిరివెన్నెలతో పాటు భారత ఫుట్‌బాల్ జట్టు మాజీ కెప్టెన్, ప్రముఖ ఆటగాడు సునీల్ ఛెత్రిలను పద్మ శ్రీ వరించింది. 2019వ సంవత్సరానికి పౌర పురస్కారాలను కేంద్రం శుక్రవారం ప్రకటించింది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన ప్రముఖులను పద్మ విభూషణ్, పద్మభూషణ్, పద్మ శ్రీ పురస్కారాలకు ఎంపిక చేసింది. కళలు, సాహిత్యం, సైన్స్ అండ్ ఇంజినీరింగ్, పరిశ్రమలు, ఆరోగ్యం–వైద్యం, వర్తకం, క్రీడలు, సామాజిక సేవ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచి ఆయా రంగాల్లో తమకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న ప్రముఖులను కేంద్రం పద్మ అవార్డులతో సత్కరించనుంది. మొత్తం 112 మందికి ఈ పురస్కారాలు ప్రకటించింది. వీరిలో నలుగురికి పద్మ విభూషణ్, 14 మందికి పద్మభూషణ్, 94 మందికి పద్మ శ్రీ పురస్కారాలు దక్కాయి. జానపద గాయకురాలు తీజన్ బాయి, జిబౌటీకి చెందిన ఇస్మాయిల్ ఒమర్ గులేహ్, ఎల్ అండ్ టీ చైర్మన్ ఏఎం నాయక్, మహారాష్ట్రకు చెందిన బల్వంత్ పురందరేలను పద్మ విభూషణ్ విజేతలుగా కేంద్రం ఎంపిక చేసింది. అవార్డులు దక్కించుకున్న వారిలో 21 మంది మహిళలు, 11 మంది విదేశీయులు, ముగ్గురు దివంగతులు, ఒకరు ట్రాన్స్‌జెండర్ ఉన్నారు. పురస్కారాలకు ఎంపికైన వారికి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ మార్చి, ఏప్రిల్‌లో రాష్ట్రపతి భవన్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో అవార్డులు ప్రదానం చేయనున్నారు. సినీ నటుడు మోహన్ లాల్(కేరళ)కు పద్మ భూషణ్, నటుడు, డాన్స్ మాస్టర్ ప్రభుదేవా(కర్ణాటక)కు నృత్యంలో పద్మ శ్రీ లభించింది.

ఎమర్జెన్సీపై గొంతెత్తిన నయ్యర్



ప్రముఖ జర్నలిస్ట్, మానవహక్కుల కార్యకర్త, దౌత్యవేత్త కుల్దీప్ నయ్యర్ అవిభక్త భారత్‌లోని సియాల్ కోట్(ప్రస్తుతం పాకిస్తాన్)లో 1923, ఆగస్టు 14న జన్మించారు. కెరీర్ తొలినాళ్లలో ఉర్దూ పత్రిక అంజామ్ లో రచయితగా పనిచేశారు. ఆ తర్వాత అదే పత్రికలో రిపోర్టర్‌గా చేరారు. దేశవిభజన అనంతరం కుటుంబంతో కలిసి భారత్‌కు వచ్చేశారు. ఆయన 'ది స్టేట్స్‌మన్' పత్రిక ఢిల్లీ ఎడిషన్‌కు ఎడిటర్‌గా పనిచేశారు. మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి, కేంద్ర మాజీ హోంమంత్రి గోవింద్ బల్లభ్‌పంత్‌కు ప్రెస్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్‌గా సేవలందించారు. 1975లో ఎమర్జెన్సీ సందర్భంగా పత్రికలపై సెన్సార్‌షిప్‌ను వ్యతిరేకించడంతో ఇందిర ప్రభుత్వం ఆయన్ను తీహార్ జైలులో పెట్టింది. కేంద్ర ప్రభుత్వం 1990లో ఆయన్ను లండన్‌లో భారత హైకమిషనర్‌గా నియమించింది. కుల్దీప్ నయ్యర్ 1997లో రాజ్యసభ సభ్యుడిగా నియమితులయ్యారు. జర్నలిజంలో ఆయన చేసిన సేవలకు గానూ 2015లో రామ్‌నాథ్ గోయెంకా జీవితకాల సాఫల్య పురస్కారాన్ని అందుకున్నారు. బియాండ్ ది లైన్స్, ఇండియా ఆఫ్టర్ నెహ్రూ, స్కూప్, ఎమర్జెన్సీ కీ ఇన్‌సైడ్ స్టోరీ, వాల్ ఎట్ వాఘా తదితర పుస్తకాలు రాశారు. న్యుమోనియాతో బాధపడుతూ ఢిల్లీలోని ఓ ఆసుపత్రిలో చేరిన నయ్యర్ 2018, ఆగస్టు 23న 95 ఏళ్ల వయసులో తుదిశ్వాస విడిచారు.

పాండవని కళలో ప్రసిద్ధురాలు తీజన్



ఛత్తీస్‌గఢ్‌కు చెందిన తీజన్ బాయి (62) ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందిన జానపద గాయకురాలు. ఆమెకు 1987లోనే పద్మశ్రీ, 2003లో పద్మభూషణ్ పురస్కారాలు దక్కాయి. మహాభారతం నుంచి పాండవుల వీరగాథలను ఆమె ఏకకాలంలో సంగీత వాద్యాలను ఉపయోగిస్తూ, జానపద గేయాలు పాడుతూ వివరిస్తారు. దీనినే పాండవని కళ అంటారు. చిన్నతనంలో ఎన్నో కష్టాలను అనుభవించి, ఎంతో కృషి చేసి ఈ స్థాయికి చేరారు. భిలాయ్ పట్టణానికి సమీపంలోని గణియారి గ్రామంలో గిరిజన తెగకు చెందిన చంక్‌లాల్ పార్ధి, సుఖవతి దంపతుల ఐదుగురు పిల్లల్లో తొలి సంతానంగా తీజన్ బాయి జన్మించారు. 12 ఏళ్ల వయసులోనే తల్లిదండ్రులు అప్పటికే ఇద్దరు పెళ్లాలున్న వ్యక్తికి తీజన్ బాయిని ఇచ్చి పెళ్లి చేశారు. ఆ తర్వాతా ఆమె భర్త మరో పెళ్లి చేసుకోవడంతో ఇక ఆమె అత్తారింటిని వదిలి వచ్చేశారు. ఆ తర్వాత రెండో పెళ్లి చేసుకున్నా, అదీ ఎంతో కాలం నిలువలేదు. ఛత్తీస్‌గఢ్‌లో లెక్కలేనన్ని గ్రామాల్లో ప్రదర్శనలిచ్చిన ఆమె, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్, జర్మనీ, ఇటలీ, బ్రిటన్, నాటి యూఎస్‌ఎస్‌ఆర్, సైప్రస్, ట్యునీషియా, టర్కీ, మాల్టా తదితర అనేక దేశాల్లోనూ పర్యటించి ఎంతో మందిని తన అభిమానులుగా మార్చుకున్నారు. ఎంత ఎదిగినా ఆమె ఎంతో వినమ్రతతో అణుకువగా ఉంటారు.

ఎదురులేని నేత ఒమర్ గులెహ్



ఆఫ్రికా దేశమైన జిబౌటీని గత 20 ఏళ్ల నుంచి అప్రతిహతంగా పాలిస్తున్న ఇస్మాయిల్ ఒమర్ గులేహ్(72) ఇథియోపియాలో 1947, నవంబర్ 27న జన్మించారు. హైస్కూలు చదువు పూర్తయ్యాక జిబౌటీకి వలసవెళ్లారు. ఫ్రెంచ్ పాలనలో ఉన్న జిబౌటీలో 1968లో ప్రభుత్వఉద్యోగిగా చేరారు. రెండేళ్లలోనే పోలీస్ ఇన్‌స్పెక్టర్ స్థాయికి ఎదిగారు. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా 'జిబౌటీ టుడే' వార్తాపత్రికను ప్రారంభించారు. 1977లో స్వాతంత్ర్యం పొందాక జిబౌటీ తొలి అధ్యక్షుడు, తన బంధువైన హసన్‌కు చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా ఏకంగా 22 ఏళ్లు పనిచేశారు. అయితే 1999 ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకున్న హసన్ తన వారసుడిగా గులేహ్ పేరును ప్రతిపాదించారు. చైనా ఇప్పటికే జిబౌటీలో నౌకా స్థావరాన్ని ఏర్పాటుచేసిన నేపథ్యంలో భారత్ గులేహ్‌కు పద్మవిభూషణ్‌ను ప్రకటించడం గమనార్హం.

పద్మ పురస్కారాల గ్రహీతలు

పేరు	రంగం	రాష్ట్రం/దేశం
పద్మ విభూషణ్		
1. తీజన్ బాయి	కళలు	ఛత్తీస్‌గఢ్
2. ఇస్మాయిల్ ఒమర్ గులేహ్(విదేశీయుడు)	ప్రజా సంబంధాలు	జిబౌటి
3. అనిల్ కుమార్ మణిభాయ్ నాయక్	వర్తకం, పరిశ్రమలు	మహారాష్ట్ర
4. బల్వంత్ మోరేశ్వర్ పురందరే	కళలు–నటన–థియేటర్	మహారాష్ట్ర
పద్మ భూషణ్		
1. జాన్ చాంబర్స్(విదేశీయుడు)	వర్తకం, వాణిజ్యం, టెక్నాలజీ	యూఎస్‌ఏ
2. సుఖ్‌దేవ్ సింగ్ ధిండ్సా	ప్రజాసంబంధాలు	పంజాబ్
3. ప్రవీణ్ గోర్ధాన్(విదేశీయుడు)	ప్రజాసంబంధాలు	దక్షిణాఫ్రికా
4. మహాశయ్ ధరమ్‌పాల్ గులాటీ	వర్తకం, పరిశ్రమలు	ఢిల్లీ
5. దర్శన్ లాల్ జైన్	సామాజిక సేవ	హర్యానా
6. అశోక్ లక్ష్మణ్‌రావు కుకడే	వైద్యం, ఆరోగ్యం	మహారాష్ట్ర
7. కరియా ముండా	ప్రజా సంబంధాలు	జార్ఖండ్
8. బుధాదిత్య ముఖర్జీ	కళలు–సంగీతం–సితార్	పశ్చిమ బెంగాల్
9. మోహన్‌లాల్ విశ్వనాథన్ నాయర్	కళలు–నటన–సినిమా	కేరళ
10. ఎస్.నంబి నారాయణ్	సైన్స్, ఇంజినీరింగ్–స్పేస్	కేరళ
11. కుల్‌దీప్ నయ్యర్(మరణానంతరం)	సాహిత్యం, విద్య(జర్నలిజం)	ఢిల్లీ
12. బచేంద్రిపాల్	క్రీడలు–పర్వతారోహణం	ఉత్తరాఖండ్
13. వి.కె.షుంగ్లు	సివిల్ సర్వీస్	ఢిల్లీ
14. హుకుందేవ్ నారాయణ్ యాదవ్	ప్రజాసంబంధాలు	బిహార్

రైతు నేస్తం వెంకటేశ్వరరావుకు పద్మశ్రీ



వట్టిచెరుకూరు(ప్రత్తిపాడు): ప్రకృతి వ్యవసాయ ప్రచారకర్త, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావుకు పద్మశ్రీ లభించింది. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు గ్రామంలో సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన వెంకటేశ్వరరావు 1994 నుంచి హైదరాబాద్‌లో ప్రింటింగ్ ప్రెస్ నడుపుతున్నారు. 2001 నుంచి 2004 వరకు రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితుల కారణంగా ఎంతో మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడటం చూసి కలత చెందిన వెంకటేశ్వరరావు రైతు రాజులా బతకటానికి తన వంతు ప్రయత్నం చేయాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా 2005లో రైతునేస్తం మాసపత్రికను ప్రారంభించారు. మొదటి సంచికను దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. వ్యవసాయానికి అనుబంధ పరిశ్రమ అయిన పాడి పరిశ్రమను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 2012లో పశునేస్తం మాస పత్రికను, ప్రకృతి వ్యవసాయ విధానాలపై విస్తృత ప్రచారం కల్పించే లక్ష్యంతో 2014లో ప్రకృతి నేస్తం మాస పత్రికను ప్రారంభించారు. తన ఆలోచనలను పుస్తక రూపంలో అందిస్తూ వచ్చిన వెంకటేశ్వరరావు రైతునేస్తం ఫౌండేషన్ ఏర్పాటుచేసి, రైతులకు ఉపయోగపడే అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కొర్నెపాడు గ్రామంలో రైతునేస్తం ఫౌండేషన్ ద్వారా రైతు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి ఇప్పటివరకు 140 వారాలకు పైగా తరగతులను నిర్వహించి 4000 మంది పైచిలుకు రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చారు. స్వతంత్ర శాస్త్రవేత్త డాక్టర్ ఖాదర్ వలి సూచనల ప్రకారం.. చిరుధాన్యాల సాగుపై రైతునేస్తం తరపున పుస్తకాలు ప్రచురించారు. వెంకటేశ్వరరావుకు పద్మశ్రీ పురస్కారం లభించడంతో ఆయన స్వగ్రామం కొర్నెపాడులో ఆనందోత్సాహాలు మిన్నంటాయి. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు 'సాక్షి'తో మాట్లాడుతూ తనకిచ్చిన ఈ అవార్డును రైతుకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానన్నారు. సాక్షి 'సాగుబడి' తన కార్యక్రమాలకు మద్దతుగా నిలిచిందని ధన్యవాదాలు తెలిపారు.

పద్మ శ్రీ పొందిన 94 మందిలో కొందరు

పేరు	రంగం	రాష్ట్రం/దేశం
బంగారు అడిగలర్	ఆధ్యాత్మికం	తమిళనాడు
ఇలియాస్ అలీ	వైద్యం–సర్జరీ	అస్సాం
మనోజ్ బాజ్‌పేయి	కళలు–నటన–సినిమా	మహారాష్ట్ర
రాజ్‌కుమారి దేవి	వ్యవసాయం	బిహార్
ఫ్రెడరిక్ ఇరినా(విదేశీయురాలు)	సామాజిక సేవ	జర్మనీ
సుభాష్ కక్(విదేశీయుడు)	సైన్స్, ఇంజినీరింగ్	అమెరికా
ఖాదర్ ఖాన్(మరణానంతరం)	కళలు–సినిమాలు	కెనడా
శంకర్ మహదేవన్ నారాయణ్	వోకల్–సినిమాలు	మహారాష్ట్ర
శంతను నారాయణ్(విదేశీయుడు)	వర్తకం	అమెరికా
నర్తకి నటరాజ్(ట్రాన్స్ జెండర్)	భరతనాట్యం	తమిళనాడు
మదురై చిన్న పిళ్లై	సామాజిక సేవ	తమిళనాడు
తావ్ పోర్చాన్ లించ్	యోగా	అమెరికా
ఆర్.వి.రమణి	వైద్యం	తమిళనాడు

నలుగురికి 'కీర్తి చక్ర'

దేశ రెండో అత్యున్నత శౌర్య పురస్కారం 'కీర్తిచక్ర'ను నలుగురు జవాన్లు పొందారు. వీరిలో జాట్ రెజిమెంట్‌కు చెందిన మేజర్ తుషార్ గౌబా, 22వ రాష్ట్రీయ రైఫిల్స్‌కు చెందిన సోవర్ విజయ్ కుమార్(మరణానంతరం)తోపాటు 2017లో ఉగ్రవాదుల దాడిలో మరణించిన జవాన్లు ప్రదీప్‌కుమార్ పండా, రాజేంద్ర కుమార్ నైన్ ఉన్నారు. అసిస్టెంట్ కమాండెంట్ జైల్ సింగ్‌తోపాటు 9 మంది సైనికాధికారులకు శౌర్యచక్రను రక్షణ శాఖ ప్రకటించింది. 'పరమ్ విశిష్ట సేవా పతకం' ఆర్మీ చీఫ్ జనరల్ రావత్ సహా 19 మంది సైనికాధికారులకు లభించింది.

మరాఠా నాటక రచయితకు పద్మవిభూషణ్

నాటక–కథా రచయిత, చరిత్రకారుడు బల్వంత్ మోరేశ్వర్ పురందరే(96) మహారాష్ట్రలోని పుణెలో 1922, జూలై 29న జన్మించారు. ఆయన రచనల్లో 17వ శతాబ్దపు మరాఠా రాజు ఛత్రపతి శివాజీ జీవితం, పాలన ఆధారంగా రాసినవే ఎక్కువగా ఉన్నాయి. శివాజీ పాలనపై పురందరే రాసిన 'జనతా రాజా' అనే నాటకం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విమర్శకుల ప్రశంసలు పొందింది. చరిత్రపై అమితాసక్తి చూపే పురందరే.. రాజా శివ ఛత్రపతి, కేసరి వంటి పుస్తకాలను రాశారు. కళారంగంలో ఆయన అందించిన సేవలకు గానూ మధ్యప్రదేశ్ ప్రభుత్వం 2007–08 సంవత్సరానికి కాళిదాస్ సమ్మాన్ అవార్డును ప్రకటించింది. అలాగే 2015లో మహారాష్ట్ర ప్రభుత్వం ఆ రాష్ట్రపు అత్యున్నత పౌర పురస్కారమైన మహారాష్ట్ర భూషణ్ అవార్డును అందించింది.


ఉత్తరాఖండ్ రుద్రప్రయాగ్‌లోని కేదర్‌నాథ్ ఆలయం పరిసరాల్లో శుక్రవారం భారీగా కురిసిన మంచు

రైళ్లలో క్రెడిట్, డెబిట్ కార్డులతో ఫుడ్

న్యూఢిల్లీ: రైళ్లలో ఆహార బిల్లుల్ని చెల్లించేందుకు 2,191 పీఓఎస్ (పాయింట్ ఆఫ్ సేల్) మెషీన్లను ఐఆర్‌సీటీసీ ప్రవేశపెట్టింది. రైలు ప్రయాణికులు ఈ మెషీన్ల వద్ద తమ క్రెడిట్, డెబిట్ కార్డులను ఉపయోగించి ఆహార బిల్లులను చెల్లించవచ్చు. ప్యాంట్రీకార్లున్న రైళ్లలో పీఓఎస్ మెషీన్లను ప్రయాణికులకు అందుబాటులో ఉంచినట్లు రైల్వే శాఖ తెలిపింది. రైళ్లలో ఆహార పదార్థాలు కొనేటప్పుడు విక్రేతలు ప్రయాణికుల నుంచి అధికమొత్తాన్ని వసూలు చేయకుండా అరికట్టేందుకు ఈ మెషీన్లు ఉపయోగపడతాయని తెలిపింది. ఎక్స్‌ప్రెస్, మెయిల్ రైళ్లలో జనవరి 26 నుంచి ఫిబ్రవరి 15వరకు పీఓఎస్ మెషీన్ల పనితీరు, ఆహారపదార్థాల కొనుగోలుపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తామని పేర్కొంది.

రైలు టికెట్‌తోపాటే షిర్డీ దర్శనం పాస్



సాక్షి, ముంబై: షిర్డీకి వచ్చే భక్తులు ఇకపై రైలు టికెట్ల రిజర్వేషన్‌తోపాటు దర్శనం పాస్ రిజర్వేషన్లు చేసుకోవచ్చు. ఈనెల 26వ తేదీ నుంచి ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తేనున్నట్లు షిర్డీ సాయిబాబా ట్రస్ట్ సంస్థ అధ్యక్షుడు తెలిపారు. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో షిర్డీ కోసం టికెట్ బుక్ చేసే సమయంలోనే అక్కడ షిర్డీ సాయి సంస్థాన్‌కు చెందిన ఆన్‌లైన్ సర్వీసెస్ ఆన్‌లైన్.సాయి.ఆర్గ్.ఇన్ అనే వెబ్ సైట్‌లింక్ కన్పిస్తుందన్నారు. దీని ద్వారా దర్శనం పాస్ తీసుకోవచ్చన్నారు. సాయినగర్ షిర్డీ, కోపర్‌గావ్, నాగర్‌సోల్, మన్మాడ్, నాసిక్ వంటి రైల్వేస్టేషన్‌ల కోసం టికెట్లు రిజర్వేషన్‌చేయించుకునే వారికి ఇది అందుబాటులో ఉంటుంది.

అద్వానీజీ ఎన్నికల్లో పోటీపై మీరే తేల్చుకోండి

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయాలో వద్దో నిర్ణయించుకోవాలని బీజేపీ కురువృద్ధ నేతలు ఎల్‌కే అద్వాణీ (91), మురళీ మనోహర్ జోషి (84)లను బీజేపీ కోరింది. 75 ఏళ్లు దాటిన వారికి పదవి దక్కదని చెబుతూనే.. పోటీ చేయాలా వద్దా అనేది వారి ఇష్టమని బీజేపీ పేర్కొన్నట్లు సమాచారం. '75 ఏళ్ల వయసు దాటిన వారికి మంత్రి పదవులు ఇవ్వకూడదనే నిషేధం విధించాం. కానీ పోటీ చేసే విషయంలో ఎలాంటి నిషేధం లేదు' అని పలువురు బీజేపీ నేతలు చెబుతున్నారు.

క్యూ3లో వండర్‌లా లాభం పైపైకి

బెంగళూరు: వినోదరంగంలోని వండర్‌లా హాలిడేస్ లిమిటెడ్ సంస్థ డిసెంబర్ 31వ తేదీతో ముగిసిన త్రైమాసికానికి రూ.78.63 కోట్ల నికర ఆదాయాన్ని ఆర్జించింది. రెండో త్రైమాసికంతో పోలిస్తే ఇది 81.34 శాతం ఎక్కువని ఆ సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో పన్నులు మినహాయించి వచ్చిన లాభం రూ.6.54 కోట్లతో పోలిస్తే ఈ సారి రూ.14.51 కోట్లకు చేరి 122 శాతం పెరుగుదల నమోదు చేసుకుంది. బెంగళూరు, హైదరాబాద్ వండర్‌లా పార్కుల్లో సందర్శకుల సంఖ్య వరుసగా 23 శాతం, 12 శాతం పెరిగిందని సంస్థ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ జార్జి జోసెఫ్ వెల్లడించారు.

శతాబ్దానికొక్క అవకాశం!

గణతంత్ర దినోత్సవ సందేశంలో రాష్ట్రపతి కోవింద్


జాతినుద్దేశించి ప్రసంగిస్తున్న కోవింద్

న్యూఢిల్లీ: ఓటు హక్కు వినియోగించుకోవడం పవిత్ర కార్యం, శతాబ్దంలో ఒక్కసారి మాత్రమే దక్కే అరుదైన అవకాశంగా భావించండి అని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రజలకు పిలుపునిచ్చారు. దేశానికి ఇది పరీక్షా సమయమన్న రాష్ట్రపతి.. ఇప్పుడు వేసే ఓటు ఈ శతాబ్దంలో దేశం గతిని నిర్ణయిస్తుందన్నారు. పేదలకు రిజర్వేషన్ల కల్పన గాంధీ కలల సాకారం దిశగా పడిన అడుగుగా ఆయన అభివర్ణించారు. 70వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆయన జాతినుద్దేశించి ప్రసంగించారు. 'వైవిధ్యం, ప్రజాస్వామ్యం, అభివృద్ధి అనే మూడు అంశాలపై ఆధారపడిన భిన్నత్వంలో ఏకత్వ భావనను స్వీకరించనిదే దేశాభివృద్ధి పరిపూర్ణం కాదు. ఈ దేశం మనది, మన అందరిదీ. మన వైవిధ్యం, ప్రజాస్వామ్యం, అభివృద్ధి ప్రపంచానికి ఆదర్శం. ఇవి విడదీయరానివి. ఈ మూడూ మనకు అత్యవసరం' అని రాష్ట్రపతి అన్నారు.

ఓటర్లకు విన్నపం

మరో నాలుగు నెలల్లో జరగనున్న సాధారణ ఎన్నికలను ప్రస్తావిస్తూ ఆయన..'21వ శతాబ్దంలో పుట్టిన పౌరులు మొదటి సారిగా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం లోక్‌సభ ఎన్నికల్లో దక్కనుంది. భారతీయుల ఆకాంక్షలకు, విభిన్నతకు నిదర్శనం ఈ ఎన్నికలు. అర్హులైన ఓటర్లందరికీ నా విన్నపం ఒక్కటే.. పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటేయండి' అని ప్రజలకు ముఖ్యంగా యువతకు పిలుపునిచ్చారు. 'ఈ ఎన్నికలు తరానికి ఒక్కసారి వచ్చే ఎన్నికలు మాత్రమే కాదు..ఈ శతాబ్దానికి ఏకైక ఎన్నికలుగా భావించండి. ప్రజాస్వామ్య ఆదర్శాలు, ఆలోచనలను ఆచరణలోకి తెచ్చేవి ఈ ఎన్నికలు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే ప్రయాణంలో, దేశ అభివృద్ధిలో ఇవి ఒక మైలురాయి మాత్రమే' అని అన్నారు.

ప్రజలందరికీ సమాన అవకాశాలు


'పేద కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రత్యేక సౌకర్యం కల్పించేందుకు ఇటీవల చేపట్టిన రాజ్యాంగ సవరణ గాంధీజీ కలలు, భారతీయుల కలల సాకారం వైపునకు పడిన మరో అడుగు' అని అన్నారు. ప్రతి చిన్నారి, ప్రతి మహిళకు సమాన అవకాశాలు, సమాన పరిస్థితులు కల్పించడమే మన సమాజం లింగ సమానత్వం సాధించిందనేందుకు సరైన సూచిక' అని తెలిపారు. మన రాజ్యాంగానికి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు గౌరవసూచికగా ఈ ఏడాది దేశం ఘనంగా రాజ్యాంగ దినోత్సవం జరుపుకోనుంది' అని పేర్కొన్నారు.

అయోధ్యపై రాజ్యాంగ ధర్మాసనం

న్యూఢిల్లీ: అయోధ్యలోని రామమందిరం–బాబ్రీమసీదు భూవివాదానికి సంబంధించి సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసును విచారించేందుకు సీజేఐ జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఎస్‌ఏ బాబ్డే, జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ ఎస్‌ఏ నజీర్‌లతో ఐదుగురు సభ్యులతో కొత్త రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటుచేసింది. ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పాటైన రాజ్యాంగ ధర్మాసనం 2019, జనవరి 29 నుంచి ఈ కేసును విచారించనుంది. ఈ మేరకు సుప్రీంకోర్టు రిజిస్ట్రీ అన్ని పక్షాలకు నోటీసులు జారీచేసింది. 2010లో ఈ కేసును విచారించిన అలహాబాద్ హైకోర్టు మొత్తం 2.77 ఎకరాల స్థలాన్ని సున్నీ వక్ఫ్ బోర్డుకు, నిర్మోహి అఖారాకు, రామ్ లల్లాకు సమానంగా పంచాలని తీర్పు వెలువరించడం తెల్సిందే.

సహకార బలోపేతానికి కార్యాచరణ

భారత్, దక్షిణాఫ్రికా నిర్ణయం



న్యూఢిల్లీ: కీలక రంగాల్లో ద్వైపాక్షిక సహకార బలోపేతానికి మూడేళ్ల పాటు వ్యూహాత్మక కార్యక్రమాన్ని అమలుపరచాలని భారత్, దక్షిణాఫ్రికాలు నిర్ణయించాయి. రక్షణ, వ్యాపారం, తీరప్రాంత భద్రత తదితర భిన్న రంగాల్లో సంబంధాల విస్తరణకు ఈ కొత్త ప్రయోగం దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశాయి. గణతంత్ర వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యేందుకు భారత్ వచ్చిన దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా శుక్రవారం ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. మరోవైపు, రామఫోసా స్పందిస్తూ..వ్యూహాత్మక కార్యక్రమాన్ని వెంటనే అమల్లోకి తేవాలని రెండు దేశాల మంత్రులు, అధికారులను ఆదేశించామని తెలిపారు. దక్షిణాఫ్రికాకు భారత్ వ్యూహాత్మక భాగస్వామి అని, గణతంత్ర వేడుకలకు తనను ఆహ్వానించడాన్ని గొప్ప గౌరవంగా భావిస్తున్నానని అన్నారు. ఇరు దేశాలు నైపుణ్యాభివృద్ధిలోనూ కలసిపనిచేస్తున్నాయి.

పేదల కోటాపై స్టేకు సుప్రీం నో

న్యూఢిల్లీ: జనరల్ కేటగిరీలోని పేదలకు విద్య, ఉద్యోగాల్లో ఇటీవల కల్పించిన 10 శాతం రిజర్వేషన్ల అమలును నిలుపుదల చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. కానీ ఈ కోటాకు వీలుకల్పిస్తున్న రాజ్యాంగ సవరణ చట్ట చెల్లుబాటును పరిశీలించేందుకు అంగీకరించింది. 10 శాతం రిజర్వేషన్ల అమలు నిర్ణయాన్ని సవాలుచేస్తూ దాఖలైన పిటిషన్లపై ప్రభుత్వ స్పందన కోరుతూ బెంచ్ శుక్రవారం నోటీసులు జారీచేసింది. జనహిత అభియాన్, యూత్ ఫర్ ఈక్వాలిటీ అనే స్వచ్ఛంద సంస్థలు ఈ పిటిషన్లను వేశాయి. ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదిస్తూ..ఈ పిటిషన్లకు విచారణార్హత లేదని, కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై స్టే ఇవ్వొద్దని విజ్ఞప్తి చేశారు. రిజర్వేషన్ల ప్రయోజనాలు పొందేందుకు ఆర్థిక స్థితిగతులు మాత్రమే ప్రాతిపదిక కావొద్దని యూత్ ఫర్ ఈక్వాలిటీ తన పిటిషన్‌లో పేర్కొంది. 50 శాతమే ఉండాలన్న రిజర్వేషన్ల పరిమితిని తాజా చట్టం ఉల్లంఘిస్తోందని గుర్తుచేసింది.

'ఎస్సీ/ఎస్టీ చట్ట సవరణ'పై యోచన

ఎస్సీ, ఎస్టీ(సవరణ) వేధింపుల నిరోధక చట్టం–2018పై కేంద్ర ప్రభుత్వ సమీక్షతో పాటు, ఈ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ చేపట్టే అంశాన్ని పరిశీలించనున్నట్లు కోర్టు తెలిపింది. ఎస్సీ/ఎస్టీ వేధింపుల చట్టం తీవ్రంగా దుర్వినియోగం అవుతోందనీ, ఈ చట్టం కింద దాఖలైన ఫిర్యాదులపై తక్షణం ప్రభుత్వ ఉద్యోగులను కానీ ఇతరులను కానీ అరెస్టు చేయరాదంటూ గత ఏడాది కోర్టు ఆదేశాలిచ్చింది. మరోవైపు, క్రెడిట్, డెబిట్ కార్డులను ఉపయోగించినప్పుడు జరిగే ఫెయిల్డ్ ట్రాన్సాక్షన్స్‌లలో డబ్బు వెంటనే వాపసు అయ్యేలా చూడాలంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్)ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. అయితే, పిటిషనర్ ముందుగా ఈ సమస్యను ఆర్‌బీఐ దృష్టికి తీసుకెళ్లాలని సూచించింది.

ఆరెస్సెస్ వల్లే అరాచకత్వం


భువనేశ్వర్ విమానాశ్రయంలో జారిపడిన ఫొటోగ్రాఫర్‌ను పైకి లేపుతున్న రాహుల్

కాంగ్రెస్ చీఫ్ రాహుల్ వ్యాఖ్య

భువనేశ్వర్: దేశంలోని అన్ని రాజ్యాంగ వ్యవస్థల్లో చొచ్చుకునిపోయేందుకు, వాటిని నియంత్రించేందుకు ఆర్‌ఎస్‌ఎస్ యత్నిస్తోందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ ఆరోపించారు. అందువల్లే న్యాయవ్యవస్థ, న్యాయవ్యవస్థ సహా దేశంలో గందరగోళం, అరాచకత్వం రాజ్యమేలుతోందని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్నవేళ ప్రజలను కలుసుకోవడంలో భాగంగా ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో రాహుల్ పలువురు మేధావులతో ముచ్చటించారు. '1991లో, 2004–14 మధ్య కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు చేపట్టిన సరళీకరణ విధానాలతోనే దేశంలో మధ్యతరగతి అవతరించింది' అని రాహుల్ తెలిపారు. 'బీజేపీ, ఆరెస్సెస్ నేతలు నన్ను తరచుగా దూషిస్తూ ఉంటారు. వాటిని నేను బహుమానంగా స్వీకరిస్తా. ఎందుకంటే ఆ విమర్శలు నన్ను మరింత రాటుదేలేలా చేశాయి' అని అన్నారు.

ప్రియాంక రాకపై గతంలోనే నిర్ణయం

సోదరి ప్రియాంకా గాంధీ రాజకీయాల్లోకి రావాలని కొన్నేళ్ల క్రితమే నిర్ణయం తీసుకున్నట్లు రాహుల్ స్పష్టంచేశారు. మిరాయా, రైహాన్ వాద్రాలు చిన్నపిల్లలు కావడంతో ప్రియాంక రాజకీయాలకు దూరంగా ఉన్నారన్నారు. ప్రస్తుతానికి యూపీలో కాంగ్రెస్ పార్టీని పునరుద్ధరించడమే ప్రియాంక లక్ష్యమనీ, ఎలాంటి ఇతర బాధ్యతలు ఆమెకు అప్పగించలేదని స్పష్టం చేశారు. తామిద్దరి మధ్య మంచి అనుబంధం ఉందనీ, నానమ్మ ఇందిర, తండ్రి రాజీవ్‌ల హత్యల తర్వాత అది మరింత దృఢపడిందని రాహుల్ పేర్కొన్నారు. తనను, ప్రియాంక పక్కపక్క గదుల్లో కూర్చోబెట్టి ప్రశ్నలు అడిగితే దాదాపు 80 శాతం ఒకేరకమైన సమాధానం వస్తుందని తెలిపారు.బీజేపీ నేత, సుల్తాన్‌పూర్ ఎంపీ వరుణ్ గాంధీ కాంగ్రెస్‌లో చేరుతారా? అనే ప్రశ్నకు స్పందిస్తూ.. అలాంటి ఊహాగానాలు వస్తున్నట్లు తనకు తెలియదన్నారు.

వెనెజులాలో రాజకీయ సంక్షోభం

కారకస్: దక్షిణ అమెరికా ఖండంలోని వెనెజులాలో ఏర్పడిన రాజకీయ సంక్షోభం రోజురోజుకూ ముదురుతోంది. తనను తాను తాత్కాలిక అధ్యక్షుడిగా ప్రకటించుకున్న విపక్ష నేత జువాన్ గుయాడో ఇప్పటికీ అజ్ఞాతంలోనే ఉండగా, అధ్యక్షుడు నికోలస్ మదురోకు సైన్యం తోడ్పాటు లభించింది. అమెరికాతోపాటు అనేక వెనెజులా పొరుగుదేశాలు గుయాడోకు మద్దతు తెలిపి ఆయనను తాత్కాలిక అధ్యక్షుడిగా గుర్తించగా, రష్యా, చైనా సహా పలు దేశాలు మదురోకు మద్దతుగా నిలిచాయి. ద్రవ్యోల్బణం భారీగా పెరిగిపోవడంతోపాటు ప్రజలకు నిత్యావసరాలు కూడా సరిగ్గా దొరకక తిండి కోసం నానా తిప్పలు పడుతున్నారు.

వైఎస్ జయమ్మకు ఘన నివాళి



వైఎస్ జయమ్మ, వైఎస్ రాజారెడ్డి సమాధుల వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్ విజయమ్మ, షర్మిల, వైఎస్ వివేకా, వైఎస్ భారతమ్మ తదితరులు

పులివెందుల: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మాతృమూర్తి దివంగత వైఎస్ జయమ్మ 13వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం వైఎస్సార్ జిల్లా పులివెందులలో వైఎస్ కుటుంబీకులు జయమ్మ, రాజారెడ్డిల సమాధుల వద్ద నివాళులర్పించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గౌరవాధ్యక్షురాలు, వైఎస్సార్ సతీమణి వైఎస్ విజయమ్మ, కుమార్తె షర్మిల, దివంగత జార్జిరెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మ, వైఎస్సార్ సోదరుడు రవీంద్రనాథరెడ్డి సతీమణి జయమ్మ, వైఎస్సార్ సోదరులు వైఎస్ వివేకానందరెడ్డి, వైఎస్ సుధీకర్‌రెడ్డితో పాటు ఇతర కుటుంబ సభ్యులు వైఎస్ జయమ్మ, వైఎస్ రాజారెడ్డి సమాధుల వద్ద పుష్పగుచ్చాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక జయమ్మ పార్కులోని జయమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి కాసేపు మౌనం వహించి నివాళులర్పించారు. అనంతరం స్థానిక జీసెస్ చారిటీస్‌లోని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అనాథలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీలోకి 'కనుమూరు'

వైఎస్ జగన్ సమక్షంలో చేరిన కాంగ్రెస్ అధికార ప్రతినిధి



వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన కనుమూరు రవిచంద్రారెడ్డి. చిత్రంలో ఎంపీలు విజయసాయిరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: ఏపీ కాంగ్రెస్ అధికార ప్రతినిధి, నెల్లూరు జిల్లా గూడూరుకు చెందిన కనుమూరు రవిచంద్రారెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. లోటస్‌పాండ్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఈయనతోపాటు ఆయన సోదరుడు కనుమూరు హరిచంద్రారెడ్డి, శ్రీకాకుళం జిల్లా పాతపట్నంకు చెందిన బచ్చు నారాయణమూర్తిలకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు.

కాంగ్రెస్, టీడీపీ కుమ్మక్కు..

ప్రభుత్వంపై పోరాడాల్సిన కాంగ్రెస్.. టీడీపీతో కుమ్మక్కై పనిచేస్తున్నాయని రవిచంద్రారెడ్డి ఆరోపించారు. ఒక రహస్య ఎజెండాతో కాంగ్రెస్, టీడీపీలు ముందుకు వెళ్తున్నాయని తెలిపారు. 60–70 అసెంబ్లీ స్థానాల్లో 10 వేల ఓట్ల చొప్పున చీల్చడానికి ఏపీ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘువీరారెడ్డి టీడీపీతో ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. టీడీపీ అవినీతిని ఎండగట్టి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి సర్కారుపై పోరాడాల్సిన కాంగ్రెస్ ఈ తరహా విధానాలు తనకు ఏమాత్రం నచ్చలేదని చెప్పారు. సీఎం చంద్రబాబు రాహుల్ గాంధీతో పొత్తు పెట్టుకోవడాన్ని కాంగ్రెస్ అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ఆశయాల కోసం పనిచేస్తామని హరిచంద్రారెడ్డి చెప్పారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వి. విజయసాయిరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజీవయ్య, నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి, పార్టీ సీఈసీ మెంబర్ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర జిల్లాలకు పాఠశాల విద్య ఆర్జేడీ కార్యాలయం

సాక్షి, అమరావతి: ఉత్తరాంధ్ర జిల్లాలైన విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు కలిపి ప్రత్యేకంగా పాఠశాల విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ కార్యాలయాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. విశాఖ కేంద్రంగా ఆర్జేడీ పోస్టును మంజూరు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

సీట్ల సర్దుబాటుపై ఫిబ్రవరిలో నిర్ణయం

- జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ వెల్లడి
- విశాఖలో జనసేన, వామపక్షాల రౌండ్‌టేబుల్ సమావేశం



సమావేశమైన పవన్‌కల్యాణ్, సురవరం, రాఘవులు తదితరులు

సాక్షి, విశాఖపట్నం/నగరంపాలెం (గుంటూరు): జనసేన, వామపక్షాల పొత్తు నేపథ్యంలో సీట్ల సర్దుబాటుపై ఫిబ్రవరిలో నిర్ణయం తీసుకుంటామని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ తెలిపారు. వచ్చే నెలలో మరోసారి సమావేశమవుతామన్నారు. విశాఖ రుషికొండలోని ఓ రిసార్ట్స్‌లో జనసేన, సీపీఐ, సీపీఎం ముఖ్య నాయకులు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులుతో పవన్‌కల్యాణ్ మూడు గంటలపాటు చర్చించారు. అనంతరం వారితో కలిసి పవన్ విలేకరులతో మాట్లాడారు. వామపక్షాలు, జనసేన పార్టీల భావజాలం ఒకేలా ఉండడంతో వాటితో కలిసి పనిచేయాలన్న నిర్ణయానికొచ్చామని పవన్ చెప్పారు. పర్యావరణ కాలుష్యం, మైనింగ్ పాలసీ, 2013 భూసేకరణ చట్టం అమలు, జాయింట్ ఫ్యాక్ట్స్ ఫైండింగ్ కమిటీ నివేదికను ఎలా ముందుకు తీసుకెళ్లాలన్న దానిపై చర్చించామని తెలిపారు. 2019 ఎన్నికల్లో ఎలా కలిసి వెళ్లాలన్న దానిపై చర్చించామన్నారు. ఈవీఎంలలో లోపాలపై తమకు అభ్యంతరాలున్నాయని, త్వరలో వాటిపై సమగ్రంగా చర్చిస్తామని చెప్పారు.

నిపుణుల కమిటీ వేయాలి

ఈవీఎంలపై తలెత్తిన అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల కమిషన్‌పై ఉందని సురవరం సుధాకరరెడ్డి చెప్పారు. తెలంగాణ ఎన్నికల్లో పోలైన ఓట్లకు, లెక్కించిన ఓట్లకు వ్యత్యాసం ఉండడం వల్ల కొన్ని నియోజకవర్గాల్లో ఫలితాలు తారుమారయ్యాయన్నారు. ఇలాంటి అనుమానాల నివృత్తికి నిపుణుల కమిటీ వేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. బీవీ రాఘవులు మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయ భవిష్యత్తు, ఆ ప్రక్రియలో మూడు పార్టీల పాత్ర గురించి చర్చించామని తెలిపారు. ప్రత్యేక హోదా, వాగ్దానాల అమలులో కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేసిందన్నారు. సమావేశంలో జనసేన నాయకులు నాదెండ్ల మనోహర్, మాదాసు గంగాధరం, సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, పి.మధు పాల్గొన్నారు.

27న జనసేన శంఖారావం సభ

27న గుంటూరు లాడ్జి సెంటరులోని ఎల్‌ఈఎం స్కూల్ గ్రౌండ్‌లో జనసేన శంఖారావం పేరుతో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు జనసేన నాయకుడు, మాజీ మంత్రి రావెల కిశోర్‌బాబు తెలిపారు. శుక్రవారం ఆయన సభ ఏర్పాట్లను పరిశీలించారు. పవన్‌కల్యాణ్ ఈ సభలో పాల్గొంటారన్నారు.

ఇక అన్ని పోస్టులకూ 'స్క్రీనింగ్' తప్పనిసరి!

- కొత్త విధానంపై ఏపీపీఎస్సీ కసరత్తు
- ఇప్పటివరకు 25 వేలమందికి పైగా అభ్యర్థులుండే నోటిఫికేషన్లకే స్క్రీనింగ్ టెస్టు
- ఆ నిబంధనను తొలగించాలని ప్రభుత్వానికి ఏపీపీఎస్సీ నివేదన
- అభ్యర్థుల సంఖ్యతో సంబంధం లేకుండా అన్నింటికీ రెండు వడపోతల పరీక్షలు..



- ఇప్పటికే పరీక్షల భారంతో అవస్థలు పడుతున్న నిరుద్యోగులకిది మరింత అశనిపాతమే

సాక్షి, అమరావతి:

రాష్ట్రంలో ఇకమీదట ప్రభుత్వ ఉద్యోగ నియామకాలన్నింటికీ స్క్రీనింగ్ టెస్టు, మెయిన్స్‌ను తప్పనిసరి చేయాలని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) భావిస్తోంది. కొత్త విధానంపై కసరత్తు చేసిన ఏపీపీఎస్సీ ఇందుకు సంబంధించి అనుమతులకోసం ప్రభుత్వానికి ఇటీవల నివేదికను సైతం పంపించింది. ఈ కొత్త విధానానికి ప్రభుత్వం అనుమతిస్తే.. ఇప్పటికే పరీక్షల భారంతో నానా ఇక్కట్లు పడుతున్న నిరుద్యోగులకు ఇది మరింత అశనిపాతమే కానుంది.

గతంలో ఒక్కటే పరీక్ష..

గతంలో ఏపీపీఎస్సీ ద్వారా నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగ భర్తీ పరీక్షలకు సంబంధించి గ్రూప్–1తోపాటు మరికొన్ని ఎగ్జిక్యూటివ్, తత్సమాన పోస్టులకు మాత్రమే ప్రిలిమ్స్‌ను ఆబ్జెక్టివ్ ప్రశ్నలతో నిర్వహించేవారు. ప్రిలిమ్స్‌లో అర్హత మార్కులు సాధించిన వారికి మెయిన్స్‌ను డిస్క్రిప్టివ్ విధానంలో పరీక్షలు పెట్టేవారు. కిందిస్థాయిలోని గ్రూప్–2, గ్రూప్–3, గ్రూప్–4 కేటగిరీల పోస్టులకు స్క్రీనింగ్ టెస్టు/ప్రిలిమ్స్‌తో నిమిత్తం లేకుండా నేరుగా ఒక్కటే పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసేవారు.

టీడీపీ వచ్చాక '25 వేల మంది' నిబంధన..

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏపీపీఎస్సీ ద్వారా నిర్వహించే అన్ని పరీక్షలకూ ఆన్‌లైన్ (కంప్యూటరాధారిత) విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ కొత్త విధానంలో ఆయా పోస్టుల నోటిఫికేషన్లకు అభ్యర్థులు 25 వేలమంది కన్నా ఎక్కువగా ఉన్నట్లయితే స్క్రీనింగ్ టెస్టు నిర్వహిస్తోంది. పోస్టుల సంఖ్యను అనుసరించి 1:50 నిష్పత్తి ప్రకారం కటాఫ్ మార్కులను నిర్ణయించి.. అభ్యర్థులను ఏపీపీఎస్సీ ఎంపిక చేసి మెయిన్స్‌ను నిర్వహిస్తోంది. 25వేల మందికన్నా తక్కువగా ఉంటే.. స్క్రీనింగ్ టెస్టుతో నిమిత్తం లేకుండా నేరుగా ఒక్కటే పరీక్ష పెట్టి ఆయా పోస్టులకు అర్హులను ఎంపిక చేస్తున్నారు. గ్రూప్–1తోపాటు అన్ని కేటగిరీల పోస్టులకూ దరఖాస్తులు 25 వేలు దాటినట్లయితే రెండేసి పరీక్షలను అభ్యర్థులు ఎదుర్కొంటున్నారు. ప్రిలిమ్స్/స్క్రీనింగ్ టెస్టుకు ఒక సిలబస్, మెయిన్స్‌కు మరో సిలబస్‌ను ఏపీపీఎస్సీ అమలు చేయడంతో అభ్యర్థులు వాటికి ప్రిపేర్ అవ్వడానికి నానా తంటాలు పడుతున్నారు. ఒకవైపు మెటీరియల్, ప్రామాణిక గ్రంథాలు అందుబాటులో లేకపోవడం, మార్కెట్లో ఉన్న ప్రైవేటు పబ్లిషర్ల పుస్తకాలను వేల రూపాయలు పెట్టి కొనుగోలు చేసి చదవడం, లక్షలు వెచ్చించి కోచింగ్ సెంటర్లలో చేరి తర్ఫీదు పొందడం.. ఇలా నానా అవస్థలూ పడుతున్నారు.

ఇకపై అన్ని పోస్టులకూ..

కొన్ని ప్రత్యేక పోస్టులకు దరఖాస్తులు తక్కువగా వస్తే వాటికి ఒక్కటే పరీక్షను ఇప్పటివరకు పెడుతున్నారు. కానీ ఈసారి వాటికీ రెండేసి పరీక్షలు (స్క్రీనింగ్, మెయిన్స్) నిర్వహించేందుకు వీలుగా ఏపీపీఎస్సీ చైర్మన్ ప్రొఫెసర్ ఉదయభాస్కర్ ప్రభుత్వానికి నివేదిక పంపారు. గతంలో 25 వేల మందికి మించితేనే స్క్రీనింగ్ టెస్టు అన్న నిబంధనను తొలగించాలని, పరీక్షలపై పూర్తి అధికారాన్ని ఏపీపీఎస్సీకి ఇవ్వాలని కమిషన్ కోరుతోంది. ప్రస్తుతం ఈ అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. త్వరలో దీనిపై ఉత్తర్వులు వెలువడవచ్చని చెబుతున్నారు. ఇప్పటికే ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ పోస్టులకు జారీ చేసిన నోటిఫికేషన్లో 16 వేల వరకు మాత్రమే దరఖాస్తులు అందాయని చెబుతున్నారు. నిబంధనల ప్రకారం దీనికి స్క్రీనింగ్ టెస్టు నిర్వహించరాదు. కానీ ఫిబ్రవరి 24న స్క్రీనింగ్ టెస్టు నిర్వహించేందుకు తేదీని కూడా ఏపీపీఎస్సీ ప్రకటించింది. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ఈ పోస్టులకు స్క్రీనింగ్ టెస్టు నిర్వహిస్తామని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. నోటిఫికేషన్లో పేర్కొన్న నిబంధనలను కాదని స్క్రీనింగ్ టెస్టు నిర్వహణ సరికాదని పలువురు అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

అభ్యర్థులకు నానా తంటాలు..

గతంలో గ్రూప్–1, ఇతర కొన్ని పోస్టులు మినహా ఇతర పోస్టులకు ఇన్ని అవస్థలు ఉండేవి కావు. ఒక్కటే పరీక్ష ఉండడంతో ప్రిపరేషన్లో అవస్థలు పడేవారు కాదు. కానీ ఈసారి దరఖాస్తులు 25 వేలు దాటితే రెండేసి పరీక్షలు తప్పనిసరి అవుతున్నాయి. పోస్టు ఏదైనా సరే దాని భర్తీకి ఏపీపీఎస్సీ ద్వారా విడుదల చేసే నోటిఫికేషన్లకు 25 వేలకు మించి దరఖాస్తులు వస్తున్నాయి. గత కొన్నేళ్లుగా నోటిఫికేషన్లు లేకపోవడంతో లక్షలాదిమంది నిరుద్యోగులు వీటికోసం ఆశతో దరఖాస్తు చేస్తున్నారు. దీంతో దాదాపు అన్ని పరీక్షలకూ రెండేసి పరీక్షలు రాయాల్సి వస్తోంది.

రోదసీలోని నిర్దేశిత కక్ష్యలోకి రెండు ఉపగ్రహాలు



నింగికి నిప్పులు చిమ్ముకుంటూ ఉపగ్రహాలను మోసుకుని వెళుతున్న ఉపగ్రహ వాహకనౌక

శ్రీహరికోట (సూళ్లూరుపేట): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) నెల్లూరు జిల్లా సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి గురువారం రాత్రి 11:37 గంటలకు పీఎస్ఎల్‌వీ–డీఎల్ (పీఎస్ఎల్‌వీ సీ44) ఉపగ్రహ వాహకనౌక ద్వారా పంపించిన రెండు ఉపగ్రహాలు నిర్దేశిత కక్ష్యలోకి చేరాయి. రెండు స్ట్రాపాన్ బూస్టర్లతో వినూత్నంగా చేసిన ప్రయోగంలో 700 కిలోలు బరువు కలిగిన మైక్రోశాట్–ఆర్‌ను భూమికి అత్యంత చేరువలో (274 కిలోమీటర్లు ఎత్తులో) సన్ సింక్రనస్ పోలార్ ఆర్బిట్‌లోకి శాస్త్రవేత్తలు విజయవంతంగా ప్రవేశపెట్టారు. ఆ తరువాత పీఎస్ఎల్‌వీ రాకెట్‌లో నాలుగో దశ (పీఎస్–4) అమర్చిన 1.2 కిలోలు బరువు కలిగిన కలాంశాట్–వీ2 అనే అతి చిన్న ఉపగ్రహాన్ని 453 కి.మీ ఎత్తులో పీఎస్–4తో పాటే పరిభ్రమిస్తూ ఉంది. మైక్రోశాట్–ఆర్ ఉపగ్రహంలో కక్ష్యలోకి చేరుకున్న వెంటనే బెంగళూరులో ఇస్ట్రాక్ కేంద్రం ఉపగ్రహాన్ని తమ అధీనంలోకి తీసుకుంది. దానికి అమర్చిన సోలార్ ప్యానెల్స్ ఆటోమేటిక్‌గా విచ్చుకుని పనిచేయడం ప్రారంభించినట్లు ఇస్ట్రాక్ కేంద్రం శాస్త్రవేత్తలు శుక్రవారం ప్రకటించారు. ఈ ఉపగ్రహం దేశ సరిహద్దుల్లో చొరబాట్లు జరిగితే గుర్తించి ఇండియన్ ఆర్మీకి చేదోడు వాదోడుగా పనిచేయనుంది. కార్గిల్ యుద్ధం జరిగిన సమయంలో టెర్రరిస్టుల చొరబాట్లను గుర్తించేందుకు కల్పనాశాట్ ఉపగ్రహాన్ని భూమికి దగ్గరగా రప్పించి చాయాచిత్రాలు తీసిన తరువాత మళ్లీ పైకి తీసుకెళ్లిన సంగతి విదితమే. మునుముందు అలాంటి పరిస్థితులు రాకుండా శాశ్వతంగా ఒక ఉపగ్రహాన్ని ఇస్రో అందుబాటులోకి తెచ్చింది. ఈ ఉపగ్రహం భూమికి అత్యంత చేరువలోనే ఉండి సేవలు అందించనుంది.

జగన్‌ది జన బలం.. బాబుది ధన బలం

- సర్వేల పేరుతో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగిస్తున్నారు
- ప్రతి నియోజకవర్గంలో 20 వేల ఓట్ల వరకు తొలగింపు
- వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారు
- రూ.6 లక్షల కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నారు
- చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ నేత ఆనం రామనారాయణరెడ్డి ధ్వజం



సాక్షి, హైదరాబాద్: ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది జన బలమని, సీఎం చంద్రబాబుది ధన బలమని వైఎస్సార్‌సీపీ నేత ఆనం రామనారాయణరెడ్డి వ్యాఖ్యానించారు. సుదీర్ఘ పాదయాత్ర ద్వారా జగన్ జన బలం వెల్లడైందన్నారు. భారత రాజకీయాలను శాసించేది కేసీఆర్, వైఎస్ జగన్, నవీన్ పట్నాయక్ అని ఎల్లో మీడియా కూడా వాస్తవాలను ఒప్పుకుందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆనం రామనారాయణరెడ్డి మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ డబ్బున్న వారికే టికెట్లు ఇస్తుందని చంద్రబాబు అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సంక్షేమ పథకాల పేరుతో అవినీతికి పాల్పడి రూ.6 లక్షల కోట్ల ప్రజాధనాన్ని చంద్రబాబు దోచుకున్నారని ఆరోపించారు. అంతేకాకుండా అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. ప్రభుత్వానికి చెందిన ఆర్టీజీఎస్‌ను టీడీపీకి లింక్ చేసి వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగిస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికల కమిషన్ ఈవీఎంలతోనే ఎన్నికలు నిర్వహిస్తామంటుంటే బ్యాలెట్ పత్రాల ద్వారా నిర్వహించాలని చంద్రబాబు డిమాండ్ చేస్తున్నారన్నారు. రాబోయే ఓటమిని ఈవీఎంలపై నెట్టడానికి ఇప్పటి నుంచే ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రజలు తప్పు చేశారని, ఈవీఎంలు తప్పు అని, ఎన్నికల అధికారులది తప్పు అని నెపం నెట్టడం ఆయనకు కొత్త కాదని అన్నారు.

నారా లోకేశ్ నేతృత్వంలోనే సర్వేలు

వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు ఓటర్ జాబితాలోనే ఉండకుండా దుర్మార్గపు పనులు చేస్తున్నారని ఆనం మండిపడ్డారు. మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో తెలుగు యువత నేతలకు సర్వేల పేరుతో ట్యాబ్‌లు ఇచ్చి విజయనగరం, గుంటూరు, కర్నూలు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో తిప్పుతున్నారని అన్నారు. ఓటర్ జాబితాలు దగ్గరపెట్టుకొని మీరు ఏ పార్టీకి చెందినవారు? మీకు పథకాలు అందాయా? లేదా? అని ప్రశ్నలు వేస్తున్నారన్నారు. ప్రతి నియోజకవర్గంలో 10 వేల నుంచి 20 వేల వరకు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగిస్తున్నారని చెప్పారు. ఓట్లు ఎలా కొనుగోలు చేయాలి? ఓట్లు ఎలా తొలగించాలనే అంశాలపై చంద్రబాబు, లోకేశ్ ప్రత్యేకంగా శిక్షణా తరగతులు పెట్టిన విషయం అందరికీ తెలుసన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి పెట్టి సర్వే సంస్థలు చేసే కార్యక్రమాలను పరిశీలించాలని కోరారు. అలాగే చంద్రబాబు ఐటీ, సీబీఐ, ఈడీ సంస్థలంటే ఎందుకు భయపడుతున్నారని ఆనం నిలదీశారు. ఆయన విధానాలతో రాష్ట్రం ఆర్థికంగా చితికిపోయిందన్నారు. ప్రతిపక్ష పార్టీకి చెందిన 23 మంది ఎమ్మెల్యేలను, ముగ్గురు ఎంపీలను అనైతికంగా టీడీపీలో చేర్చుకున్న చంద్రబాబు పాలనను ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో ఈ అవినీతి ప్రభుత్వాన్ని ఇంటికి పంపించడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

4న తిరుపతి నుంచి సమర శంఖారావం

- బూత్‌లెవల్ కమిటీలకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ దిశానిర్దేశం
- మొత్తం 13 జిల్లాల్లో సభలు
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెల్లడి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి. పక్కన పోకల అశోక్‌కుమార్, పురుషోత్తంరెడ్డి, విశ్వనాథం

తిరుపతి తుడా: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చిత్తూరు జిల్లా నుంచి సమర శంఖారావం పూరించనున్నట్లు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెల్లడించారు. ఎన్నికలకు సమాయత్తం చేసేందుకు బూత్ కన్వీనర్లు, కమిటీల సభ్యులకు ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేస్తారని చెప్పారు. తిరుపతిలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడారు. వచ్చే నెల 4న తిరుపతిలో సమర శంఖారావం ప్రారంభమవుతుందని తెలిపారు. సమర శంఖారావం పేరుతో నిర్వహించే జిల్లా స్థాయి సమావేశాల్లో బూత్ కన్వీనర్లు, కమిటీల సభ్యులతోపాటు ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయకర్తలు పాల్గొంటారన్నారు. శంఖారావం సభలను 13 జిల్లాల్లోనూ నిర్వహిస్తామన్నారు. వచ్చే నెల 4న చిత్తూరు, 5న వైఎస్సార్, 6న అనంతపురం జిల్లాల్లో సభలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఫిబ్రవరి చివరి నాటికి అన్ని జిల్లాల్లో సభలు పూర్తి చేస్తామన్నారు. దేశంలో మరెవరికీ సాధ్యం కాని విధంగా 14 నెలల పాటు సుదీర్ఘ పాదయాత్రతో ప్రజల్లో ఉన్న జగన్ నిత్యం ప్రజాహిత కార్యక్రమాలను నిర్వహిస్తూ రాష్ట్ర భవిష్యత్ కోసం పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు.

ప్రత్యేక హోదా ఇచ్చే పార్టీకే మద్దతు

దేశవ్యాప్తంగా అన్ని సర్వేల్లోనూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించబోతున్నట్లు స్పష్టమైందని పెద్దిరెడ్డి అన్నారు. రాష్ట్రంలో 20 నుంచి 22 ఎంపీ స్థానాలు సాధించి ప్రధాని ఎంపికలో కీలకపాత్ర పోషిస్తామన్నారు. కేంద్రంలో ప్రత్యేక హోదా ఇచ్చే పార్టీకే తమ మద్దతు ఉంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీతోనూ పొత్తు ఉండదని స్పష్టం చేశారు. ఓటమి భయంతోనే చంద్రబాబు వైఎస్సార్‌సీపీ నవరత్నాలను, టీఆర్ఎస్ పథకాలను, వివిధ రాష్ట్రాల పథకాలను కాపీ కొడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రాన్ని నిలువుదోపిడీ చేసి 600 హామీల్లో ఒక్కటీ అమలు చేయకుండా మోసగించిన సీఎం 'మళ్లీ బాబే రావాలి' అంటూ ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చంద్రబాబు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రామచంద్రారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో తప్పుడు హామీలతో ప్రజల్ని మరోసారి మోసగించాలని ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు నిజ స్వరూపం తెలిసిన చిత్తూరు జిల్లా ప్రజలు ఏనాడూ ఆయనను నమ్మలేదన్నారు. సొంత ఊరు, నియోజకవర్గంలోనూ ఆయనను తీవ్రంగా వ్యతిరేకిస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రజలు కూడా చంద్రబాబు నైజాన్ని, మోసాన్ని గుర్తించాలని కోరారు. మీడియా సమావేశంలో పోకల అశోక్‌కుమార్, పురుషోత్తంరెడ్డి, విశ్వనాథం పాల్గొన్నారు.

ఇక సింగపూర్ విద్యుత్!

- కొనుగోలు చేసేందుకు రాష్ట్ర సర్కారు సన్నద్ధం
- ఫ్లెక్సిబుల్ షెడ్యూల్డ్ పవర్ పేరిట కొత్త వ్యవహారం
- సింగపూర్ సంస్థ భాగస్వామ్యం ఉన్న సెంబ్‌కార్ప్ గాయత్రీ పవర్ నుంచి కొనుగోలు
- ఏటా 500 మెగావాట్లను 5 ఏళ్లపాటు కొనాలని నిర్ణయం
- ఈ ఏడాది ఏప్రిల్ నుంచే అమలు...


సాక్షి ప్రతినిధి, కర్నూలు: రాజధాని అమరావతి నిర్మాణంలో సింగపూర్ ప్రైవేట్ సంస్థలకు పెద్దపీట వేసిన రాష్ట్ర ప్రభుత్వం త్వరలో సింగపూర్ సంస్థ నుంచి విద్యుత్ కొనుగోలు చేసేందుకు సన్నద్ధమవుతోంది. ఇందుకోసం కొత్త తరహా విద్యుత్ కొనుగోలు విధానాన్ని తెరపైకి తీసుకొస్తోంది. ఫ్లెక్సిబుల్ షెడ్యూల్డ్ పవర్ (ఎఫ్ఎస్‌పీ) అనే కొత్త పేరు పెట్టి మరీ సింగపూర్ ప్రైవేటు సంస్థ సెంబ్‌కార్ప్ నుంచి కరెంటు కొనుగోలు చేయాలని నిర్ణయించింది. వాస్తవానికి ఆంధ్రప్రదేశ్‌లో మిగులు విద్యుత్ ఉంది. అయితే, రోజులో (24 గంటలు) ప్రతి గంటను పరిగణనలోకి తీసుకుంటే కొన్ని సమయాల్లో విద్యుత్ లోటు ఉంటోందని ప్రభుత్వం తేలిచ్చింది. ఆ సమయాల్లోనూ విద్యుత్ లోటు ఉండకూడదని చెబుతూ ఫ్లెక్సిబుల్ షెడ్యూల్డ్ పవర్ పేరిట విదేశీ ప్రైవేటు సంస్థ నుంచి విద్యుత్‌ను కొనుగోలు చేయాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. 2019 ఏప్రిల్ నుంచి రానున్న 5 ఏళ్లపాటు సదరు సంస్థ నుంచి విద్యుత్ కొనుగోలు చేయాలని గత నెల 28వ తేదీన జరిగిన సమావేశంలో అంగీకారానికి వచ్చారు. విద్యుత్ కొనుగోలు కోసం టెండర్లను పిలిచేందుకు ఏర్పాట్లు చేయాలని కేపీఎంజీ కన్సల్టెన్సీ సంస్థను ప్రభుత్వం ఆదేశించింది.

మిగులంటూనే మతలబు

రానున్న ఆరేళ్లలో రాష్ట్రంలో ఏ మేరకు విద్యుత్ డిమాండ్ ఉండనుంది? ఎంతమేర కరెంటు అందుబాటులో ఉంటుదన్న దానిపై ఇప్పటికే విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కం) అంచనాలు రూపొందించాయి. వీటి ప్రకారం రానున్న ఐదేళ్లపాటు ప్రతిఏటా మిగులు విద్యుత్ అందుబాటులో ఉండనున్నట్లు తేలింది. అయితే, రోజులో కొన్ని సమయాల్లో అంటే సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు విద్యుత్ డిమాండ్ అధికంగా ఉంటుంది. ఈ సమయాల్లో విద్యుత్ లోటు ఉండే అవకాశం ఉంది. సుమారు 1,500 మెగావాట్ల నుంచి 5,000 మెగావాట్ల వరకూ విద్యుత్ లోటు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ చిన్న అంశాన్ని సాకుగా తీసుకుని ప్రైవేటు విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం పావులు కదిపింది. సింగపూర్ సంస్థతోపాటు కాంగ్రెస్ నేత భాగస్వామ్యం ఉన్న సెంబ్‌కార్ప్ గాయత్రీ పవర్ ద్వారా 500 మెగావాట్లు కొనుగోలు చేసేందుకు సిద్ధమైంది. మొత్తం 1,500 మెగావాట్ల విద్యుత్‌ను ఐదేళ్లపాటు కొనుగోలు చేయనున్నారు. ఇందులో సెంబ్‌కార్ప్ నుంచే 500 మెగావాట్లను కొనుగోలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. దీనిపై త్వరలోనే ప్రభుత్వం ఆమోదముద్ర వేయనుంది. అనంతరం విద్యుత్ కొనుగోలు కోసం టెండర్లు పిలవనున్నారు.

మిగులు లెక్క పక్కా..

రాష్ట్రంలో 2019–20 ఆర్థిక సంవత్సరం నుంచి 2023–24 ఆర్థిక సంవత్సరం వరకు రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్‌ను డిస్కంలు లెక్కించాయి. ఈ లెక్కల ప్రకారం రాష్ట్రంలో మిగులు విద్యుత్ ఉంటోంది. కానీ, ప్రైవేటు విద్యుత్‌ను కొనుగోలు చేయడానికి అనుగుణంగా హవర్లీ విద్యుత్ డిమాండ్ విధానాన్ని తెరపైకి తెచ్చినట్లు స్పష్టమవుతోంది.



రైతే దేశానికి వెన్నెముక

సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జాస్తి చలమేశ్వర్



ఉత్తమ రైతుకు అవార్డు అందజేస్తున్న సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జాస్తి చలమేశ్వర్

గుంటూరు రూరల్: రైతే దేశానికి వెన్నెముక అని, వారి సంక్షేమం..దేశాభివృద్ధికి మార్గమని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జాస్తి చలమేశ్వర్ అన్నారు. శుక్రవారం గుంటూరు నగరశివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉత్తమ రైతులకు అవార్డులు అందజేశారు. రాష్ట్ర వ్యవసాయ సంయుక్త కార్యాచరణ సమితి ప్రథమ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. తాను రైతు కుటుంబం నుంచి వచ్చానని చెప్పారు. 130 కోట్ల జనాభా ఉన్న మన దేశం అత్యధిక శాతం వ్యవసాయంపై ఆధారపడి ఉందన్నారు. వ్యవసాయంలో అధునాతన పద్ధతులు అవలంభిస్తున్నారని, ఇంకా పెరగాలని సూచించారు. రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ ఎం.రవికుమార్ మాట్లాడుతూ 2017–18 సంవత్సరంలో వ్యవసాయంలో వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభను కనబరచిన 200 మంది రైతులను ఎంపిక చేసి ఉత్తమ రైతు అవార్డును, ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న సమితి ప్రతినిధులను అభినందించారు. 172 మంది రైతులకు జాస్తి చలమేశ్వర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, అవార్డులు అందజేశారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ వి.దామోదర్‌నాయుడు, విశ్రాంత డెప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ దావులూరి రమణకుమార్, వర్సిటీ పరిశోధనా సంచాలకుడు డాక్టర్ ఎన్వీ నాయుడు, సహ పరిశోధనా సంచాలకురాలు డాక్టర్ పి.ప్రభుప్రసాదిని, రంగా ట్రస్ట్ సభ్యులు ఎల్.కృష్ణ శంకర్, ఆత్మ సంచాలకుడు జె.రవికుమార్, జాస్తి శ్రీనివాసరావు, 13 జిల్లాల ఆత్మ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి కేంద్రం ఇంకా రూ.లక్షా 16 వేల కోట్లివ్వాలి

టీడీపీ నేతలతో టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి కేంద్రం ఇంకా రూ.లక్షా 16 వేల కోట్ల నిధులు ఇవ్వాల్సి ఉందని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారు. దానిపైనే ప్రధానికి లేఖ రాశానని, కేంద్రంలో బీజేపీ నేతలు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన విమర్శించారు. కేంద్రం ఇవ్వాల్సిన నిధులపై ప్రతిపక్ష నేత జగన్‌మోహన్‌రెడ్డి ప్రధానమంత్రి మోదీని ప్రశ్నించడం లేదని, బాధ్యతారాహిత్యానికి ప్రతిబింబం జగన్ అని ఆరోపించారు. టీడీపీ ప్రజాప్రతినిధులు, ఇన్‌చార్జిలు, పార్టీ బాధ్యులతో ఉండవల్లిలోని తన నివాసం నుంచి శుక్రవారం ఆయన టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జయప్రకాశ్ నారాయణ కమిటీ రాష్ట్రానికి రూ.85 వేల కోట్లు ఇవ్వాలని చెప్పిందని, పవన్ కల్యాణ్ జేఎఫ్‌సీ రూ.75 వేల కోట్లు ఇవ్వాలని చెప్పిందని తెలిపారు. టీడీపీకి 65 లక్షల సైన్యం ఉందన్నారు.

అక్షయగోల్డ్ డైరెక్టర్ కూకట్ల శ్రీనివాస్ అరెస్టు

రిమాండ్‌పై ఏలూరు జిల్లా జైలుకు తరలింపు

సాక్షి ప్రతినిధి ఏలూరు: అక్షయ గోల్డ్ డైరెక్టర్, అభయ గోల్డ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ కూకట్ల శ్రీనివాస్‌ను సీఐడీ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. అతనిని శుక్రవారం రాత్రి జిల్లా న్యాయమూర్తి వద్ద హాజరుపరచగా ఫిబ్రవరి 4వ తేదీ వరకు రిమాండ్ విధించారు. శ్రీనివాస్‌ను పోలీసులు ఏలూరు జిల్లా జైలుకు తరలించారు. ఏలూరు టూటౌన్ ప్రాంతంలో గతంలో అభయ గోల్డ్, అక్షయ గోల్డ్ కంపెనీలు నిర్వహించేవారు. అప్పట్లో ఖాతాదారులకు ఈ రెండు కంపెనీలు సొమ్ము ఎగవేశాయి. బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో ఈ కంపెనీలపై ఏలూరు టూటౌన్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. అక్షయగోల్డ్‌లో 30 కేసులు, అభయగోల్డ్‌లో 20 కేసులు నమోదు కావడంతో సీఐడీ పోలీసులు విచారణ చేపట్టారు. దర్యాప్తు చేసిన సీఐడీ పోలీసులు 2013లో శ్రీనివాస్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి అతనికి రిమాండ్ విధించారు. శ్రీనివాస్ రిమాండ్ కాలం ముగియడంతో బయటకు వచ్చారు. అనతంరం శ్రీనివాస్ కోర్టుకు హాజరుకాకపోవడంతో అతనిపై నాన్ బెయిలబుల్ వారెంట్లను కోర్టు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సీఐడీ పోలీసులు శ్రీనివాస్‌ను అరెస్టు చేశారు.

ఆర్టీసీ సమ్మెపై కార్మిక శాఖకు నోటీసిచ్చిన ఎన్‌ఎంయూ

సాక్షి, అమరావతి: ఆర్టీసీ కార్మికుల సమస్యలపై యాజమాన్యం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని, సమ్మె ఉధృతం చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నేతలు పేర్కొన్నారు. శుక్రవారం ఆర్టీసీ హౌజ్‌లోని ఎన్‌ఎంయూ కార్యాలయంలో సెంట్రల్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎన్‌ఎంయూ నేతలు రమణారెడ్డి, చంద్రయ్య పాల్గొని యూనియన్ నేతలకు దిశానిర్దేశం చేశారు. సమావేశం తర్వాత కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ అజయ్‌ను కలిసి సమ్మె నోటీసిచ్చారు. కాగా, సంస్థలో కార్మికుల డబుల్ డ్యూటీలకు డబుల్ వేతనం ఇప్పించాలని కార్మిక సంఘాలు చాలా కాలం నుంచి డిమాండ్ చేస్తున్నా.. యాజమాన్యం పట్టించుకోవడంలేదు. దీనిపై నేషనల్ మజ్దూర్ యూనియన్ నేతలు శుక్రవారం ఎండీని కలిసి కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమ బాట పడతామని తేల్చిచెప్పారు.

పింఛన్ మొత్తాన్ని పెంచుతూ ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: వృద్ధులు, వితంతువులు, కల్లు గీత కార్మికులు, చేనేతలు, ఒంటరి మహిళలు, మత్స్యకారులు, ఎయిడ్స్ రోగులు, డప్పు కళాకారులు, 80 శాతం లోపు అంగవైకల్యం ఉన్న వారికి ఇస్తున్న రూ.1,000ల పింఛన్ మొత్తాన్ని రూ. 2,000లకు పెంచుతూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. 80 శాతం పైబడిన అంగవైకల్యం ఉన్నవారితో పాటు ట్రాన్స్‌జెండర్స్‌కు ఇస్తోన్న పింఛన్ మొత్తాన్ని రూ.1,500 నుంచి రూ.3,000లకు పెంచింది. కిడ్నీ రోగులకు ఇస్తున్న రూ. 2,500ల పింఛన్‌ను రూ.3,500లకు పెంచింది. డిసెంబర్‌కు సంబంధించి 2019 జనవరిలో జరిగే పంపిణీ నుంచే పెంపు వర్తించనుందని ఉత్తర్వులో పేర్కొంది.

వేగంగా రుణాలు ఇవ్వండి

రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో సీఎస్ పునేఠా

సాక్షి, అమరావతి: పేదల ఇళ్ల నిర్మాణాలకు వేగవంతంగా రుణాలు మంజూరు చేయాల్సిందిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠా బ్యాంకర్లకు సూచించారు. శుక్రవారం సచివాలయంలో రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశాన్ని సీఎస్ నిర్వహించారు. ప్రభుత్వ పథకాల అమలుకు బ్యాంకర్లు సహకరించాలని పునేఠా కోరారు. అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలని, అంతర్గత సమస్యలను వెంటనే పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రతి పథకం పురోగతిని అధికారులు, బ్యాంకర్లు సమీక్షించుకోవాలన్నారు. మహిళలు, విద్యార్థులకు రుణాల మంజూరు పెరగాలని ఆయన కోరారు. చెల్లింపుల్లో మందకొడితనం సాకుతో సంక్షేమానికి రుణాలు నిలిపేయరాదన్నారు.

ఏపీకి ఐదుగురు ఐపీఎస్‌ల కేటాయింపు

సాక్షి, అమరావతి: కేంద్ర హోంశాఖ ఏపీకు ఐదుగురు ఐపీఎస్‌లను కేటాయించింది. అదిరాజ్ సింగ్ రాణా (పంజాబ్), వీఎన్ మణికంఠ చందోలు (ఆంధ్రప్రదేశ్), ప్రేమకుమార్ (ఉత్తరప్రదేశ్), క్రిష్ణకాంత్ పటేల్ (తెలంగాణ), తుషార్‌డుడిని (రాజస్థాన్) ఏపీకి కేటాయించినట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రీజనల్ కో-ఆర్డినేటర్ల నియామకం

సాక్షి, అమరావతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బీసీ విభాగం రీజనల్ కో–ఆర్డినేటర్లను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాయలసీమ రీజనల్ కో–ఆర్డినేటర్‌గా తొండమల్ల పుల్లయ్య, కోస్తాంధ్రకు అంగిరేకుల ఆదిశేషు, ఉత్తరాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్‌గా పక్కి వెంకట సత్యదివాకర్‌ను నియమించారు.

మోసాలే ‘పెట్టుబడి’గా..!

సాక్షి, అమరావతి: రుణాల మాఫీ పేరుతో రాష్ట్రంలోని 94 లక్షల మంది డ్వాక్రా మహిళలను వంచించిన సీఎం చంద్రబాబు ఇప్పుడు ఎన్నికల ముంగిట పెట్టుబడి నిధి డబ్బుల పేరుతో మరోసారి వారిని మోసగించేందుకు సిద్ధమయ్యారు. డ్వాక్రా సంఘాల రుణాలన్నీ మాఫీ చేస్తానని 2014 ఎన్నికల్లో ప్రచారం చేయడమే కాకుండా ఎన్నికల ప్రణాళికలోనూ చంద్రబాబు పొందుపరిచారు. తొలి సంతకం డ్వాక్రా రుణాల మాఫీపైనే చేస్తానని చెప్పిన చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే మాట మార్చేశారు. డ్వాక్రా రుణాలను మాఫీ చేయబోనంటూ కేవలం పది వేల రూపాయల చొప్పున నాలుగు విడతల్లో పెట్టుబడి నిధి ఇస్తామంటూ మోసం చేశారు. తూతూమంత్రంగా ఇచ్చే ఆ పెట్టుబడి నిధిని కూడా బ్యాంకులు పాత అప్పుల కింద జమ చేసుకున్నాయి. డ్వాక్రా మహిళలు పెట్టుబడి నిధిని డ్రా చేసుకునేందుకు బ్యాంకులు అనుమతించలేదు.

ఓటమి భయంతో ఎన్నికల ముంగిట వంచన

గత ఎన్నికలకు ముందు డ్వాక్రా సంఘాల రుణాలు రూ.14,205 కోట్లు న్నాయి. చంద్రబాబు సర్కారు అందులో ఒక్క పైసా కూడా మాఫీ చేయకపోవడంతో ఆ అప్పులు పెరిగిపోయి ప్రస్తుతం రూ.25,421 కోట్లకు చేరుకున్నాయి. పొదుపు సంఘాల మహిళల నుంచి టీడీపీ సర్కారుపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడం, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ తాము అధికారంలోకి వచ్చాక డ్వాక్రా సంఘాల రుణాల మొత్తాన్ని నాలుగు విడతల్లో మహిళలకే ఇస్తామని ప్రకటించడంతో సీఎం చంద్రబాబు హడావుడి చర్యలకు ఉపక్రమించారు.

- డ్వాక్రా మహిళా సంఘాలను మరోసారి వంచించే యత్నాలు
- ఎన్నికల ముంగిట పెట్టుబడి నిధి డబ్బుల పేరుతో చెక్కుల పంపిణీ
- గత ఎన్నికల్లో ఇచ్చిన డ్వాక్రా రుణాల మాఫీ హామీకి ఎగనామం
- రూ.14,205 కోట్ల నుంచి రూ.25,421 కోట్లకు పెరిగిన పొదుపు సంఘాల అప్పులు
- సకాలంలో రుణాలు చెల్లించిన సంఘాలకూ సున్నా వడ్డీ చెల్లించని వైనం

వచ్చే ఎన్నికల్లో టీడీపీ పరాజయం తథ్యమని జాతీయ సర్వేలన్నీ తేల్చి చెబుతుండటంతో ఇప్పుడు మరోసారి 94 లక్షల మంది డ్వాక్రా మహిళలను దగా చేసే ఎత్తుగడ అమలుకు తెర తీశారు. వచ్చే నెలలో ఎన్నికల షెడ్యూల్ వెలువడవచ్చని భావిస్తున్న తరుణంలో డ్వాక్రా మహిళలకు మరో పది వేల రూపాయల చొప్పున పెట్టుబడి నిధి కింద ఇస్తామంటూ ప్రకటన చేయడమే కాకుండా శుక్రవారం గుంటూరు, కడప, విశాఖపట్టణాల్లో నిర్వహించిన సభలకు డ్వాక్రా సభ్యులను తరలించి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రకటించారు.



బ్యాంకులకు డబ్బులివ్వకుండా చెక్కుల పంపిణీ..

రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం అన్ని రకాల బిల్లుల చెల్లింపులను నిలుపుదల చేసింది. రూ.14 వేల కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మంచినీటి సరఫరా బిల్లులను సైతం చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టారు. ప్రస్తుతం ఉన్న పథకాలు, ప్రాజెక్టులకే వచ్చే ఆరేడేళ్లకు సంబంధించిన బడ్జెట్ సరిపోదని ఆర్థిక శాఖ కూడా స్పష్టం చేసింది. వాస్తవాలు ఇలా ఉండగా డ్వాక్రా మహిళలకు రూ.పది వేల చొప్పున మూడు నెలల్లో డబ్బులిస్తామంటూ చెక్కుల పంపిణీకి సర్కారు తెరతీయడం గమనార్హం. బ్యాంకులకు డబ్బులు విడుదల చేయకుండా ఫిబ్రవరిలో రూ.2,500, మార్చిలో రూ.3,500, ఏప్రిల్‌లో రూ.4,000 చొప్పున ఇస్తామంటూ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.

సున్నా వడ్డీ బకాయిలు రూ.2,350 కోట్లు

సకాలంలో రుణాలు చెల్లించిన డ్వాక్రా సంఘాలకు 2016 సెప్టెంబర్ నుంచి సున్నా వడ్డీని ప్రభుత్వం చెల్లించడం లేదు. ఇప్పటివరకు సున్నా వడ్డీ కింద ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు రూ.2,350 కోట్లకు చేరుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం సున్నా వడ్డీ నిధులను ఇవ్వకపోవడంతో బ్యాంకర్లు మహిళా సంఘాల నుంచి వసూలు చేస్తున్నారు. సున్నా వడ్డీ నిధులను విడుదల చేయకుండా పొదుపు సంఘాలపై వడ్డీల భారం మోపుతూ మరోపక్క ఎన్నికల ముందు హడావిడిగా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడం ద్వారా చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకున్న విషయం స్పష్టం అవుతోందని ఓ ఉన్నతాధికారి వ్యాఖ్యానించారు.

బ్యాంకులకు ప్రభుత్వం చెల్లిస్తేనే ఆ చెక్కులపై డబ్బులు ఇస్తారని అధికార వర్గాలు పేర్కొన్నాయి. చెక్కుల పంపిణీ చేపట్టామని చెప్పుకోవడానికి ఎన్నికల కోడ్ అమల్లోకి రాకముందుగా సర్కారు ఇలాంటి ఎత్తుగడ వేసిందని స్పష్టం చేస్తున్నాయి. రూ. పది వేల చొప్పున పెట్టుబడి నిధి డబ్బులు ఇచ్చేందుకు నాలుగున్నరేళ్ల సమయం తీసుకున్న సర్కారు ఇప్పుడు ఎన్నికల ముందు మూడు నెలల్లో మరో రూ.పది వేల చొప్పున ఇస్తామని ప్రకటన చేయడంలో చిత్తశుద్ధి లేదని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

అండగా ఉండండి!

- ఎన్నికలయ్యే వరకు నా కోసం పనిచేయండి
- ఇంటికి పెద్దకొడుకులా ఉంటా
- నన్ను కాపాడుకోవాల్సిన, గెలిపించుకోవాల్సిన బాధ్యత మీదే
- డ్వాక్రా మహిళలకు మూడు దఫాల్లో రూ.10 వేలు చెల్లింపు
- ఈ సొమ్ముతో అంచెలంచెలుగా ఎదిగి లక్షలు సంపాదించాలి
- కోటి నలభై లక్షల మందికి స్మార్ట్‌ఫోన్లు
- వెలుగు సిబ్బందికి 30 శాతం వేతనాలు పెంచా
- ఇప్పటికే పెన్షన్లు రెట్టింపు చేశా
- అధికారంలోకి వస్తే తొలి సంతకం ప్రత్యేక హోదాపైనే
- ‘పసుపు–కుంకుమ’ బహిరంగ సభల్లో సీఎం చంద్రబాబునాయుడు
- ‘మీకు మేముంటాం’ అంటూ సభ్యులతో బలవంతంగా తీర్మానాలు
- ముందురోజు రాత్రే తరలింపుతో మహిళల నానా అవస్థలు

సాక్షి నెట్‌వర్క్: డ్వాక్రా మహిళలకు నాలుగున్నర ఏళ్లలో రూ.21,116 కోట్లు అందజేశామని, ఇంత చేశాం కాబట్టి తనకు అండగా నిలవాలని.. ఎన్నికలయ్యే వరకూ తన కోసం పనిచేయాలని సీఎం చంద్రబాబు వారిని వేడుకున్నారు. ఇంటికి పెద్ద కొడుకులా ఉంటానన్నారు. గ్రామాల్లో తన గురించి చర్చించాలని.. మళ్లీ టీడీపీ ప్రభుత్వం రావాలన్నారు. ‘నన్ను కాపాడుకోవాల్సిన బాధ్యత, నన్ను గెలిపించుకోవాల్సిన బాధ్యత మీదే..’ అంటూ ఆయన మహిళలను అభ్యర్థించారు. పసుపు–కుంకుమ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం నేలపాడు, కడప, విశాఖపట్నంలలో జరిగిన బహిరంగ సభల్లో చంద్రబాబు ప్రసంగించారు. డ్వాక్రా మహిళలకు మూడు దఫాల్లో రూ.10 వేలను అందజేయడమే కాకుండా, రాష్ట్రంలోని కోటి నలభై లక్షల మందికి స్మార్ట్‌ఫోన్లు అందజేస్తానని సీఎం ప్రకటించారు. ఫిబ్రవరిలో రూ.2,500.. మార్చిలో రూ.3,500, ఏప్రిల్‌లో రూ.4వేల చొప్పున చెక్కులను నేరుగా మహిళల ఖాతాల్లో జమచేస్తామని తెలిపారు. స్మార్ట్‌ఫోన్ చేతిలో ఉంటే టెక్నాలజీని అనేక రకాలుగా వినియోగించుకోవచ్చని చెప్పారు. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు తాను ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టానన్నారు. రాష్ట్రంలో 93 లక్షల 80 వేల మంది డ్వాక్రా మహిళలు ఉన్నారని వీరందరికీ అప్పుచేసి మరీ రూ.10 వేలు చొప్పున ఇస్తున్నానని చెప్పారు. ‘సాక్షి’ పేపరోళ్లు చెబుతున్నట్లుగానే తన దగ్గర డబ్బుల్లేవని.. అందుకే రూ.10 వేలకు పోస్ట్ డేటెడ్ చెక్కులే ఇస్తున్నానని సీఎం చెప్పారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

తానిచ్చే రూ.10 వేలతో డ్వాక్రా మహిళలు అంచలంచెలుగా రూ.లక్షలు సంపాదించి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సీఎం ఆకాంక్షించారు. నియోజకవర్గానికి 200 ఎకరాలు భూమి కేటాయించి అక్కడ మౌలిక సదుపాయాలు సమకూరుస్తానని.. వారు తయారుచేసిన వస్తువులు విక్రయించుకునేందుకు అక్కడ షెడ్లు నిర్మిస్తామని చెప్పారు. గతంలో కుటుంబ నియంత్రణకు తాను పిలుపునిస్తే మంచి స్పందన వచ్చిందని.. అలాగే, ఇప్పుడు ఒకరికి మించి పిల్లలను కనాలని కోరారు. కాగా, ఇప్పటివరకు 30 శాతం మేర వెలుగు సిబ్బందికి జీతాలు పెంచామని తెలిపారు. అధికారంలోకి వస్తే తొలి సంతకం ప్రత్యేక హోదాపై చేస్తానని చంద్రబాబు అన్నారు. కాగా, ‘కేసీఆర్ నాకేదో రిటర్న్ గిఫ్ట్ ఇస్తానంటున్నాడు. ఏ గిఫ్ట్ ఇస్తాడు.. ఆయన ఒక గిఫ్ట్ ఇస్తే ఆయనకు ఐదు రిటర్న్ గిఫ్ట్‌లు ఇవ్వడానికి మా అక్కాచెల్లమ్మలు సిద్ధంగా ఉన్నార’ని చెప్పారు. వైఎస్సార్‌సీపీ తామే గెలవబోతున్నట్టుగా డబ్బులిచ్చి సర్వేలు చేయించుకుందని, వాటిని నమ్మొద్దని చెప్పారు.



విశాఖ సభలో పసుపు-కుంకుమ-2 నమూనా చెక్కును డ్వాక్రా సంఘాలకు అందజేస్తున్న సీఎం చంద్రబాబు



నేలపాడు డ్వాక్రా సదస్సు వద్ద కూర్చునేందుకు కుర్చీలు లేక బయట వున్న కుర్చీలను మోసుకుని వెళ్తున్న మహిళలు

డ్వాక్రా మహిళలపై దాష్టీకం

ఇదిలా ఉంటే.. చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ లోని పట్టణ దారిద్ర్య నిర్మూలనా విభాగం (మెప్మా) ఆధ్వర్యంలో శుక్రవారం వెయ్యి మందికి పైగా మహిళల్ని సెల్‌ఫోన్, రూ.10వేలను ఇస్తామంటూ అంబేడ్కర్ భవన్‌కు బలవంతంగా రప్పించారు. అక్కడకు వెళ్లిన మహిళలకు అధికారులు చుక్కలు చూపించారు. కడపలో జరుగుతున్న సీఎం బహిరంగ సభను ఇక్కడ లైవ్‌లో చివరివరకు చూసిన వారికే ‘పసుపు–కుంకుమ’ వర్తింపజేస్తామంటూ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బలవంతంగా కూర్చోపెట్టారు. కానీ, అది ప్రసారం కాలేదు. దీంతో మహిళలు తిట్టుకుంటూ బయటకు వచ్చారు. ఆగ్రహించిన అధికారులు గేట్లు మూయించేశారు. కొందరిని జుట్టుపట్టుకుని లాగుతూ లోపలికి తోసేశారు. ఇదే విధంగా రాజధాని ప్రాంతంలోని నేలపాడులోనూ అధికారులు, టీడీపీ నేతలు డ్వాక్రా మహిళలను తీవ్ర ఇక్కట్లకు గురిచేశారు. ఇక్కడకు పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి మహిళలను తరలించారు. వీరిని గురువారం రాత్రే వారివారి మండల కేంద్రాల్లో ఉన్న వెలుగు కార్యాలయాలకు తీసుకువచ్చి అక్కడ నుంచి శుక్రవారం సభకు తీసుకువచ్చారు. రాత్రివేళ వీరికి భద్రత లేకపోవడంతో వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సభకు హాజరు కాకుంటే రూ.10 వేలు డబ్బు, స్మార్ట్‌ఫోన్‌లు అందవనే హెచ్చరికతో మహిళలు తప్పనిసరి పరిస్థితుల్లో వచ్చారు. వీరందరికీ భోజన ఏర్పాట్లు సక్రమంగా చేయలేదు.



బయటకొస్తున్న ఓ మహిళను జుట్టు పట్టుకుని లాగుతుంటే.. బలవంతంగా విడిపించుకుని బయటపడ్డ దృశ్యం

బలవంతంగా తీర్మానాలు.. మహిళల మండిపాటు

‘మీతోనే మేముంటాం..’ అంటూ ఓ తీర్మాన పత్రాన్ని పంపాలంటూ సీఎం చంద్రబాబు రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలకు మెప్మా శాఖ అధికారుల ద్వారా సమాచారం పంపడంపై డ్వాక్రా మహిళలు మండిపడ్డారు. డ్వాక్రా రుణాలు పూర్తిగా మాఫీ చేస్తానని చెప్పి.. మాట తప్పి సంఘాలను నిర్వీర్యం చేసిన ఆయనకు తాము అండగా ఉన్నామని ఎలా తీర్మానాలు చేయాలంటూ వైఎస్సార్‌జిల్లా ప్రొద్దుటూరులో జరిగిన సమావేశంలో రీసోర్స్ పర్సన్లను (ఆర్పీలు) నిలదీశారు. ఈ సమావేశానికి డ్వాక్రా మహిళలను తీసుకురావాలంటూ సర్కారు ఆర్పీలను ఆదేశించడంతో వారు మహిళలను బెదిరించి బస్సులెక్కించారు. బస్సుల్లో ఉన్న ఆర్పీ సంఘ సభ్యులతో కలిసి తీసుకున్న ఫొటోను, బస్సు ముందు సీఓ, ఆర్పీ నిలబడి సమాఖ్య ఫ్లెక్సీతో తీసుకున్న ఫొటోలను పంపించాలని నిబంధన పెట్టడంతో వారంతా సీఎం సభకు వెళ్లాల్సి వచ్చింది. ఈ విధంగా అనంతపురం, కర్నూలు, నెల్లూరు జిల్లాల నుంచి వందలాది బస్సుల్లో తరలించారు. కడపలో సీఎం సభ ప్రత్యక్ష ప్రసారానికి టీవీలను ఆర్పీలే ఏర్పాటు చేసుకోవాలనడంతో వారు లబోదిబోమంటూ పరుగులు పెట్టారు. మరోవైపు.. అమరావతి, విశాఖపట్నం, కడపలో జరిగిన సభల్లో మహిళలతో బలవంతంగా ఏకగ్రీవ తీర్మానం చేయించినట్లు సమాచారం.



మీతోనే మేముంటామని సమాఖ్యలకు పంపిన తీర్మాన పత్రం

బస్సులు సీఎం సభలకు.. ఇక్కట్లు ప్రయాణికులకు!

- డ్వాక్రా సభలకు 5 వేల ఆర్టీసీ బస్సులు తరలింపు
- లక్షలాది ప్రయాణికులకు బస్సుల్లేక పాట్లు
- ప్రభుత్వం నిర్వహించే ఏ కార్యక్రమానికైనా ఆర్టీసీ బస్సుల వాడకం
- ధర్మపోరాట దీక్షలు, జ్ఞానభేరి, డ్వాక్రా సభలతో జనానికి అవస్థలు
- ఆర్టీసీకి డబ్బులివ్వకుండా ఎగ్గొడుతున్న సర్కార్

సాక్షి, అమరావతి: ప్రయాణికుల ఇబ్బందులు పట్టించుకోని ఆర్టీసీ.. సీఎం చంద్రబాబు సేవలో తరిస్తోంది. చంద్రబాబు ప్రచార సభలకు ఆర్టీసీ బస్సులను మళ్లిస్తూ లక్షలాది మంది ప్రయాణికులను అవస్థలపాల్జేస్తోంది. విశాఖ, గుంటూరు, కడపలో డ్వాక్రా మహిళలతో సీఎం సభలు నిర్వహించారు. ఈ సభల కోసం ఏకంగా 5 వేల బస్సులను ఆర్టీసీ ఏర్పాటు చేసింది. దీంతో గమ్యస్థానాలకు వెళ్లే ప్రయాణికులు బస్సుల్లేక నానా యాతన పడ్డారు. మహిళలను బస్సుల్లో తరలించడానికి, ప్రచారం కోసం ఇంత పెద్ద ఎత్తున ఆర్టీసీ బస్సులను వినియోగించడంపై ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు సభకు విజయవాడ, కృష్ణా జిల్లా డిపోల నుంచి 2 వేల బస్సులకు పైగా తరలించారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కనీసం సిటీ బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

ప్రభుత్వ ప్రచారం కోసం ఆర్టీసీని అప్పుల్లోకి..

ఇటీవలి కాలంలో ఆర్టీసీకి రాష్ట్ర ప్రభుత్వం రూ.7.86 కోట్ల మేర బకాయి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ధర్మ పోరాట దీక్షలు, జ్ఞానభేరి సభలకు పెద్ద ఎత్తున ఆర్టీసీ బస్సులను తిప్పుతున్నారు. ఇందుకు ఆర్టీసీకి చెల్లించాల్సిన డబ్బు చెల్లించకుండా అప్పనంగా ఆర్టీసీని వినియోగించుకుంటున్నారు. సీఎం సభలకు ఇలా బస్సులను తిప్పడంతో ప్రయాణికులకు పాట్లు తప్పడం లేదు. రాష్ట్రంలో విజయనగరం, విజయవాడ, నెల్లూరు, కడప జోన్లున్నాయి. నిత్యం 72 లక్షల మంది ప్రయాణికులు వారి గమ్యస్థానాలకు వెళ్తున్నారు. విద్యార్థులు, ప్రయాణికులు, కూలి పనులు చేసుకునే వారు నిత్యం ఆర్టీసీ బస్సుల ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. ధర్మపోరాట సభ, జ్ఞానభేరి సభ నిర్వహిస్తే ఆర్టీసీ సీఎం సేవలో తరిస్తోంది. ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించే రోజున సగటున 15 లక్షల మంది ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నట్లు ఓ అంచనా. ఒక బస్సు సీఎం సభకు పంపితే కిలోమీటరుకు రూ.25 నుంచి రూ.30 వరకు చెల్లించాలి. బస్సును వినియోగించుకున్నందుకు కనిష్టంగా రూ.30 వేల వరకు ఆర్టీసీకి చెల్లించాలి. అయితే ప్రభుత్వం బస్సులను వాడుకున్నందుకు ఒక్క పైసా కూడా చెల్లించడం లేదు. బస్సులను తిప్పడం వల్ల వచ్చిన నష్టం సంగతి అటుంచితే.. ఇప్పటి వరకు జిల్లాల్లో నిర్వహిస్తున్న సభలకు 2,620 అన్ని కేటగిరీల బస్సులను ప్రభుత్వం వినియోగించుకుంటే.. శుక్రవారం ఒక్క రోజు డ్వాక్రా సభలకు 5 వేల బస్సులను వినియోగించడం గమనార్హం.

ఆర్టీసీకి పైసా చెల్లించలేదు

గ్రామాలు, పట్టణాల్లో ఉన్న టీడీపీ కార్యకర్తలను గడిచిన ఆర్నెల్ల నుంచి పోలవరం యాత్రకు పంపుతున్నారు. అమరావతి, ఇంద్ర, సూపర్ లగ్జరీ బస్సులను పోలవరం యాత్రకు ఏర్పాటు చేస్తున్నారు. గత ఆర్నెల్ల నుంచి సుమారు వంద బస్సులను తిప్పారు. పోలవరం సందర్శనకు ఇరిగేషన్ శాఖ ఆర్టీసీకి నిధులు చెల్లిస్తుందని చెప్పి నెలలు గడుస్తున్నా.. ఇంతవరకు ఆర్టీసీకి పైసా చెల్లించలేదు. ఇటీవలే ఇరిగేషన్ శాఖ రూ.22.25 కోట్ల నిధుల్ని విడుదల చేసింది. ఇందులో ఒక్క పైసా కూడా ఆర్టీసీకి చెల్లించకపోవడం గమనార్హం.



నేలపాడు డ్వాక్రా సదస్సుకు బస్సుల్లో ఫుట్‌బోర్డుపై ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న మహిళలు

ఆర్టీసీ బస్సుల సంఖ్య: 11,687

- గత ఐదు నెలలుగా సీఎం సభలు, దీక్షలకు మళ్లించిన బస్సులు: 2,620
- డ్వాక్రా సభలకు ఒక్క రోజే వినియోగించుకున్న బస్సుల సంఖ్య: 5 వేలు
- కిలోమీటరుకు బస్సుకు చెల్లించాల్సింది: రూ.25 నుంచి రూ.30 వరకు
- ఆర్టీసీ బస్సును బయటకు పంపితే రోజుకు చెల్లించాల్సింది: కనిష్టంగా రూ.30 వేలు
- ప్రభుత్వ కార్యక్రమాలకుగాను ఆర్టీసీకి ఇప్పటి వరకు చెల్లించాల్సిన సొమ్ము: రూ.7.86 కోట్లు .

సీఎం సభకు వెళ్లిన 108 వాహనాలు.. సకాలంలో వైద్యం అందక బాలిక మృతి

రాజధాని ప్రాంతంలో ఘటన



ఘటనా స్థలంలో రక్తం మరకలు, దుస్తులు

తాడికొండ: రాజధాని ప్రాంతంలో పెరిగిన ట్రాఫిక్‌కు అనుగుణంగా అనువైన రోడ్లు లేకపోవడం.. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించాల్సిన 108 వాహనాలు అందుబాటులో లేకపోవడం కారణంగా ఓ బాలిక మృత్యుఒడికి చేరింది. తాడికొండ మండలం మోతడక గ్రామ పరిధిలో శుక్రవారం సాయంత్రం వేగంగా వెళుతున్న ఆటోకు టైరు పేలడంతో అదుపుతప్పింది. దీంతో అమరావతి వలస మాలపల్లికి చెందిన రాయపూడి గీతాంజలి (14) తీవ్రగాయాలపాలై కొట్టుమిట్టాడుతుండగా.. స్థానికులు 108 వాహనానికి ఫోన్ చేశారు. అయితే వాహనం అందుబాటులో లేదని, రావడానికి సమయం పడుతుందంటూ సమాధానం రావడంతో కంగుతిన్నారు. చిన్నారిని హుటాహుటిన ప్రైవేటు వాహనంలో గుంటూరులోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందింది. కాగా, ముఖ్యమంత్రి సభ పేరిట శుక్రవారం ఉదయం 8 గంటలకే తాడికొండ, అమరావతి మండలాలకు చెందిన 108 వాహనాలను తుళ్ళూరు ప్రాంతానికి తరలించారు. దీంతో ఈ ప్రాంతంలో 108 సేవలు శుక్రవారం పూర్తిగా నిలిచిపోయాయి.

శ్రీనివాసరావు రిమాండ్ పొడిగింపు

- ఫిబ్రవరి 8 వరకు పొడిగించిన ఎన్ఐఏ కోర్టు
- శ్రీనివాసరావుకు ప్రాణహాని ఉందన్న న్యాయవాది జయకర్
- అయితే జైలులో ప్రత్యేక గదిలో అతడిని ఉంచండి
- జైలు నుంచి వచ్చి, పోయే సమయంలో జాగ్రత్తలు తీసుకోండి
- రాజమండ్రి, విజయవాడ పోలీసు కమిషనర్లు, తూ.గో ఎస్పీకి కోర్టు ఆదేశం
- 2 మెమోలను మూసివేస్తూ ఉత్తర్వులు
- తదుపరి విచారణ ఈనెల 31కి వాయిదా

సాక్షి, అమరావతి

ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విశాఖ విమానాశ్రయంలో హత్యాయత్నానికి పాల్పడిన జె.శ్రీనివాసరావు రిమాండ్‌ను ఫిబ్రవరి 8 వరకు పొడిగిస్తూ ఎన్ఐఏ ప్రత్యేక న్యాయస్థానం జడ్జి పార్థసారధి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే శ్రీనివాసరావు ప్రాణాలకు ముప్పు ఉందని అతడి తరపున న్యాయవాది జయకర్ ఆందోళన వ్యక్తం చేసిన



నేపథ్యంలో శ్రీనివాసరావు భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని రాజమహేంద్రవరం, విజయవాడ పోలీసు కమిషనర్లను, తూర్పు గోదావరి జిల్లా ఎస్పీని న్యాయమూర్తి ఆదేశించారు. అలాగే రాజమండ్రి జైలులో శ్రీనివాసరావుకు ప్రత్యేక గదిని కేటాయించాలని జైలు అధికారులకు ఆదేశాలిచ్చారు. జైలులో కరడుగట్టిన ఖైదీలతో అతడిని కలపరాదని స్పష్టం చేశారు. జైలు గది నుంచి ప్రత్యేక వేళల్లోనే అతడిని బయటకు తీసుకురావాలని స్పష్టం చేశారు. శ్రీనివాసరావుకు ఏదైనా జరిగితే అది ప్రభుత్వాల వైఫల్యం అవుతుందన్నారు. వైఎస్ జగన్‌పై హత్యాయత్నానికి సంబంధించిన రికార్డులను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు ఇవ్వొద్దంటూ సిట్‌ను ఆదేశిస్తూ డీజీపీ ఇచ్చిన సర్క్యులర్ విషయంలో తగిన సమయంలో జోక్యం చేసుకుంటామని తెలిపారు. తదుపరి విచారణను ఈ నెల 31కి వాయిదా వేశారు.

డీజీపీ న్యాయప్రక్రియలో జోక్యం చేసుకున్నారు..

రిమాండ్ ముగిసిన నేపథ్యంలో శ్రీనివాసరావును పోలీసులు శుక్రవారం ఎన్ఐఏ ప్రత్యేక న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. ఈ సందర్భంగా అతడి తరపున న్యాయవాది జయకర్ వాదనలు వినిపిస్తూ ఎన్ఐఏ అధికారులు తమను తప్పుదోవ పట్టించారని, వారిపై కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలని, ఎన్ఐఏ, సిట్ మధ్య ఉత్తరప్రత్యుత్తరాలకు సంబంధించిన సమాచారాన్ని తమకు అందచేసేలా ఆదేశాలు ఇవ్వాలంటూ తాము దాఖలు చేసిన రెండు మెమోలపై విచారణకు ఒత్తిడి చేయడం లేదన్నారు. ఈ మెమోల స్థానంలో ఇదే అభ్యర్థనలతో పిటిషన్లు దాఖలు చేశామని వివరించారు. దీంతో న్యాయమూర్తి రెండు మెమోలను మూసేసి ఎన్ఐఏకు నోటీసులు జారీ చేశారు. దీనిపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఎన్ఐఏను ఆదేశించారు.

డీజీపీ సానుకూలంగా స్పందించలేదు

అంతకుముందు ఎన్ఐఏ ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిద్ధిరాములు వాదనలు వినిపిస్తూ ఈ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసినప్పటికీ సిట్ అధికారులు ఇప్పటి వరకు తమకు ఈ కేసు తాలుకు రికార్డులను అందచేయలేదన్నారు. దీనిని తీవ్రంగా పరిగణించాలని కోరారు. ఈ సమయంలో న్యాయమూర్తి స్పందిస్తూ మీరే నేరుగా సిట్‌ను అడిగే అవకాశం ఉందిగా అని చెప్పగా, ఆ పని కూడా చేశామని, అయినా ప్రయోజనం లేకపోయిందని వివరించారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసిన రోజునే ఎన్ఐఏ ఎస్పీ రికార్డులు ఇవ్వాలని ఏపీ డీజీపీని కోరారని, అయితే డీజీపీ సానుకూలంగా స్పందించలేదన్నారు. ఆ తర్వాతే తాము ఈ కోర్టుకు వచ్చామని, రికార్డులు ఇవ్వాలని కోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. అయితే డీజీపీ సర్క్యులర్ జారీ చేస్తూ చెప్పేంత వరకు ఎన్ఐఏకు రికార్డులు ఇవ్వొద్దని సిట్‌ను ఆదేశించారని వివరించారు. ఇలా చేయడం ద్వారా డీజీపీ న్యాయ ప్రక్రియలో జోక్యం చేసుకున్నారని, దీనిని ఎట్టి పరిస్థితుల్లో సహించరాదన్నారు. డీజీపీ తనను న్యాయస్థానం కన్నా అధికుడిగా భావిస్తున్నారని, కోర్టు కంటే ఏదీ ఎక్కువ కాదన్న విషయాన్ని అతనికి తెలియచెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిద్ధిరాములు వివరించారు. సర్క్యులర్ జారీ చేసే అధికారం డీజీపీకి ఎంత మాత్రం లేదన్నారు. కాబట్టి సిట్‌కు నేతృత్వం వహించిన నాగేశ్వరరావును పిలిపించి ఈ విషయంపై వివరణ కోరాల్సిన అవసరం ఉందన్నారు. దీనికి న్యాయమూర్తి స్పందిస్తూ ఈ విషయంపై తగిన సమయంలో జోక్యం చేసుకుంటానని తెలిపారు. సిద్ధిరాములు స్పందిస్తూ న్యాయం ఆలస్యమైతే.. న్యాయం తిరస్కరించినట్లేనని చెప్పారు. దీనికి న్యాయమూర్తి స్పందిస్తూ న్యాయం విషయంలో తొందరపడితే.. న్యాయాన్ని పాతరేసినట్లే అని వ్యాఖ్యానించారు.

జైల్లో అందరినీ ఒకేలా చూస్తారు

ఆ తర్వాత న్యాయమూర్తి, కోర్టు హాలులో ఉన్న శ్రీనివాసరావును విచారించారు. జైలులో ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా? కోర్టుకు తీసుకొచ్చేటప్పుడు దార్లో ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొన్నావా? అని ప్రశ్నించారు. ఎటువంటి ఇబ్బందులూ లేవని, అయితే అందరి ఖైదీలతో కలిపి బయటకు వదులుతున్నారని చెప్పాడు. దీనికి న్యాయమూర్తి స్పందిస్తూ జైలులో అందరినీ ఒకేలా చూస్తారన్నారు. పుస్తకం రాసేందుకు కాగితాలు కావాలంటే జైలు అధికారులకు విజ్ఞప్తి చేసుకోవాలని శ్రీనివాసరావుకు సూచించారు.

ఓటు వేయని వారికి ప్రశ్నించే హక్కు లేదు

- మీ భవిష్యత్తు నిర్ణయాన్ని వృథా చేసుకోవద్దు
- భారత పార్లమెంట్ వ్యవస్థను యువత కాపాడాలి
- ఎన్నికల రోజు సెలవును ఎంజాయ్ చేయడానికి కాదు
- జాతీయ ఓటరు దినోత్సవంలో గవర్నర్ నరసింహన్



సాక్షి, అమరావతి బ్యూరో: ప్రజాస్వామ్యంలో ఓటు వేయని వారికి ప్రశ్నించే హక్కులేదని, ప్రభుత్వ పాలనను తప్పుపడుతూ చర్చల్లో పాల్గొనడం మరీ తప్పని తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ అభిప్రాయపడ్డారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గవర్నర్ ఈ వ్యాఖ్యలు చేశారు.ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి గోపాల కృష్ణద్వివేది, రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఎన్.రమేష్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠా, ఇతర అధికారులు పాల్గొన్నారు. బద్ధకంతోనో, మరేదైనా కారణం చేతో ఓటును వినియోగించుకోకపోతే మీ భవిష్యత్తు అంధకారం కావడంతో పాటు.. దేశ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని గవర్నర్ అన్నారు. ఎన్నో పోరాటాల ద్వారా మన పెద్దలు సాధించిన పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడే బాధ్యత యువ ఓటర్ల చేతుల్లోనే ఉందని తెలిపారు. ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కని చెప్పారు. ఎన్నికల సంఘం ఎలక్షన్ రోజు సెలవు ప్రకటించి ఓటు హక్కును వినియోగించుకోమంటే.. కొంతమంది ఎంజాయ్ చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ధనం, మద్యం, కులం, మతం, ప్రాంతం, భాష తదితర ప్రలోభాలకు గురికాకుండా అమూల్యమైన హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న వారందరి చేత ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో 90 శాతం పైగా ఓటింగ్ నమోదు కావాలని ఆశించారు. ఎన్నికల విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన కృష్ణా, గుంటూరు, ఈస్ట్ గోదావరి కలెక్టర్లు బి.లక్ష్మీకాంతం, కోన శశిధర్, కార్తికేయ మిశ్రాను సన్మానించి, అవార్డులను ప్రదానం చేశారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు, యువతకు బహుమతులు అందజేశారు.1952 ఎన్నికల నుంచి ఓటు హక్కును వినియోగించుకుంటున్న 80 సంవత్సరాల వృద్ధురాలు వెంకటనరసమ్మ వద్దకు వెళ్లి గవర్నర్ సన్మానించారు.

నృసింహస్వామిని దర్శించుకున్న గవర్నర్



గవర్నర్ దంపతులకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఆలయ ఈఓ

మంగళగిరిటౌన్: గుంటూరు జిల్లా మంగళగిరిలో వేంచేసి యున్న శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారిని తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ నరసింహన్ దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. గవర్నర్ దంపతులకు ఆలయ కార్యనిర్వహణాధికారి మండేపూడి పానకాలరావు, అర్చకులు ఆలయ మర్యాదలతో హారతులిచ్చి స్వాగతం పలికారు. తొలుత ఎగువ సన్నిధిలోని పానకాల లక్ష్మీనరసింహ స్వామివారిని దర్శించుకున్న గవర్నర్ దంపతులు పానకాన్ని స్వీకరించారు. అనంతరం దిగువ సన్నిధిలోని లక్ష్మీనరసింహస్వామివారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి దర్శనానంతరం గవర్నర్ దంపతులకు ఆలయ ఈవో స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో గుంటూరు దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కేవీ.శ్రీనివాసరావు, ఆర్డీవో వీరబ్రహ్మం, అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ, తహశీల్దార్ వసంతబాబు, డీఎస్పీ జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్‌పై ప్రభుత్వం డ్రామాలు

- బినామీ ఆస్తులు, డైరెక్టర్ల అరెస్టు మాటేమిటి?
- వైఎస్సార్‌సీపీ అగ్రిగోల్డ్ బాధిత బాసట కమిటీ కో–ఆర్డినేటర్ లేళ్ల అప్పిరెడ్డి



సాక్షి, అమరావతి: అగ్రిగోల్డ్ వ్యవహారంలో దర్యాప్తు పేరుతో కాలయాపన చేస్తున్న చంద్రబాబు ప్రభుత్వం బాధితులను ఘోరంగా మోసం చేస్తుందని వైఎస్సార్ కాంగ్రెస్ అగ్రిగోల్డ్ బాధిత బాసట కమిటీ రాష్ట్ర కో– ఆర్డినేటర్ లేళ్ల అప్పిరెడ్డి ధ్వజమెత్తారు. అగ్రిగోల్డ్ బినామీ ఆస్తులను ఎందుకు పట్టించుకోవడం లేదని, డబ్బు మళ్లించిన కంపెనీ డైరెక్టర్లపై చర్యలెందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అప్పిరెడ్డి శుక్రవారం 'సాక్షి'తో మాట్లాడుతూ.. అగ్రిగోల్డ్‌లో డిపాజిట్లను దాని యాజమాన్యం 159 కంపెనీలకు మళ్లించినట్టు గుర్తించామని ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. ఏళ్లు గడుస్తున్నా మళ్లించిన వేల కోట్లతో కొనుగోలు చేసిన బినామీ ఆస్తులను ఎందుకు స్వాధీనం చేసుకోలేదన్నారు. అప్పుడప్పుడు సీఐడీతో హడావుడి చేయిస్తున్న ప్రభుత్వం బాధితులను మభ్యపెట్టేలా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అగ్రిగోల్డ్ బినామీ ఆస్తులను గుర్తించి స్వాధీనం చేసుకోవాలని, ఆయా కంపెనీల డైరెక్టర్లను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అరకొర సాయంతో బాధితులను మభ్యపెట్టకుండా.. రూ.1183 కోట్లు విడుదల చేసి రూ.20 వేల లోపు డిపాజిట్ చేసిన 80 శాతం మంది బాధితులకు తక్షణ సాయం అందించాలన్నారు. మిగిలిన వారందరికీ కాలపరిమితితో కూడిన బాండ్లు ఇవ్వాలని అప్పిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పెండింగ్ జీతాలు, బిల్లులివ్వండి

రాజధానిలో అంగన్‌వాడీల ధర్నా

సాక్షి, అమరావతి: అంగన్‌వాడీ సెంటర్ల అద్దెలు, 2018 అక్టోబరు నుంచి పెండింగ్‌లో ఉన్న జీతాలు, గ్యాస్, ట్రాన్స్‌పోర్టు, టీఏ బిల్లులు చెల్లించాలని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలంటూ..శుక్రవారం విజయవాడ లెనిన్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. మూడు నెలలుగా జీతాలు లేకుండా ఎలా బతకాలని ప్రశ్నించారు. బిల్లులు పెండింగ్‌లో ఉంచడం వల్ల అప్పులు చేయాల్సి వస్తుందని వాపోయారు. యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ ఎమ్మెల్యేలు, మంత్రులు నెలనెలా జీతాలు మొదటి తేదీనే తీసుకుంటారని.. అంగన్‌వాడీలకు మాత్రం నెలనెలా ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణకు కార్యకర్తల మెడలో పుస్తెలు తాకట్టుపెట్టి రూ.10 వడ్డీకి అప్పులు తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన జన్మభూమి కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి అంగన్‌వాడీ కార్యకర్తల చేత సీమంతాలు, అన్నప్రాసనలు, పిండి వంటలకు ఖర్చు పెట్టించారన్నారు. వాటిని ఎవరు చెల్లిస్తారని ప్రశ్నించారు. వారం రోజుల్లో సమస్య పరిష్కరించకుంటే ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడి క్యాంపు కార్యాలయాన్ని ముట్టడి స్తామని ఆమె హెచ్చరించారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎన్‌సీహెచ్ సుప్రజ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల్లో రక్తహీనత తగ్గించేందుకు పనిచేస్తున్న అంగన్‌వాడీలు వేతనాలు లేక అనారోగ్యానికి, రక్తహీనతకు గురవుతున్నారని చెప్పారు. సీపీఎం నాయకులు సీహెచ్ బాబూరావు, డీడీ కృష్ణ, ఎ.వెంకటేశ్వరావు, గజలక్ష్మి పాల్గొని మాట్లాడారు.



విజయవాడలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నిరసన

ఏపీ కోసం ఉమ్మడి రాజకీయ ప్రణాళిక

- 29న విజయవాడలో ఏడు రాజకీయ పార్టీల అధ్యక్షులతో సమావేశం
- మాజీ ఎంపీ ఉండవల్లి

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయమే అజెండాగా రానున్న ఐదేళ్లలో లోక్‌సభ, శాసనసభ మొదటి సమావేశాల్లో ప్రశ్నించే రాజకీయ పార్టీలకు చెందిన అధ్యక్షులతో చర్చించి ఉమ్మడి అజెండా సిద్ధం చేసేందుకు సమావేశం నిర్వహించనున్నామని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ ప్రకటించారు. శుక్రవారం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం వై.జంక్షన్ ఆనం రోటరీ హాల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో అరుణ్‌కుమార్ మాట్లాడుతూ 30వ తేదీనుంచి శాసన సభ సమావేశాలు జరుగుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని 29వ తేదీ ఉదయం 10 గంటలకు విజయవాడ హోటల్ ఐలాపురంలో సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చలమేశ్వర్ సమక్షంలో బీజేపీ, కాంగ్రెస్, వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేన, ఉభయ కమ్యూనిస్టు పార్టీలకు చెందిన అధ్యక్షులతో సమావేశమై చర్చించి ఉమ్మడి అజెండా తయారు చేయనున్నట్లు తెలిపారు. గతం వదలిపెట్టి నూతనంగా ఎన్నికయ్యే లోక్‌సభ, శాసనసభ మొదటి సమావేశాల్లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ప్రశ్నించేందుకు ఆలోచన చేయాలన్నారు. జనసేన అధ్యక్షుడు పవన్, కాంగ్రెస్ అధ్యక్షుడు రఘువీరా, బీజేపీ తరపున కన్నా లక్ష్మీనారాయణ, సీపీఐ రామకృష్ణ, సీపీఎం మధు హాజరవుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి ఎవరూ రావడం లేదని, తెలుగుదేశం పార్టీ నుంచి ఇంకా సమాధానం రావాల్సి ఉందన్నారు.

సోమశిల హైలెవల్ కెనాల్ అంచనా వ్యయం పెంపు


- రూ. 461.40 కోట్ల మేర పెంచుతూ జీవో జారీ
- రెండో దశ పనులకు టెండర్లు పిల వాలంటూ ఉత్తర్వులు
- ఎన్నికల షెడ్యూలు వెలువడేలోగా టెండర్ల ప్రక్రియ పూర్తికి యత్నాలు

సాక్షి, అమరావతి: సోమశిల హైలెవల్ లిఫ్ట్ కెనాల్ అంచనా వ్యయాన్ని రూ. 1,532.19 కోట్ల నుంచి రూ. 1,993.59 కోట్లకు పెంచుతూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అంటే రూ. 461.40 కోట్ల మేర అంచనా వ్యయం పెంచారు. తొలి దశ పనులు ఇప్పటికే చేపట్టగా.. ఎన్నికల షెడ్యూల్ విడుదల లోపు రెండో దశ పనులకు టెండర్లు పిలిచి.. కోటరీ కాంట్రాక్టర్లకు కట్టబెట్టాలని జలవనరుల శాఖ అధికారులపై ప్రభుత్వ పెద్దలు ఒత్తిడి తెస్తున్నారు. సోమశిల రిజర్వాయర్ నుంచి 5 టీఎంసీలు తరలించి, నెల్లూరు జిల్లాలోని మెట్ట ప్రాంతాలైన ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో 90 వేల ఎకరాలకు సాగునీరు, 58 గ్రామాలకు తాగునీరు ఇవ్వడానికి రూ. 1,532.19 కోట్లతో సోమశిల హైలెవల్ లిఫ్ట్ కెనాల్‌ను గత ప్రభుత్వం 2013లో చేపట్టింది. ఇందులో తొలి దశ కింద 43 వేల ఎకరాలకు సాగునీరు అందించే పనులను 2013లో చేపట్టి ఇప్పటిదాకా 52 శాతం పూర్తి చేశారు. రెండో దశలో 47 వేల ఎకరాలకు నీళ్లందించే పనులకు ఈ ఎన్నికలకు ముందే టెండర్లు పిలిచి, వాటిని కోటరీ కాంట్రాక్టర్లకు అప్పగించి కమీషన్‌లు దండుకోవడంతోపాటు.. ఆ నియోజకవర్గాల ప్రజలను మభ్యపెట్టడానికే ఎత్తులు వేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. అంచనా వ్యయం పెంచిన నేపథ్యంలో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ల నుంచి భారీగా ముడుపులు దండుకోవడానికి పావులు కదుపుతున్నారు.

దోపిడీ కోటాలో మరో ఎత్తిపోతల


రూ. 489.28 కోట్లతో ముక్త్యాల ఎత్తిపోతలకు జీవో జారీ

- తొలుత అంచనా వ్యయం రూ. 324.56 కోట్లు
- రూ. 166 కోట్ల మేర అంచనా వ్యయం పెంపు
- కోటరీ కాంట్రాక్టర్‌కు పనులు దక్కేలా నిబంధనలు
- చేతులు మారనున్న రూ. 100 కోట్ల ముడుపులు


GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT
Water Resources Department – Mukthyala Lift Irrigation Scheme on Left Bank of Krishna River Near Mukthyala Village of Jaggaiahpeta Mandal, Krishna District – Administrative Sanction for an amount of Rs.489.28 Crores – Orders – Issued.

WATER RESOURCES (Projects-II) DEPARTMENT
G.O.RT.No. 61 Dated: 25-01-2019
Read:
From the CE, KDS, Vijayawada letter No.CE/KDS/VJA/DT-4/AEE-11/APSIDC/ 3139, dated 19.11.2018.
---XXXX---
ORDER:-
In the reference read above, the Chief Engineer, Krishna Delta System, Vijayawada has stated that the Ayacut proposed to be covered under the Mukthyala L.I. Scheme is 38627 Acres which is a localized ayacut under DVR Branch Canal and has legitimate right to water allocation. Due to the non realization of allotted share of 32.25 TMC under Nagarjuna Sagar Left Canal at the AP Boarder, it is proposed to supplement the distressed ayacut of 38627 Acres of DVR Branch Canal by altering the mode of supply from Gravity to Lift. The proposed scheme is designed to lift a total quantity of 2.7 TMC water with a discharge of 386.27 Cusecs for 120days at 16 hours pumping per day, from the Krishna River through Pump House proposed to be constructed on Krishna Left Bank near Mukthyala Village (About 4 Km downstream of Pulichintala Dam).

ఆర్థికశాఖ అభ్యంతరాలను తుంగలో తొక్కి ముక్త్యాల ఎత్తిపోతలకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ సర్కార్ జారీ చేసిన ఉత్తర్వు


The WR Department is advised to get the hydrological clearance as availability of water is the minimum requirement for proposing a project.

హైడ్రలాజికల్ క్లియరెన్స్ లేకుండా ముక్త్యాల ఎత్తిపోతలకు అనుమతి ఇవ్వలేమని తేల్చిచెప్పిన ఆర్థిక శాఖ

సాక్షి, అమరావతి: ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో కమీషన్లు భారీగా దండుకోవడానికి చంద్రబాబు సర్కార్ నీటి ప్రాజెక్టుల అంచనాలను ఎడాపెడా పెంచేస్తోంది. ఎన్నికల్లో డబ్బు వెదజల్లడానికి అందినకాడకి దోచేసేలా ప్రభుత్వ పెద్దలు వ్యూహాలు రచిస్తున్నారు. రూ. 489.28 కోట్ల వ్యయంతో కృష్ణా జిల్లాలో ముక్త్యాల ఎత్తిపోతల పథకానికి పరిపాలన అనుమతి ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. కృష్ణా జిల్లాలో నాగార్జునసాగర్ ఎడమ కాలువ పరిధిలోని డీవీఆర్ బ్రాంచ్ కెనాల్ కింద ఉన్న 38,627 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు రూ. 324.56 కోట్ల వ్యయంతో ముక్త్యాల ఎత్తిపోతలను చేపట్టడానికి డీపీఆర్ రూపొందించగా.. అధికారులపై సీఎం చంద్రబాబు ఒత్తిడి తెచ్చి అంచనా వ్యయాన్ని రూ. 489.28 కోట్లకు పెంచేలా చేశారు. ముక్త్యాల ఎత్తిపోతల పథకం చేపట్టడానికి అనుమతి ఇవ్వాలని కృష్ణా డెల్టా సిస్టమ్ (కేడీఎస్) సీఈ ప్రతిపాదనలు పంపగా.. ఈ పథకానికి హైడ్రలాజికల్ క్లియరెన్స్ లేదని.. నిబంధనల ప్రకారం ఆయకట్టు స్థిరీకరణకు ఎకరానికి రూ. 52,500లోపు ఖర్చు చేయాలని.. కానీ రూ. 1,26,668 ఖర్చు చేసేలా ప్రతిపాదనలు ఉన్నాయని, ఇప్పటికే చేపట్టిన ప్రాజెక్టులకే నిధుల కొరత ఏర్పడిన నేపథ్యంలో ముక్త్యాలకు అనుమతి ఇవ్వలేమని ఆర్థిక శాఖ తేల్చిచెప్పింది. అయితే ఆర్థిక శాఖ అభ్యంతరాలను తోసిపుచ్చిన సీఎం చంద్రబాబు.. ముక్త్యాల ఎత్తిపోతలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ గురువారం ఫైలుపై సంతకం చేశారు. దీంతో శుక్రవారం జలవనరుల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

కోటరీ కాంట్రాక్టర్‌కే పనులు..

తక్షణమే ఈ ఎత్తిపోతల పనులను కోటరీలో ప్రధాన కాంట్రాక్టర్‌కు దక్కేలా నిబంధనలతో టెండర్ నోటిఫికేషన్ జారీ చేయాలని సీఎం చంద్రబాబు అధికారులపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెస్తున్నారని తెలిసింది. నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద రాష్ట్రంలో కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లో 3.98 లక్షల ఎకరాలు ఉంది. రాష్ట్ర వాటాగా 32.25 టీఎంసీలు విడుదల చేయాలి. కానీ 2014 నుంచి ఇప్పటివరకూ ఏ ఒక్క సీజన్‌లోనూ పది టీఎంసీలకు మించి నీటిని సరఫరా చేయలేదు. దీంతో సాగర్ ఎడమ కాలువ రైతుల్లో సర్కార్ తీరుపై ఆగ్రహం పెల్లుబుకుతోంది. ఈ నేపథ్యంలో చింతలపూడి ఎత్తిపోతల సామర్థ్యాన్ని పెంచి.. గోదావరి నుంచి అదనంగా 34 టీఎంసీలను తరలించి.. సాగర్ ఎడమ కాలువ ఆయకట్టుకు నీళ్లందించే పనులను రూ. 4,908 కోట్లతో ఏడాదిన్నర క్రితం ప్రభుత్వం చేపట్టింది. ఆ పనులనూ కోటరీ కాంట్రాక్టర్లకు అప్పగించి భారీమొత్తంలో కమీషన్‌లు దండుకున్నారు. చింతలపూడి ఎత్తిపోతల సకాలంలో పూర్తయ్యేలా చర్యలు చేపట్టడంలో విఫలమైన సర్కార్.. ఎన్నికల షెడ్యూలు వెలువడటానికి నెల రోజుల ముందు ముక్త్యాల ఎత్తిపోతలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం గమనార్హం.

హైడ్రలాజికల్ అనుమతి లేకుండానే..:

రైతులను కనికట్టు చేసి ఎన్నికల గండం గట్టెక్కడం కోసం ముక్త్యాల ఎత్తిపోతలకు సర్కార్ తెరతీసింది. పులిచింతల జలాశయానికి నాలుగు కి.మీ.ల దిగువన కృష్ణా నది ఎడమ గట్టుపై ముక్త్యాల నుంచి రోజుకు 386.27 క్యూసెక్కుల చొప్పున 120 రోజుల్లో 2.7 టీఎంసీలను ఎత్తిపోతల ద్వారా డీవీఆర్ బ్రాంచ్ కెనాల్‌కు తరలించి ఆయకట్టును స్థిరీకరించడానికి ఏపీఎస్ఐడీసీ డీపీఆర్‌ను రూపొందించింది. హైడ్రలాజికల్ క్లియరెన్స్ లేకపోవడంతో ఆ డీపీఆర్‌ను జలవనరుల శాఖ తోసిపుచ్చింది. ఈ వ్యవహారాన్ని ఎమ్మెల్సీ టీడీ జనార్దన్ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఏపీఎస్ఐడీసీ రూపొందించిన డీపీఆర్‌ను కేడీఎస్ సీఈకి పంపించి.. అంచనా వ్యయాన్ని పెంచేలా చక్రం తిప్పారు. దాంతో రూ. 489.28 కోట్లతో ముక్త్యాల ఎత్తిపోతలను చేపట్టడానికి అనుమతి ఇవ్వాలని నవంబర్ 19న కేడీఎస్ సీఈ ప్రతిపాదనలు పంపారు. అంటే అంచనా వ్యయం రూ. 164.72 కోట్ల మేర పెరిగింది. ఈ వ్యవహారంలో రూ. వంద కోట్లకుపైగా ముడుపులు చేతులు మారనున్నాయని జలవనరుల అధికారులు చెబుతున్నారు.

రెడీ టు ఓట్, మా తెలుగు తల్లికి రికార్డులు



రెడీ టు ఓట్ అక్షర క్రమంలో కూర్చున్న 8,320 మంది విద్యార్థులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళంలో జాతీయ నూతన ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన 'రెడీ టు ఓట్' అక్షర ఆకృతి, మా తెలుగు తల్లికి మల్లెపూదండ గీతాలాపన రికార్డులు నెలకొల్పాయి. నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన 9వ జాతీయ నూతన ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని రెడీ టు ఓట్, ప్రతిజ్ఞ, ఎన్నికల చిహ్నం రూపంలో 150 మంది దివ్యాంగులు త్రిచక్ర సైకిళ్లపై కూర్చోవడం ఒక రికార్డుగా, 8,320 మంది విద్యార్థులు ఒకేసారి మా తెలుగు తల్లికి మల్లెపూల దండ గీతాలాపన కూడా రికార్డుగా నమోదైంది. మూడు అంశాల్లో 'ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సౌత్ ఇండియా' కోఆర్డినేటర్ డాక్టర్ స్వర్ణశ్రీ, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ బింగి నరేంద్ర గౌడ్ పరిశీలకులుగా హాజరై ఈ కార్యక్రమాలను తిలకించి రికార్డును ధ్రువీకరించారు. ఈ రెండు సంస్థలతో పాటు లింకా బుక్ ఆఫ్ రికార్డ్స్ కూడా సూత్రప్రాయంగా ఆమోదం తెలియజేసింది. కార్యక్రమంలో కలెక్టర్ కె.ధనంజయరెడ్డి, జేసీ కేవీఎన్ చక్రధరబాబు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, స్థానిక ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

జన్మభూమి కమిటీలు దోపిడీ దొంగలు

- ప్రభుత్వ తప్పిదాల వల్లే ప్రజలకు ఇబ్బందులు
- వైఎస్సార్‌సీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి


ఆదిమూర్తిపల్లె గ్రామంలో జరిగిన బహిరంగసభలో ప్రసంగిస్తున్న సజ్జల

గిద్దలూరు: టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల నుంచి జన్మభూమి కమిటీ సభ్యుల పేరుతో దోపిడీ దొంగలుగా మారి ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ప్రకాశం జిల్లా పరిశీలకుడు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. గిద్దలూరు మండలం ఆదిమూర్తిపల్లె గ్రామంలో శుక్రవారం నిన్ను నమ్మం బాబూ కార్యక్రమం బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజల ఇబ్బందులకు కారణం ప్రభుత్వ తప్పిదాలేనన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అవినీతిలో ముందుందని, రూ.7 లక్షల కోట్ల అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్న పిల్లలు తినే ఆహారం నుంచి వృద్ధులకు ఇచ్చే పింఛను వరకు అవినీతికి పాల్పడ్డారన్నారు. ప్రజలకు ఏమీ చేయకున్నా అన్నీ చేశానని, తానే గెలవబోతున్నానంటూ ప్రచారం చేసుకోవడంలో చంద్రబాబు దిట్ట అన్నారు. పార్టీ ఫిరాయింపులతో రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారన్నారు. 14 నెలల పాటు జరిగిన పాదయాత్రలో ప్రజల నుంచి వచ్చిన అన్ని రకాల సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టనున్నామన్నారు. నవరత్నాల పథకాలతో పేదల అభ్యున్నతి సాధ్యమవుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే వెలిగొండ ప్రాజెక్టు నీరిచ్చి పశ్చిమ ప్రకాశం రైతులను, ప్రజలను ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త అన్నా వెంకటరాంబాబు, నాయకులు కామూరి రమణారెడ్డి, చేగిరెడ్డి లింగారెడ్డి, ఎంపీపీలు కామూరి అమూల్య, కొత్తపల్లి జ్యోతి, నాయకులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ బీఎస్ఎన్ఎల్ ఆఫర్

సాక్షి, హైదరాబాద్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా బీఎస్ఎన్ఎల్ ప్రీపెయిడ్ మొబైల్ వినియోగదారుల కోసం స్పెషల్ టారిఫ్ వోచర్ (ఎస్‌టీవీ –269) ఆఫర్‌ను ప్రకటించింది. 26 రోజుల కాలపరిమితితో గల ఈ ఆఫర్‌లో ఏదైన నెట్‌వర్క్‌కు 2,600 నిమిషాలు ఉచిత వాయిస్‌కాల్స్, ప్రతిరోజు 2.6 జీబీ డాటా, 260 ఎస్ఎంఎస్‌లు వర్తిస్తాయి. ఈ ఆఫర్ ఈ నెల 26 నుంచి 31 వరకు అందుబాటులో ఉంటుందని బీఎస్ఎన్ఎల్ వర్గాలు తెలిపాయి.

ఏపీపీఎస్సీ చైర్మన్‌ను తొలగించాలి

- కమిషన్ కార్యాలయం ఎదుట విద్యార్థి, యువజన సంఘాల ధర్నా
- ఆయా సంఘాల నేతల అరెస్టు..


ఏపీపీఎస్సీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నేతలు

సాక్షి, అమరావతి: రిజర్వేషన్ కేటగిరీలో ఉన్నవారు జనరల్ కాంపిటీషన్‌లో పోటీపడేందుకు వీలు లేదని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) నోటిఫికేషన్‌లో ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థి, యువజన సంఘాలు ఆందోళనకు దిగాయి. ఏపీపీఎస్సీ చైర్మన్ ఉదయ భాస్కర్‌ను తొలగించాలని, రాజ్యాంగ బద్ధంగా ఇచ్చిన రిజర్వేషన్లను చిత్తశుద్ధితో అమలు చేయాలని, గ్రూప్స్ పరీక్షలు మరో నెల వాయిదా వేయాలనే డిమాండ్‌తో శుక్రవారం ఏపీపీఎస్సీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించాయి. విజయవాడలోని రాఘవయ్య పార్కు నుంచి ఏపీపీఎస్సీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించిన వివిధ సంఘాల నాయకులు అనంతరం కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. చైర్మన్ వచ్చి వినతి పత్రాన్ని తీసుకోవాలని వారు చేసిన డిమాండ్‌ను ఏపీపీఎస్సీ తిరస్కరించింది. రంగంలోకి దిగిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు ధర్నాకు నాయకత్వం వహించిన ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏఐవైఎఫ్, డీవైఎఫ్ఐ, కేవీపీఎస్, పీడీఎస్‌యూ నాయకులను అరెస్ట్ చేశారు. దాదాపు 20 మందిని అదుపులోకి తీసుకుని వారందర్నీ వ్యానులో సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం బేషరతుగా విడిచిపెట్టారు. అరెస్ట్ అయిన వారిలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అప్సర్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రామన్న, ఎం.సూర్యారావు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.అశోక్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సుబ్బారావు, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిచంద్ర, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.మాల్యాద్రి, రాష్ట్ర నాయకులు టి.ప్రవీణ్, సుందరయ్య, చరణ్‌సాయి, మెల్లస్, రాజేష్, నటరాజ్, క్రాంతితోపాటు పలువురు ఉన్నారు. రాజ్యాంగ విలువలకు పాతర వేస్తున్నవారి గురించి ప్రశ్నిస్తే అరెస్ట్ చేస్తారా? అంటూ నాయకులు ఈ సందర్భంగా ప్రశ్నించారు.

కోడెలా.. ఇలా అయితే ఎలా?

- స్పీకర్ ఇలాకాలో మృతదేహంతో ధర్నా చేసిన ఎస్సీలు
- ఏళ్ల తరబడి తమకు శ్మశానానికి స్థలం లేదని ఆవేదన


తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఎస్సీకాలనీ వాసులు

ముప్పాళ్ల (సత్తెనపల్లి): ''ప్రపంచమంతా గుంటూరు జిల్లా సత్తెనపల్లి వైపు చూస్తోంది..ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా అన్ని వర్గాల వారి శ్మశానాలను సుందరంగా తీర్చిదిద్దాం''అంటూ ఏపీ శాసనసభ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు ప్రతి బహిరంగ సభలోనూ నిత్యం వల్లె వేస్తుంటారు. కాని ఆయన మాటలకు చేతలకు పొంతన లేదనడానికి శుక్రవారం జరిగిన ఘటనే నిదర్శనం. కోడెల ప్రాతినిధ్యం వహిస్తున్న సత్తెనపల్లి నియోజకవర్గంలోని మండల కేంద్రమైన ముప్పాళ్లలో శ్మశానానికి స్థలం లేక మృతదేహంతో పలువురు ఎస్సీ వర్గానికి చెందిన వారు రోడ్డెక్కారు. తమకు శ్మశానానికి స్థలం మంజూరు చేయాలని కోరుతూ మృతదేహంతో తహశీల్దార్ కార్యాలయం ముందు కాలనీ వాసులు, బంధువులు శుక్రవారం ఆందోళనకు దిగారు. ఏడు శతాబ్దాలుగా శ్మశానానికి స్థలం లేక కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలప్పుడు శ్మశాన స్థలం ఇస్తానని హామీ ఇచ్చినా నేటికి అమలు చేయకపోవటంతోనే రోడ్డెక్కామని చెబుతున్నారు. అన్ని కులాల వారికి శ్మశానాలు ఉన్నప్పటికీ తమకు మాత్రం శ్మశానం లేకపోవటంతో రోడ్డు పక్కనే పూడ్చుకోవాల్సి వస్తుందని చెప్పారు.

ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయానికి...

మండల కేంద్రమైన ముప్పాళ్లలోని ఎస్సీ కాలనీకి చెందిన కందుల అబ్రహం అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. అంత్యక్రియలకు స్థలం లేకపోవటంతో కాలనీ వాసులు, బంధువులు మృతదేహంతో ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయం వద్దకు వచ్చారు. మృతదేహాన్ని తహశీల్దార్ కార్యాలయం ముందు ఉంచి ఆందోళన చేపట్టారు. ప్రభుత్వాధికారులు కాలనీవాసులతో చర్చలు జరిపి సమస్య పరిష్కారానికి వారం రోజులు గడువు కోరటంతో కాలనీ వాసులు ఆందోళన విరమించారు.

నరసరావుపేటలో
అధికార పార్టీ దౌర్జన్యం

- ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వైద్యశాలపై టీడీపీ నేతల దాడి
- పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు తీవ్ర గాయాలు



మల్లమ్మ సెంటర్‌లో పోలీస్ ఔట్ పోస్టుకు ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన టీడీపీ నాయకులు

నరసరావుపేట టౌన్: చేతిలో అధికారం ఉంది కదా ఏం చేసినా చెల్లుబాటవుతుందని అధికార పార్టీ నేతలు బరితెగిస్తున్నారు. గుంటూరు జిల్లా నరసరావుపేట నియోజకవర్గంలో గురువారం అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాద్ తనయుడు డాక్టర్ శివరామకృష్ణ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా అధికార తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉద్దేశపూర్వకంగా కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. రూట్ మ్యాప్‌లో లేకపోయినా కావాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి నివాసం వద్దకు చేరుకొని, రెచ్చగొట్టేలా నినాదాలు చేశారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం ఎమ్మెల్యే వైద్యశాలపై, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై రాళ్లతో దాడికి దిగారు. ఈ ఘటనలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వైద్యశాల ఎదుట వేచి ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు కంచర్ల విజయమ్మ, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, భవనం వాసుదేవరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. విజయమ్మ తలకు నాలుగు కుట్లు పడగా, శ్రీనివాసరెడ్డి చేయి విరిగింది. వాసుదేవరెడ్డికి ముఖంపై రాయి బలంగా తగలడంతో పళ్లు ఊడిపోయి తీవ్ర గాయమైంది. బాధితుల వద్ద వాంగ్మూలం తీసుకున్న పోలీసులు శుక్రవారం టీడీపీ నాయకులపై బెయిలబుల్ కేసు నమోదు చేశారు. అయి0తే, టీడీపీ నాయకులు పోలీసులపై ఒత్తిడి తీసుకొచ్చి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై తప్పుడు కౌంటర్ కేసు బనాయించారు. సయ్యద్ బాషా అనే వ్యక్తిపై దాడిచేసి అతని మెడలో చైన్ లాక్కున్నట్లు కొంతమంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై ఐపీసీ 384కింద నాన్‌బెయిల్‌బుల్ కేసు నమోదు చేయడం గమనార్హం.

పోలీసు ఔట్ పోస్ట్‌కు టీడీపీ ఫ్లెక్సీ

స్పీకర్ తనయుడి పుట్టినరోజు సందర్భంగా నరసరావుపేటలో టీడీపీ నాయకులు ఇష్టారాజ్యంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. మల్లమ్మ సెంటర్‌లోని పోలీసు ఔట్ పోస్టుకు కూడా శివరామకృష్ణ పుట్టినరోజు ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం గమనార్హం. కొన్ని ఇళ్లకు కూడా బలవంతంగా ఫ్లెక్సీలు అతికించారు. అదేమిటని గృహ యజమానులు ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడ్డారు.

పరప్పణ ఖైదీలపై మానసిక రోగాల పంజా

బెంగళూరు పరప్పణ అగ్రహార జైల్లో 131 మందికి అనారోగ్యం

సాక్షి, బెంగళూరు: బెంగళూరులోని పరప్పణ అగ్రహార కేంద్ర కారాగారంలో నలుగురు మహిళలతో పాటు మొత్తం 131 మంది ఖైదీలు పలు రోగాలతో బాధపడుతున్నారు. అయితే పరిశీలించాల్సిన వైద్యులు అరకొరగా ఉండటంతో రోగుల సంఖ్య పెరిగిపోతోంది. మానసిక వైద్యులు లేకపోవడంతో రోగుల పరిస్థితి దయనీయంగా మారింది. జైలు పరిశీలనకు వెళ్లిన విశ్రాంత ఐఏఎస్ అధికారి వినయ్‌కుమార్ బృందం తమ నివేదికల్లో మానసిక రోగుల అంశాన్ని వెల్లడించింది. జైలు భద్రత, రోగులు, వైద్యుల సౌకర్యాల గురించి పరిశీలించారు. జైలులో 15 రకాల మానసిక రోగాల సమస్యలను గుర్తించి చికిత్స అందిస్తున్నారు. జైలులోని వాతావరణ పరిస్థితులు సరిగా లేక 16 మంది మానసిక వ్యాధితో బాధపడుతుండగా వారికి వైద్యం అందిస్తున్నారు. నిజ జీవితం నుంచి దూరంగా ఉండటంతో సైకోటిక్ సమస్య కారణంగా 45 మంది ఇబ్బంది పడుతున్నారు. మరో 28 మంది మాదక ద్రవ్యాల కారణంగా బాధపడుతున్నారు. 14 మంది నిరాశతో ఉన్నారు. జైలుకు వచ్చామనే బాధతో మరో ముగ్గురు మానసిక రోగాల బారిన పడ్డారు. ఏ రోగంతో బాధపడుతున్నారో తెలియని రోగులు 13 మంది జైల్లో ఉన్నారు. 131 మంది మానసిక రోగాలతో బాధపడుతున్న క్రమంలో వెంటనే క్లినికల్ సైకాలజిస్ట్, మానసిక వైద్యుడు, సహాయకులను మంజూరు చేశారు. ప్రస్తుతం ఉన్న ఇద్దరు డాక్టర్లలో మనోవైద్యుడి పోస్టు ఖాళీగా ఉంది. ఫలితంగా మానసిక రోగులు ఎక్కువైనట్లు తెలుస్తోంది. పరప్పణ అగ్రహార సెంట్రల్ జైలు కోసం 20 మంది వైద్యులు, సహాయకులను నియమించారు. అందులో కేవలం 11 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. తొమ్మిది పోస్టులు ఖాళీగానే ఉన్నాయి.

నిధుల మళ్లింపుపై వివరాలు ఇవ్వండి

రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: డమ్మీ కంపెనీలను ఏర్పాటు చేసి నిధులను మళ్లించిన వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఏపీ హైకోర్టు శుక్రవారం రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌ను ఆదేశిస్తూ తదుపరి విచారణను ఫిబ్రవరి 8కి వాయిదా వేసింది. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ చాగరి ప్రవీణ్ కుమార్, న్యాయమూర్తి జస్టిస్ మల్లవోలు సత్యనారాయణ మూర్తితో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. వేల కోట్ల రూపాయలను డమ్మీ కంపెనీల ద్వారా రిలయన్స్ దారి మళ్లించిందని, దీని వల్ల వాటాదారులకు రూ. 27 వేల కోట్ల మేర నష్టం వాటిల్లిందని ఫిర్యాదు చేసినా కేంద్రం తగిన చర్యలు తీసుకోవడం లేదంటూ ప్రకాశం జిల్లాకు చెందిన టి.గంగాధర్ హైకోర్టులో పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై శుక్రవారం ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరపు న్యాయవాది శివరాజు శ్రీనివాస్ స్పందిస్తూ.. ఈ వ్యవహారానికి సంబంధించిన వివరాలను సమాచార హక్కు చట్టం కింద కోరితే కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ ఇవ్వడం లేదన్నారు. రికార్డులు కనిపించడం లేదని చెబుతున్నారని వివరించారు. అందువల్ల రికార్డులను సమర్పించేలా కేంద్రాన్ని ఆదేశించాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం, ఈ వ్యవహారంపై కౌంటర్ దాఖలు చేయాలని రిలయన్స్ ఇండస్ట్రీస్‌ను ఆదేశించింది.


వర్సిటీ బోధన పోస్టుల ఇంటర్వ్యూలు వాయిదా

- యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా పోస్టుల భర్తీ ప్రక్రియ
- కోర్టు స్టే ఉత్తర్వులను ఖాతరు చేయకుండా ముందుకు
- సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో ఇంటర్వ్యూలు వాయిదా

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లోని అసిస్టెంటు ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి తలపెట్టిన ఇంటర్వ్యూలను ఆయా వర్సిటీలు వాయిదా వేస్తున్నాయి. ఈ పోస్టుల భర్తీలో నిబంధనలకు విరుద్ధంగా ముందుకు వెళ్తుండటంపై ఇప్పటికే న్యాయస్థానాల్లో వ్యాజ్యాలు దాఖలై, స్టే ఉత్తర్వులు కూడా వచ్చాయి. బోధనా పోస్టుల భర్తీ ప్రక్రియను నిలిపేయాలంటూ ఇదివరకే యూజీసీ అన్ని యూనివర్సిటీలను ఆదేశించింది. మరోపక్క రిజర్వేషన్లకు సంబంధించి ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో మళ్లీ కొత్తగా నోటిఫికేషన్లను వెలువరించాల్సి ఉంది. అయితే ప్రభుత్వంలోని ముఖ్యులు కొందరు ఆయా వర్సిటీల ద్వారా ఇంటర్వ్యూల తేదీలను ఖరారు చేయించి నియామకాలు పూర్తిచేయడానికి సన్నాహాలు చేశారు. యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా, వర్సిటీల స్వయం ప్రతిపత్తిని కాలరాస్తూ, పోస్టులను ఇష్టానుసారంగా రేషనలైజేషన్ చేయడమే కాక, ఏపీపీఎస్సీ ద్వారా స్క్రీనింగ్ టెస్టునూ ప్రభుత్వం నిర్వహింపజేసింది. ఈ స్క్రీనింగ్ టెస్టుపై పలువురు న్యాయస్థానంలో వ్యాజ్యాలు దాఖలు చేశారు. తుది తీర్పు వెలువరించేవరకు స్క్రీనింగ్ టెస్టు ఫలితాలు వెలువరించరాదని కోర్టు స్టే ఉత్తర్వులు ఇచ్చింది. కోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా స్క్రీనింగ్ టెస్టు ఫలితాలు ప్రకటించడమే కాకుండా, తమ వారితో పోస్టులు భర్తీ చేసుకొనేందుకు ఏకంగా ఇంటర్వ్యూలకూ తెరతీశారు. ఈ పోస్టుల కోసం పోటీపడుతున్న పలువురు అభ్యర్థులు ఇంటర్వ్యూలను నిలిపివేయాలంటూ గవర్నర్, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి, వర్సిటీల వీసీలకు లేఖలు రాశారు. తాజాగా రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన నేపథ్యంలో ఇంటర్వ్యూలను వాయిదా వేయాలని ప్రభుత్వం ఆయా వర్సిటీలకు ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. దీంతో ఆయా వర్సిటీలు ఇంటర్వ్యూలను వాయిదా వేసినట్లు అభ్యర్థులకు మెయిల్స్ ద్వారా సమాచారం పంపుతున్నాయి. ఇప్పటికే రాయలసీమ వర్సిటీ ఈనెల 28వ తేదీ నుంచి నిర్వహించ తలపెట్టిన ఇంటర్వ్యూలను వాయిదా వేస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రకటించారు.

కొడుకు బతికొస్తాడని సమాధి వద్ద కాపలా..

- మంత్రగాడి మాటలు నమ్మి 37 రోజులుగా తల్లిదండ్రుల పడిగాపులు
- వారి నుంచి డబ్బు గుంజి క్షుద్ర పూజలు చేసిన మంత్రగాడు
- పోలీసుల రంగప్రవేశం.. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపేసిన వైనం
- నెల్లూరు జిల్లా పెట్లూరులో ఘటన



మృతిచెందిన శ్రీనివాసుల సమాధి చుట్టూ కంపవేసిన కుటుంబసభ్యులు (ఇన్‌సెట్‌లో) శ్రీనివాసులు (ఫైల్)

వెంకటగిరి రూరల్: చేతికి అంది వచ్చిన కొడుకు మరణించడంతో ఆ తల్లిదండ్రుల శోకానికి అంతు లేకుండా పోయింది. కుమారుడి ఎడబాటును తట్టుకోలేక ఎలాగైనా బతికించాలంటూ వారు ఓ మంత్రగాడిని ఆశ్రయించారు. వారి అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకున్న ఆ క్షుద్రపూజల మంత్రగాడు.. చనిపోయిన వ్యక్తిని తన మంత్రశక్తులతో తిరిగి బతికిస్తానని, మీరు చేయాల్సిందల్లా అతని సమాధి వద్ద 41 రోజులపాటు కాపలా కాస్తే చాలని నమ్మించాడు. పూజల పేరిట వారినుంచి భారీ ఎత్తున సొమ్ము గుంజాడు. అతని మాటలు నమ్మిన తల్లిదండ్రులు 37 రోజులుగా సమాధి వద్ద పడిగాపులు కాశారు. తమ కుమారుడు లేచి వస్తాడన్న నమ్మకంతో ఎదురుచూస్తూ ఉండిపోయారు. అయితే మంత్రగాడి క్షుద్రపూజలతో ఆందోళన చెందిన గ్రామస్తులు విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా.. వారు బాధితులకు కౌన్సెలింగ్ చేసి ఇంటికి పంపించారు. ఈ ఘటన శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటగిరి మండలంలోని పెట్లూరు గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలివీ..

పెట్లూరు దళితవాడకు చెందిన తుపాకుల రంగయ్య, నరసమ్మ దంపతుల కుమారుడు శ్రీనివాసులు అలియాస్(వాసు) జీవనోపాధికోసం ఓ ట్యాక్సీని కొని కోడూరులో దాన్ని తిప్పుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో కోడూరు ప్రాంత వ్యక్తితో వివాదం తలెత్తింది. శ్రీనివాసులును 15 రోజుల్లోగా చంపేస్తానని అతను బెదిరించాడు. ఇది జరిగిన మూడు రోజులుకు శ్రీనివాసులు జ్వరం బారిన పడ్డాడు. వైద్య పరీక్షలు చేయించుకోకుండా అశ్రద్ధ చేశాడు. పరిస్థితి ముదిరాక స్థానిక వైద్యుల్ని సంప్రదించగా స్వైన్‌ఫ్లూగా నిర్ధారించి మెరుగైన వైద్యంకోసం తిరుపతికి వెళ్లాలని సూచించారు. దీంతో తిరుపతిలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేరగా.. పరిస్థితి విషమించి మృతిచెందాడు. కుమారుని మరణంతో తట్టుకోలేకపోయిన తల్లిదండ్రులు కోడూరులో ఓ వ్యక్తితో గొడవ పడిన పదిరోజుల వ్యవధిలోనే తమ కొడుకు మరణించాడని, ఇది క్షుద్ర శక్తులున్న వారి పనేనని అనుమానించారు. తమ కుమారుడిని బతికించాలంటూ కోడూరుకి చెందిన ఓ క్షుద్ర మంత్రగాడిని ఆశ్రయించారు. వారి మూఢవిశ్వాసాన్ని సొమ్ము చేసుకోవాలని భావించిన ఆ మంత్రగాడు 41 రోజులపాటు సమాధి వద్ద కాపలా కాస్తే మీ కుమారుడిని బతికిస్తానంటూ నమ్మించాడు. కొడుకును బతికించుకోవాలన్న తపనతో ఆ దంపతులు.. శ్రీనివాసులు మృతదేహాన్ని స్వగ్రామంలో పాతిపెట్టి అతని సమాధి చుట్టూ ముళ్లపొదలు వేసి అక్కడే 37 రోజులపాటు రాత్రీ, పగలు తేడా లేకుండా పడిగాపులు కాశారు.

ఇదే అదనుగా మంత్రగాడు వారినుంచి వేలకు వేలు నగదు గుంజి రాత్రివేళల్లో పూజలు చేయడం ప్రారంభించాడు. ఈ పూజలతో భయాందోళనలకు గురైన గ్రామస్తులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంకటగిరి పోలీసులు శుక్రవారం ఉదయం పెట్లూరుకు వచ్చి బాధిత కుటుంబసభ్యులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చి పంపేశారు. అనంతరం ఎస్ఐ కొండప్పనాయుడు, సిబ్బంది పెట్లూరు వెళ్లి మూఢనమ్మకాలను వీడాలని, మంత్రాలు, తంత్రాలు, క్షుద్రపూజలు నమ్మవద్దని గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.


MARUTI SUZUKI ARENA
మనసుతో స్ట్రాంగ్
BIG NEW WAGONR
WAGONR
శక్తివంతమైన 1.2 లీ ఇంజన్
శ్రమలేని AGS
విలక్షణమైన డ్యూయల్-స్ప్లిట్ హెడ్‌ల్యాంప్స్
స్మార్ట్‌ప్లే స్టూడియో
రూపొందించబడిన డిజైన్
రెండు ఫ్రంట్ ఎయిర్‌బ్యాగ్స్
తరగతిలో ఉత్తమమైన బూట్ స్థలం | విశాలమైన కేబిన్
స్టీరింగ్ మౌంటెడ్ కంట్రోల్స్ | రియర్ 60:40 స్ప్లిట్ సీట్
సమీకృత రివర్స్ పార్కింగ్ సెన్సార్లు
శక్తివంతమైన హార్టెక్ట్ ప్లాట్‌ఫాం | EBDతో ఏబీఎస్ ABS
Scan QR Code on Facebook/Twitter to interact and discover new features of the #BigNewWagonR
WAGONR



ఏ దేశంలో ఉండేదైనా మనుషులే.
వాళ్లకుండేదీ కుటుంబాలే.
తప్పు చేసిన 'రోగ్ నేషన్స్'కి శిక్ష వేయాలి కానీ..
ఆ దేశంలో ప్రజలకు నష్టం కలక్కూడదు.
యుద్ధంలో అదెలా సాధ్యం?!
బాంబులు వేస్తే మంచివారు, చెడ్డవారూ
ఇద్దరూ ప్రాణాలు కోల్పోతారు కదా!
అందుకే... సర్జికల్ స్ట్రయిక్స్.
అందుకే.. ఈ రిపబ్లిక్ డే రోజు
'ఉడి' చిత్రంపై స్పెషల్ ఫోకస్.


'ఉడి : ది సర్జికల్ స్ట్రయిక్' చిత్రం పోస్టర్‌లో వికీ కౌశల్ తదితరులు

ఒక ఉడి కథ

సెప్టెంబరు 18, 2016. లష్కర్ ఏ తోయిబా టెర్రరిస్టులు తెల్లవారుజామున వాస్తవాధీన రేఖ దాటి భారత్‌లోకి వచ్చి, 'ఉడి' ప్రాంతంలో ఉన్న 12 బ్రిగేడ్ హెడ్ క్వార్టర్స్‌ను ముట్టడించారు. వారి దాడిలో బిహార్‌కు చెందిన ఆరవ బెటాలియన్‌లోని పందొమ్మిది మంది జవానులు అమరులయ్యారు. ఇందుకు ప్రతీకారంగా భారత ప్రభుత్వం సర్జికల్ స్ట్రయిక్ చేసింది. ఆ వాస్తవ కథాంశమే 'ఉడి: ది సర్జికల్ స్ట్రయిక్.'

విహాన్ సింగ్ షెర్గిల్ (వికీ కౌశల్) భారత ఆర్మీ మేజర్. ఎన్నో యుద్ధాలలో విజయాలు సాధిస్తూ, మాతృదేశానికి సేవ చేస్తుంటాడు. అయితే తన తల్లిని విస్మరిస్తున్నాననే బాధ అతడి హృదయాన్ని దహిస్తూ ఉంటుంది. అల్జీమర్స్ వ్యాధితో ఉన్న తల్లి.. చెల్లి దగ్గర ఉంటుంది. ఈ సమయంలో తల్లి దగ్గరకు వెళ్లకపోతే, తనను పూర్తిగా మరచిపోతుంది అనుకుంటాడు. విధుల నుంచి తప్పుకుని, తల్లి దగ్గరకు వెళ్లిపోతానని చెబుతాడు. 'దేశానికి సేవ చేసే అదృష్టం అందరికీ లభించదు. శక్తి ఉన్నంతవరకు దేశం కోసం పాటుపడాలి' అని పై అధికారి అనడంతో మనసు మార్చుకుని, తన తల్లి ఉండే ప్రాంతానికి బదిలీ చేయించుకుంటాడు. రాజధానిలో ఆర్మీ బేస్‌లో చేరి, తల్లికి సేవ చేస్తుంటాడు. చెల్లి భర్త మేజర్ కరణ్ కశ్యప్ (మోహిత్ రైనా) కూడా సైనికదళంలోనే పని చేస్తుంటాడు. వారికి ఒక పాప. ఆ పాపలో తండ్రి, మేనమామల దేశభక్తి ప్రవహిస్తుంటుంది. తను కూడా పెద్దయ్యాక సైన్యంలో చేరతానంటుంది. తల్లి (స్వరూప్ సంపత్)ని చూసుకోవడానికి జాస్మిన్ అల్మైదా (యామీ గౌతమ్) అనే ఒక నర్సుని పెడతాడు విహాన్. ఆమే దగ్గరుండి అన్నీ చూసుకుంటూ ఉంటుంది. ఒకరోజున అకస్మాత్తుగా తల్లి కనిపించదు. అంతా వెతుకుతారు. ఎక్కడా కనిపించదు. ఆ కోపంలో నర్సుని విధుల నుంచి తొలగిస్తారు. ఆమె వెళ్లిపోతుంది. ఇంతలో తల్లిని కారులో తీసుకువస్తారు అపరిచితులు. (వెళ్లిపోయిన ఆ నర్సు తరవాత 'రా' ఏజెంట్ అని విహాన్‌కి తెలుస్తుంది).


ఈ క్రమంలో లష్కరే తోయిబా టెర్రరిస్టులు ఉడిలో చేసిన దాడిలో వీర మరణం పొందుతాడు విహాన్ చెల్లి భర్త కరణ్. టెర్రరిస్టులపై ప్రతీకారం తీర్చుకోవాలని నిశ్చయించుకుంటాడు విహాన్. అదే సమయంలో పాకిస్తాన్ చర్యకు ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటుంది భారత ప్రభుత్వం. నేషనల్ సెక్యూరిటీ అడ్వయిజర్ గోవింద్ భరద్వాజ్ (పరేశ్ రావల్) సర్జికల్ స్ట్రయిక్‌కి ప్రణాళిక రూపొందిస్తాడు. ఆ బెటాలియన్‌కి నాయకత్వం వహించి, ఉడి ఆర్మీ బేస్ క్యాంపులో పథకం ప్రకారం దాడులు జరపడానికి విహాన్‌సింగ్ సన్నద్ధుడవుతాడు. మరో వైపు.. చేతికి చిక్కిన పాకిస్తాన్ టెర్రరిస్టుల నుంచి నిజాన్ని రాబట్టడానికి ప్రయత్నిస్తారు 'రా' ఏజెంట్ పల్లవి శర్మ, విహాన్ సింగ్. మొత్తానికి తమకు కావలసిన సమాచారాన్ని సేకరిస్తారు. ఆ తర్వాత సర్జికల్ స్ట్రయిక్‌కి ముహూర్తం నిర్ణయం అవుతుంది. కేవలం గంటలో ఈ ఆపరేషన్ పూర్తి కావాలి. అయితే పాకిస్తాన్ స్థావరాలలో ఎవరెవరు ఉన్నారో తెలిస్తేనే కాని, వీరి దాడి త్వరగా పూర్తి చేయలేరు. ఏం చేయాలా అని ఆలోస్తుంటారు. ఆ సమయంలో ఒక కుర్రవాడు తయారుచేస్తున్న గరుడ డ్రోన్ (గరుడ పక్షి బొమ్మ లోపల డ్రోన్ కెమెరా ఉంచుతారు)ను చూస్తాడు భారత ఆఫీసర్. దాని సహాయంతో టెర్రరిస్టుల స్థావరాలను గమనిస్తూ, సమాచారం అందించుకుంటూ టెర్రరిస్టులను మట్టుపెట్టాలనుకుంటారు. పథకం ప్రకారం అన్నీ సిద్ధం చేస్తారు. అర్ధరాత్రి వేళ పాకిస్తాన్ స్థావరాలకు చేరుకుని, పని పూర్తి చేసుకుని తెల్లారేలోగా వెనక్కు వచ్చేయాలని ప్రధాని ఆదేశం. అడుగడుగునా గరుడ డ్రోన్ సమాచారం అందిస్తూనే ఉంటుంది. పథకం ప్రకారం దాడి జరుగుతూ ఉంటుంది. అనుకోకుండా గరుడ డ్రోన్ అకస్మాత్తుగా కింద పడిపోతుంది. ఎంత ప్రయత్నించినా కొద్దిగా కూడా కదలదు. ఇంతలో పాకిస్తానీ టెర్రరిస్టులకు చెందిన ఒక చిన్న కుర్రవాడు అక్కడకు వచ్చి, గరుడను చూసి బొమ్మ అనుకుని, చేతిలోకి తీసుకుని పరీక్షగా చూస్తుంటాడు. ఆ పిల్లవాడు గరుడను ఏం చేస్తాడా అని భారత అధికారులు ఆందోళనగా చూస్తుంటారు. రిమోట్ ఒక్కసారిగా పనిచేయడం ప్రారంభిస్తుంది. గాలిలోకి ఎగురుతుంది. నిమిషాలలో సర్జికల్ స్ట్రయిక్ విజయవంతం అవుతుంది. ఈ దాడిలో ఆ గరుడను పట్టుకున్న కుర్రవాడు ఎదురుపడతాడు భారత సైనికులకు. ఆ బాలుడి పట్ల దయ చూపి విడిచిపెడతాడు విహాన్‌సింగ్. తెలతెలవారుతున్నా వీరజవానులు ఇంకా వెనుకకు రాకపోవడంతో ప్రధానిలో ఆందోళన బయలుదేరుతుంది. ఇంతలోనే 'ఆపరేషన్ సక్సెస్, మనవారంతా వెనక్కు వస్తున్నారు' అనే సమాచారం అందుతుంది.

– డా. పురాణపండ వైజయంతి


'ఉడి' చిత్రంలో 'రా' ఏజెంటు పాత్రలో యామీ గౌతమ్

సెర్బియాలో 'వాస్తవాధీన' సన్నివేశాలు

పాకిస్తాన్‌పై భారతదేశం సర్జికల్ స్ట్రయిక్ జరిగిన సంవత్సరానికి.. సెప్టెంబరు 2017లో తాను ఈ సినిమా తీస్తున్నట్టు ప్రకటించారు ఆదిత్యధర్. ఆ పదకొండు రోజులు (సెప్టెంబరు 18 నుంచి సెప్టెంబరు 29 వరకు) ఏం జరిగిందనే అంశం ఆధారంగా కథను రూపొందించుకున్నారు. మేజర్ విహాన్ సింగ్ షెర్గిల్ పాత్రలో నటించడం కోసం విక్కీ కౌశల్ ఐదు మాసాల పాటు మిలిటరీ శిక్షణ తీసుకున్నారు. బరువు పెరిగారు. రోజుకి ఐదు గంటల పాటు శ్రమపడ్డారు. ముంబైలోని 'కఫ్ పరేడ్'లో గన్ ట్రయినింగ్ కూడా తీసుకున్నారు. ముంబై నవీ నగర్‌లోనే నటులందరికీ శిక్షణ ఇచ్చారు. ఆయుధాలు ఉపయోగించడం నేర్పారు. 'వాస్తవ అధీన రేఖ' సన్నివేశాలను సెర్బియాలో చిత్రీకరించారు. యామీ గౌతమ్ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్నారు. ఈ చిత్రంలో యుద్ధం, యాక్షన్, స్ట్రాటెజీ అన్నీ ఉన్నాయి. నరేంద్రమోడి, అరుణ్ జైట్లీ, రాజ్‌నాథ్ సింగ్, సుష్మాస్వరాజ్ పాత్రలను కూడా చూపారు దర్శకులు.



సర్జికల్‌స్ట్రయిక్ అంటే?!

ఇదొక సైనిక దాడి. లక్ష్యాన్ని మాత్రమే ఛేదించి.. ప్రజలకు, చుట్టుపక్క ప్రదేశాలకు, వాహనాలకు, భవంతులకు ఏ మాత్రం హాని, విధ్వంసం జరగకుండా చేసేదే సర్జికల్ స్ట్రయిక్. 1976లో ఉగాండాలోని ఎంటెబ్బే మీద ఆ ప్రభుత్వం సర్జికల్ స్ట్రయిక్ చేసింది. 1981లో ఇజ్రాయిల్.. ఇరాక్ అణు రియాక్టర్ మీద సర్జికల్ స్ట్రయిక్ చేసింది. అఫ్గానిస్తాన్‌లోని అల్‌కాయిదా స్థావరాల మీద అమెరికా చాలాసార్లు సర్జికల్ స్ట్రయిక్స్ చేసింది. ఇక మన దేశం 2016 సెప్టెంబరు 18న 'ఉడి' ప్రాంతంలో పాకిస్థాన్ మీద సర్జికల్ స్ట్రయిక్ చేసింది.

హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్

● మీటూ ; ద వే ఫార్వార్డ్

చనిపోతే తప్ప నమ్మరా?

హైదరాబాద్, బేగంపేటలో ఉంది ది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్. హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌కు వేదిక ఆ స్కూలే. ఎనిమిదేళ్లు పూర్తి చేసుకుంది హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్. ఇది తొమ్మిదో ఎడిషన్. నిన్న మొదలైన ఈ మూడు రోజుల పండుగ రేపటితో ముగుస్తుంది. ఈ ఏడాది ఫెస్టివల్‌కి అతిథి చైనా దేశం. గాంధీజీ 150వ జయంతి ఏడాది కావడంతో గుజరాత్ సాహిత్యం సాహిత్యం, గాంధీజీ ప్రధానాంశాలుగా రూపొందిందీ ప్రోగ్రామ్. సాహిత్య సభలో సిరాచుక్క సాక్షిగా 'మీటూ' సామాజికాంశం ప్రధానమైన చర్చనీయాంశమైంది. అనేక ఆవేదనలకు సంగ్రహరూపంగా 'మీటూ; ద వే ఫార్వార్డ్' ప్యానల్ డిస్కషన్ జరిగింది. ఇందులో చిన్మయి శ్రీపాద, సంధ్య మెనన్, సుతప పాల్‌లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ న్యాయవాది వసుధా నాగరాజ్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

> **మహిళ తాను చెప్పదలుచుకున్న విషయాన్ని రాసి పెట్టి ఆత్మహత్య చేసుకున్నప్పుడే ఆమె మాటను విశ్వసిస్తారు. బతికి ఉండి చేసే పోరాటానికి మద్దతు ఇవ్వడానికి పురుష సమాజానికి మనసు రాదు.**

ఎవరికి చెప్పకోవాలి

'బ్రేవ్ హార్ట్స్ ఆఫ్ ద కంట్రీ' అంటూ ప్రశంసపూర్వకంగా ఆహ్వానించారు వసుధ. ''సమాజం అధికార సమీకరణల మీద నడుస్తోందని, అది విద్యార్థిని– టీచర్ నుంచి అధికారి – ఉద్యోగిని వరకు అన్ని చోట్లా విస్తృతంగా రాజ్యమేలుతోందని నిరసించారామె. 'మీటూ' ఉద్యమాన్ని ప్రస్తావిస్తూ 'నా దేహాన్ని పణంగా పెట్టడం ఎందుకు' అంటూ శ్రీరెడ్డి గళం విప్పినప్పుడు తెలిసింది సినిమా ఇండస్ట్రీకి విశాఖ గైడ్‌లైన్స్ గురించి తెలియదని. ధైర్యంగా బయటకు వచ్చిన తనుశ్రీదత్తా నుంచి ఎవరు కూడా కంప్లయింట్ ఫైల్ చేసే అవకాశమే లేని విధంగా నడుస్తోంది మన వ్యవస్థ. పని ప్రదేశంలో సెక్సువల్ హెరాస్‌మెంట్ ప్రివెన్షన్ సెల్ ఉండాలనే నిబంధన అమలు చేయించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి'' అన్నారు వసుధ. ''మగవారికి ప్రతికూలమైన అంశాల మీద కనీస చర్చ లేకుండా వీలయినంత త్వరగా తుడిచేయడానికే చూస్తుంది సమాజం. బేటీ బచావో, బేటీ పడావో అనే నినాదం మంచి ఫలితాలనివ్వాలంటే మహిళలకు ఉద్యోగం చేసే చోట సురక్షితమైన వాతావరణం ఉండాలి. ఆ వాతావరణం కల్పించే వరకు ప్రభుత్వాలు పర్యవేక్షిస్తూనే ఉండాలి'' అని రచయిత సంధ్యా మెనన్ అభిప్రాయం వ్యక్తం చేశారు. అసత్యపు ఆరోపణలు అంటూ గొంతుచించుకోవడం మీద తన అధ్యయనాన్ని వివరిస్తూ ''నేపాల్ నుంచి కేరళ వరకు రకరకాల మహిళలను కలిశాను. వారి అనుభవాలను తెలుసుకున్నాను. నా ఫోన్‌కు 250 మెసేజ్‌లు వచ్చాయి. వాటిలో మూడు మాత్రమే పెద్దగా ప్రాధాన్యం లేనివి. మిగిలినవన్నీ ఏ మాత్రం సందేహం లేకుండా వేధింపు అని అంగీకరించాల్సినవే. ఆ మూడింటిని కూడా అసత్యపు ఆరోపణలు అనడానికి వీల్లేదు. చిన్నపాటి అపార్థాల కారణంగా లేవనెత్తిన ఆరోపణలవి. మీటూ ఉద్యమంలో స్పందించే గొంతుకలు ఉన్నాయి. ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ఒక స్పష్టమైన విధానాన్ని రూపొందించుకోవాలి'' అన్నారు సుతప పాల్.


వసుధా నాగరాజ్
చిన్మయి



సంధ్యా మెనన్
సుతపా పాల్

గళం విప్పినందుకు..

సమంత, భూమిక, కాజల్, త్రిష, పూజా హెగ్డే, సోనాక్షి సిన్హా, నయనతార, లావణ్య త్రిపాఠి... వంటి అనేక మంది హీరోయిన్ల ద్వారా మనకు స్వర పరిచితురాలు చిన్మయి శ్రీపాద. సింగర్‌గా సింగిల్ కార్డుతో పాటలు పాడిన అమ్మాయి. నంది, ఫిలింఫేర్, స్టేట్ అవార్డు వంటి లెక్కలేనన్ని అవార్డులందుకున్న అమ్మాయి. బ్లూ ఎలిఫెంట్ కంపెనీ సీఈవోగా విజయవంతంగా నడుస్తున్న కెరీర్ ఆమెది. తమిళనాడు నుంచి ఫార్చ్యూన్ గ్లోబల్ ఉమెన్స్ మెంటరింగ్ పార్ట్‌నర్‌షిప్ ప్రోగ్రామ్‌కు ఎంపికైన తొలి మహిళ. ఒకప్పుడు గడియారంతో పాటు పరుగులు తీస్తూ... రోజుకు ఐదారు పాటలు పాడిన అమ్మాయి. ఇప్పుడు రోజుకు ఒక పాటకు మించడం లేదు. దీనంతటికీ కారణం తమిళ కవి, పాటల రచయిత వైరముత్తు అకృత్యాలను బయటపెట్టడమే. 'మీటూ' అంటూ బయటకొచ్చిన బాధితులకు ఆలంబనగా నిలిచినందుకు ఆమె చెల్లిస్తున్న మూల్యం ఇది.

''సక్సెస్‌లో ఉన్నావు కెరీర్‌ని కోల్పోవద్దు... అని చెప్పింది మా అమ్మ. కెరీర్ కంటే స్త్రీగా ఆత్మగౌరవం ముఖ్యం కదా అమ్మా అన్నాను. వైరముత్తు మీద నోరు తెరిచిన క్షణం నుంచి ఈ క్షణం వరకు వేధింపులు కొనసాగుతూనే ఉన్నాయి. వైరముత్తు వేసుకున్న జెంటిల్మన్ ముసుగును తొలగిస్తూ వందల మంది బయటకు వచ్చారు. అప్పటివరకు నా కులం ప్రస్తావన రాలేదు, వాళ్ల అఘాయిత్యాలను బయటపెట్టినప్పటి నుంచి కుల సమీకరణలు మొదలయ్యాయి. అవి రాజకీయ సమీకరణలకు దారితీశాయి. వాటంతటగా అవి దారి తీయలేదు. అలా తీయించారు. 'పబ్లిసిటీ కోసం సమాజంలో పేరున్న వాళ్ల మీద ఇలాంటి ఆరోపణలు చేయడం మామూలే' అన్నాడా పెద్దమనిషి. పదిహేడేళ్లపాటు నిర్మించుకున్న కెరీర్ నాది. నేనందుకున్న అవార్డులకు లెక్కేలేదు. అలాంటి నేను పబ్లిసిటీ కోసం అర్థరహితమైన ఆరోపణలు చేయడం నాకవసరమా? పద్మశ్రీలు, పద్మభూషణ్‌లు అందుకున్న వ్యక్తి (వైరముత్తు) అనాల్సిన మాటలు కావవి. సోషల్ మీడియాలో నా మీద ట్రోలింగ్ ఎక్కువైంది. ప్రాణ హాని ఉంటుందని, ఒక్కదానినే ప్రయాణం చేయవద్దని స్నేహితులు, బంధువులు జాగ్రత్తలు చెబుతున్నారు. ఏరోజు ఏదైనా జరగవచ్చనేటంతగా భయానక వాతావరణం ఏర్పడి ఉంది. ఇది కూడా పవర్ ఉన్న వాళ్లు వ్యూహాత్మకంగా సృష్టించినదే. ఇలాంటి విషయాల్లో భారతీయ సమాజం మారాలి. పితృస్వామ్య భావజాలంతోపాటు స్త్రీ అంటే తేలిక భావం, ఏదైనా అనవచ్చు అనే ఆధిక్య భావన కరడు గట్టుకుని ఉంది. మహిళను నమ్మరు, ఆమె మాటను విశ్వసించరు. ఇప్పటి వరకు ఉన్న పరిస్థితి ఏమిటంటే... వివాదాన్ని ఎదుర్కొంటున్న మహిళ తాను చెప్పదలచుకున్న విషయాన్ని రాసి పెట్టి ఆత్మహత్య చేసుకున్నప్పుడే ఆమె మాటను విశ్వసిస్తారు. బతికి ఉండి చేసే పోరాటానికి మద్దతు ఇవ్వడానికి పురుష సమాజానికి మనసు రాదు. ఈ పోకడ మారనంత వరకు ఈ పోరాటాలు తప్పవు'' అన్నారు గాయని చిన్మయి శ్రీపాద.

> **మంచి పరిణామం కోసమే**
>
> ''నా మీద ఏ క్షణాన అయినా దాడి జరగవచ్చు. దాడి జరుగుతుందని వెనక్కి పోవడం ఉండదు. ఇప్పటి వరకు జరిగిన దాని పట్ల నాకు ఎటువంటి విచారమూ లేదు. జరగాల్సినదే జరిగింది. జరగాల్సిన మంచి పరిణామానికి వేసిన అడుగు ఇది. ఒక మంచి జరగాలంటే కొంత ఘర్షణ తప్పదు. అలాంటి ఘర్షణే ఇది. లక్ష్యాన్ని చేరే వరకు ప్రయాణం కొనసాగుతుంది.
>
> **- చిన్మయి శ్రీపాద, గాయని, డబ్బింగ్ ఆర్టిస్ట్**



– వాకా మంజులారెడ్డి
ఫొటోలు: అనిల్ కుమార్

రేపటి ఫన్‌డేలో..



పులి పేల్చని తుపాకీ

మనిషి రక్తం మరిగిన పులెంత ప్రమాదకారో వేట రుచెరిగిన మనిషీ అంతే ప్రమాదకరం. కృష్ణమూర్తిరాజు మామూలు వ్యక్తి కాదు. పేరున్న మహా వేటగాడు. తూర్పు కనుమల్లోని పెద్ద పులులే కాకుండా చిచ్చరపిడుగుల్లాంటి చిరుతపులులను కూడా రాజుగారి తూటాలకు బలయిపోయాయి. ఆయన వేట చూడటానికి దేశం నలుమూలల నుంచీ చాలామంది వస్తుండేవారు.

ఎన్నో నోరు లేని ప్రాణులను చంపిన ఆయనకి, తొలిసారి ఓ పులి ప్రాణం విలువనీ, ప్రాణభయాన్నీ తెలియజేయడమే కాదు...ఆలోచనలోనూ పడేసింది.

అదేమిటో 'పులి పేల్చని తుపాకీ' కథలో రేపటి ఫన్‌డేలో చదవండి.

నిష్క్రమణం

కొద్ది రోజుల్లోనే ఉరికంబానికి ఎక్కనున్న తల్లి, ఖైదులోనే పుట్టి పెరిగిన ఆమె చిన్నారి కొడుకు... ఆమెను దేవతలా చూసే తోటి ఖైదీలు... ఉరిశిక్ష పడ్డ ఖైదీలు క్షమాభిక్ష కోసం పాకులాడతారు. ఉరిశిక్ష పడ్డ నార్గిస్ మాత్రం క్షమాభిక్ష కోసం ఎలాంటి అర్జీని పెట్టుకోలేదు.

సోదరుడు ఎంత ఒత్తిడి చేసినా క్షమాభిక్ష కోరడానికి ఆమె సుతరామూ ఇష్టపడలేదు.

ఉరికంబం వద్దకు తీసుకొచ్చినప్పుడు కూడా నిబ్బరాన్ని కోల్పోలేదు. చోరీలూ, హత్యలూ ఏవీ చేయని ఆమె ఉరికంబం వరకు ఎందుకొచ్చిందో ఉర్దూ కథ 'నిష్క్రమణం' లో చదవండి.

ఋషి



వ్యవసాయం, సంసారం, సమాజం... ఇవ్వేమి ఇవ్వలేని సంతోషం అప్పలరాములుకు నాటకం ఇచ్చింది. నాటకమే ఊపిరిగా, నాటకమే జీవితంగా బతికిన అప్పలరాములు జీవనచిత్రం 'రుషి' కథలో చదవండి.

ఇంకా... 'వర్రీ వద్దు వంటిల్లు ఉందిగా – డాక్టర్ బామ్మ సలహాలు (ముఖచిత్ర కథనం), మిమ్మల్ని ఆకట్టుకునే మరెన్నో శీర్షికలు...రేపటి ఫన్‌డేలో చదవండి

మహా సంకల్పం

నా దేశం ఒక సందేశం

అంతటి రసస్ఫోరకమైన, ఉన్నత స్థితిలో దేశాన్ని చూడగలగడం అంటే.. దేశంపై ఇష్టం, ప్రేమ మాత్రమే కాదు.. దేశాన్ని గౌరవించడం, దేశాన్ని పూజించడం కూడా. అందుకే ఈ గణతంత్ర దినోత్సవం నాడు మనం మరొకసారి ప్రతిన పూనుదాం.

దేశభక్తి అంటే ఏంటి? దేశాన్ని ఇష్టపడటమా? దేశాన్ని ప్రేమించటమా? స్వామి వివేకానంద జీవితంలో జరిగిన ఓ సంఘటన ఆధారంగా దేశభక్తి అర్థాన్ని, ఔన్నత్యాన్ని తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

వివేకానంద ఓ దశలో నాలుగేళ్ల పాటు పాశ్చాత్యదేశాలలో పర్యటించారు. ఆ దేశాల్లోని సిరిసంపదలను, విజ్ఞానాన్ని, అభివృద్ధిని, వారు అవలంబిస్తున్న విధానాలను, ఆధునికతను, ఆ దేశాల అగ్రగామితనాన్ని, ఆధునిక టెక్నాలజీని స్వయంగా పరిశీలించారు. ఆ సుదీర్ఘ పర్యటనను ముగించుకుని, భారతదేశానికి వచ్చేందుకు అక్కడి విమానాశ్రయంలో వేచి ఉండగా ఓ పత్రికా విలేకరి ఆయన్ని.. ''ఇక్కడికి, అక్కడికి తేడా ఏమిటని మీ అనుభవంలో తెలుసుకున్నారు?'' అని అడిగారు. అందుకు వివేకానంద ఇలా సమాధానం ఇచ్చారు. ''ఇక్కడి సంపదను, వైభోగాలను స్వయంగా చూశాను. ఇప్పుడు పర్యటన ముగించుకుని నా మాతృభూమికి వెళుతున్నాను. ఈ దేశాలకు రాక ముందు నా దేశాన్ని నేను ఇష్టపడేవాడిని. ఇప్పుడు



నా దేశాన్ని ప్రేమిస్తున్నాను. అంతే తేడా. అంతే కాదు, నా దేశంలోని ధూళి, నీరు, నేల పవిత్రంగా అనిపిస్తున్నాయి. చెట్టూ చేమ, రాయి రప్పా, పుట్టా గుట్టా అంతా నాకు పరమ పవిత్రంగా కనిపిస్తోంది. మొత్తం మీద నా భారతదేశం నాకు ధగధగాయమానమైన ఓ సువర్ణ దేవాలయంలా సాక్షాత్కారం అవుతోంది'' అన్నారు వివేకానంద.

స్వచ్ఛమైన, నిత్యమైన, దేశభక్తికి ఇంతకన్నా నిదర్శనం మరొకటి ఉంటుందా?

– డా. రమాప్రసాద్ ఆదిభట్ల

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ ॥ శనివారం
26-1-2019

ఈ పాటకు ట్యూన్ తెలుసా?



డా॥ బాలాంత్రపు రజనీకాంతరావు

పల్లవి: మాదీ స్వతంత్ర దేశం
మాదీ స్వతంత్ర జాతి (2)
భరతదేశమే మా దేశం
భారతీయులం మా ప్రజలం(2) ॥మాదీ॥

చరణం-1
వింధ్య హిమవత్ శ్రీ నీలాచల
సంధ్యారుణిత నవాకలు మావి
గంగా గోదావరీ సహ్యజా
తుంగతరంగిత హృదయాల్ మావి(2) ॥మాదీ॥

చరణం-2
ఆలయమ్ముల శిల్పవిలాసం
ఆరామమ్ముల కళాప్రకాశం(2)
మొగల్ సమాధుల రసధరహాసం
మాకు నిత్యనూతనేతిహాసం ॥మాదీ॥

చరణం-3
అహింసా పరమో ధర్మ
సత్యం వద ధర్మం చర...(2)
అది బుషుల వేదవాక్కులు
మా గాంధి గౌతముల సువాక్కులు(2) ॥మాదీ॥

చరణం-4
స్వతంత్రతా సౌభ్రాతృత్వాలు
సమతామానవతావాదాలు
జనని ఓ స్వతంత్రదేవీ
కొనుమా నివాళులు మావి(2) ॥మాదీ॥

రచన, సంగీతం: డా॥ బాలాంత్రపు రజనీకాంతరావు
గానం: టంగుటూరి సూర్యకుమారి

కాసుకో సుడోకు

1				8	3		4	7
3			4	6	7	2		1
					2		3	
	4			9		1		
5		6				9		4
		7		4			6	
	2		7					
8		4	6	2	9			3
7	9		5	3				8

రాశి ఫలాలు (సౌరమానం)



జన్మనక్షత్రం తెలియదా? నో ప్రాబ్లమ్! మీ పుట్టినరోజు తెలుసా? మీ పుట్టిన తేదీని బట్టి ఈ వారం (జనవరి 26 నుంచి ఫిబ్రవరి 1 వరకు) మీ రాశి ఫలితాలు

డా॥ మైలవరపు శ్రీనివాసరావు
జ్యోతిష్య పండితులు

రుచీ మిలే మేరా తుమ్హారా

దేశంలో ఎన్నో భాషలు...
ఎన్నో సంస్కృతులు...
ఎన్నో రుచులు..
కానీ
భాషలు, రుచులు, సంస్కృతులను
కలిపి వండితేనే
టేస్ట్ ఆఫ్ ఇండియా

సేకరణ: వైజయంతి పురాణపండ

గుజరాతీ థేప్లా



కావలసినవి: గోధుమ పిండి – 2 కప్పులు; సెనగ పిండి – అర కప్పు; మెంతి ఆకులు – ఒక కప్పు, పెరుగు – అర కప్పు; అల్లం ముద్ద – అర టీ స్పూను; పచ్చి మిర్చి ముద్ద – అర టీ స్పూను; ఇంగువ – పావు టీ స్పూను; జీలకర్ర – అర టీ స్పూను; గరం మసాలా – అర టీ స్పూను; పసుపు – అర టీ స్పూను; మిరప కారం – అర టీ స్పూను; ఉప్పు – ఒక టీ స్పూను.

తయారీ: ● ఒక పాత్రలో పైన చెప్పిన పదార్థాలన్నీ వేసి బాగా కలపాలి ● కొద్దిగా నీళ్లు జత చేసి చపాతీపిండిలా కలుపుకోవాలి ● మూత ఉంచి సుమారు అరగంటసేపు పక్కన ఉంచాలి ● అరగంట తరవాత ఒక టేబుల్ స్పూను నూనె జత చేసి పిండిని మళ్లీ బాగా కలిపి, చిన్న చిన్న ఉండలు చేసి పక్కన ఉంచాలి ● పొడి పిండి అద్దుతూ చపాతీ మాదిరిగా ఒత్తుకోవాలి ● స్టౌ మీద పెనం ఉంచి వేడయ్యాక, పెనం మీద కొద్దిగా నెయ్యి లేదా నూనె వేయాలి ● ఒత్తి ఉంచుకున్న థేప్లాను వేసి రెండు వైపులా దోరగా కాల్చి తీసేయాలి ● పచ్చడి, పెరుగులతో వేడివేడి థేప్లాలను అందించాలి.

బిహార్ లిట్టి చోఖా




కావలసినవి: లిట్టి కోసం... గోధుమ పిండి – 2 కప్పులు; ఉప్పు – పావు టీ స్పూను; నెయ్యి లేదా నూనె – ఒక టేబుల్ స్పూను; నీళ్లు – ముప్పావు లేదా ఒక కప్పు. స్టఫింగ్ కోసం... సెనగ పిండి – ఒక కప్పు (దోరగా వేయించాలి); జీలకర్ర – అర టీ స్పూను; సోంపు – అర టీ స్పూను; వాము – అర టీ స్పూను; కలోంజీ – పావు టీ స్పూను; మిరప కారం – అర టీ స్పూను; పచ్చి మిర్చి – 2 (సన్నగా తరగాలి); అల్లం తురుము – ఒక టీ స్పూను; వెల్లుల్లి తురుము – ఒక టీ స్పూను; కొత్తిమీర తరుగు – 2 టేబుల్ స్పూన్లు; నల్ల ఉప్పు – పావు టీ స్పూను; ఉప్పు – రుచికి తగినంత; నిమ్మరసం – 2 టీ స్పూన్లు; ఆవ నూనె – 2 టీ స్పూన్లు; నీళ్లు – కొద్దిగా.

తయారీ: ● ఒక పాత్రలో గోధుమ పిండి, ఉప్పు, నెయ్యి లేదా నూనె వేసి బాగా కలపాలి ● నీళ్లు జత చేసి చపాతీ పిండిలా కలుపుకోవాలి ● బాగా మెత్తగా అయ్యేలా ఎక్కువ సేపు కలిపి పక్కన ఉంచాలి.

స్టఫింగ్ తయారీ... ● మిక్సీలో జీలకర్ర, సోంపు వేసి కొద్దిగా బరకగా ఉండేలా మిక్సీ పట్టి పక్కన ఉంచాలి ● ఒక పాత్రలో సెనగ పిండి వేసి, జీలకర్ర పొడి మిశ్రమం జత చేయాలి ● వాము, కలోంజీ, మిరప కారం, పచ్చి మిర్చి తరుగు, అల్లం తురుము, వెల్లుల్లి తరుగు, కొత్తిమీర తరుగు, నల్ల ఉప్పు, రాళ్ల ఉప్పు జత చేసి బాగా కలపాలి ● నిమ్మరసం, ఆవ నూనె జత చేసి మరోమారు కలపాలి ● కొద్దిగా నీళ్లు జత చేసి, కొద్దిగా గట్టిగా కలిపి అరగంట సేపు పక్కన ఉంచాలి ● గోధుమ పిండి మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలుగా చేసుకోవాలి ● పొడి పిండి అద్దుతూ చిన్న సైజు పూరీలా ఒత్తుకోవాలి ● సెనగ పిండి మిశ్రమాన్ని కొద్దిగా తీసుకుని గుండ్రంగా చేతితో చేసి, అంచులు తడి చేసి, మూసేయాలి. ఇలా అన్నీ తయారుచేసుకుని ఒక పాత్రలో ఉంచి, పాత్ర మీద తడి బట్ట వేసి ఉంచాలి. తయారుచేసుకున్నవాటిని బేకింగ్ ట్రే మీద ఉంచాలి ● 200 డిగ్రీల దగ్గర ప్రీ హీట్ చేసిన అవెన్‌లో ఈ ట్రే ఉంచాలి. సుమారు 40 నిమిషాల తరవాత బయటకు తీసేయాలి ● చిన్న గిన్నెలో ● కరిగించిన నేతిని వీటి మీద పూయాలి ● నెయ్యి వేసి అందించాలి.

హిమాచల్ ప్రదేశ్ మద్రా



కావలసినవి: కాబూలీ చనా – 2 కప్పులు; ఆవ నూనె – 3 టేబుల్ స్పూన్లు; ఇంగువ – పావు టీ స్పూను; లవంగాలు – 3; దాల్చిన చెక్క – చిన్న ముక్క; ఏలకులు – 1; మిరియాలు – 4; జీలకర్ర – ఒక టీ స్పూను; ఉల్లి తరుగు – పావు కప్పు; గరం మసాలా – అర టీ స్పూను; ధనియాల పొడి – ఒక టేబుల్ స్పూను; పసుపు – అర టేబుల్ స్పూను; మిరప కారం – తగినంత; ఉప్పు – తగినంత; తరిగిన పచ్చి మిర్చి – 3; గడ్డ పెరుగు – 2 కప్పులు; బియ్యప్పిండి – 2 టేబుల్ స్పూన్లు; నెయ్యి – ఒక టేబుల్ స్పూను.

తయారీ: ● మిక్సీలో ఏలకులు, మిరియాలు, లవంగాలు వేసి పొడి (మరీ మెత్తగా లేకుండా) చేయాలి ● ఒక పాత్రలో బియ్యప్పిండికి తగినన్ని నీళ్లు జత చేసి కలిపి పక్కన ఉంచాలి ● స్టౌ మీద బాణలిలో రెండు టేబుల్ స్పూన్ల ఆవ నూనె వేయాలి ● సన్నటి మంట మీద కాగిన తరవాత, ఇంగువ, జీలకర్ర, దాల్చిన చెక్క పొడి వేసి వేయించాలి ● పొడి చేసుకున్న మిగతా మసాలా దినుసులను జత చేయాలి ● ఉల్లి తరుగు జత చేసి వేయించాలి ● గరం మసాలా, ధనియాల పొడి జత చేసి బాగా కలపాలి ● ఉడికించిన సెనగలను వేసి బాగా కలిపిన తరవాత మసాలా, ఉప్పు, మిరప కారం వేసి కలియబెట్టాలి ● పచ్చి మిర్చి తరుగు జత చేసి బాగా కలిపి రెండు నిమిషాల పాటు ఉడికించాక, మంట బాగా తగ్గించేయాలి ● పెరుగు జత చేసి బాగా కలియబెట్టాలి ● మంట పెంచి, ఆపకుండా కలుపుతుండాలి ● బియ్యప్పిండి కలిపిన నీళ్లు, నెయ్యి వేసి కలియబెట్టి, సుమారు ఐదు నిమిషాలు ఉడికించాలి ● గ్రేవీ కొద్దిగా గట్టి పడిన తరవాత దింపేసి, చల్లారాక వేడివేడి అన్నంలోకి వడ్డించాలి.

మహారాష్ట్ర వడ పావ్



కావలసినవి: స్టఫింగ్ కోసం... ఆలుగడ్డలు – రెండు (కొద్దిగా పెద్దవి); పచ్చి మిర్చి + వెల్లుల్లి ముద్ద – ఒక టేబుల్ స్పూను; ఆవాలు – అర టీ స్పూను; ఇంగువ – చిటికెడు; పసుపు – పావు టీ స్పూను; కరివేపాకు – రెండు రెమ్మలు; కొత్తిమీర తరుగు – ఒక టేబుల్ స్పూను; ఉప్పు – తగినంత.

పిండి తయారీ కోసం... సెనగ పిండి – ఒకటిన్నర కప్పులు; ఇంగువ – చిటికెడు; పసుపు – పావు టీ స్పూను; బేకింగ్ సోడా – చిటికెడు; నీళ్లు – అర కప్పు; ఉప్పు – తగినంత. **గ్రీన్ చట్నీ కోసం...** కొత్తిమీర తరుగు – ఒక కప్పు; వెల్లుల్లి రెబ్బలు – 2; నిమ్మరసం – 3 చుక్కలు; సన్నగా తరిగిన పచ్చి మిర్చి – 3; ఉప్పు – తగినంత. **శొంఠి చట్నీ కోసం...** గింజలు లేని చింతపండు – అర కప్పు; నీళ్లు – 2 కప్పులు; జీలకర్ర – అర కప్పు; శొంఠి పొడి – అర టీ స్పూను; ఇంగువ – చిటికెడు; మిరప కారం – పావు టీ స్పూను; బెల్లం పొడి – ఒక కప్పు; నూనె – ఒక టీ స్పూను; ఉప్పు – తగినంత. **వడ పావ్ కోసం మరి కొన్ని...** రెడ్ చట్నీ – 2 టేబుల్ స్పూన్లు; పావ్ లేదా బ్రెడ్ రోల్స్ – తగినన్ని; ఉప్పులో కలిపి వేయించిన పచ్చి మిర్చి – తగినన్ని.

తయారీ: గ్రీన్ చట్నీకి చెప్పిన పదార్థాలకు తగినన్ని నీళ్లు జతచేసి మిక్సీలో వేసి మెత్తగా చేయాలి. కొద్దిగా గట్టిగా ఉండేలా జాగ్రత్తపడాలి.

శొంఠి చట్నీ తయారీ... ● తగినన్ని నీళ్లలో చింతపండును సుమారు గంటసేపు నానబెట్టాక, చేతితో మెత్తగా పిసికి, పిప్పిలాంటిది తీసేసి, చిక్కటి రసాన్ని ఒక గిన్నెలోకి తీసుకోవాలి ● స్టౌ మీద బాణలి వేడయ్యాక నూనె వేసి కాచాలి ● మంట తగ్గించి, జీలకర్ర వేసి చిటపటలాడించాలి ● శొంఠిపొడి, మిరప కారం, ఇంగువ జత చేసి కలపాలి ● చింత పండు రసం జత చేసి సుమారు ఐదు నిమిషాలు ఉడికించాలి ● బెల్లం పొడి, ఉప్పు జత చేసి మరో ఐదు నిమిషాలు ఉడికించాలి ● మిశ్రమం బాగా చిక్కబడ్డాక దింపి చల్లారనివ్వాలి ● గాలిచొరని డబ్బాలో నిల్వచేసుకోవచ్చు.

వడా పావ్ తయారీ... ● ఒక పాత్రలో బంగాళ దుంపలకు తగినన్ని నీళ్లు జత చేసి స్టౌ మీద ఉంచి ఉడికించి దింపేయాలి ● తొక్క తీసేసి, చేతితో మెత్తగా అయ్యేలా మెదపాలి ● స్టౌ మీద బాణలి ఉంచి వేడయ్యాక నూనె వేసి కాచాలి ● ఆవాలు జత చేసి చిటపటలాడించాలి ● కరివేపాకు, ఇంగువ వేసి కొద్దిగా వేయించాలి ● వెల్లుల్లి రెబ్బలు + పచ్చిమిర్చి ముద్ద జత చేయాలి ● పసుపు జత చేసి మరోమారు వేయించాలి ● బాగా వేగిన తరవాత ఈ మిశ్రమాన్ని బంగాళ దుంపకు జతచేసి బాగా కలపాలి ● కొత్తిమీర, ఉప్పు జత చేయాలి ● ఈ మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలుగా చేసి, కొద్దిగా ఫ్లాట్‌గా ఉండేలా చేతితో ఒత్తుకోవాలి ● మరొక పాత్రలో సెనగ పిండి, పసుపు, ఇంగువ, బేకింగ్ సోడా, ఉప్పు, అర కప్పు నీళ్లు వేసి బజ్జీ పిండిలా తయారుచేసుకోవాలి ● స్టౌ మీద బాణలిలో నూనె పోసి వేడి చేయాలి ● తయారుచేసి ఉంచుకున్న బంగాళ దుంప ఉండలను సెనగ పిండిలో ముంచి, నూనెలో వేయాలి ● బంగారు రంగులోకి వచ్చేవరకు వేయించి పేపర్‌టవల్ మీదకు తీసుకోవాలి ● ఈ విధంగా అన్నీ తయారు చేసుకోవాలి ● పావ్‌లను మధ్యలోకి కట్ చేసి, తయారుచేసుకున్న వడను మధ్యలో ఉంచాలి ● తయారుచేసి ఉంచుకున్న చట్నీలతో అందించాలి.

ఆంధ్ర గోంగూర పచ్చడి



కావలసినవి: గోంగూర – అర కేజీ; ఎండు మిర్చి – 100 గ్రా.; మెంతులు – ఒక టీ స్పూను; ఆవాలు – ఒక టేబుల్ స్పూను; ఇంగువ – అర టీ స్పూను; పసుపు – పావు టీ స్పూను; నువ్వుల నూనె – 100 గ్రా.; ఉల్లి తరుగు – పావు కప్పు.

తయారీ: ● గోంగూరను శుభ్రంగా కడిగి, పొడి వస్త్రం మీద నీడలో (పూర్తిగా తడి పోయే వరకు) ఆరబోయాలి ● స్టౌ మీద బాణలిలో కొద్దిగా నూనె వేసి కాగాక గోంగూర వేసి పచ్చి పోయేవరకు సుమారు పావు గంటసేపు వేయించి తీసేయాలి ● అదే బాణలిలో కొద్దిగా నూనె వేసి కాగాక ఆవాలు, మెంతులు, ఎండు మిర్చి వేసి వేయించి, మంట ఆర్పేయాలి ● మిక్సీలో ముందుగా ఎండుమిర్చి మిశ్రమం వేసి మెత్తగా పొడి చేయాలి ● గోంగూర జత చేసి మెత్తగా అయ్యేవరకు మిక్సీ పట్టి, ఒక పాత్రలోకి తీసుకోవాలి ● ఉల్లి తరుగు జతచేయాలి ● బాణలిలో నూనె వేసి కాగాక ఇంగువ వేసి కాచి దింపేయాలి ● కొద్దిగా చల్లారాక గోంగూరలో వేసి కలపాలి ● వేడి వేడి అన్నంలోకి రుచిగా ఉంటుంది.

ఒడిశా చెన్నా పోడా



కావలసినవి: పనీర్ లేదా సెనగలు – పావు కేజీ; పంచదార లేదా బెల్లం పొడి – అర కప్పు; ఏలకుల పొడి – అర టీ స్పూను; బియ్యప్పిండి – అర టేబుల్ స్పూను; జీడి పప్పులు, కిస్‌మిస్‌లు – తగినన్ని; నెయ్యి – కొద్దిగా.

తయారీ: ● అవెన్‌ను 180 డిగ్రీల దగ్గర ప్రీహీట్ చేయాలి ● పనీర్ లేదా ఉడికించిన సెనగ పప్పును పొడి పొడిగా చేయాలి ● అర కప్పు పంచదార లేదా బెల్లం పొడి జత చేసి చపాతీ పిండిలా కలపాలి ● అవసరమనుకుంటే కొద్దిగా పాలు జత చేయాలి ● ఏలకుల పొడి, బియ్యప్పిండి జత చేయాలి ● కిస్‌మిస్, జీడి పప్పు పలుకులు కూడా జత చేయాలి ● ఈ మిశ్రమాన్ని బేకింగ్ ట్రేలో వేసి సమానంగా పరిచి, అవెన్‌లో ఉంచి, 45 నిమిషాలు బేక్ చేయాలి ● బయటకు తీసి చల్లారనివ్వాలి ● చాకుతో జాగ్రత్తగా స్లయిసెస్‌లా కట్ చేయాలి ● భోజనం చేశాక ఈ స్వీట్‌ను తింటారు.

మేషం (మార్చి 21 - ఏప్రిల్ 19)

ఆ ఊరికి ఎటువెళ్లాలని అడిగితే – ‘నేనూ అదే ఊరికి వెళ్తున్నాను. నా వెనకాలే రండి–’ అనడమేగాక ఆ ఊళ్లో కూడా మనం ఎక్కడికి వెళ్లాలో అక్కడి కొచ్చి ఎవరైనా వెళ్తే దాన్నే అ– దృష్టమంటారు. ఇది ఉదాహరణకి చెప్పిన మాట. ఇలాంటి అదృష్టాలు వరించే కాలం మీకిది. అనూహ్యంగా విజయాలు లభించే సమయం అన్నమాట. అలాగని అనాలోచితంగా పనుల్ని ప్రారంభించకండి. అనుభవజ్ఞుల్నీ పెద్దల్నీ సంప్రదించి మాత్రమే పనిలోకి దిగండి. విజయం తథ్యం.

తీర్చవలసిన బాకీలేమైనా ఉంటే, అవి చిన్నా చితకానే కదా అనుకోకండి. శత్రుశేషం రుణశేషం అగ్నిశేషం (శత్రువుల్నీ రుణాలనీ అగ్నినీ మిగిలింది కొద్దిగానే కదా అనే ఉద్దేశ్యంతో విడిచెయ్యడం లేదా ఉదాశీనంగా ఉండడం) మంచిది కాదు. వెంటనే తీర్చగలిగినంత చొప్పున తీర్చెయ్యాలనే నిశ్చయానికి రండి. నిజాయతీగా తీర్చేస్తూ ఉండండి. ఉద్యోగంలో కొత్త బాధ్యత మీకు అప్పగించబడవచ్చు. దాంతో అంతా కొత్త కొత్తగా ఉండి తెలియని పనిభారం మీదపడే అవకాశముంది. పనిని నేర్చుకుని మీరే స్వయంగా చేసుకోండి తప్ప, ఇతరుల చేత చేయించుకోకండి. ‘చీటికి ప్రాణంబు వ్రాలు’ అన్నట్టు కాగితం వజ్రాయుధంగా మారిపోతుంది. అడుగున ఉన్న సంతకం కారణంగా. ఎవరో చేసిన తప్పిదానికి మీ సంతకం ద్వారా మీరు బాధ్యులు కావడం దేనికి? నేర్చుకుని చేసుకోండి పనిని. మరి అన్నీ విజయవంతం అదృష్టకరమంటూ ఈ తీరుగా ఇబ్బంది రావచ్చుననడమేమిటనే అనుమానం రావచ్చు. ఇప్పటికే ఇలాగాని ఏదైనా జరిగి ఉన్నా భయపడకండి–ఆ ఇబ్బంది తొలగిపోతుందని చెప్పడం దీని భావం. అలాగని తెలిసి పొరపాటు చేయడం సరికాదు సుమా! అనడం కూడా దీనిలక్ష్యం. ఏదో ఓ కారణం వల్ల ధనం ఖర్చయ్యే అవకాశం ఉంది. ఆలోచించి వ్యయం చేసుకోండి.

లౌకిక పరిహారం: ఆదిత్య హృదయ స్తోత్ర పారాయణం మంచిది.
అలౌకిక పరిహారం: రుణాలుంటే తీర్చేయాలని భావించుకుని ఆచరణ ప్రారంభించండి.

మిథునం (మే 21 - జూన్ 20)

ఒక వాగ్దానాన్ని చేసేటప్పుడో లేక ఒక విషయాన్ని చెప్పేటప్పుడో లోపల నేనీ పని చేయలేను– ఇది సాధ్యం కానే కాదు– అని స్పష్టంగా అనుకుని, పైకి చెప్పలేక వాగ్దానం చేసి ఇరుకున పడే అవకాశముంది. వ్యవహారంలో లౌక్యం అస్పష్టత ఏమాత్రం పనికి రావని గుర్తుంచుకోండి. మీ సంతానాన్ని ఏమాత్రమూ అదుపులో పెట్టుకో(లే)ని కారణంగా ప్రవర్తనలో మార్పు వచ్చే అవకాశం బాగా ఉంది. ముఖ్యంగా దుష్ట సహవాసాలూ అలవాట్లూ అబ్బే వీలుంది కాబట్టి రాబోయే సంవత్సరం నుండి మరోచోట చదివించడానికో లేక చదివే పాఠశాలను మార్చడమో వంటి వాటి గురించి ఆలోచించుకోండి. అన్ని సమస్యలూ తీరే మంచి ఉపాయం మీరు గారాబం చేయకపోవడమూ– మీ అదుపాజ్ఞల్లో వాళ్లు ఉండేలా తగినంత భయాన్ని పెట్టడమున్నూ. దీనివల్ల వాళ్లూ మీరూ కూడా ఒకేచోట ఉండే కుదిరికను కోల్పోరు– ఆరోగ్యాన్ని చూసుకుంటూ ఉండవచ్చు. ఆ అనుబంధాన్ని కొనసాగించుకుంటూ ఉండవచ్చు కూడా.

కోపం వచ్చినప్పుడో మీరనుకున్నది సాధించలేనప్పుడో అన్నం తినకుండా ఉండడం, మాట్లాడకపోవడం వంటి చిత్రమైన అలవాట్లు కొందరికి తాత్కాలిక వ్యాధిలా బాధిస్తూ ఉంటాయి. ఒకసారీ రెండుసార్లూ మహా అయితే మూడోసారి బతిమాలి మిమ్మల్ని శాంతపరచవచ్చు– పట్టుదలని పోగొట్టేలా చేయవచ్చు గాని ఎప్పుడూ మీరదే ధోరణిలో ఉంటే– మీ పాటికి మిమ్మల్ని విడిచేసే ప్రమాదముంది. నిదానమైన గొంతుతో ఎదుటివ్యక్తి మీ మాటని మనసుతో వినే సమయాన్ని గుర్తించి మీ బాధని చెప్పండి– తప్పక పని సాధింపబడుతుంది. ఇది ఈ తీరు పద్ధతిలో అనుకూలించే సమయమే మీకు. ప్రస్తుత దశాకారణంగా మీరు మాట్లాడే మాట ఎదుటివారికి అపార్థాన్నిస్తుందేమోననుకుంటూ స్పష్టంగా అవసరమైనంత మాత్రమే మాట్లాడండి. నవ్వులాటలూ వేళాకోళాలూ కొద్దిగా ఈ వారంలో సరికావు.

లౌకిక పరిహారం: అక్షరాల్లో కాఠిన్యం, మాటల్లో నొప్పించేతనం వద్దేవద్దు.
అలౌకిక పరిహారం: ఆంజనేయ స్తోత్రాన్ని పఠిస్తూ ఉండండి.

సింహం (జూలై 23 - ఆగస్ట్ 22)

శ్రీకాళహస్తి శివాలయాన్ని ఆనుకుని సువర్ణముఖీ నది ప్రవహిస్తోంది. ఆ శివాలయాన్ని నిర్మించే రోజుల్లో ఏ భక్తుడు ఎంత నిష్ఠతో ఆ శివాలయపు పనుల్ని చేస్తే – ఆ సాయంత్రం పని దిగిపోయేప్పుడు ఆ సువర్ణముఖిలో స్నానం చేస్తున్న వేళ – ఆ చేసిన పనికి సరిపోయినంత సువర్ణం (బంగారం) దొరుకుతూ ఉండేదిట. అలాగే మీరెంత పనిని ప్రజోపయోగ కార్యక్రమాలకంటూ వెచ్చిస్తే అంత సొమ్ము లభిస్తుంది విరాళ రూపంలో. ధర్మ కార్యాలు నెరవేర్చండి. ‘మీ పెద్దమ్మాయిని పెద్దగా సుఖపడేలా చేయలేకపోయాననే మాట నిజమే గాని, మీ చిన్నమ్మాయినిచ్చి వివాహం చేస్తే ఎంతో సంతోషపడేలా చూసుకుంటా’నన్నాట్ట వెనక ఓ తింగరి. అలాంటి అప్రయోజకుడు, అసమర్థుడు అయిన అధికారి మీకు అధికారిగా రావచ్చు. అంటే – అతను ఇంతకుముందు వెలగబెట్టిన ఉద్యోగంలో అతడు చూపించిన అసమర్థతకి శిక్ష పడకపోగా మళ్లీ పదవి, ఉన్నతి మీద మీకు అధికారిగా రావచ్చునని భావం. ‘చెప్పింది చేసెయ్యి’ అనేది ఉద్యోగ రాజనీతి. కాబట్టి అలానే చేసి చేతులు దులుపుకోండి తప్ప ‘అదీ – ఇదీ...’ అంటూ వాదులాడి ఉద్యోగానికి ఎసరు పెట్టించుకోకండి. ప్రతి ఆజ్ఞనీ అతని నుండి లిఖిత పూర్వకంగా ఉండేలా జాగ్రత్తపడండి. వెనకటికి ఓ పనిమనిషి ఇల్లు తగలబడుతూంటే అందరూ వెళ్లార్ట ‘అయ్యో’ అనుకుంటూ. వచ్చేప్పుడు ఆనందంగా తిరిగొస్తూంటే కారణమేమి?టన్నాట్ట ఎవడో. తమ తమ ఇళ్లలో కనిపించకుండా ఉన్న చెంబులు, బిందెలు, పాత్రలు, వస్తువులు అన్నీ అక్కడే దొరికాయట. సరిగ్గా ఇలాగే మీ పోయిన విలువైన వస్తువులు మామూలువి, ఖరీదైనవి కూడా మంచి నమ్మకమనుకుంటూ ఉన్న వ్యక్తి నుండి అకస్మాత్తుగా పొరుగూరిలో వాళ్లింట్లో వివాహమో మరో శుభకార్యమో జరుగుతూంటే బయటపడతాయి ఓ వాహనంతో సహా. ఇలా బాగా అరుదైన సంఘటన జరగచ్చు లాభకరంగా.

లౌకిక పరిహారం: పరిస్థితికి అనుగుణంగా వెళ్లడం నేర్చుకోండి.
అలౌకిక పరిహారం: దుర్గాదేవి స్తోత్రం మంచిది

వృషభం (ఏప్రిల్ 20 - మే 20)

ఒక చిన్న తొందరపాటుతనం లేదా వ్యక్తి మీది నమ్మకం లేదా ఉదాసీనభావంతో ఓ చిన్న పొరపాటు చేసి ఉంటారు. దానినుండి చక్కగా ఏ విధమైన అభ్యంతరమూ ఇబ్బందీ లేకుండా సుఖంగా బయటపడిపోతారు. ఓ అరణ్యంలో ప్రయాణిస్తుంటే ఎలా మృగ–జంతు– సర్ప భయం ఉంటుందో అలాగే కావాలని అడ్డుపెట్టే వారున్నారనుకుంటూ జాగ్రత్తగా సాగిపొండి వృత్తి ఉద్యోగ వ్యాపారాల్లో. మనోవేదన తాత్కాలికం. విజయ సాధన శాశ్వతం. పదిమందిలోనూ మీ అధికారాన్నీ దర్పాన్నీ ప్రదర్శించాలనే ఆలోచనతో మీ కింది వారిమీదా, తోటి ఉద్యోగులతో, అలాగే సంస్థలో పని చేసే కింది శారీరక శ్రామికుల మీదా ఆవేశంగాని ప్రదర్శించినా, చిన్నగా మాట తూలినా పరిస్థితులన్నీ అనూహ్యంగా అయిపోయే అవకాశముంది. ఒర లేకుండా పదునైన కత్తిని భుజాన తగిలించుకు వెళ్తుంటే ఆ నడకకి అనుగుణమైన కదలికల కారణంగా తప్పక శరీరాన్ని గాయపరుస్తుంది కదా ఆ కత్తి! కాబట్టి పెద్ద పెద్ద అరుపులూ కేకలూ కోపంతో ఊగిపోవడం వంటివి మీకే హానికరం. అవతలి వ్యక్తి తన మనసుతో వినేలా అతని ప్రవర్తనకి గాయమయ్యేలా చిన్న గొంతుతో సూటిగా విషయాన్ని వివరించి– అలా కుదరదన్న పక్షంలో తగిన నిర్ణయాన్ని ఆలోచించి చేయండి.

ఎప్పుడో ఆగిపోయిన పనుల్ని తిరిగి ప్రారంభించాలని అనుకుంటారు. ప్రశాంతంగా కూచుని ఆలోచించిన పక్షంలో తప్పక అవి తిరిగి ప్రారంభింపబడవచ్చు. అయితే స్పష్టంగా అనుకోవడం, అనుకున్న విధంగా ఆచరించడం వంటివి చేయడం సరైనది తప్ప మొహమాటంతో కొన్ని లోలోపలే అనుకున్న పక్షంలో వ్యవహారం బెడిసికొట్టే అవకాశముంది. స్పష్టతతో అవగాహనతో సాధ్యాసాధ్యాల ఆలోచనలతో ముందుకి సాగండి. ఒకసారి వ్యవహారం దెబ్బతింటే ఇక ఆ పని ముందుకి సాగే అవకాశమే లేదని గ్రహించండి.

లౌకిక పరిహారం: ఆలోచించకుండా దిగకండి. మొహమాటం వద్దు. ఆవేశం అనర్థ దాయకం.
అలౌకిక పరిహారం: శ్రీ విష్ణు సహస్రనామ పఠనం ఆవశ్యకం.

కర్కాటకం (జూన్ 21 - జూలై 22)

అప్పటివరకూ వచ్చిన గాలీవానా పూర్తిగా తగ్గిపోయింది. ప్రయాణించాల్సింది నీటికి వాలుగా. పడవ నడిపే సరంగు భోజనం నిద్ర కూడా పూర్తయింది. తెరచాపనెత్తి ఎలా చక్కని పాటందుకుని తెడ్డు తీసుకుని పడవను నడపడానికి సిద్ధపడతాడో అలా ఉంది ప్రస్తుతం మీ దశ. ఏ పనిని చేయాలని అనుకుంటున్నారో దాని గురించిన ఓ ప్రణాళికని వేసుకుని వెంటనే పనిలోకి దిగండి. కాగితపు పడవని నీటిమీద విడిస్తే ఏ తెడ్డూ వేయనక్కరలేకుండా దానంతటదే అవలీలగా అలా దూరంగా వెళ్లిపోతూ కన్పిస్తుందో అలా సాగిపోతాయి పనులన్నీ.

ఆవునుండి పాలని పిదకడానికి ముందుగా కొన్ని నీళ్లని చెంబులో పోసుకుని వెళ్తాడు పితికేవాడు. ధాన్యాన్ని కొలవడానికి గంపని తీసుకు వెళ్లే వ్యక్తి కొంత ధాన్యాన్ని దాంట్లో వేసుకుని మాత్రమే వెళ్తాడు కొలతకి. ఇంట్లో కూడా గృహిణి వంటని సరిగ్గా సరిపడేంత మాత్రమే కాకుండా కొంత మిగిలేలా ఆలోచన చేసుకుని వండుతుంది. అదే తీరుగా మీరు కూడా భూమినో గృహాన్నో పొలాన్నో కొనదలిచే ఆలోచనల్లో ఉండడం మంచిదే కాని, ఇంట్లో ఉన్న పిల్లలకో మరింత వృద్ధాప్యంలో ఉన్నవారికో ఆరోగ్య సమస్యలు రావచ్చనే ఊహతో ఉంటూ కొంత నిలవ ఉంచుకుని ఆ మీదటి సొమ్మునే స్థిరాస్తి కోసం వినియోగించడం ఎంతైనా అవసరం. సన్నిహితుల సహకారం లభించే కారణంగా విఘ్నాలు వచ్చినా తొందరగా తొలగిపోతాయి. ఇబ్బంది కలిగించవు. సంతానపు ప్రవర్తనని గమనించుకుంటూ ఉండాల్సిందే. స్నేహితులతో వాళ్ల కదలికలు ఎలా ఎలా ఉంటున్నాయనేది మరింతగా పట్టించుకుంటూ ఉండాల్సిందే. ఇంట్లో డబ్బులు దాచుకునే చోటు ఒకటుంటే అక్కడొక పుస్తకం కలమూ పెట్టి దేనికెవరు ఎంతెంత తీసుకుంటున్నారో రాసి తీసుకోవలసిందని చెప్పండి. ఇంటిదొంగ ఈశ్వరులెవరో స్పష్టంగా తెలిసిపోతుంది మీకు.

లౌకిక పరిహారం: సంతానపు ప్రవర్తనని గమనించుకుంటూ ఉండండి.
అలౌకిక పరిహారం: గణపతి షోడశనామాలనీ పఠించుకుంటూ ఉండండి.

కన్య (ఆగస్ట్ 23 - సెప్టెంబర్ 22)

దాంపత్యం అన్యోన్యంగా ఉండే సందర్భంగా మనసు ప్రశాంతంగా ఉంటుంది. తీర్థయాత్రలు, పుణ్యక్షేత్ర సందర్శనాలు చేయాలనే బుద్ధి పుడుతుంది. ఏది చేసినా ప్రణాళికాబద్ధంగా వ్యయం చేసుకోవడం అవసరం. దానధర్మాలు మీదికి దృష్టి మళ్లడం తప్పు కాదు – అవశ్యం చేయవలసిందే కాని యథాశక్తి మాత్రమే చేస్తూ ఉండడం తప్పనిసరి.

మీ సంతానం విద్యార్థి దశలో గాని ఉన్నట్లయితే వాళ్లకి అనుకున్నంత శాతం విద్యలో లభించకపోవచ్చు. పైగా విద్య కంటే వేరైన క్రీడలు చిత్రలేఖనం సంగీతం, నృత్యం వంటి వాటిలో క్రమంగా ప్రవేశం లభించి అదే ఓ వ్యాపకంగా మారిపోయే ప్రమాదముంది కాబట్టి ఎప్పటికప్పుడు హెచ్చరికతో ఉంటూ ప్రధాన విద్య మీదకే దృష్టి ప్రసరించేలా శ్రద్ధ వహించవలసిందే.

బంధువుల్లో ఒక కొంతకాలం నుండి మీ గురించిన అపోహలెవరి కారణంగానో ఏర్పడి ఉన్నవన్నీ క్రమక్రమంగా తొలగిపోతూ మొత్తమ్మీద మీ నిజాయితీతనం స్పష్టంగా అందరికీ అర్థమౌతుంది. దాంతో పెద్ద బండరాయి గుండెమీది నుండి దిగిపోయిన సంతోషం మీ సొంతమౌతుంది. దీంతో పాటు మీకున్న కోప స్థాయి కూడా తగ్గడమే కాక సహన బుద్ధి పెరుగుతూ ఉంటుంది. లోగడ ప్రతిస్పందించినంత తీవ్రంగా ప్రతిస్పందించకుండా ఉంటారు. ఇది ఆరోగ్యాభివృద్ధికి దోహదమౌతుంది కూడా.

మీరు అన్ని పనుల్నీ సక్రమంగా నిర్వహించగలిగిన సమర్థత – అలాగే ఓపిక – వీటితోపాటు పనిని చేయడంలో కొత్త మెళకువలూ కలిగినవారన్నమాట నిజమే కాని, ఈ కారణంగా మీకు పని ఒత్తిడి పెరిగిపోవడం లేదూ? పైగా ఇన్నిటి భారం కారణంగా ఎక్కడైనా పొరపాటు జరిగితే ఈ ప్రతిష్ఠ మొత్తం దీనివల్ల పోవడం లేదూ? ఎంత అవసరమో అంతే చేయడాన్ని నేర్చుకోండి. ప్రశంసలకి లొంగిపోకండి.

లౌకిక పరిహారం: ఆరోగ్య రక్షణకి ఔషధాల వాడకం కాదు – పని ఒత్తిడిని తగ్గించుకోవాలి.
అలౌకిక పరిహారం: ఇష్ట దేవతాస్తుతి మంచిది.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ ॥ శనివారం 26-1-2019

సిక్కిం మామోస్



కావలసినవి: మైదా పిండి – ఒక కప్పు; నూనె – అర టీ స్పూను; ఉప్పు – తగినంత; నీళ్లు – తగినన్ని

స్టఫింగ్ కోసం... సన్నగా తరిగిన కూర ముక్కలు – రెండు కప్పులు (క్యాబేజీ, క్యారట్లు, ఫ్రెంచ్ బీన్స్, క్యాప్సికమ్ వంటివి); ఉల్లికాడల తరుగు – పావు కప్పు; వెల్లుల్లి రెబ్బలు – 3; సోయా సాస్ – ఒక టీ స్పూను; మిరియాల పొడి – అర టీ స్పూను; నూనె – ఒక టేబుల్ స్పూను; ఉప్పు – తగినంత.

తయారీ: ● ఒక పాత్రలో మైదా పిండి, ఉప్పు, నూనె వేసి బాగా కలపాలి ● తగినన్ని నీళ్లు జత చేసి చపాతీ పిండిలా కలిపి సుమారు అర గంట సేపు పక్కన ఉంచాలి.

స్టఫింగ్ తయారీ... ● స్టౌ మీద బాణలి ఉంచి వేడయ్యాక నూనె వేసి కాచాలి ● వెల్లుల్లి రెబ్బలు వేసి వేయించాలి ● ఉల్లి తరుగు జత చేసి బంగారు రంగులోకి వచ్చేవరకు వేయించాలి ● కూరగాయల తరుగు జత చేసి, సన్నని మంట మీద వేయించాలి ● సోయా సాస్, ఉప్పు, మిరియాల పొడి జత చేసి బాగా కలిపి దింపేయాలి ● ఉల్లికాడల తరుగు జత చేసి బాగా కలపాలి.

మామోస్ తయారీ: ● మైదా పిండి మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలు చేసుకోవాలి ● ఒక్కో ఉండను తీసుకుని పూరీ ప్రమాణంలో ఒత్తుకోవాలి ● స్టఫింగ్ మిశ్రమాన్ని కొద్దిగా తీసుకుని పూరీ మధ్యలో ఉంచి, అంచులను ముడతలు వచ్చేలా చేస్తూ, అన్నివైపులా మూసేయాలి ● ఇలా అన్నీ తయారుచేసుకోవాలి ● వీటి మీద తడి వస్త్రం వేసి ఉంచాలి ● కుకర్‌లో నీళ్లు పోసి మరిగించాలి ● తయారుచేసి ఉంచుకున్న మామోస్‌ను ఇడ్లీ రేకులలో ఉంచి, కుకర్‌లో పెట్టాలి ● సుమారు ఐదు నిమిషాలు ఉడికించి, దింపేయాలి ● వీటిని ప్లేట్‌లోకి తీసుకుని, ఉల్లికాడలతో అలంకరించి, టొమాటో చిల్లీ సాస్, రెడ్‌చిల్లీ గార్లిక్ చట్నీలతో అందించాలి.

జార్ఖండ్ ఠేకువా



కావలసినవి: గోధుమ పిండి – 2 కప్పులు; బెల్లం పొడి – ముప్పావు కప్పు; కొబ్బరి తురుము – అర కప్పు; నూనె – డీప్ ఫ్రైకి సరిపడా; చీజ్ 2 టేబుల్ స్పూన్లు; ఏలకులు – 5.

తయారీ: ● ఒక పాత్రలో బెల్లం పొడి, అర కప్పు నీళ్లు పోసి, స్టౌ మీద ఉంచి, మరిగించాలి ● బెల్లం పూర్తిగా కరిగేవరకు ఉంచి, దింపేసి వడపోయాలి ● బెల్లం నీళ్లలో నెయ్యి వేసి కలియబెట్టాలి ● ఒక పాత్రలో గోధుమ పిండి వేసి, ఏలకుల పొడి, కొబ్బరి తురుము జత చేయాలి ● బెల్లం నీళ్లు పోస్తూ, పిండిని గట్టిగా కలుపుకోవాలి ● ఈ పిండితో ఠేకువాలు తయారుచేసుకోవాలి ● స్టౌ మీద బాణలిలో నూనె వేసి కాచాలి ● గోధుమపిండిని చిన్న చిన్న ఉండలుగా చేయాలి ● చేతులకు నూనె పూసుకుని, ఒక ఉండ చేతిలోకి తీసుకుని, చేతితో మృదువుగా ఒత్తాలి ● మనకు నచ్చిన ఆకారంలో దానిని తయారుచేసుకోవాలి ● అంటే ఆకు ఆకారం ఇష్టపడితే, ఆకులా చేసి, గోళ్లతో గీతలు గీయాలి ● లేదంటే గుండ్రంగా కూడా చేసుకోవచ్చు ● మంటను మధ్యస్థంగా ఉంచి, తయారుచేసి ఉంచుకున్న ఠేకువాలను నూనెలో వేసి దోరగా వేయించి తీసేయాలి ● చల్లారాక గాలి చొరని డబ్బాలోకి తీసుకోవాలి ● ఇవి నెల రోజుల దాకా నిల్వ ఉంటాయి.

పంజాబ్ సర్‌సోంకా సాగ్



కావలసినవి: ఆవ ఆకులు – ఒక కట్ట; బచ్చలి ఆకు – అర కట్ట; పాల కూర – అర కట్ట; ముల్లంగి ఆకుల తరుగు – ఒక కప్పు; ముల్లంగి – చిన్న ముక్క; మెంతి ఆకు – ఒక కప్పు; ఉల్లి తరుగు – అర కప్పు; టొమాటో తరుగు – అర కప్పు; సన్నగా తరిగిన పచ్చి మిర్చి – 2; వెల్లుల్లి తరుగు – ఒక టీ స్పూను; మిరప కారం – అర టీ స్పూను; ఇంగువ – పావు టీ స్పూను; నీళ్లు – 3 కప్పులు; మొక్క జొన్న పిండి – 2 టేబుల్ స్పూన్లు; ఉప్పు – తగినంత.

సాగు కోసం... ఉల్లి తరుగు – అర కప్పు; నూనె – 2 టేబుల్ స్పూన్లు; ఉడికించిన సగ్గు బియ్యం – 3 కప్పులు

తయారీ: ● అన్ని ఆకు కూరలను శుభ్రంగా కడిగి, సన్నగా తరిగి పక్కన ఉంచాలి ● కుకర్‌లో పైన చెప్పిన పదార్థాలన్నిటినీ (మొక్క జొన్న పిండి కాకుండా) వేసి మూత పెట్టి స్టౌ మీద ఉంచి ఉడికించి దింపేయాలి ● చల్లారిన తరవాత, మొక్కజొన్న పిండి జత చేసి మెత్తగా అయ్యేవరకు కవ్వంతో బాగా గిలకొట్టి, ఈ మిశ్రమాన్ని ఒక బాణలిలో పోసి, స్టౌ మీద ఉంచి, బాగా చిక్కబడేవరకు సుమారు అర గంట సేపు సన్నని మంట మీద ఉడికించి దింపేయాలి ● స్టౌ మీద బాణలి ఉంచి వేడయ్యాక నూనె లేదా నెయ్యి వేసి కాచాలి ● ఉల్లి తరుగు వేసి బంగారు రంగులోకి వచ్చేవరకు వేయించాలి ● ఉడికించి ఉంచుకున్న సగ్గుబియ్యాన్ని జత చేయాలి ● మంట బాగా తగ్గించి కలుపుతుండాలి ● ఉడికించిన ఆకు కూరల మిశ్రమం కూడా జత చేసి మరోమారు కలిపి దింపేయాలి ● ఉల్లి చక్రాలు, పచ్చిమిర్చితో అలంకరించాలి ● రోటీలతో తింటే రుచిగా ఉంటుంది.

తమిళనాడు కట్టు పొంగల్

కావలసినవి: పెసర పప్పు – 150 గ్రా.; కొత్త బియ్యం – 100 గ్రా.; మిరియాలు – 15 (పొడి చేయాలి); పచ్చి మిర్చి – 6; పచ్చి కొబ్బరి – ఒక కప్పు; నెయ్యి – పావు కప్పు; జీడి పప్పులు – 15; జీలకర్ర – అర టీ స్పూను; ఆవాలు – పావు టీ స్పూను; ఎండు మిర్చి – 3; మినపప్పు + సెనగ పప్పు – 2 టేబుల్ స్పూన్లు; కొత్తిమీర – కొద్దిగా; కరివేపాకు – రెండు రెమ్మలు; ఉప్పు తగినంత ; ఇంగువ – కొద్దిగా

తయారీ: ● దళసరి పాత్రలో కొద్దిగా నెయ్యి వేసి స్టౌ మీద ఉంచి వేడి చేయాలి ● పెసర పప్పు వేసి దోరగా వేయించాలి ● బియ్యం కడిగి నీళ్లన్నీ తీసేసిన తరవాత బియ్యం కూడా వేసి సుమారు ఐదు నిమిషాల పాటు బాగా వేయించి (తెలుపు రంగు పోకూడదు) తీసి పక్కన ఉంచుకోవాలి ● అదే బాణలిలో మరి కాస్త నెయ్యి వేసి కరిగాక, మిరియాల పొడి వేసి వేయించాక, జీడిపప్పులు వేసి వేయించి తీసి పక్కన పెట్టుకోవాలి ● ఒక గిన్నెలో నాలుగు కప్పుల నీళ్లు, సన్నగా తరిగిన పచ్చి మిర్చి, పచ్చి కొబ్బరి, వేయించిన బియ్యం, పెసర పప్పు ఇవన్నీ వేసి కుకర్‌లో ఉంచి మూడు విజిల్స్ వచ్చేవరకు ఉంచి దింపేయాలి ● స్టౌ మీద బాణలి ఉంచి వేడయ్యాక కొద్దిగా నెయ్యి వేసి కరిగించాలి ● ఆవాలు, మినపప్పు, పచ్చి సెనగ పప్పు, జీలకర్ర, ఎండు మిర్చి, ఇంగువ, కరివేపాకు వేసి వేయించాక, తయారుచేసి ఉంచుకున్న పొంగలిలో వేయాలి ● ఉప్పు వేసి బాగా కలియబెట్టి వేడి వేడిగా సర్వ్ చేయాలి.



కశ్మీరీ పులావ్

కావలసినవి: నెయ్యి – 3 టేబుల్ స్పూన్లు; బిర్యానీ ఆకు – 1; దాల్చిన చెక్క – చిన్న ముక్క; ఏలకులు 2; జీలకర్ర – 2 టీ స్పూన్లు; బాస్మతి బియ్యం – ఒక కప్పు; పాలు – ముప్పావు కప్పు; నీళ్లు – ఒకటింపావు కప్పులు; ఉప్పు – తగినంత; కుంకుమ పువ్వు – పావు టీ స్పూను; తాజా క్రీమ్ – 3 టీ స్పూన్లు; కిస్‌మిస్ – 2 టేబుల్ స్పూన్లు; వేయించిన బాదం పప్పులు + జీడి పప్పులు + వాల్నట్స్ + పిస్తాలు – ముప్పావు కప్పు; పంచదార – 2 టీ స్పూన్లు; వేయించిన ఉల్లి తరుగు – పావు కప్పు.

తయారీ: ● బాస్మతి బియ్యాన్ని శుభ్రంగా కడిగి, తగినన్ని నీళ్లు పోసి గంటసేపు నానబెట్టాలి ● స్టౌ మీద బాణలిలో నెయ్యి వేసి కరిగాక బిర్యానీ ఆకు, దాలిన చెక్క, లవంగాలు, ఏలకులు వేసి వేయించాలి ● జీలకర్ర జత చేసి మరోమారు కలపాలి ● బాస్మతి బియ్యం జత చేసి రెండు మూడు నిమిషాలు కలియబెట్టాలి ● పాలు, నీళ్లు జత చేసి కలపాలి ● ఉప్పు, కుంకుమ పువ్వు, క్రీమ్ జత చేసి మరోమారు కలియబెట్టాలి ● మూత పెట్టి, సన్నని మంట మీద సుమారు 20 నిమిషాలు పాటు ఉడికించాలి ● బాగా ఉడికిన తరవాత పంచదార, కిస్‌మిస్ వేసి కలపాలి ● వేయించిన బాదం పప్పులు, జీడి పప్పులు, వాల్నట్స్, పిస్తాలు వేసి బాగా కలిపి మరో మూడు నిమిషాలు ఉడికించి దింపేయాలి ● రైతాతో అందించాలి. (దానిమ్మ గింజలు, యాపిల్ ముక్కలు కూడా వేసుకోవచ్చు).



తెలంగాణ గుత్తి దోసకాయ



కావలసినవి: బుడమకాయలు (చిన్న చిన్న దోసకాయలు) – 5; కారం – టీ స్పూన్; ఉప్పు – తగినంత; పచ్చిమిర్చి – 2 (నిలువుగా కట్ చేసుకోవాలి); నువ్వుల పొడి – టీ స్పూన్; ధనియాల పొడి – అర టీ స్పూన్; అల్లం వెల్లుల్లి పేస్ట్ – అర టీ స్పూన్; కరివేపాకు – 2 రెమ్మలు; కొత్తిమీర – తగినంత; నూనె – టేబుల్ స్పూన్; జీలకర్ర, ఆవాలు – అర టీ స్పూన్; పసుపు – కొద్దిగా; ఉల్లిపాయలు – 1 (సన్నగా తరగాలి).

తయారీ: ● దోసకాయల ముచ్చికల వద్ద కొద్దిగా కట్ చేసి, చేదుగా ఉందో లేదో చెక్ చేయాలి. నాలుగువైపులా (గుత్తి వంకాయను కట్ చేసినట్టుగా) కట్ చేయాలి. లోపల కొద్దిగా గింజలు తీయాలి. ఈ గింజలను కూడా మెత్తగా రుబ్బి కూరలోకి వాడుకోవచ్చు ● కారం, ఉప్పు, ధనియాలపొడి, నువ్వుల పొడి (దోసకాయలు పులుపు లేకపోతే కొద్దిగా చింతపండు వాడుకోవచ్చు) కలిపి రోట్లో దంచాలి. ఈ మిశ్రమాన్ని దోసకాయల్లో కూరాలి ● పొయ్యిమీద గిన్నెపెట్టి వేడయ్యాక నూనె వేయాలి. దీంట్లో జీలకర్ర, ఆవాలు, ఉల్లిపాయలు వేసి వేగనివ్వాలి. తర్వాత దీంట్లో అల్లం వెల్లుల్లిపేస్ట్ వేసి కలపాలి. పసుపు, కరివేపాకు, పచ్చిమిర్చి, సిద్ధంగా ఉంచుకున్న దోసకాయలను వేసి కలపాలి ● గిన్నె మీద ఆవిరిమూత (కొద్దిగా నీళ్లుపోసిన మరొక గిన్నె) పెట్టి సన్నని మంటమీద ఉడకనివ్వాలి ● మధ్యమధ్యలో దోసకాయలను కలుపుతూ, గ్రేవీకి అవసరమైనంతగా నీళ్లు ఊరుతున్నాయో లేదో సరిచూసుకోవాలి. చాలకపోతే కొద్దిగా నీళ్లు జతచేయవచ్చు ● ముక్క ఉడికి, నూనె తేలినట్టుగా కనిపిస్తే కొద్దిగా ధనియాలపొడి, కొత్తిమీర చల్లి దించేయాలి ● అన్నం, రోటీల్లోకి ఈ గుత్తి దోసకాయ రుచికరంగా ఉంటుంది.

కేరళ ఇడియాప్పమ్



కావలసినవి: బియ్యప్పిండి–ఒక కప్పు; కొబ్బరి తురుము – ఒక కప్పు; నీళ్లు – ఒక కప్పు; ఉప్పు – తగినంత; నూనె/నెయ్యి – ఇడ్లీ ప్లేట్‌కు రాయడానికి తగినంత.

తయారీ: ● స్టౌ మీద బాణలి వేడయ్యాక బియ్యప్పిండి వేసి కొద్దిసేపు వేయించి తీసేయాలి ● స్టౌ మీద ఒక గిన్నెలో నీళ్లు పోసి మరిగించి దింపేయాలి ● ఆ నీళ్లలో బియ్యప్పిండి, ఉప్పు వేసి మెత్తగా అయ్యేలా కలుపుకోవాలి ● తడి వస్త్రం మూతలా వేయాలి ● కొద్దికొద్దిగా పిండి తీసుకుని జంతికల గొట్టంలో ఉంచాలి ● ఇడ్లీ రేకులకు నెయ్యి లేదా నూనె పూయాలి ● కొద్దిగా కొబ్బరి ఈ రేకులలోకి బియ్యప్పిండిని చక్రాల మాదిరిగా తిప్పాలి ● అలా అన్ని రేకులలో వేసుకుని, కుకర్‌లో ఉంచి ఆవిరి మీద ఉడికించి, దింపేయాలి ● ప్లేటులోకి తీసుకుని, కొబ్బరి చట్నీ లేదా పల్లీ చట్నీతో అందించాలి.

కర్ణాటక బిసిబేళ బాత్



కావలసినవి: ధనియాలు – 4 టీ స్పూన్లు; పచ్చి సెనగ పప్పు – 4 టీ స్పూన్లు; మినప్పప్పు – 2 టీ స్పూన్లు; జీలకర్ర – ఒక టీ స్పూను; మెంతులు – పావు టీ స్పూను; మిరియాలు – అర టీ స్పూను; ఏలకులు – 4; దాల్చిన చెక్క – చిన్న ముక్క; లవంగాలు – 4; ఎండు కొబ్బరి తురుము – 2 టేబుల్ స్పూన్లు; గసగసాలు – 2 టీ స్పూన్లు; నువ్వులు – ఒక టీ స్పూను; నూనె – ఒక టీ స్పూను; కాశ్మీరీ ఎండు మిర్చి – 12; కరివేపాకు – మూడు రెమ్మలు; ఇంగువ – చిటికెడు; క్యారట్ – 1 (చిన్నది); బీన్స్ – 5; పచ్చి బఠాణీ – 2 టేబుల్ స్పూన్లు; బంగాళదుంప – అర చెక్క (ముక్కలు చేయాలి); పల్లీలు – 2 టేబుల్ స్పూన్లు; నీళ్లు – 2 కప్పులు; పసుపు – పావు టీ స్పూను; ఉప్పు – తగినంత; చింతపండు రసం – ముప్పావు కప్పు (కొంచెం చిక్కగా ఉండాలి); బెల్లం పొడి – అర టీ స్పూను; ఉల్లి పాయ – అర చెక్క (ముక్కలు చేయాలి); ఉడికించిన కంది పప్పు – ఒక కప్పు; అన్నం – రెండున్నర కప్పులు; నీళ్లు – ఒక కప్పు; నెయ్యి – ఒక టేబుల్ స్పూను

పోపు కోసం: నెయ్యి – 2 టేబుల్ స్పూన్లు; ఆవాలు – ఒక టీ స్పూను; ఎండు మిర్చి – 1 (ముక్కలు చేయాలి); ఇంగువ – కొద్దిగా; కరివేపాకు – 2 రెమ్మలు; జీడిపప్పులు – 10

తయారీ: ● ఒక పెద్ద పాత్రలో కూరగాయ ముక్కలు, పల్లీలు, నీళ్లు, పసుపు, ఉప్పు వేసి స్టౌ మీద ఉంచి ముక్కలు మెత్తపడేవరకు ఉడికించాలి ● ముక్కలు బాగా ఉడికిన తరవాత చింతపండు రసం, బెల్లంపొడి, ఉల్లి తరుగు వేసి సుమారు పదినిమిషాల పాటు ఉడికించాలి ● ఉడికించిన పప్పు, అన్నం జతచేసి బాగా కలిపి మరో కప్పు నీళ్లు పోసి కలియబెట్టి, మూత పెట్టాలి ● కొద్దిసేపటి తరవాత 4 టీ స్పూన్ల బిసిబేళబాత్ మసాలా వేసి సన్నని మంట మీద 20 నిమిషాల పాటు ఉడికించి దింపేయాలి ● చిన్న బాణలి స్టౌ మీద ఉంచి వేడయ్యాక నెయ్యి లేదా నూనె వేసి కాగాక పోపు కోసం తీసుకున్న సరుకులను వేసి వేయించి, సిద్ధం చేసుకున్న బిసిబేళబాత్ మీద వేసి బాగా కలిపి, వేడివేడిగా అందించాలి.

మధ్యప్రదేశ్ పోహా జిలేబీ

కావలసినవి: గట్టి అటుకులు – 2 కప్పులు; ఉల్లి తరుగు – పావు కప్పు; ఆలుగడ్డ తరుగు – పావు కప్పు; ఆవాలు – ఒక టీ స్పూను; సోంపు – పావు టీ స్పూను; తరిగిన పచ్చి మిర్చి – 3; కరివేపాకు – 2 రెమ్మలు; మిరప కారం – అర టీ స్పూను; ఉప్పు – తగినంత; కొత్తిమీర తరుగు – 2 టేబుల్ స్పూన్లు; పసుపు – చిటికెడు.

గార్నిషింగ్ కోసం... నిమ్మ చెక్కలు – రెండు; సేవ్ – అర కప్పు; దానిమ్మ గింజలు – అర కప్పు; కొబ్బరి తురుము – పావు కప్పు; ఉల్లి తరుగు – పావు కప్పు

తయారీ: ● అటుకులను రెండు మూడు సార్లు శుభ్రంగా కడిగి, నీళ్లు ఒంపేసి ఒక పాత్రలోకి తీసుకోవాలి ● ఉప్పు, మిరపకారం జత చేసి కలపాలి ● స్టౌ మీద బాణలి ఉంచి వేడయ్యాక, రెండు టీ స్పూన్ల నూనె వేసి కాచాలి ● ఆవాలు వేసి చిటపటలాడించాక, సోంపు, ఉల్లి తరుగు, పచ్చి మిర్చి తరుగు, కరివేపాకు, ఆలుగడ్డల తరుగు, పసుపు వేసి బాగా కలియబెట్టి మూత పెట్టి మెత్తగా అయ్యేవరకు ఉడికించాలి ● అటుకుల మిశ్రమం జత చేసి బాగా కలిపి మూత పెట్టాలి ● ఐదు నిమిషాల తరవాత కొత్తిమీర తరుగు వేసి కలిపి దింపేయాలి ● గార్నిషింగ్‌లో చెప్పిన పదార్థాలతో అలంకరించి జిలేబీతో జత చేసి అందించాలి (మధ్య ప్రదేశ్‌లో ముఖ్యంగా ఇండోర్‌లో దీనిని ఎక్కువగా ఇష్టపడతారు).



జిలేబీ... కావలసినవి: మైదా పిండి – ముప్పావు కప్పు; కార్న్; స్టార్చ్ – పావు కప్పు; పెరుగు – ఒక కప్పు; ఫుడ్ కలర్ – చిటికెడు; వేడి నూనె – 2 టేబుల్ స్పూన్లు; కుంకుమ పువ్వు – చిటికెడు; నిమ్మ రసం – ఒక టీ స్పూను; ఒక పాత్రలో పైన చెప్పిన పదార్థాలన్నీ వేసి మెత్తగా వచ్చేలా బాగా కలిపి, పైన మూత పెట్టి సుమారు 24 గంటల సేపు వదిలేయాలి.

పంచదార పాకం కోసం... పంచదార – ఒకటిన్నర కప్పులు; నీళ్లు – అర కప్పు

తయారీ: ● ఒక పాత్రలో పంచదార, నీళ్లు పోసి, స్టౌ మీద ఉంచి తీగ పాకం వచ్చేవరకు కలిపి దింపేయాలి ● సిద్ధమైన జిలేబీ పిండిని, కెప్ బాటిల్‌లోకి తీసుకోవాలి ● మూతకు చిన్న రంధ్రం చేయాలి ● స్టౌ మీద బాణలిలో నూనె పోసి కాగాక, అందులోకి జిలేబీ ఆకారంలో వచ్చేలా సీసాను గుండ్రంగా తిప్పుతూ వేయాలి ● రెండువైపులా దోరగా కాలిన తరవాత, తీసి, పంచదార పాకంలో వేయాలి ● ఈ విధంగా మొత్తం పిండితో తయారుచేసుకుని, పాకంలో వేసి ఒక గంటసేపు వదిలేయాలి ● ఆ తరవాత తింటే జిలేబీలలోకి పాకం చేరి రుచిగా ఉంటాయి.

తుల
(సెప్టెంబర్ 23 - అక్టోబర్ 22)

ఇంట్లో ఉన్న గాలిపటంకాని ఆపకుండా వచ్చేసినట్లయితే ఎలా? అలాగే తిరుగుతూనే మీరొచ్చేవరకూ కూడా కనిపిస్తూ ఉంటుందో 'దానంతట అది ఆగిపోవాలి' అనుకో(లే)దో అలాగే మీది కూడా – ఓ విషయమంటూ బుద్ధిలో పడితే తీవ్రంగా దాన్ని గురించే ఆలోచించే లక్షణమున్న రాశి. కాబట్టి ఆలోచనల భారాన్ని అనుక్షణం మోస్తూనే ఉంటారు. దాంతో వైద్యుడు, చికిత్స, ఔషధాలు... వాటివల్ల మరో చిన్న చిన్న ఇబ్బందులు (సైడ్ ఎఫెక్ట్స్) వస్తూనే ఉంటాయి. కుండకి చిల్లు పడితే దానికి పూర్వం రోజుల్లో చిన్న మాటుని గట్టిగా జిగురుగా ఉండే ఒండ్రుమట్టితో వేస్తూండేవారు. అలా మీ బుద్ధిని మీరు నిరోధించుకో(లే)ని పక్షంలో ఇప్పటికే కొంతగా దెబ్బతిన్న ఆరోగ్యం మరికొంత కిందికి వెళ్లచ్చు. ఇలా చెప్పడానిక్కారణం మీరు చదువుకునే రోజుల్లో మీకు చదువు కంటే వేరైన ఓ లలిత కళలో ప్రవేశం అభినివేశం ఉండడమే కాక, కొన్ని బహుమతుల్ని కూడా పొంది ఉండి ఉండడమే. ఆరోగ్యం జాగ్రత్త! భారతంలో కౌరవులు, పాండవులు అని ఇద్దరున్నారు కదా! పాండవులెప్పుడూ అరణ్యాల్లోనే ఉంటూ అందరూ తమని చూడడానికి వస్తూంటే సంతోషంగానే గడుపుతూండేవారు. అరణ్యాల్లో పాండవులు అలా ఆనందంగా ఉంటూంటే, దివ్యరాజ భవనాల్లో సకల సౌఖ్యాలు ఉన్న కౌరవులు మాత్రం నిరంతరం ఆలోచనలతో మాయోపాయాలతో దురాలోచనలతో ఎక్కడ పాండవులు తమకి ఏ ఇబ్బందిని కలిగిస్తారో అనే భయంతోనే ఉంటూండేవారు. కారణం ఒకటే. తమది కానిదాన్ని తాము ఆక్రమించుకుని ఉండడమే. జూదమనే అధర్మ కార్యంతో రాజ్యాన్ని సాధించామని అనుకుంటూ ఉండడమే. న్యాయస్థానంలో మీరెన్ని అసత్యాలని రాసి సమర్పించినా నిజమేదో మీకు తెలుసు. అందుకే నిజాన్ని ఒప్పుకుంటూ మీకు శత్రువులా భావించే వ్యక్తుల వద్దకి వెళ్తే జీవిత సమస్య క్షణంలో విడిపోతుంది. గమనించుకోండి.

లౌకిక పరిహారం: ఒకఅబద్ధాన్ని నిరూపించుకోవడానికి మరికొన్ని అబద్ధాలని ఆడాలని చెప్తే వద్దని చెప్పండి.

అలౌకిక పరిహారం: మన్యు సూక్తంతో ఆంజనేయునికి అభిషేకం మంచిది.

ధనుస్సు
(నవంబర్ 22 - డిసెంబర్ 21)

ఎక్కడ ఏ వస్తువుని పడేసినా – అయ్యో! మీరు ఈ వస్తువుని ఇక్కడ పడేసి మర్చిపోయారంటూ అందించే కాలం అయిపోయింది. ఇప్పుడు మీ శరీర అవయవాలనే రక్షించుకుంటూ చూసుకోవలసిన కాలం – అంటే చేతిని దూరంగా జరిపి కూచుంటే అక్కడ ఏదైనా పడే వస్తువు ఉందా? లేక ఏదైనా విద్యుత్ పరికరం గాని ఉందా? అడుగుని సరైన చోటనే వేస్తున్నానా? అని ఆలోచించాల్సిన జాగ్రత్త తీసుకోవాల్సిన కాలం వచ్చిందన్న మాట. అలాగని వణుకుతూ కూర్చోకండి. తగిన జాగ్రత్తతో ఉంటూ ఉండాల్సిందేనని అర్థం తప్ప భయపెట్టేయడం దీని లక్ష్యమే కాదు.

సంతానాన్ని పొరుగూళ్లో చదివించదలిచిన తల్లిదండ్రులు అక్కడ తమ సంతానాన్ని విడిచి వచ్చేసి – ఇక తమ బాధ్యత అయిపోయిందని ఎలా అనుకోకుండా అనుక్షణం వాళ్లతో మాట్లాడుతూ క్షేమ సమాచారాన్ని తెలుసుకుంటూ అప్పుడప్పుడు వెళ్లి చూస్తూ ఉంటారో అలాగే భగవంతుడు మీకు ఈ కష్ట స్థితిని ప్రసాదించినా అనుక్షణం మీ బాగోగుల్ని పరామర్శిస్తూనే ఉంటాడు. కాబట్టే రావలసినంత ఆపద ఎప్పుడూ రాదు. రావలసిన కష్టం రాకుండానూ ఉండదు. దైవధ్యానమే దీనికి సరైన పరిష్కారం.

వ్యాపారస్థుల మీద నిఘా, ఉద్యోగంలో అధికారి మందలింపులూ, వృత్తిలో పనుల ఆలస్యం... వంటివి సాగచ్చు. ఎంతగా గొడుగుని నెత్తిమీద వేసుకు వెళ్లినా ఇటూ అటూ తడవకుండా ఉండగలమా? ఇదీ అంతేనని భావించండి. చిత్రమేమంటే దాంపత్యంలో అన్యోన్య భావం ఉంటుంది. సంతానం మరో పరీక్ష ఇంకో పరీక్ష అనుకుంటూ వెళ్తూ ఉత్తీర్ణతని సాధిస్తూనే ఉంటారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఉద్యోగ వ్యాపార వృత్తుల్ని మారకండి. మెడని పట్టుకుని నెడుతూంటే చూరు పట్టుకుని వేళ్లాడాడని సామెత. కొంత కాలం ఇలా ఉండక తప్పదు. అధైర్యపడద్దు.

లౌకిక పరిహారం: స్థానచలనం ఉద్యోగ మార్పు వద్దు. జాగ్రత్తలో ఉండండి.

అలౌకిక పరిహారం: శివారాధనం ఫలప్రదం.

కుంభం
(జనవరి 20 - ఫిబ్రవరి 18)

కోళ్ల పందేలలో ఏదో ఒక కోడి ఎదుటి కోడితో యుద్ధాన్ని చేయలేక పరాజయంతో బరిలో నుండి పరిగెత్తి పారిపోతూంటే, ఆ కోడి యజమాని మళ్లీ దాన్ని పట్టుకొచ్చి మళ్లీ బరిలో పెడుతూ అది చనిపోయేవరకూ యుద్ధాన్ని చేయిస్తూనే ఉంటాడు. అది వాని స్వార్థబుద్ధి. అలాగే మీరు ఓ వివాదంలో పడి ఒక అనవసరమంటూ వెనకడుగు వేయగానే, మళ్లీ మిమ్మల్ని రెచ్చగొడుతూ ఆ వివాదంలోనికి నెట్టే వ్యక్తులు వచ్చే అవకాశముంది. ఏ మాత్రమూ రెచ్చిపోకండి. దెబ్బతినేది మీరు తప్ప రెచ్చగొట్టే వాళ్లకి కలిగే నష్టమేముంది? భారతంలో ఓ బొంతకాకిని అన్ని కాకులూ కలిసి రెచ్చగొట్ట హంసతో పోటీకి పోవలసిందని చెప్పి దాని ప్రాణం పోయేలా చేసారని భీష్ముడు చెప్తాడు ఓ చోట. అందుకే పురాణాలని చదివాలి ప్రతి ఒక్కరూ. కుటుంబసభ్యుల్లో ఉండే ఐకమత్యం కారణంగా ఓ బలమైన కోటలో శత్రువుల దాడి ఊహకి కూడ అందని సందర్భంలో ఆ రాజు ఎంత ఆనందంగా ఉంటాడో అలా ఉండగలుగుతారు ఈ వారమంతా. కొంతకాలంలో శుభకార్యక్రమానికి సొమ్ముని వెచ్చించవలసిన అవసరముంది కాబట్టి ధనాన్ని కొద్దిగా ఆలోచించుకుని మాత్రమే ఖర్చు చేయండి. ముఖ్యంగా గృహంలో విలాసవస్తు సేకరణం వంటివి తాత్కాలికంగా మానుకోవడం మంచిది. దూరపు ప్రయాణాలని గాని చేయవలసి వస్తే శరీరం దానికి సహకరించని పక్షంలో మొగమాట లేకుండా 'రాలే'నని చెప్పండి తప్ప ఏదో సాకుని చెప్పి తప్పించుకుని మీ గురించిన వ్యక్తిత్వంలో మచ్చని తెచ్చుకోకకండి. అదే తీరుగా రుణాన్ని ఎవరైనా అడిగినా నిర్భయంగా చెప్పండి ఇస్తానని, ఇవ్వలేనని తప్ప మధ్యపెట్టి చుట్టూ తప్పించుకుని చివరికి లేదని చెప్పకండి. ఈ తీరు సంఘటనల వేళ్ల క్రమక్రమంగా బలమైన మీ పట్ల విముఖతనీ ఇతరులకి అసహకార బుద్ధినీ కలగజేస్తాయి.

లౌకిక పరిహారం: రెచ్చగొట్టినా రెచ్చగొట్టబడకండి. మొగమాటాలు వద్దు.

అలౌకిక పరిహారం: నవగ్రహ ప్రదక్షిణలు మంచివి.

వృశ్చికం
(అక్టోబర్ 23 - నవంబర్ 21)

పాములు తమ చుట్టూ తిరుగాడుతూ ఉండే ప్రదేశానికి బదిలీ గాని అయినట్లయితే మొదటిగా పాము కనిపించినప్పుడు రోజురోజంతా అదే చర్చ – నివారణోపాయం... ఏమీ లేదని నిర్ణయించుకోవడంతో ముగిసిపోతుంది. చెప్పలేని భయం. రెండోసారి కనిపిస్తే కొంత భయం తగ్గి, తగు జాగ్రత్తల మీదికి దృష్టి మళ్లుతుంది. ఇక ఆ మీదట భయం ఉండదు గాని మరింత జాగ్రత్త దృష్టి పెరుగుతుంది. అదే అవసరం భయపడుతూ ఉండడం కంటే. లోగడ ఉన్నంత భయం – ఏం జరుగుతుందోననే మనోవేదన... పూర్తిగా తగ్గిపోయి – ఏం జరిగినా సరే! అనే దృఢ ధైర్యం ఉదాసీన భావం స్పష్టంగా వచ్చేస్తుంది – వచ్చేసింది కూడా. ఇదే ధైర్యంతో ఉండండి. ఎక్కడెక్కడి మబ్బుల్లో క్రమంగా ఓ చోటికి చేరుతున్నట్టు ఆకాశంలో కనిపిస్తోంది కదా! ఏ ప్రదేశానికి ఆ మబ్బులన్నీ చేరి వర్షింపబోతున్నాయో తెలుస్తూ వర్షం పడని చోటుకి వెళ్లడమో లేక వర్షం వల్ల ఇబ్బంది పడకుండా ఉండేలా కావలసిన గొడుగు, ఇల్లు వంటివి జాగ్రత్తలని తీసుకోవడమో చేస్తారు. ఇలా అనకూడదేమో గాని శని ఎప్పుడూ వ్యక్తికి కష్టంతో పాటు దాన్ని దాటే ఆలోచనని ఇచ్చి తీరుతాడు. బాణం చివరనుండే మురికికి బాణపు గాయం బాధించకుండా ఉండే మందుని పెట్టి కొడతాడట శని. ఎంత మంచి మాట! ఈ జాగ్రత్త ఆత్మధైర్యం భయపడకుండా ఉండడమే కాక ఇతరులక్కూడా ధైర్యాన్ని చెప్పగల శక్తీ... ఇలా అన్నిటినీ ఇప్పుడే కాక జీవితమంతకీ కూడా ప్రబోధించిన ఘనుడు శని మాత్రమే. ఇది నిజం కాబట్టే తన నలుగురు తమ్ములూ యక్షుని సముఖంలో మరగించి కనిపించినా ధర్మరాజు చలించిపోలేదు.

ఇదే ధైర్యంతో, ఆత్మస్థైర్యంతో ఉండండి. విజయం మీదే. అయితే జరుగుతున్నది నత్తల పరుగు పందెం. కాలం అనే మీ నత్త అన్నింటిలోకీ ముందే ఉంది. విజయం మీదే. భయం వద్దు.

లౌకిక పరిహారం: ఆత్మస్థైర్యాన్ని విడువకండి. నిరుత్సాహపరుల్ని దూరంగా ఉంచండి.

అలౌకిక పరిహారం: శని శ్లోకాన్ని ప్రతిరోజూ 361 మార్లు చదువుతూనే ఉండండి.

మకరం
(డిసెంబర్ 22 - జనవరి 19)

'గోడ మీద బొమ్మ గొలుసుల బొమ్మ వచ్చేపోయే వారికి వడ్డించు బొమ్మ' అని చిన్నప్పుడు పాఠాల్లో 'తేలు'ని గురించి ఓ చిన్న గేయం ఉండేది. అప్పటి రోజుల్లో దానికి అర్థం తెలియదు. ఇప్పుడు అనుభవపూర్వకంగా మీకు టీకా తాత్పర్యాలతో తెలుస్తుంది. మీరు చేస్తూండే పనులకి తెలిసినవాళ్లూ, తెలియనివాళ్లూ, పాపం మీ మీద వ్యతిరేకత లేకున్నా పొరపాటున మీకు వ్యతిరేకత కలుగజేసినవాళ్లూ.. ఇలా – 'తేలు అనేది మంచివాడా? చెడ్డవాడా? అని గమనించకుండా ఎవరు తన దగ్గర వేలుని పెడితే వాళ్లని కుట్టి బాధపెట్టేట్టు'.. సమస్యల్ని సృష్టిస్తూ మానసిక వ్యధని కల్గిస్తూనే ఉంటారు. అయినా చినుకు చినుకు మధ్య వేగంగా గుర్రం మీద వెళ్లే నేర్పరితనం ఉన్న సహదేవునిలా మీరు కష్టం నుండి తప్పించుకుంటూ సాగిపోతూనే వెళ్తారు. ధైర్యంగా ఉండండి.

ఓ మంచివార్త – సంతానప్రాప్తీ సంతానానికి మంచి చోట కళాశాలలో చేరే అవకాశం లేదా ఉద్యోగ ప్రాప్తీ.. వంటివి కలుగబోతోందని మీకు స్పష్టంగా తెలిసిన కారణంగా ఈ వృత్తి ఉద్యోగవ్యాపారపు చికాకులు మీకు ఏ మాత్రమూ పట్టవు. అది ఆనందకరవిషయమే కదా! మీకున్న బంధుబలమెంతో వాళ్లు మీకు ఏవేవో సందర్భాల్లో సహకరిస్తున్న తీరుతెన్నుల ద్వారా స్పష్టంగా అర్థమై మానసికంగా దృఢంగా ఉంటారు. ఇరుగుపొరుగులతో వాగ్వివాదాలు వద్దు. మానసికమైన ఒత్తిడికి అవి కూడ కారణాలు ఔతాయి. 'అతిపరచయాదవజ్ఞా సంతతగమనా దనాదరః' అని సంస్కృతంలో ఓ సూచన.

ఎక్కువెక్కువ పరిచయాలని పెంచేసుకుంటే అవమానం, అస్తమానం వాళ్లింట్లో వీళ్లూ వీళ్లింట్లో వాళ్లూ – కలిసి మెలిసి ఉంటామనుకుంటూ తిరుగుతూంటే నిరాదరణా కలుగుతాయని దానర్థం. ఈ సూచనని గమనించి ప్రవర్తించడం మంచిది.

లౌకిక పరిహారం: ఎండా నీడల్లా కష్టం సుఖం దోబూచులాడుతూంటే దానికి అనుగుణంగా ప్రవర్తించండి.

అలౌకిక పరిహారం: నిత్యం దేవాలయదర్శనం మంచిది.

మీనం
(ఫిబ్రవరి 19 - మార్చి 20)

ఒక్కరుగా వ్యాపారం మంచిది కాదు. సమష్టిగానే చేస్తూ ఉండండి. ముఖ్యంగా అన్నదమ్ములతో కలిసి మెలిసి వ్యాపారాన్ని గాని చేస్తూ ఉంటే విశేషలాభాలు కన్పించవచ్చు. మరొకరు చేస్తారనే భావాన్ని విడిరి మీరు మీరుగా చేయగలిగినంత శ్రమనీ వ్యాపారవిషయంలో చేస్తూనే ఉండండి. ఒక కట్టెని ఎవరైనా తేలిగ్గా విరిచేయగలరు గాని, కట్టెల మోపుని ఒక్కసారిగా విరుగగొట్టడమనేది అసాధ్యం కదా! ఆ సమైక్య భావానికి నిరంతరం అందరూ కృషి చేసుకుంటూ ఉండండి. ప్రస్తుతానికి అనుకూల ఫలితాలేమీ లేవు. ఆర్థికంగా లాభం ఉంది. అయాచితంగా తమకి లభించిన అర్ధరాజ్యంతో ఆనందపడని సంతృప్తి పడని కౌరవులు ఆ పాండవులు అర్ధరాజ్యాన్నీ కాజేయాలనే ఆలోచనతో మొత్తం నాశనాన్నే చేసుకున్నారు. తనకున్న భార్య మండోదరితో సంతృప్తిపడని రావణుడు సీతమ్మని తెచ్చుకుని మొత్తం రాక్షసజనాన్నీ లంకనీ కూడ సమూలంగా నాశనం చేసుకున్నాడు. మీ భాగస్వాములందరితో కూడ ఈ విషయాన్నే చెప్తూ ఉండండి. ఈ ఉన్న సంస్థని విస్తరింపజేసుకోవడం మంచిది తప్ప, అత్యాశతో మరో వ్యాపారాన్ని ప్రారంభించడం ప్రస్తుతానికి సత్ఫలితాలనీయదని, ఆ దిశగానే ఉండేలా చూసుకుంటూ ఉండండి అందరినీ కూడ. ప్రయాణ సందర్భాలలో వస్తువులని గురించిన జాగ్రత్తని పాటించండి. వాహనాలని నడిపే సందర్భంలో కూడ శ్రద్ధతో ఉండండి. సంతానం చదువూ ప్రవర్తనా కూడ ప్రోత్సాహకరంగా ఉంటుంది. మిమ్మల్ని ఆశ్రయించుకుని మీ సంస్థలో ఎవరెవరు కింది ఉద్యోగులుగా ఉన్నారో వాళ్లలో ఎవరికైనా ఆరోగ్యసమస్యలూ ఆర్థిక సమస్యలూ గాని ఉంటే చేతనైనంతలో సహాయపడండి తప్ప ఆ ఉద్యోగిని తొలగించి కొత్తవారిని తెచ్చుకోవడం మంచిది కాదు. గ్రహించుకోండి.

లౌకిక పరిహారం: సంతృప్తి పడండి. కొత్త వ్యాపార ఆలోచన వద్దు ప్రస్తుతానికి.

అలౌకిక పరిహారం: శ్రీ విష్ణు సహస్రనామ పఠనం ఉత్తమం.



రాజ్యాంగ పీఠిక చెబుతున్నదిదే!

భారత ప్రజలమైన మేము..
'భారతదేశాన్ని సర్వసత్తాక– సామ్యవాద – లౌకిక – ప్రజాస్వామిక – గణతంత్ర రాజ్యంగా నిర్మించుకునేందుకు..
పౌరులందరికీ సాంఘిక – ఆర్థిక – రాజకీయ న్యాయాన్ని..
ఆలోచన – భావ ప్రకటన – విశ్వాసం – ధర్మం – ఆరాధనలపై స్వేచ్ఛను..
అంతస్తుల్లో – అవకాశాల్లో సమానత్వాన్ని చేకూర్చుకునేందుకు..
వారి వ్యక్తిగత గౌరవాన్ని, జాతీయ ఐక్యత, సమగ్రతను సంరక్షిస్తూ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించేందుకు..'

మనం రాజ్యాంగాన్ని రూపొందించుకున్నాం. రాజ్యాంగ పీఠికలోని పై వాక్కులు భారత రాజ్యాంగ మూలతత్వాన్ని ప్రతిబింబిస్తు న్నాయి. రాజ్యాంగ లక్ష్యాలను మరింత మెరుగ్గా అర్థం చేసుకునేందుకు ఇవి దోహదపడతాయి. ఈ పీఠికే రాజ్యాంగానికి ఆత్మ. పీఠికలో భారతదేశాన్ని సర్వసత్తాక, ప్రజాస్వామిక, గణతంత్ర రాజ్యంగానే పేర్కొన్నారు. ఎమర్జెన్సీ సమయంలో (1976లో) 42వ రాజ్యాంగ సవరణ ద్వారా వీటికి.. 'సామ్యవాద', 'లౌకిక'పదాలు చేర్చారు. 'దేశ ఐక్యత'అనే పదాన్ని, 'దేశ ఐక్యత, సమగ్రత'గా మార్చారు. సార్వభౌమాధికారానికి పెద్ద పీట వేయడం ద్వారా భారత దేశం సర్వ స్వతంత్రమైనదని పీఠిక పేర్కొంది. తన విధానాల విషయంలో రాజీ లేని వైఖరి అవలంభించగలదని స్పష్టీకృతమైంది. ప్రజాస్వామ్య మార్గాల్లో 'సామ్యవాద'లక్ష్యాలు సాధించాలనే ఆలోచనకు దేశం కట్టుబడుతుందని తేల్చింది. 'లౌకిక'తత్వానికి లోబడడం ద్వారా మత ప్రమేయం లేని రాజ్యంగా ప్రకటించుకుంది. ఓటు హక్కు ద్వారా తమ ప్రతినిధులకు ఎన్నుకునేందుకు, ఎన్నికల్లో పోటీ చేసేందుకు, పాలనా వ్యవహారాల్లో భాగమయ్యేందుకు వలసిన 'ప్రజాస్వామిక'హక్కులను కట్టబెట్టింది. రాచరికానికి స్థానం లేదని, ప్రజలు మాత్రమే దేశాన్ని పాలిస్తారని (గణతంత్రం) ప్రకటించింది.

విజయాలు పాక్షికమే..

ఒక ప్రజాస్వామిక దేశంగా భారత్ చెప్పుకోదగిన విజయాలు సాధించిందని.. ప్రముఖ చరిత్రకారుడు రామచంద్ర గుహ చెబుతుంటారు. కశ్మీరు సమస్య, ఈశాన్య భారతంలోని కొద్ది ప్రాంతాలను పక్కనబెడితే, మొత్తంగా ఒక ఐకమత్య దేశంగా భారత్ సుదీర్ఘకాలం మనగలగడం ఒక అద్భుతం అన్నారు. అయితే 'ప్రజాస్వామ్యం'విషయంలో మనం 50% మాత్రమే విజయం సాధించామన్నారు. సైన్యం చెప్పుచేతుల్లో వుండే పాకిస్తాన్ రాజకీయ వ్యవస్థను, శ్రీలంక వంటి దేశాలు ఎదుర్కొంటున్న సంక్షోభాలను గమనించినప్పుడు మనం చాలా స్థిమితంగా వున్నామనేది నిస్సందేహం. సమాన అవకాశాల విషయంలో పీఠికలో పేర్కొన్న లక్ష్యాలను చేరుకోవడంలో చాలా వెనకబడి ఉన్నామనేది సుస్పష్టం. చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్ల చట్టం రూపుదాల్చకపోవడాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాల్సిందే.

జయ జయ జయ జయహే

మన గణతంత్రమెంతో ఘనం!

- వందల సవరణలు జరిగినా చెక్కు చెదరని రాజ్యాంగ మౌలిక స్వరూపం
- నేటికీ అన్ని వర్గాలు, ప్రాంతాల వారి హక్కులకు భరోసా
- నెహ్రూ నుంచి మోదీ వరకు.. రాజ్యాంగ పరిరక్షణే ప్రభుత్వాల ధ్యేయం
- 1952లో తొలి సార్వత్రిక ఎన్నికల నిర్వహణతో ముక్కున వేలేసుకున్న ప్రపంచం


అద్భుతం.. అపూర్వం.. 69 ఏళ్లలో.. వందల సవరణలు జరిగినా మౌలిక స్వరూపం చెక్కుచెదరని రాజ్యాంగం మనది. ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగం మనది. ఎన్నో కులాలు, మతాలు, విభిన్న భాషలు, సంప్రదాయాలున్నప్పటికీ.. అందరినీ కలుపుకుని వెళ్తూ ఘనమైన గణతంత్రంగా కొనసాగడానికి అసలైన కారణం బలమైన మన రాజ్యాంగ పునాదులే. రోజురోజుకూ దేశంలో ప్రజాస్వామ్యం బలోపేతమవడానికి కారణం కూడా మన రాజ్యాంగం వేసిన బాటలే. రాజ్యాంగంలోని సెక్షన్లు, చాప్టర్లు దేశంలోని అన్ని ప్రాంతాలు, వర్గాల అవసరాలను తీరుస్తున్నాయి. కొత్తగా ఎదురవుతున్న సమస్యలకూ పరిష్కారాలు చూపిస్తున్నాయి. అందుకే నిస్సందేహంగా మన రాజ్యాంగం 'ది గ్రేట్'.

ఎన్నో సమస్యలు ఒకే పరిష్కారం!

విభిన్న భాషలు, మతాలు, సంప్రదాయాల సంగమమైన విశాల భారతదేశాన్ని దృష్టిలో ఉంచుకుని రాజ్యాంగానికి రూపకల్పన చేయడం ఓ అద్వితీయమైన ప్రక్రియ. అన్ని వర్గాల సంక్షేమాన్ని కాంక్షిస్తూ రూపొందించిన ఇలాంటి రాజ్యాంగాన్ని.. నేటి పరిస్థితుల్లో రాయడం కచ్చితంగా అసాధ్యమనే చెప్పాలి. భారత్‌తోపాటు అనేకమైన ఆసియా, ఆఫ్రికా దేశాలు వలసపాలకులనుంచి విముక్తి పొందినా.. ఆయా దేశాలన్నీ ఇప్పటికీ అంతర్గత కల్లోలాలతో సతమతమవుతున్నాయి. పాకిస్తాన్ పరిస్థితిలో ఇన్నేళ్లయినా మార్పు రాకపోవడమే ఇందుకు సరైన ఉదాహరణ. భారత విభజన కూడా చాలా దుర్మార్గంగా జరిగిందనేది సుస్పష్టం. పంజాబ్, బెంగాల్‌లు రెండేసి ముక్కలుగా విడిపోయిన నేపథ్యంలో చెలరేగిన హింస చరిత్రలో చెరగని మరకలుగా మిగిలిపోయాయి. ఆ తర్వాత పలు సంస్థానాలు భారత్‌లో కలిసే సమయంలోనూ ఇబ్బందులు తప్పలేదు. కశ్మీర్‌లోయలో కొంతభాగం పాక్ ఆధీనంలోకి వెళ్లడం, తదనంతర సమస్యలు నేటికీ ఓ సవాల్‌గా మారాయి. ఇన్ని విచిత్రమైన, విపత్కర సమస్యలు న్నప్పటికీ.. భారత రాజ్యాంగాన్ని అందరూ గౌరవించారు. తొలుత కాంగ్రెస్ ఆ తర్వాత జనతా ప్రభు త్వం, 1999 నుంచి బీజేపీ నేతృ త్వంలోని ఎన్డీయే.. ప్రభు త్వాలేవైనా.. రాజ్యాంగా నికి కట్టుబడి నడుచు కున్నాయి. తొలి ప్రధాని జవహార్‌లాల్ నెహ్రూ నుంచి నరేంద్ర మోదీ వరకు అందరూ రాజ్యాం గంపై ప్రజల్లో విశ్వాసం పెరిగేందుకు చర్యలు తీసుకున్నారు.

ప్రజాస్వామ్య పండగ!

భారత రాజ్యాంగం ప్రకారం పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ నిర్మించడానికి 1950లోనే సుకుమార్ సేన్ ప్రధాన ఎన్నికల అధికారిగా ఎన్నికల కమిషన్ ఏర్పాటైంది. పాశ్చాత్య దేశాల్లో మొదట ఆస్తులున్నవారికి, ఆ తర్వాత చాలా కాలానికి.. కార్మికులు, మహిళలకు ఓటు హక్కు ఇచ్చారు. భారత్‌లో మాత్రం రాజ్యాంగంలో రాసుకున్న విధంగా భాష, లింగ, కుల, మత వివక్ష లేకుండా 21 ఏళ్లు నిండిన పౌరులందరికీ ఓటు హక్కు కల్పించారు. ఎన్నికల కమిషన్ తన మొదటి కర్తవ్యంగా లక్షలాది మంది రాష్ట్ర ప్రభుత్వాల సిబ్బందిని తీసుకుని ఓటర్ల జాబితాలు రూపొందించింది. ప్రజాస్వామ్యంలో గొప్ప ప్రయోగమైన తొలి ఎన్నికలను విజయవంతంగా నిర్వహించారు. రాష్ట్రాల అసెంబ్లీలు, లోక్‌సభకు ఒకేసారి జరిగిన ఈ ఎన్నికల్లో ప్రజలు ఎంతో ఉత్సాహంగా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భారత దేశంలో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగదన్న పాశ్చాత్య దేశాల అంచనాలు తప్పని మన రాజ్యాంగం మరోసారి రుజువుచేసింది. 1952 నుంచి 2014 వరకు 16సార్లు పార్లమెంటుకు ఎన్నికలు జరిగాయి. ఎన్నికల ద్వారా కేంద్రంలో, రాష్ట్రాల్లో శాంతియుతంగా అధికార బదిలీ జరుగుతోంది. ఇదంతా అంబేద్కర్ నేతృత్వంలో రూపొందించుకున్న భారత రాజ్యాంగం పుణ్యమేననడంలో సందేహం లేదు.



128,19,35,911
మొత్తం దేశ జనాభా..

32,87,263	15,200	7,516
వైశాల్యం.. (చదరపు కిలోమీటర్లలో)	భూ సరిహద్దు (కిలోమీటర్లలో)	తీర ప్రాంతం (కిలోమీటర్లలో)

7 సరిహద్దు దేశాలు..

61,60,00,000
పనిచేయగలిగే వారు
మిలిటరీ సర్వీసుకు అర్హులైన వారు 48,96,00,000

ప్రయాణం మొదలైందిలా..!

రాజధాని ఢిల్లీలోని అర్విన్ స్టేడియం (ప్రస్తుత మేజర్ ధ్యాన్‌చంద్ స్టేడియం)లో 1950 జనవరి 26న ఉదయం 10.30 గంటలకు భారత తొలి రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ మువ్వన్నెల జాతీయ పతాకం ఆవిష్కరించడంతో భారత్ గణతంత్ర రాజ్యంగా అవతరించింది. 21గన్ సెల్యూట్‌తో ఈ చారిత్రక ఘట్టం మొదలైంది. 1947 ఆగస్టు 15 అర్ధరాత్రి ఇండియాలో బ్రిటిష్ పాలన ముగిసిన 894 రోజులకు ప్రజలే ప్రభువులుగా భారత్ సర్వసత్తాక గణతంత్ర దేశంగా ప్రయాణం ప్రారంభించింది. బ్రిటిష్ వలస రాజ్యం ట్యాగ్ నుంచి.. సర్వసత్తాక, లౌకిక, ప్రజాతంత్ర దేశంగా భారతదేశం రూపుదిద్దుకోవడం చాలా గొప్ప పరిణామం. 1930 నాటి సంపూర్ణ స్వరాజ్యం కావాలనే స్వప్నం.. 1950లో వాస్తవరూపం దాల్చడానికి రెండు దశాబ్దాలు పట్టింది. 1929 లాహోర్ భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలో భారత గణతంత్ర రాజ్యానికి బీజాలు పడ్డాయి. 1930 జనవరి 26ను పూర్ణ స్వరాజ్య దినంగా పాటించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు

చెక్కు చెదరని మౌలిక స్వరూపం

69 ఏళ్లుగా భారత రాజ్యాంగం అనేక ఆటుపోట్లను తట్టుకుని నిలబడింది. వందకు పైగా రాజ్యాంగ సవరణలు జరిగినా సుప్రీంకోర్టు ఆదేశాలు, నిరంతర నిఘా కారణంగా రాజ్యాంగ మౌలిక స్వరూపం నేటికీ చెక్కుచెదరలేదు. రాజ్యాంగబద్ధ పాలనతో ప్రజాస్వామ్యం కొత్త కొత్త ప్రాంతాలకు, వర్గాలలోకి చొచ్చుకుపోతోంది. మారిన ప్రస్తుత పరిస్థితుల్లో రాజ్యాంగంలోని కొన్ని లోటుపాట్లు సుపరిపాలనకు అడ్డంకిగా మారాయని ఏడు దశాబ్దాల మన అనుభవాలు చెబుతున్నాయి. 20 కోట్ల జనాభా దాటిన ఉత్తరప్రదేశ్ మొదలుకుని లక్షల జనాభా ఉన్న సిక్కిం వరకూ ఉన్న 29 రాష్ట్రాలకు ఫెడరల్ వ్యవస్థలో వాటికి ఉండాల్సినన్ని అధికారాలు లేవు. 1980ల్లోనే వామపక్షాలు, డీఎంకే, నేషనల్ కాన్ఫరెన్స్, తెలుగుదేశం, అస్సాం గణపరిషత్ వంటి ప్రాంతీయపక్షాల డిమాండ్ల కారణంగా.. కేంద్రం–రాష్ట్రాల సంబంధాలు సమీక్షించేందుకు పలు కమిషన్లను ఏర్పాటుచేశారు. లిబరలైజేషన్, గ్లోబలైజేషన్ ఫలితంగా ఆర్థిక, పారిశ్రామిక రంగాల్లో రాష్ట్రాలకు కొంత స్వేచ్ఛ పెరిగిన మాట వాస్తవమేగాని విద్య, వైద్యం వంటి అనేక కీలక రం గాల్లో ఇప్పటికీ రాష్ట్రాలకు స్వయం నిర్ణయాధికారం లేదు. ఈ నేపథ్యంలో నిజ మైన ఫెడరల్ వ్యవస్థ కోసం జరిగే డిమాండ్ల పరీక్షను భారత రాజ్యాంగం ఎదుర్కోవలసివస్తుంది. ఫెడరల్ వ్యవస్థ కోసం జరిగే రాజ్యాంగ సవరణ దేశ చరి త్రలో అతి పెద్ద సవరణ అయ్యే ఆస్కారం ఉంది.

ఇది రిపబ్లిక్ దేశం

భారత్‌కు రాజ్యాంగాన్ని రూపొందించ డమే లక్ష్యంగా భారత రాజ్యాంగ పరిషత్ తొలి సమావేశం 1946 జనవరి 9న జరిగింది. మూడేళ్ల తర్వాత 1949 నవంబర్ 26న చర్చోపచర్చల తర్వాత రాజ్యాంగానికి అధికారికంగా ఆమోదముద్ర పడింది. 1947 ఆగస్ట్ 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా.. రాజ్యాంగం అమల్లోకి వచ్చాకే భారత్ నిజమైన స్వాతంత్ర్యం భారత ప్రజలకు లభించింది. తమ ప్రభుత్వాన్ని ఎన్నుకోవడానికి పౌరులకు అధికారాన్ని రాజ్యాంగం అందించింది. తొలి రిపబ్లిక్ డే రోజున రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్ దేశప్రజలకు సందేశమిస్తూ.. 'జాతి పిత, స్వాతంత్ర్య సమరయోధులు కలలుగన్న వర్గ రహిత, సహకార స్వేచ్ఛతో, సంతోషాలతో నిండిన సమాజ స్థాపనకు మనం పునరంకితమౌదాం. ఈ రోజు కేవలం పండుగ చేసుకోవడంపై కన్నా మన లక్ష్యాలకు పునరంకితం కావడానికే శ్రద్ధ చూపాలి. కర్షకులు, శ్రామికులు, కార్మికులు, ఆలోచనపరులు పూర్తి స్వేచ్ఛగా, సంతోషంగా ఉండేలా చేసే.. గొప్ప లక్ష్యానికి కట్టుబడి ఉందాం'అని పిలుపునిచ్చారు.

మనది విలక్షణ రాజ్యాంగం!

ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత విశిష్టతల్లో.. రాజ్యాంగం ప్రత్యేకమైనది. బ్రిటన్, అమెరికా, రష్యా, ఆస్ట్రేలియా, జపాన్, ఐర్లాండ్, జర్మనీ, కెనడా దేశాల రాజ్యాంగాలను పరిశీలించి.. 308 మంది మేధావుల సుదీర్ఘ మేధోమథనం తర్వాత రాజ్యాంగాన్ని రూపొందించారు. 70 ఏళ్లుగా దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా మనుగడ సాగించడానికి ఈ రాజ్యాంగమే బలమైన పునాది. రాజ్యాంగాన్ని ఇంగ్లీషు, హిందీ భాషల్లో చేతితో రాశారు. ప్రపంచంలో అతిపెద్ద లిఖిత రాజ్యాంగం మనదే. దీంట్లో 444 అధికరణలు, 22 భాగాలు, 12 షెడ్యూళ్లు, 118 సవరణ లున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారాలన్నీ రాజ్యాంగం నుంచే దఖలు పడ్డాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలేమైనా రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయని భావిస్తే సుప్రీం కోర్టు వాటిని రద్దు చేస్తుంది. ప్రజలకు, ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులకు విశేషాధికారాలు ఉంటే దాన్ని 'గణతంత్రం' అం టారు. రాష్ట్రపతి పదవిని ఉన్నా.. ఆయన రాచరిక వ్యవస్థల్లో ఉన్నట్లుగా సర్వాధికారి మాత్రం కారు. విమర్శించే హక్కు పౌరులకు ఉంటడం మన రాజ్యాంగం కల్పించిన ప్రత్యేకత. సమానత్వం, స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యం, మత స్వేచ్ఛ, సాంస్కృతిక, విద్యా పరమైన స్వేచ్ఛ మొదలైనవి మన రాజ్యాంగం మనకిచ్చిన వరాలు.

గణతంత్ర విజయం..

పంచాయతీరాజ్ వ్యవస్థ

- మెజారిటీ లక్ష్యాలను సాధించిన ఈ వ్యవస్థ
- స్థానిక సంస్థల్లో మహిళలకు 50% రిజర్వేషన్లు
- అధికారంలో భాగస్వాములైన దళితులు, వెనకబడిన వర్గాలు

70ఏళ్ల భారత గణతంత్ర సుదీర్ఘ ప్రస్థానంలో సాధించిన అతిగొప్ప విజయం పంచాయతీరాజ్ వ్యవస్థ. ఢిల్లీ పాలనను గ్రామస్థాయి వరకు తీసుకెళ్లేందుకు మహాత్ముడు కలలుగన్న గ్రామస్వరాజ్యం లక్ష్యంతో మొదలైన పంచాయతీరాజ్ వ్యవస్థ చాలా వరకు ఉద్దేశిత లక్ష్యాలను చేరుకుంది. జనాభాలో సగంగా ఉన్న మహిళలు ఇప్పుడు 50% స్థానిక సంస్థలను పాలిస్తున్నారు. ఊరికి దూరంగా బతుకులీడ్చిన దళితులు కూడా అధికారంలో భాగస్వాములయ్యారు. అయితే, ఇలాంటి విజయాలతో పాటు పంచాయతీరాజ్ వ్యవస్థ.. అనేక మౌలిక సమస్యలను ఎదుర్కొంటోంది. వాటన్నింటినీ పరిష్కరించుకోగలిగితే ప్రపంచంలోనే తిరుగులేని దేశంగా భారత్ ఆదర్శవంతమవుతుంది.

73వ రాజ్యాంగ సవరణతో..

ప్రజాస్వామ్యాన్ని గ్రామస్థాయి వరకు విస్తరింపచేయడానికి, స్వపరిపాలన ద్వారా పంచాయతీలను బలోపేతం చేయడానికి 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థ అమల్లోకి వచ్చింది. పాలనలో పంచాయతీ ప్రతినిధులు భాగస్వాములయ్యారు. గ్రామస్థాయి పాలనలో మహిళలు, ఎస్సీ, ఎస్టీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించేందుకు ఈ చట్టం ఉపయోగపడింది. తమ సమస్యలను తామే గుర్తించి వాటి పరిష్కారాలను కూడా తామే నిర్ణయించుకునే అధికారం పంచాయతీ ప్రతినిధులకు దక్కింది. తద్వారా నిధుల వినియోగం, పాలనలో పారదర్శకత ఏర్పడింది. ఆ మేరకు రాష్ట్రాలు పంచాయతీలకు అవసరమైన అధికారాలు బదిలీ చేయడానికి వీలైంది. అంతవరకు రాష్ట్ర ప్రభుత్వం తన అధికారులతో గ్రామ పాలన సాగించేది. అధికారులకు స్థానిక సమస్యల పట్ల అవగాహన లేమి కారణంగా గ్రామాభివృద్ధి కుంటుపడేది. గ్రామాలపై అధికారుల పెత్తనం కొనసాగేది. పంచాయతీరాజ్ సంస్థలకు అధికారాలు, విధుల వికేంద్రీకరణ వల్ల అవి బలమైన పాలన కేంద్రాలుగా తయారవుతాయనడంలో సందేహం లేదు.స్థానికుల అవసరాలను తీర్చగలుగుతాయి. వారికి జవాబుదారీగా ఉంటాయి.

మహిళలకు పగ్గాలు..

ప్రస్తుతం దేశంలో 2,32,332 గ్రామ పంచాయతీలు, 6000 మండల/సమితులు, 534 జిల్లా పరిషత్‌లు ఉన్నాయి. గ్రామ పంచాయతీలకు 27,75,858 మంది, మండల/సమితులకు 1,44,491 మంది, జిల్లా పరిషత్‌లకు 15,067 మంది ప్రజాప్రతినిధులు ఎన్నికవుతున్నారు. వీటిలో 75వేల పంచాయతీలు, 2వేల మండల పరిషత్‌లు 175 జిల్లా పరిషత్‌లకు మహిళలే నాయకత్వం వహిస్తున్నారు. ఉత్తర భారతంతో పోలిస్తే దక్షిణ భారతంలో స్థానిక సంస్థల్లో మహిళల ప్రాతినిధ్యం ఎక్కువగా ఉంది. రిజర్వేషన్ల కారణంగా పలువురు ఎస్సీ,ఎస్టీలు కూడా స్థానిక సంస్థలకు ఎన్నికవుతున్నారు. పాలనలో భాగస్వాములవుతున్నారు. దేశ వ్యాప్తంగా పంచాయతీ రాజ్ వ్యవస్థ విజయవంతం అయినట్టు గణాంకాలు చెబుతున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వాల పెత్తనం

స్థానిక సంస్థలు కూడా పార్లమెంటు, అసెంబ్లీల్లాగే రాజ్యాంగబద్ధ సంస్థలే. వాటిలాగే ఇవి కూడా స్వతంత్రంగా వ్యవహరించాలి. చాలా స్థానిక సంస్థలు సంబంధిత రాష్ట్ర ప్రభుత్వంపై ఆధారపడాల్సి వస్తోంది. అందువల్ల పాలనా పరంగా పంచాయతీలకు నేటికీ పూర్తి స్వయం ప్రతిపత్తి లభించడం లేదు. స్థానిక సంస్థలకు నిధుల కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వాలు ఉదాసీనంగా, వివక్షపూరితంగా వ్యవహరిస్తున్నాయి. నిధుల కేటాయింపులో రాజకీయ ఒత్తిళ్లు, కాంట్రాక్టర్ల జోక్యం ఎక్కువగా ఉంటోంది. ఈ ప్రక్రియలో భారీ ఎత్తున అవినీతి చోటుచేసుకుంటోంది. కొన్ని రాష్ట్రాలు పంచాయతీల నిధులను కూడా ఏదో వంకతో పక్కదారి పట్టిస్తున్నాయి.

సమాంతర పాలన..

పంచాయతీల అధికారాల్ని దెబ్బతీయడం కోసం రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా పార్టీ తరపున గ్రామ సభలు/కమిటీలు ఏర్పాటు చేయడం, పంచాయతీ నిధుల్ని పక్కదారి పట్టించడం చేస్తున్నాయి. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) పంచాయతీలతో సంబంధం లేకుండా అభివృద్ధి పథకాలు అమలు పరచడం కూడా పంచాయతీ వ్యవస్థను బలహీనపరుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో పాలక పార్టీ జన్మభూమి కమిటీల ద్వారా సమాంతర పాలన సాగిస్తోంది.

మౌలిక వసతుల కొరత..

దేశవ్యాప్తంగా 2.52 లక్షల పంచాయతీలు ఉంటే, వాటిలో 60వేల పంచాయతీలకు సొంత భవనాలు కూడా లేవు. చాలా పంచాయతీల్లో మౌలిక సదుపాయాలు కూడా అరకొరగానే ఉన్నాయి. ప్రభుత్వం ఈ–గవర్నెన్స్ ప్రవేశపెట్టినా దానిని పూర్తి స్థాయిలో అమలు చేయడానికి అవసరమైన సదుపాయాలు చాలా పంచాయతీలకు లేవు. సాంకేతిక నిపుణుల కొరత, ఇంటర్నెట్ అందుబాటులో లేకపోవడం వల్ల చాలా పంచాయతీలు ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకోలేక అభివృద్ధిలో వెనకబడుతున్నాయి. పేరుకు స్వయం నిర్ణయాధికారాలు ఉన్నా పరోక్షంగా ఇవి రాష్ట్ర ప్రభుత్వ సంస్థలుగా వాటి అదుపాజ్ఞల్లోనే పని చేయాల్సి వస్తోంది. స్వయం ప్రతిపత్తి లేదు. మూడంచెల మధ్య సమన్వయం, సామరస్యం లోపిస్తోంది. తన ఆధిపత్యాన్ని ప్రదర్శించుకునే యత్నంలో మూడింటి మధ్య ఘర్షణలు తలెత్తుతున్నాయి.



జవసత్వాలిచ్చిన సవరణ

73వ రాజ్యాంగ సరవణ పంచాయతీలకు కొత్త అధికారాలు కల్పించడమే కాక దాని స్వభావాన్ని కూడా మార్చివేసింది. అంతకు ముందు పంచాయతీలు రాజ్యాంగ సంస్థలు కావు. కేవలం అమలు కమిటీలుగానే ఉండేవి. వాటిలో రాజకీయ పార్టీలకు ఏ సంబంధం లేదు. పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు వ్యక్తిగతంగానే పోటీ చేసేవారు. 73వ రాజ్యాంగ సవరణతో పంచాయతీల్లో రాజకీయ పార్టీలు ప్రవేశించాయి. వాటికి స్వయం నిర్ణయాధికారం లభించింది. పంచాయతీల్లో బలహీనవర్గాలు, మహిళలకు రిజర్వేషన్లు వచ్చాయి. దేశమంతటా రెండు, మూడంచెల పంచాయతీ వ్యవస్థ ఏర్పాటయింది. ప్రతి గ్రామంలోనూ గ్రామ సభ ఏర్పడింది. నాగాలాండ్, మేఘాలయ, మిజోరంలు మినహా దేశంలోని అన్ని రాష్ట్రాల్లో పంచాయతీరాజ్ వ్యవస్థ ఉంది. దేశంలో పంచాయతీరాజ్ వ్యవస్థను మొదట రాజస్థాన్ ప్రభుత్వం 1959లో నాగపూర్ జిల్లాలో ప్రవేశపెట్టింది. తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేసింది. రాజస్తాన్ రెండో సీఎం బల్వంత్‌రాయ్‌ను 'పంచాయతీ పిత'గా పేర్కొంటారు. ఆయన ఆధ్వర్యంలో వేసిన కమిటీ సిఫారసు మేరకే దేశంలో మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రవేశపెట్టడం జరిగింది. దీని తర్వాత పలు కమిటీలను ప్రభుత్వాలు ఏర్పాటుచేశాయి. పంచాయతీరాజ్ వ్యవస్థ సాధించిన అతి గొప్ప విజయం.. జనాభాలో సగమైన మహిళలకు 50% రిజర్వు చేయడం.

వైఫల్యాల్లోంచి పుట్టిన ఆలోచన

దేశాభివృద్ధి కోసం1952లో నాటి ప్రభుత్వం పంచవర్ష ప్రణాళికలు ప్రారంభించింది. అయితే, ఇవి ఆశించిన ఫలితాలనివ్వలేదు. గ్రామస్థాయికి ఆ పథకాలు వెళ్లకపోవడం, పంచాయతీలు వాటిని సమర్థవంతంగా అమలు పరచలేకపోవడమే దీనికి కారణమన్న భావన వ్యక్తమయింది. పరిపాలన కేంద్రీకృతం కావడం వల్ల గ్రామ స్థాయిలో పథకాల అమలుపై పర్యవేక్షణ లోపించింది, అవినీతి పెరిగింది. జవాబుదారీ తనం లోపించింది. ఫలితంగా ప్రజలకు ప్రభుత్వ సంస్థలపై, అధికారులపై నమ్మకం పోయింది. ఈ పరిస్థితుల్లో ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం కలిగించడానికి, అభివృద్ధి పథకాలు గ్రామ స్థాయిలో పూర్తిగా అమలు కావడానికి అధికార వికేంద్రీకరణ అవసరమని పెద్దలు భావించారు. దాంతో పంచాయతీరాజ్ వ్యవస్థ పుట్టుకొచ్చింది. పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి రాజీవ్ గాంధీ ప్రభుత్వం ఎల్ఎం సింఘ్వీ అధ్యక్షతన కమిటీని ఏర్పాటు చేసింది. 1990లో జనతా పార్టీ ప్రభుత్వం కూడా పంచాయతీరాజ్ వ్యవస్థ వైఫల్యాల అధ్యయనానికి అశోక్ మెహతా కమిటీని వేసింది. రాజీవ్ గాంధీ (1989), వీపీ సింగ్(1990), పీవీ నరసింహారావు(1991) ప్రభుత్వాలు ఈ వ్యవస్థ బలోపేతానికి పలు సవరణలు చేశాయి. వీటన్నిటి కారణంగానే.. 73వ రాజ్యాంగ సవరణ చట్టం తీసుకొచ్చారు.





అవమానాల నుంచి.. విప్లవాలనెంచి!

ఒకప్పుడు ఆంక్షల మధ్య దిగుమతులు.. ఇప్పుడు ప్రపంచదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి భారత్..

తినేందుకు తిండి లేదు.. రోగమొస్తే మందుబిళ్లకూ దిక్కులేని స్థితి..

గణతంత్ర రాజ్యంగా అవతరించినప్పుడు ఇదీ భారత్ పరిస్థితి!

మరి ఇప్పుడు.. అన్ని రంగాల్లోనూ స్వయంసమృద్ధి..

అగ్రరాజ్యాల కళ్లు కుట్టే స్థాయిలో ఆర్థిక అభివృద్ధి!

శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన రంగాల్లో భారత్ ఘన విజయాలను తరచిచూస్తే..

హరిత విప్లవం విజయాలు..


1947 నాటికి గోధుమ దిగుబడి	60 లక్షల టన్నులు
వరి దిగుబడి	24 లక్షల టన్నులు
2017-18 నాటికి గోధుమలు	10 కోట్ల టన్నులు
వరి దిగుబడి	11.2 కోట్ల టన్నులు

- ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో నార్మన్‌బోర్లాగ్ సృష్టించిన గోధుమ వంగడంపై విస్తృత పరిశోధనలు చేసిన వ్యక్తి బెంజమన్ పీయరీ పాల్. గోధుమ మొక్కల పొడవును తగ్గించే జన్యువు ఆధారంగా జరి గిన ఈ పరిశోధనలే అధిక దిగుబడులిచ్చే వంగడాల సృష్టికి నాంది పలికాయి.

క్షీర విప్లవం..(1955లో దిగుమతులు)

వెన్న	500 టన్నులు
పాలపొడి	3000 టన్నులు
2016లో భారత్ ఎగుమతి చేసిన పాలు	36 వేల టన్నులు
2018 నాటికి పాలు, పాల ఉత్పత్తుల ఎగుమతుల విలువ	17.2కోట్ల డాలర్లు

- క్షీర విప్లవానికి ఆద్యుడు వర్గీస్ కురియన్ అని చాలా మందికి తెలుసు. అప్పట్లో పాలను పొడిగా మార్చే సాంకేతికతను భారత్‌కు ఇచ్చేందు కు ఐరోపా దేశాలు నిరాకరించాయి. దీంతో హెచ్.ఎం.దలయా అనే డెయిరీ శాస్త్రవేత్త మామూ లు స్ప్రే గన్, ఎయిర్ హీటర్ల సాయంతో ఓ యంత్రాన్ని తయారు చేయడంతో పరిస్థితి మారింది. గేదె పాలను పొడిగా మార్చలేమన్న యూరోపియన్ల అంచనాను తప్పు అని నిరూపించారు. హెచ్.ఎం.దలయా వల్లే భారత్‌లో క్షీర విప్లవ ప్రస్థానం మొదలైంది.



సమాచార విప్లవం

1975.. భారత్ సొంత ఉపగ్రహం ఆర్యభట్టను ప్రయోగించిన సంవత్సరం. ఐదేళ్లు తిరగకుండానే ఎస్ఎల్వీ–3 రాకెట్‌తో రోహిణి ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది ఇస్రో. అప్పటి నుంచి ఇప్పటివరకు ఇస్రో ప్రయోగించిన ప్రయోగించిన మొత్తం ఉపగ్రహాలు 238 వరకు ఉంటే అందులో విదేశీ ఉపగ్రహాలు 104. ఇన్‌శాట్, ఐఆర్ఎస్ శ్రేణి ఉపగ్రహాలు దేశంలో సమాచార విప్లవానికి నాందీ పలికాయి. విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, వాతావరణ అంచనాలు, తుపాను హెచ్చరికలను సామాన్యుడికి చేరువ చేసిందీ పరిణామం. హాలీవుడ్ సినిమా బడ్జెట్ కంటే తక్కువ ఖర్చుతో అంగారకుడిపైకి అంతరిక్ష నౌకను పంపగలిగినా.. జాబిల్లిపై నీటి జాడను కనిపెట్టేందుకు ప్రయోగాలకు కేంద్రంగా నిలిచినా అది భారత్‌కే చెల్లింది. సొంతంగా రాకెట్ కూడా తయారు చేసుకోలేని దశ నుంచి ఇరుగు పొరుగు దేశాలకు జీపీఎస్ వ్యవస్థలను అందించే స్థాయికి ఎదగడం మనం గర్వించాల్సిన విషయమే! – అంతరిక్షాన్ని శాంతియుత ప్రయోజనాలకే వాడాలని మన విధానం. విద్య, ఆరోగ్యం దేశ నలుమూలలకు చేర్చేందుకు ఉపగ్రహాలను వాడతామని 1960లలో ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ డైరెక్టర్ విక్రమ్ సారాభాయ్ ఆలోచనలను పట్టించుకున్న వారు కొందరే. రాకెట్, ఉపగ్రహ నిర్మాణంలో అప్పటికి మనుకున్న టెక్నాలజీ సున్నా! అయితే దశాబ్దం తర్వాత ఆర్యభట్ట ప్రయోగంతో భారత్ తన సత్తా చాటుకుంది.

ప్రపంచానికి మందులిచ్చాం




విదేశీ కంపెనీల పెత్తనం నుంచి మూడో అతిపెద్ద మందుల తయారీ కేంద్రంగా ఎదగడం వరకు గత 70 ఏళ్లలో భారత ఫార్మా రంగం సాధించిన ప్రగతి అనితర సాధ్యమనే చెప్పాలి. 1954లో హిందుస్తాన్ యాంటీబయోటిక్స్ లిమిటెడ్, ఆ తర్వాతి కాలంలో సోవియట్ యూనియన్ సాయంతో ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మాసూటికల్స్ లిమిటెడ్ ఏర్పాటుతో బహుళజాతి కంపెనీల ఒంటెత్తు పోకడలకు అడ్డుకట్ట పడితే.. 1970లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ పేటెంట్ చట్టాన్ని సవరించడంతో జెనరిక్ మందుల తయారీ సులువైంది. నేషనల్ కెమికల్ లేబొరేటరీస్, రీజనల్ రీసెర్చ్ లేబొరేటరీ (ఇప్పుడు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ))లు మందుల తయారీ రంగంలో పరిశోధనలకు ఊతమిచ్చాయి. ఐఐసీటీ వంటి సీఎస్ఐఆర్ పరిశోధనశాలలు సిప్రోఫ్లాక్సిన్, అజిత్రోమైసిన్, డైక్లోఫెనాక్ వంటి మందులను చౌకగా తయారు చేయడం.. ఆ టెక్నాలజీని ప్రైవేట్ కంపెనీలకు బదలాయించడంతో జనరిక్ మందుల విప్లవం మొదలైంది.

ఐటీతో ముున్ముందుకు

తమకు అక్కరకు రాని యంత్రాలను భారత్‌కు పంపడం.. అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేయడం.. ఇదీ 1960– 70లలో దేశంలోని డేటా ప్రాసెసింగ్ రంగం పరిస్థితి. ఐబీఎం, ఐసీఎల్ కంపెనీల గుత్తాధిపత్యం ఉన్న సమయంలో ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు మిలిటరీ, పరిశోధన సంస్థల్లోనూ ఇదే తంతు. ఈ నేపథ్యంలో 1970లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ ఏర్పాటైంది. ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఈసీఐఎల్), కంప్యూటర్ మెయిన్‌టెనెన్స్ కార్పొరేషన్ (సీఎంసీ), స్టేట్ ఎలక్ట్రానిక్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ల ఏర్పాటుతో దేశంలో ఐటీ విప్లవానికి బీజాలు పడ్డాయి. రైల్వే రిజర్వేషన్ల కంప్యూటరీకరణకు ప్రత్యేకమైన టెక్నాలజీని అభివృద్ధి చేసిన తర్వాత వెనుదిరిగి చూసింది లేదు. ఐటీ ఉత్పత్తులు, సేవల రంగంలో ఈ రోజు భారత్ ఓ తిరుగులేని శక్తి.

టెలికం విప్లవం



ఒకప్పుడు ఇంటికి ఫోన్ కావాలంటే నెలల పాటు ఎదురు చూడాల్సిన పరిస్థితి. టెలికామ్ రంగంలో కీలకమైన స్విచింగ్ టెక్నాలజీ కొన్ని బహుళజాతి కంపెనీల చేతుల్లోనే ఉండటం ఇందుకు కారణం. అయితే 1960లలో టెలికామ్ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుతో దేశంలో టెలికామ్ విప్లవానికి అంకురం పడింది. దాదాపు 13 ఏళ్ల తర్వాత భారత్ తొలిసారి 100 లైన్ల ఎలక్ట్రానిక్ స్విచ్‌ను అభివృద్ధి చేయగలిగింది. ఇదే సమయంలో టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్, ఐఐటీ బాంబే శాస్త్రవేత్తలు సంయుక్తంగా మిలటరీ అవసరాల కోసం డిజిటల్ ఆటోమెటిక్ ఎలక్ట్రానిక్ స్విచ్ తయారు చేశారు. 1984లో శాం పిత్రోడా నేతృత్వంలో సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ (సీ–డాట్) ఏర్పాటుతో పల్లెపల్లెనా టెలిఫోన్ ఎక్స్‌చేంజ్‌ల ఏర్పాటుకు మార్గం సుగమమైంది. సీ–డాట్ అభివృద్ధి చేసిన టెక్నాలజీని ప్రైవేట్ కంపెనీలకు ఉచితంగా ఇవ్వడంతో ప్రపంచవ్యాప్తంగా అనేక గ్రామీణ ప్రాంతాల్లోనూ టెలిఫోన్ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది.

విను వీధిలో విద్యారంగం!

‘చదువు అనేది ఉత్పత్తిని పెంచడానికి.. సామాజిక, జాతీయ సమగ్రతకు.. ఆధునికత దిశగా దేశం అడుగులు వేసేందుకు.. సామాజిక, నైతిక, ఆధ్యాత్మికకు సాధనంగా దోహదపడేలా చూడాలి’

- డాక్టర్ ఎస్.రాధాకృష్ణన్ కమిషన్

గత 70 ఏళ్లలో నిరక్షరాస్య దేశం నుంచి భారత్ ప్రపంచ జ్ఞాన కేంద్రంగా అవతరించింది. విద్యా రంగంలో అవాంతరాలను అధిగమించి, అభివృద్ధికి బాటలు వేసింది. 1951లో 36.1 కోట్ల జనాభాలో 18.33% మంది ప్రజలే అక్షరాస్యులుగా ఉన్నారు. ప్రస్తుతం 74.04 శాతం మంది ప్రజలు అక్షరాస్యులుగా ఉన్నారు. పురుషుల్లో 82% మంది, స్త్రీలలో 66%మంది అక్షరాస్యులు. అత్యధిక అక్షరాస్యతా రాష్ట్రంగా 94.65 శాతంతో త్రిపుర నిలిచింది. బిహార్‌లో అతి తక్కువగా 63.82%అక్షరాస్యత ఉంది.

ప్రాథమిక విద్య.. 1995లో కేంద్రం ప్రారంభించిన మధ్యాహ్న భోజన పథకం విద్యా రంగంలోనే విప్లవాత్మకమైన మార్పు తీసుకొచ్చింది. 1950–51లో 2.1 లక్షల ప్రాథమిక పాఠశాలలున్నాయి. 2018 నాటికి దేశం మొత్తం ప్రాథమిక పాఠశాలల సంఖ్య 8,40,546.

సాంకేతిక విద్య.. సాధారణ విద్య స్థానంలో సాంకేతిక విద్యను అభివృద్ధి వైపు దేశం పరుగులు తీసింది. పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, మెడికల్, డెంటల్ కాలేజీలనూ, మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్స్ ఏర్పాటు చేశారు. ఎన్నో పారిశ్రామిక శిక్షణ సంస్థలను అభివృద్ధి పరిచారు. అందులో.. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) వంటివి ఉన్నాయి. దాదాపు అన్ని రాష్ట్రాల్లో అగ్రికల్చరల్ యూనివర్సిటీలను స్థాపించారు.


ఉన్నత విద్య.. 1951లో దేశంలో 27 యూనివర్సిటీలున్నాయి. ప్రస్తుతం ప్రపంచంలోనే ఉన్నత విద్యలో మూడో అతిపెద్ద దేశం భారత్. మొదటి రెండు స్థానాల్లో అమెరికా, చైనాలు ఉన్నాయి. 2016 నాటికి దేశంలో 799 విశ్వవిద్యాలయాలున్నాయి. 44 సెంట్రల్ యూనివర్సిటీలు, 540 స్టేట్ యూనివర్సిటీలు. 122 డీమ్డ్ యూనివర్సిటీలు, 90 ప్రైవేటు యూనివర్సిటీలున్నాయి.



వ్యాధుల ఆటకట్టు.. ఆరోగ్యమే మన పట్టు!

ఆరోగ్య రంగంలో మన దేశం గత 70 ఏళ్లో సాధించిన అభివృద్ధిని చూస్తే ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను అభివృద్ధి చేయడం నుంచి ప్రాణాంతక వ్యాధులెన్నింటినో మట్టుబెట్టగలిగాం. మలేరియా, క్షయ, ఆటలమ్మ, కుష్టువ్యాధి, పోలియో లాంటి ప్రాణాంతక వ్యాధులను అరికట్టగలిగాం. 1947లో 725 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుండగా, 2017 నాటికి 28,863 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నాం.

1950–51లో ప్రతి 1000 జననాలకు 145.6 మంది శిశువులు మరణించేవారు. ప్రస్తుతం ప్రతి 1000 మందికి 34 శిశు మరణాలు సంభవిస్తున్నాయి. 1940ల్లో ప్రతి లక్ష జననాలకు 2 వేల మాతృ మరణాలు సంభవించేవి. 1950కి వచ్చేసరికి 1,000కి తగ్గాయి. 2015 నాటికి 174 మాతృమరణాలు సంభవిస్తున్నాయి. అయితే అంతర్జాతీయంగా చూసుకుంటే మనదేశం మాతృమరణాల్లో శ్రీలంక (30), థాయ్‌లాండ్(20), చైనా (27) లకంటే బాగా వెనుకబడి ఉంది. 1950 నాటికి దేశవ్యాప్తంగా ఉన్న వైద్యుల సంఖ్య 50,000. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సంఖ్య 725. 1950లో మన దేశ ప్రజల జీవిత కాలం 32 ఏళ్లే. 2016 గణాంకాల ప్రకారం మన దేశ ప్రజల సగటు జీవన ప్రమాణం 68 ఏళ్లు.



1. రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టిషనర్స్ (ప్రతి 10,000 మందికి) 1950–51లో 1.7 మంది ఉంటే, 1999–2000 సంవత్సరంలో 5.5 ఉన్నారు.
2. మెడికల్ కాలేజీలు 1950–51లో 28 ఉంటే, 1999–2000 నాటికి 167 మెడికల్ కాలేజీలు ఉన్నాయి. 2017 నాటికి మన దేశంలో 460 మెడికల్ కాలేజీలున్నాయి.
3. ప్రతి 10 వేల మంది జనాభాకు ఆసుపత్రి బెడ్లు 1950–51లో 3.2 ఉంటే 1999–2000లో 9.3 ఉన్నాయి.
4. వైద్యులు ప్రతి 10 వేల మందికి 1950–51లో 61.8 మంది ఉంటే, 1999–2000 ల కల్లా 535.2 మంది వైద్యులున్నారు. 2017 నాటికి దేశంలో మొత్తం 8 లక్షల మంది వైద్యులున్నారు. ప్రతి 1668 మందికీ ఒక వైద్యులున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది.

దీర్ఘకాలిక, ప్రాణాంతక వ్యాధులను అధిగమించాం!

మలేరియా: 1958లో నేషనల్ మలేరియా ఎరాడికేషన్ కార్యక్రమం తీసుకోవడం ద్వారా చాలా వరకు మలేరియాని నివారించగలిగాం.

మశూచి: 1977 తర్వాత దీన్ని అధిగమించడంలో మనం సఫలీకృతం అయ్యాం.

క్షయ: 1955 లో నేషనల్ టీబీ కంట్రోల్ కార్యక్రమాన్ని మన దేశంలో తెచ్చారు. 1977లో నేషనల్ ట్యూబర్క్యులసిస్ కంట్రోల్ కార్యక్రమంలో కొద్దిగా మార్పులు చేసి పునఃప్రారంభించారు. జిల్లా టీబీ కంట్రోల్ సెంటర్లు దేశవ్యాప్తంగా 446 నెలకొల్పారు. ఆ తరువాత మన దేశంలో క్షయ వ్యాధుల సంఖ్య తగ్గింది.

కుష్టువ్యాధి: 1990–91 నాటికి క్షయ వ్యాధిగ్రస్తుల సంఖ్య 20 లక్షలు. 1955లోనే కుష్టువ్యాధి నివారణకు నేషనల్ లెప్రసీ కంట్రోల్ ప్రోగ్రాంలో ప్రారంభించారు. కుష్టు వ్యాధి నిర్మూలనలో మనం సఫలీకృతులమయ్యాం.

ఎయిడ్స్: మన దేశంలో 1987 సంవత్సరంలో నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ప్రోగ్రాం ప్రారంభించాం. 1990–91లో జోనల్ స్థాయి రక్తపరీక్ష కేంద్రాలను విస్తృతంగా ఏర్పాటు చేశారు.

పోలియో: ఏడాదికి ఒకేరోజులో కోట్లాది మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం ద్వారా దాదాపు పోలియోని దేశం అధిగమించగలిగింది.

ఐదేళ్లకో ప్రణాళిక.. 5వ స్థానానికి చేర్చింది

(సాక్షి, బిజినెస్ విభాగం)

- ఎన్నో ప్రత్యేకతలతో ఎదుగుతున్న భారత్
- లైసెన్స్ రాజ్ నుంచి డిజిటల్ వ్యవస్థ స్థాయికి
- 947 కోట్ల నుంచి 167 లక్షల కోట్లకు జీడీపీ

డెబ్బై ఏళ్లు!!. ఒక పూర్తి జీవితం!!. వెనక్కి తిరిగి చూసుకుంటే బాల్యం నుంచి జరిగిన ఘటనలు అన్నీ ఇన్నీ కావు. భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం ఇదే సమయంలో... ఊహకందనన్ని జీవితాల్ని చూసిందనుకోవాలి. ఎందుకంటే కేవలం రూ.947 కోట్లతో మొదలైన ప్రస్థానం... ఇపుడు ఏకంగా రూ.167 లక్షల కోట్లకు చేరింది. సగటు భారతీయుడి తలసరి ఆదాయాన్ని రూ.247 నుంచి రూ.1.12 లక్షలకు తీసుకెళ్లింది. పంచవర్ష ప్రణాళికలతో మొదలుపెట్టి... వ్యవసాయం, పరిశ్రమలు, ఉద్యోగాలు, సేవలు... ఇలా అన్ని రంగాలకూ ప్రాధాన్యమిచ్చుకుంటూ... సంక్షోభాల్ని తట్టుకుని, సంస్కరణలకు ప్రాణం పోసి ఇపుడో మహాశక్తిగా ఎదిగింది. చివరికి... మనల్ని నిర్వీర్యంగా వదిలి వెళ్లిన బ్రిటన్‌నే తోసిరాజంటూ 5వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోంది. ఈ ఏడు దశాబ్దాల పయనపై ‘సాక్షి’ అందిస్తున్న ప్రత్యేక కథనమిది...

స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)

కేవలం రూ.947 కోట్ల ఆర్థిక వ్యవస్థను మనకు బ్రిటిష్ వారు అప్పగించి వెళ్లగా... అదిప్పుడు రూ.167 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది. స్వాతంత్ర్యం వచ్చాక స్వల్ప వృద్ధికి కూడా కటకటలాడే ఆర్థిక వ్యవస్థ 2005–06 నాటికి ఏకంగా రెండంకెల వృద్ధికి ఎగబాకింది. 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభం తర్వాత వృద్ధి రేటు నెమ్మదించినప్పటికీ, 2014 నుంచి (2017 మినహా) ప్రపంచంలో అత్యంత వేగంగా 7 శాతం వృద్ధిని సాధిస్తున్న దేశంగా భారత్ అవతరించగలిగింది. ఈ 70 ఏళ్లలో భారతీయుడి వార్షిక తలసరి ఆదాయం రూ.247 నుంచి రూ.1.12 లక్షలకు చేరింది. ఇక రిజర్వుబ్యాంకు వద్ద 1950లో కేవలం 2 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వలుండేవి. విదేశీ మారక ద్రవ్యానికి కటకటలాడి.. దిగుమతులపై అలవికాని నియంత్రణలుండేవి. అలాంటిదిపుడు స్వేచ్ఛా వాణిజ్య వ్యవస్థగా అవతరించి.. 400 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వలుండే స్థాయికి చేరింది.

పంచవర్షం నుంచి నీతి ఆయోగ్‌కు...

బుడిబుడి అడుగులేసే పిల్లల ఎదుగుదలకు ప్రణాళిక వేసినట్లుగా.. ఆర్థిక వ్యవస్థలో జవసత్వాలు నింపడానికి 1951లో పంచవర్ష ప్రణాళికలు ఆరంభమయ్యాయి. ఒక నిర్దేశిత సమయాన్ని నిర్ణయించుకుని, లక్ష్యాల్ని సాధించటమే వీటి ఉద్దేశం. తొలుత వ్యవసాయం.. ఆ తర్వాత భారీ ఉద్యోగాలు కల్పించడానికి ప్రభుత్వరంగ పరిశ్రమలు.. తర్వాత నీటి పారుదల.. ఇలా ఐదేళ్లు ఒక్కో రంగానికి ప్రాధాన్యమిస్తూ పంచవర్ష ప్రణాళికలు అమలయ్యాయి. ప్రస్తుత 2012–2017 పంచవర్ష ప్రణాళిక 12వది. ఈ ప్రణాళికలో 8.2% ఆర్థికాభివృద్ధి లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించుకోగా, అంతర్జాతీయ మందగమనం వల్ల అది సాధ్యం కాలేదు. తాజాగా ఏర్పాటైన నీతి ఆయోగ్ మూడేళ్ల యాక్షన్ ప్లాన్‌ను ప్రతిపాదించింది.

సంక్షోభాలను తట్టుకుంటూ...

ఈ 70 ఏళ్లలో మన ఆర్థిక వ్యవస్థ మూడు సంక్షోభాల్ని చవిచూసింది. అవి 1966, 1981, 1991 సంవత్సరాల్లో. ఈ మూడూ విదేశాలకు చెల్లింపులు చేయలేక తలెత్తిన సంక్షోభాలే. దివాలా దేశంగా ప్రకటితమయ్యే సందర్భాలవి. అలాంటి సందర్భాల్లో అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) డాలరు రుణాన్ని సర్దుబాటు చేయడంతో తక్షణ చెల్లింపులు చేయగలిగాం. కాకపోతే 1991లో తలెత్తిన సంక్షోభానికి మధ్య తరగతి ఇళ్లలో మాదిరే రిజర్వు బ్యాంకు తన దగ్గరున్న 67 టన్నుల బంగారాన్ని ఐఎంఎఫ్ వద్ద తనఖా పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక 1966 నాటి సంక్షోభాన్ని ఎదుర్కోవటానికి రూపాయి విలువను దారుణంగా తగ్గించేశారు. 1991లో సంక్షోభ ఫలితంగా 1992లో ఆర్థిక సంస్కరణలు ఆరంభమయ్యాయి. అవి కొత్త అవకాశాలకు తలుపులు తెరిచాయి. మన మానవ వనరుల సమర్థ వినియోగానికి దారులు వేశాయి. అంతే!! ఆ తరవాత మళ్లీ సంక్షోభ ఛాయలు తాకలేదు.

గ్యాస్... ఫోన్... అన్నీ సంస్కరణల చలవే!

భారత ఆర్థిక వ్యవస్థను సమూలంగా మార్చివేసిన ఆర్థిక సంస్కరణలకు 1992లో పునాది పడింది. అప్పటిదాకా ఏదైనా వ్యాపారం పెట్టి, నడపాలంటే ప్రతి దానికీ లైసెన్సులు లేదా పర్మిట్లు తప్పనిసరి పద్ధతి నడిచింది. ప్రతిదీ ప్రభుత్వ అజమాయిషీలోనే కొనసాగేది. కాకపోతే 1992లో రూపాయి విలువను ఒకే నెలలో మూడు దఫాలు తగ్గించడం ద్వారా మొదలైన ఆర్థిక సంస్కరణలు.. లైసెన్స్ రాజ్‌కు తెరవేశాయి. పలు కీలక రంగాల్లో విదేశీ పెట్టుబడులకు ద్వారాలు తెరిచాయి. తక్షణం కావాల్సిన గ్యాస్ కనెక్షన్ రావటమే కాదు.. ఫోన్ కనెక్షన్లను ఇంటికొచ్చి, అభ్యర్థించి మరీ ఇచ్చే పరిస్థితులొచ్చాయి.

జాతీయకరణ నుంచి పేమెంట్ బ్యాంకులకు...

ఇప్పుడంతా ప్రయివేటు బ్యాంకులదే హవా. వీటికి తోడు చిన్న ఆర్థిక బ్యాంకులు, పేమెంట్ బ్యాంకులు వచ్చేశాయి. వాలెట్లు కూడా బ్యాంకులు చేసే పనులన్నీ చేసేస్తున్నాయి. బ్యాంకుల జాతీయకరణ స్థాయి నుంచి.. ప్రస్తుతం ఆర్థిక సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వరంగ బ్యాంకుల్లో తన వాటాను కేంద్రం గణనీయంగా తగ్గించుకుంటూ వస్తున్న పరిస్థితి నెలకొంది. ప్రభుత్వరంగ బ్యాంకుల సంఖ్యను తగ్గించి, ఆరేడు పటిష్టమైన ప్రభుత్వ బ్యాంకుల్ని రూపొందించాలన్న ప్రయత్నాలు ప్రస్తుతం జరుగుతున్నాయి.

ఆర్థిక సంస్కరణలకు ముందు...

- కారు లేదా స్కూటర్ కొనాలంటే వాటిని బుక్ చేసుకున్న రెండు, మూడేళ్లకుగానీ డెలివరీ వచ్చేది కాదు. మన కంపెనీల వద్ద ఉత్పాదక సామర్థ్యం తక్కువగా ఉండటం, ప్రభుత్వం ఉత్పత్తిపై పరిమితులు విధించడం ఇందుకు కారణం.
- వైద్యానికైనా, విహారానికైనా, వ్యాపారానికైనా విదేశాలకు వెళ్లాలంటే విదేశీ మారక ద్రవ్యం కోసం రిజర్వుబ్యాంకు అనుమతి తప్పనిసరి అయ్యేది. ఆర్‌బీఐ దగ్గర తగిన డాలర్లు లేకపోవడంతో పరిమిత విదేశీ ద్రవ్యానికే అనుమతినిచ్చేది.
- విదేశాల నుంచి కారు గానీ, కంప్యూటర్‌గానీ దిగుమతి చేసుకోవాలన్నా భారీగా 200 నుంచి 300 శాతం వరకూ దిగుమతి సుంకాలుండేవి.

ఆర్థిక సంస్కరణలకు తర్వాత..

తలసరి ఆదాయం మూడు రెట్లు

- గత 25 సంవత్సరాల్లో తలసరి ఆదాయం 500 డాలర్ల నుంచి 1600 డాలర్లకు మూడు రెట్లకుపైగా పెరిగింది. ప్రస్తుత 7.5 శాతం చొప్పున భారత ఆర్థిక వ్యవస్థ వార్షిక వృద్ధి సాధిస్తే...రానున్న 25 సంవత్సరాల్లో తలసరి ఆదాయం 10,000 డాలర్లకు పెరుగుతుందని అంచనా.

విదేశీ మారక నిల్వలు జీరో నుంచి...

- విదేశీ మారక నిల్వలు దాదాపు జీరో నుంచి 400 బిలియన్ డాలర్లకు పెరిగాయి.

పాలించిన బ్రిటన్‌కంటే...

సుదీర్ఘ పోరాట ఫలితంగా ఏ దేశం నుంచైతే మనం స్వాతంత్రం సంపాదించుకున్నామో..ఆ దేశం.. బ్రిటన్‌ను మించిపోయేందుకు సిద్ధమయ్యింది. 2020లో బ్రిటన్ ఆర్థిక వ్యవస్థను భారత్ తలదన్ని ప్రపంచంలో ఐదో పెద్ద ఎకానమీగా ఆవిర్భవిస్తుందంటూ తాజాగా పీడబ్ల్యూసీ విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. వరల్డ్‌బ్యాంక్ గణాంకాల ప్రకారం 2017లో బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ విలువ 2.62 ట్రిలియన్ డాలర్లుకాగా, మనది 2.60 ట్రిలియన్ డాలర్లు.

సాక్షి బిజినెస్

శనివారం 26-1-2019

WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
170 ▼	69 ▼
36,026	10,781

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

సూచీ		మార్పు
నాస్‌డాక్	7,160	▲ 87
డోజోన్స్	24,769	▲ 216
ఎఫ్‌టీఎస్‌ఈ 100	6,809	▼ 10
డాక్స్	11,282	▲ 152
షాంఘై	2,602	▲ 10
నికాయ్	20,774	▲ 199

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	70.35	72.2
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	92.25	94.8
€	యూరో	ఎస్‌బీఐ	79.7	82.1
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	63	68
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	49.7	52.05
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	50.75	54.3
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	17.6	20.75
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	--	--
¥	చైనా యువాన్	థామస్‌కుక్	9.45	11.2

వ్యాపార 'మణి'మకుటం నాయక్...



అనిల్ మణిభాయ్ నాయక్... ఇది మౌలిక సదుపాయాల రంగానికి చెందిన విఖ్యాత కంపెనీ ఎల్‌అండ్‌టీ గ్రూపు ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ఏఎం నాయక్ (77) పూర్తి పేరు. ఎల్‌అండ్‌టీ కంపెనీలో 1965 మార్చి 15న జూనియర్ ఇంజనీర్‌గా తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన ఆయన ఆ సంస్థను నడిపించే స్థాయికి చేరుకుని... ఉక్కులాంటి కంపెనీగా తీర్చిదిద్దారు. కేవలం మౌలిక సదుపాయాలకే పరిమితం కాకుండా, ఐటీ సేవలు, ఆర్థిక సేవల్లోకీ విస్తరింపజేశారు. ఆయన సేవలకు గుర్తింపుగా తాజాగా కేంద్ర ప్రభుత్వం పద్మవిభూషణ్ అవార్డును ప్రకటించింది. నాయక్ గుజరాత్ రాష్ట్రానికి చెందిన వారు. బిర్లా విశ్వకర్మ మహావిద్యాలయ ఇంజనీరింగ్ కాలేజీ నుంచి మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. అనంతరం తన తండ్రి ఇచ్చిన లేఖతో ముంబైకి వెళ్లి ముకంద్ ఐరన్ అండ్ స్టీల్ వర్క్స్‌లో పనిచేసే వీరేన్ జే షాను కలిశారు. ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం లేకపోవడంతో, మెరుగుపరచుకోవాలని అక్కడి కంపెనీ మేనేజర్ నుంచి సలహా వచ్చింది. దాంతో ఆయన ఇంగ్లిష్ సామర్థ్యాలను పెంచుకునే పనిలో పడ్డారు. 1965 మార్చి 15న ఎల్‌అండ్‌టీలో జూనియర్ ఇంజనీర్‌గా చేరారు. 1986లో జీఎంగా పదోన్నతి పొందారు. 1999లో ఏకంగా సంస్థ సీఈవో పగ్గాలు చేపట్టారు. 2003లో చైర్మన్ అయ్యారు. ఐఐఎం, అహ్మదాబాద్‌కు సైతం చైర్మన్‌గా పనిచేశారు.

టెక్ దిగ్గజం.. జాన్ చాంబర్స్



ప్రతిష్టాత్మక పద్మభూషణ్ పురస్కారానికి ఎంపికైన అమెరికన్ టెక్ దిగ్గజం జాన్ చాంబర్స్.. దాదాపు రెండు దశాబ్దాల పాటు ఐటీ సంస్థ సిస్కోకు సారథ్యం వహించారు. కంపెనీ వార్షికాదాయాన్ని 70 మిలియన్ డాలర్ల నుంచి 47 బిలియన్ డాలర్ల స్థాయికి చేర్చడంలో కీలకపాత్ర పోషించారు. ప్రస్తుతం సిస్కో గౌరవ చైర్మన్‌గా ఉన్నారు. అమెరికా–భారత్ వ్యూహాత్మక భాగస్వామ్య ఫోరం (యూఎస్ఐఎస్‌పీఎఫ్) చైర్మన్‌గా కూడా వ్యవహరిస్తున్న చాంబర్స్.. భారత్‌కు చెందిన రెండు స్టార్టప్ సంస్థల్లో కూడా ఇన్వెస్ట్ చేశారు.

ప్రముఖ మసాలా దినుసుల సంస్థ ఎండీహెచ్ అధిపతి మహాశయ్ ధరమ్ పాల్ గులాటీకి పద్మ భూషణ్ లభించింది. టెక్నాలజీ సంస్థ అడోబ్ చైర్మన్ శంతను నారాయణ్ పద్మశ్రీకి ఎంపికయ్యారు.

మారుతీ లాభం 17% డౌన్!!

- రూ. 1,489 కోట్లుగా నమోదు
- ఒక త్రైమాసికంలో ఇంత క్షీణత అయిదేళ్లలో ఇదే తొలిసారి
- తగ్గిన అమ్మకాలు, అధిక ముడివస్తువుల ధరలే కారణం

న్యూఢిల్లీ: ఆటోమొబైల్ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా నికర లాభం (ఎంఎస్ఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వరుసగా రెండో త్రైమాసికంలో కూడా క్షీణించింది. సెప్టెంబర్ క్వార్టర్‌లో 10 శాతం క్షీణత నమోదు చేసిన మారుతీ తాజాగా డిసెంబర్ క్వార్టర్‌లోనూ అదే తీరు కొనసాగించింది. అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికంలో కంపెనీ నికర లాభం ఏకంగా 17 శాతం క్షీణించి రూ. 1,489 కోట్లకు పరిమితమైంది.

గడిచిన అయిదేళ్లలో చూస్తే ఒక త్రైమాసికంలో మారుతీ లాభం ఇంత భారీగా క్షీణించడం ఇదే ప్రథమం. 2013–14 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో మారుతీ సుజుకీ నికర లాభం అత్యధికంగా 35.46 క్షీణించి రూ. 800 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం మూడో క్వార్టర్‌లో సంస్థ లాభం రూ.1,799 కోట్లు. ఇక, అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికంలో మారుతీ ఆదాయం మాత్రం 5 శాతం పెరిగి రూ. 19,528 కోట్ల నుంచి రూ. 20,586 కోట్లకు పెరిగింది. సమీక్షాకాలంలో అమ్మకాలు స్వల్పంగా 0.6 శాతం క్షీణించి 4,28,643 యూనిట్లుగా నమోదయ్యాయి.

ఒకేసారిగా చుట్టుముట్టిన సమస్యలు..

మూడో త్రైమాసికంలో పలు ప్రతికూల అంశాలు ఒకేసారిగా చుట్టుముట్టడంతో లాభాలపై ప్రభావం పడిందని మారుతీ సుజుకీ పేర్కొంది. పండుగ సీజన్‌లో వాహన విక్రయాలు ఆశించిన స్థాయిలో లేకపోవడం, కమోడిటీల ధరలు భారీగా పెరిగిపోవడం, విదేశీ మారక విలువ అనుకూలంగా లేకపోవడం, మార్కెటింగ్..సేల్స్ వ్యయాలు భారీగా పెరగడం తదితర అంశాలు క్యూ3లో ప్రభావం చూపినట్లు మారుతీ పేర్కొంది. అయితే, వ్యయాల నియంత్రణ దిశగా ఉద్యోగులు, సరఫరాదారుల నుంచి వచ్చిన కొన్ని సూచనలు అమలు చేయడంతో



ప్రతికూల ప్రభావం కాస్త తగ్గిందని మారుతీ పేర్కొంది. పండుగ సీజన్‌లో అమ్మకాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో దాదాపు 90,000 యూనిట్ల మేర స్టాక్‌ను విక్రయించుకునేందుకు డీలర్లకు మరింత తోడ్పాటు అందించినట్లు వివరించింది. మూడో త్రైమాసికంలో పనితీరు ఆశించిన స్థాయిలో లేకపోవడాన్ని.. మార్కెట్ బలహీనంగా ఉందన్న కోణంలో మాత్రమే చూడాల్సి ఉంటుందని మారుతీ పేర్కొంది. అటు అంతర్జాతీయంగా మార్కెట్లు కూడా బాగాలేకపోవడం, పలు కరెన్సీల డీవేల్యుయేషన్ మొదలైన అంశాల కారణంగా ఎగుమతులు కూడా 8.5 శాతం క్షీణించినట్లు వివరించింది. ఆటోమొబైల్ సంస్థల సమాఖ్య సియామ్ ఈ ఏడాది ఆటోమొబైల్ రంగం 8–10 శాతం పెరగొచ్చని ముందుగా అంచనా వేసినప్పటికీ... తొలి మూడు త్రైమాసికాల్లో కలిపి ఈ రంగం కేవలం 4.4 శాతమే వృద్ధి సాధించింది.

షేరు 8 శాతం క్రాష్...

ఆర్థిక ఫలితాలు నిరాశపర్చడంతో శుక్రవారం మారుతీ సుజుకీ షేర్లు భారీగా పతనమయ్యాయి. బీఎస్ఈలో ఒక దశలో 8.77% క్షీణించి 52 వారాల కనిష్టమైన రూ.6,420 స్థాయిని తాకింది. చివరికి 7.40% నష్టంతో రూ. 6,516.35 వద్ద క్లోజయ్యింది. ఎన్ఎస్ఈలో 8.,10 శాతం క్షీణించి రూ. 6,469.90 వద్ద క్లోజయ్యింది. కంపెనీ మార్కెట్ విలువ రూ. 15,739 కోట్లు ఆవిరైపోయి.. రూ.1,96,845.94 కోట్లకు పడింది.

ఐదో ఆర్థిక శక్తిగా భారత్!

- త్వరలోనే బ్రిటన్‌ను అధిగమిస్తాం...
- ప్రధాని నరేంద్రమోదీ ప్రకటన
- పెట్టుబడుల పురోగతికి చర్యలు..
- భారత్–దక్షిణాఫ్రికా వ్యాపార సదస్సులో ప్రసంగం

న్యూఢిల్లీ: ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించనుందని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. దేశంలో పెట్టుబడుల పురోగతికి నిరంతర చర్యలను ప్రభుత్వం తీసుకుంటోందనీ ఆయన వివరించారు. ఇండస్ట్రీ చాంబర్– సీఐఐ నిర్వహించిన భారత్–దక్షిణాఫ్రికా వాణిజ్య సదస్సును ఉద్దేశించి శుక్రవారం ప్రధాని ప్రసంగంలో కొన్ని ముఖ్యాంశాలు...

- భారత్ ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ. అత్యాధునిక మౌలిక సదుపాయాలతో 'కొత్త భారత్'ను నిర్మించడానికి కట్టుబడి ఉంది. నైపుణ్యత, సాంకేతిక అభివృద్ధికి గట్టి చర్యలు తీసుకుంటోంది.
- 2.6 ట్రిలియన్ డాలర్లతో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ప్రస్తుతం అమెరికా, చైనా, జపాన్, జర్మనీ, బ్రిటన్ తరువాత ఉన్న భారత్ త్వరలో ఐదో స్థానానికి ఎదిగే అవకాశాలు ఉన్నాయి.
- దేశీయ తయారీ రంగానికి ఉత్తేజం కలిగించడానికి కేంద్రం పలు చర్యలు తీసుకుంటోంది. అందులో మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటివి ఉన్నాయి.
- వాణిజ్యం, పెట్టుబడులు, అభివృద్ధి వ్యవహారాలను పరిశీలించే ఐక్యరాజ్యసమితి సంస్థ– యూఎన్‌సీటీఏడీ నివేదిక ప్రకారం ప్రపంచంలో అత్యధికంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) ఆకర్షించే దేశాల జాబితాలో భారత్ ఉంది. అయితే ఈ విషయంలో మాకు సంతృప్తి లేదు. కీలక రంగాలను రోజువారీగా సమీక్షించి తగిన ఆర్థిక సంస్కరణలను తీసుకురావడానికి నిరంతరం కేంద్రం ప్రయత్నిస్తుంది.
- అవాంతరాలు లేని వ్యాపార నిర్వహణకు సంబంధించి ప్రపంచబ్యాంక్ గత ఏడాది భారత్‌కు 77వ ర్యాంక్ ఇచ్చింది. గడచిన నాలుగేళ్లలో భారత్ 65 ర్యాంకులు మెరుగుపడిన విషయాన్ని ఇక్కడ గమనించాలి.
- భారత్–దక్షిణాఫ్రికాల మధ్య 2017–2018లో వాణిజ్య పరిమాణం 10 బిలియన్ డాలర్లు అయితే, రానున్న కాలంలో వాణిజ్య, ఆర్థిక సంబంధాలను మరింత పటిష్ఠంచేసుకుని, మెరుగుపరుచుకోడానికి భారత్ తగిన చర్యలు తీసుకుంటుంది. ఇందుకు రెండు దేశాలకూ తగిన అవకాశాలూ ఉన్నాయి.



సీఐఐ సదస్సులో మోదీ, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు రామ్‌పోసా, సీఐఐ ప్రెసిడెంట్ రాకేశ్ మిట్టల్

దక్షిణాఫ్రికాలో 150 భారత్ సంస్థలు: రామ్‌పోసా

దక్షిణాఫ్రికాలో ప్రస్తుతం 150కిపైగా భారత్ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్న దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామ్‌పోసా పేర్కొన్నారు. వ్యవసాయం, ఐసీటీ, ఎయిరోస్పేస్, ఇంధనం, ఫార్మా, రక్షణ, మౌలిక, మైనింగ్, క్రియేటివ్ రంగాల్లో పరస్పరం సహకరించుకోడానికి రెండు దేశాలకూ చక్కటి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. భారత్‌లోని వివిధ రంగాల్లో ప్రస్తుతం 29 దక్షిణాఫ్రికా కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని, మరిన్ని కంపెనీలు దేశంతో కలిసి పనిచేయడానికి ఉత్సుకత ప్రదర్శిస్తున్నాయని రామ్‌పోసా పేర్కొన్నారు.

వృద్ధి కొన్నేళ్లు 7-7.5 శాతం

ప్రధాని ఆర్థిక సలహా మండలి

న్యూఢిల్లీ: భారత్ వృద్ధి రేటు రానున్న సంవత్సరాల్లో 7–7.5 శాతం శ్రేణిలో ఉంటుందని ప్రధాని ఆర్థిక వ్యవహారాల సలహా మండలి (ఈఏసీ–పీఎం) శుక్రవారం పేర్కొంది. శుక్రవారం సమావేశమైన మండలి వృద్ధి అవకాశాలపై చర్చించింది. కీలక సంస్కరణల ద్వారా వ్యవస్థాగత సవాళ్లను అధిగమించి వృద్ధి రేటును తేలిగ్గా ఒకశాతానికిపైగా పెంచుకోవచ్చని మండలి సూచించింది. అలాగే సామాజిక రంగ సంస్కరణల కొనసాగింపు కీలకమైన అంశమని వివరించింది. ప్రపంచ ఆర్థిక పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నాయని, దేశ ఆర్థిక వ్యవస్థపై ఈ ప్రభావం కనబడుతుందని పేర్కొన్న మండలి, ఆయా అంశాలను దేశం జాగ్రత్తగా పరిశీలనలోకి తీసుకోవాలని తెలిపింది.

ఢిల్లీ–జోహాన్నెస్‌బర్గ్ మధ్య విమానసర్వీసులు అవసరం: విక్రమ్‌జిత్

రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాల పురోగతిపై దక్షిణాఫ్రికా కాన్సుల్ జనరల్ విక్రమ్‌జిత్ సింగ్ షహ్నాయ్ మాట్లాడుతూ, డీప్ మైనింగ్, రత్నాలు, ఫుడ్ ప్రాసెసింగ్, సీడ్ డెవలప్‌మెంట్ బ్యాంక్ వంటి పలు రంగాల్లో విస్తృత స్థాయి సహకారానికి రెండు దేశాలకూ మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. ఇరు దేశాల ప్రజల రాకపోకలు పెరగడానికి ఢిల్లీ– జోహానెస్‌బర్గ్ మధ్య ప్రత్యక్ష విమాన సర్వీసుల అవసరముందని సూచించారు.

ఆర్థిక సంక్షోభంలో 'ఎస్సెల్'

- నిధుల సమీకరణకు కొన్ని శక్తులు అడ్డుపడుతున్నాయి
- 'జీ'లో వాటాలు విక్రయించనివ్వడం లేదు
- దెబ్బతీసిన ఇన్‌ఫ్రా పెట్టుబడులు, వీడియోకాన్ డీ2హెచ్ కొనుగోలు
- రుణదాతలకు ఎస్సెల్ గ్రూప్ చైర్మన్ సుభాష్ చంద్ర లేఖ

ముంబై: ఎస్సెల్ గ్రూప్ తీవ్ర సంక్షోభ పరిస్థితులు ఎదుర్కొంటోందంటూ వస్తున్న వార్తలపై గ్రూప్ చైర్మన్ సుభాష్ చంద్ర ఎట్టకేలకు పెదవి విప్పారు. కంపెనీ ఆర్థిక సంక్షోభంలో ఉన్న మాట నిజమేనని అంగీకరించారు. దీన్నుంచి బైటపడే క్రమంలో కీలకమైన జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ (జీఈఈఎల్)లో వాటాలను విక్రయించి నిధులు సమీకరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నా.. కొన్ని శక్తులు పడనివ్వడం లేదని ఆరోపించారు. ఇన్‌ఫ్రా పెట్టుబడులపై ఆశలు పెట్టుకున్నా ఐఎల్‌అండ్‌ఎఫ్ఎస్ సంక్షోభం కారణంగా పరిస్థితి అదుపు తప్పిందని, వీడియోకాన్‌కి చెందిన డీ2హెచ్ వ్యాపారం కొనుగోలు కూడా కలిసి రాలేదని పేర్కొన్నారు. శుక్రవారం రుణదాతలకు రాసిన బహిరంగ లేఖలో సుభాష్ చంద్ర ఈ విషయాలు వెల్లడించారు.

తొందరపడితే మీకే నష్టం..

రుణదాతలకు క్షమాపణ చెప్పిన సుభాష్ చంద్ర .. జీఈఈఎల్‌లో వాటాల విక్రయం పూర్తయ్యే దాకా ఓపిక పట్టాలని కోరారు. అలా కాకుండా తొందరపాటుతనంతో వ్యవహరిస్తే.. రెండు వర్గాలూ నష్టపోక తప్పదని వ్యాఖ్యానించారు. అయితే, మొత్తం అప్పు ఎంత ఉన్నది, ఎగవేతలేమైనా జరిగాయా లాంటి అంశాలు ఆయన ప్రస్తావించలేదు. ఐఎల్‌అండ్‌ఎఫ్ఎస్ సంక్షోభం అనంతరం రుణాల రోలోవర్ కష్టంగా మారిందని, అయితే డిసెంబర్ దాకా చెల్లింపులన్నీ సక్రమంగానే జరపగలిగామని పేర్కొన్నారు. 'నా ఉద్దేశాలు మంచివే అయినప్పటికీ బ్యాంకర్లు, ఎన్‌బీఎఫ్‌సీలు, మ్యూచువల్ ఫండ్స్



ఆశించినట్లుగా పనిచేయలేకపోయాయని నేను భావిస్తున్నాను. ఇందుకుగాను క్షమాపణలు చెబుతున్నాను. ఎవ్వరిదీ ఒక్క పైసా రుణం కూడా ఉంచుకోబోను. జీఈఈఎల్‌లో వాటాల విక్రయం పూర్తయితే అన్ని రుణాలను తీర్చేయగలుగుతాము. అప్పటిదాకా ఓర్పు వహించండి. కానీ ఆందోళనతో, అరాచకంగా స్పందిస్తే దాని వల్ల మీరూ, మేమూ నష్టపోవాల్సి వస్తుంది' అని చంద్ర పేర్కొన్నారు.

తప్పులు జరిగాయి..

గతేడాది జూన్ నుంచి సమస్యలు వెన్నాడుతున్నాయని, రుణదాతలు.. షేర్‌హోల్డర్లకు గుర్తుతెలియని శక్తులు లేఖలు రాస్తూ గందరగోళపరుస్తున్నాయని సుభాష్ చంద్ర చెప్పారు. తన వంతుగా కొన్ని తప్పులు కూడా జరిగాయని ఆయన తెలిపారు. ఎస్సెల్ ఇన్‌ఫ్రా కారణగా రూ. 4,000–5,000 కోట్ల మేర నష్టపోవాల్సి వచ్చిందన్నారు. అలాగే 2016 నవంబర్‌లో వీడియోకాన్ డీ2హెచ్ వ్యాపారం కొనుగోలుతో బోలెడంత నష్టపోయామని చెప్పారు. ఇక కుటుంబ వ్యాపార విభజన సమయంలో గ్రూప్ కంపెనీల రుణభారమంతా తమపైనే వేసుకోవడం మరో పెద్ద తప్పిదమని పేర్కొన్నారు.

షేర్లు ఢమాల్...

డీమోనిటైజేషన్ తర్వాత భారీ డిపాజిట్లు చేయడంపై ఎస్ఎఫ్ఐవో విచారణ ఎదుర్కొంటున్న కంపెనీల జాబితాలో ఎస్సెల్ గ్రూప్ సంస్థల పేర్లున్నాయని వార్తలు రావడంతో గ్రూప్ కంపెనీల షేర్లు భారీగా పడ్డాయి. డిష్ టీవీ 33%, జీలెర్న్ 19%, ఎస్సెల్ ప్యాక్ 12% క్షీణించాయి. జీ గ్రూప్ మార్కెట్ విలువ రూ. 14,000 కోట్లు పడిపోయింది. జీ ఎంటర్‌టైన్‌మెంట్ 26% క్షీణించి రూ. 319కి పడిపోయింది.

సాక్షి బిజినెస్ వెబ్‌సైట్‌లో...

- బడ్జెట్ టైంలో ఎఫ్‌పీఐలు ఏం చేస్తున్నాయి?
- ఇండియా వైపు మార్క్‌మొబియస్ మొగ్గు
- ఈ 15 షేర్లూ...బడ్జెట్ బెట్స్!
- ఈ ఆరు కంపెనీలు మల్టీబ్యాగర్లు!
- జీ గ్రూప్ షేర్ల భారీ పతనం
- ఫలితాల షాక్...మారుతీ 8 శాతం క్రాష్
- రియల్టీ షేర్ల భారీ పతనం
- యస్ బ్యాంక్ షేరుపై బ్రోకరేజ్‌లు మాట

మరిన్ని ఆసక్తికర కథనాలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం..

WWW.SAKSHIBUSINESS.COM

SAKSHIBUSINESS యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

GET IT ON Google Play | Available on the App Store

ఇండియన్ బ్యాంక్‌కు ప్రొవిజనింగ్ దెబ్బ..

మొండిబాకీలకు 3 రెట్లు పెరిగిన కేటాయింపులు ● క్యూ3లో సగానికి తగ్గిన లాభం

న్యూఢిల్లీ: మొండిబాకీలకు కేటాయింపులు పెరగడంతో.. ప్రభుత్వ రంగ ఇండియన్ బ్యాంక్ నికర లాభం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో సగానికి తగ్గి రూ. 152 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే వ్యవధిలో బ్యాంక్ లాభం రూ. 303 కోట్లు. ఇక క్యూ3లో మొత్తం ఆదాయం రూ. 4,903 కోట్ల నుంచి రూ. 5,269 కోట్లకు పెరిగింది. స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) 6.27 శాతం నుంచి 7.46 శాతానికి ఎగిశాయి. నికర ఎన్‌పీఏలు కూడా 3.3 శాతం నుంచి 4.42 శాతానికి పెరిగాయి. పరిమాణంపరంగా స్థూల ఎన్‌పీఏలు రూ. 9,595 కోట్ల నుంచి రూ. 13,198 కోట్లకు, నికర ఎన్‌పీఏలు రూ. 4,899 కోట్ల నుంచి రూ. 7,571 కోట్లకు ఎగిశాయి. ఫలితంగా మొండిబాకీలకు కేటాయింపులు ఏకంగా మూడు రెట్లు పెరిగి రూ. 385 కోట్ల నుంచి రూ. 974 కోట్లకు చేరినట్లు ఇండియన్ బ్యాంక్ వెల్లడించింది.



ఎల్‌అండ్‌టీ లాభం 37 శాతం జూమ్..

- క్యూ3లో రూ.2,042 కోట్లు..
- రూ.2.8 లక్షల కోట్ల ఆర్డర్లు...

ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఇంజనీరింగ్ దిగ్గజం లార్సన్ అండ్ టూబ్రో (ఎల్ అండ్ టీ) నికర లాభం 37 శాతం ఎగిసి రూ. 1,490 కోట్ల నుంచి రూ. 2,042 కోట్లకు చేరింది. అటు ఆదాయం 24 శాతం వృద్ధితో రూ. 28,747 కోట్ల నుంచి రూ. 35,709 కోట్లకు పెరిగింది. సమీక్షాకాలంలో కొత్తగా రూ. 42,233 కోట్ల ఆర్డర్లు దక్కించుకున్నట్లు సంస్థ సీఎఫ్‌వో ఆర్ శంకర రామన్ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం ఇదే వ్యవధిలో వచ్చిన కొత్త ఆర్డర్లు రూ. 48,130 కోట్లని పేర్కొన్నారు. మూడో త్రైమాసికంలో కొత్త ఆర్డర్ల రాక 12 శాతం తగ్గినప్పటికీ.. తొమ్మిది నెలల వ్యవధిలో చూస్తే 16 శాతం వృద్ధి ఉందని ఆయన వివరించారు. అంతర్జాతీయంగా ఒడిదుడుకుల పరిస్థితులు ఉన్నప్పటికీ.. ఆర్డర్ల సంఖ్య 30 శాతం మేర పెరిగిందన్నారు. డిసెంబర్ 31 నాటికి మొత్తం రూ. 2,84,049 కోట్ల ఆర్డర్లు చేతిలో ఉన్నాయని చెప్పారు. మరోవైపు, ప్రతిపాదిత రూ. 9,000 కోట్ల షేర్ల బైబ్యాక్ ఆఫర్‌ను సెబీ తిరస్కరించడంపై స్పందించిన సీఈవో ఎస్ఎన్ సుబ్రమణ్యన్.. ఈ విషయంపై సెబీతో చర్చించనున్నట్లు తెలిపారు. వాటాదారులకు అధిక ప్రయోజనం చేకూర్చడమే తమ ఉద్దేశమన్నారు. బీఎస్ఈలో సంస్థ షేరు 0.85 శాతం క్షీణించి రూ. 1,285.55 వద్ద క్లోజయ్యింది.



స్టార్టప్‌లను ప్రోత్సహించాలి..


- బీపీవో, కేపీవో సేవలకు పన్నుల్లో స్పష్టత అవసరం
- ఏంజెల్ ట్యాక్స్‌ను రద్దు చేయాలి
- కేంద్రానికి ఐటీ కంపెనీల సంఘం నాస్కామ్ వినతులు

న్యూఢిల్లీ: బీపీవో, కేపీవో సేవలను జీఎస్టీ కింద ఇంటర్‌మీడియరీలు (మధ్యవర్తిత్వ సంస్థలు)గా పరిగణిస్తున్నందున పన్ను నిబంధనల పరంగా స్పష్టత తీసుకురావాలని ఐటీ కంపెనీల సంఘం నాస్కామ్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. పరిశ్రమలో వృద్ధి రేటు మందగించినప్పటికీ... 2016 ఆర్థిక సంవత్సరం నుంచి 24 బిలియన్‌డాలర్ల ఆదాయాన్ని ఈ రంగం తెచ్చిపెట్టడమే కాకుండా నికరంగా ఎక్కువ ఉద్యోగాలు కల్పించిన విషయాన్ని గుర్తు చేసింది. స్టార్టప్‌ల్లో చేసే పెట్టుబడులపై ఏంజెల్ ట్యాక్స్ పేరుతో విధిస్తున్న లెవీని ఎత్తివేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు బడ్జెట్ ముందస్తు ప్రతిపాదనలను నాస్కామ్ కేంద్ర ఆర్థిక శాఖకు పంపింది.

ఇంటర్‌మీడియరీలు కావు...

బీపీవో, కేపీవోలు సహా ఐటీ ఆధారిత సేవలను ఇంటర్‌మీడియరీలుగా రెవెన్యూ శాఖ పరిగణిస్తుండడంపై నాస్కామ్ ఆందోళన వ్యక్తం చేసింది. సరఫరా ప్రదేశం, ప్రధాన కార్యాలయం, బ్రాంచ్‌ల లావాదేవీలు, సెజ్ కొనుగోళ్లనూ సత్వరమే పరిష్కరించాల్సిన అంశాలుగా నాస్కామ్ కోరింది.





పెట్టుబడులకు ప్రోత్సాహం...


స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకుగాను ఏంజెల్ ట్యాక్స్‌ను రద్దు చేయాలన్నది నాస్కామ్ ప్రధాన డిమాండ్లలో మరొకటి. అంతేకాదు స్టార్టప్‌లకు రాయితీలు కూడా కల్పించాలని కోరింది. ''ఏంజెల్ ఇన్వెస్టర్లు ఓ కంపెనీ ఆరంభ దశలో ఎంతో రిస్క్ తీసుకుని పెట్టుబడులు పెడుతుంటారు. కొత్త కంపెనీ ఆవిర్భవించి, వృద్ధి చెందేందుకు ఈ పెట్టుబడులు కీలకం. ఒకవేళ వీటికి రాయితీలు ఇవ్వకపోతే, కనీసం ప్రోత్సాహం అయినా ఇవ్వాల్సిన అవసరం ఉంది'' అని ఆశిష్ అగర్వాల్ వివరించారు.

మై జీనియస్ స్టార్‌లో నైపుణ్య శిక్షణ!

- రూబిక్స్, అబాకస్, డ్రాయింగ్, హ్యాండ్ రైటింగ్ ట్రెయినింగ్
- ఫిబ్రవరిలో మార్కెట్లోకి యాప్; రూ.3 కోట్ల ఆదాయమే లక్ష్యం
- హైదరాబాద్, బెంగళూరులోని వందకు పైగా స్కూళ్లతో ఒప్పందం
- 'స్టార్టప్ డైరీ'తో కంపెనీ ఫౌండర్ చవ్వా శివ నవ్య

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అబాకస్, క్యూబ్స్, ప్రోగ్రామింగ్ వంటి సాఫ్ట్ స్కిల్స్ నేర్చుకోవాలంటే? ప్రత్యేకంగా శిక్షణ కేంద్రానికెళ్లాలి లేదా హోమ్ ట్రెయినర్‌ను పెట్టుకోవాలి. కాకపోతే ఇలాంటివి మెట్రోల్లోనే దొరుకుతాయి. మరి, ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లోని విద్యార్థులైతే? ఇదే సమస్య ఒక తల్లిగా నవ్యకూ ఎదురైంది. డ్రాయింగ్ టీచర్‌ను వెతికే పనిలో ఏకంగా సాఫ్ట్ స్కిల్స్ యాప్స్‌ను అభివృద్ధి చేసే సాఫ్ట్‌వేర్ కంపెనీ 'ఐ–యాప్స్ ట్రాక్ సాఫ్ట్‌వేర్'ను ప్రారంభించేసింది. మరిన్ని వివరాలు ఆమె మాటల్లోనే.. ''మాది అనంతపురం. బిట్స్ పిలానీలో బీఈ పూర్తయ్యాక... అమెరికాలోని ఎస్‌హెచ్‌యూ వర్సిటీలో ఎంబీఏ ఫైనాన్స్ చేశా. పలు బహుళ జాతి కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలొచ్చాయి. సొంతూళ్లో ఏదైనా కంపెనీ పెట్టాలన్నది నా కోరిక. ''ఐదేళ్ల వయసున్న మా అబ్బాయికి డ్రాయింగ్ అంటే మహా ఇష్టం. నాకేమో రాదు. పోనీ, దగ్గర్లో ఇన్‌స్టిట్యూట్స్ ఉన్నాయా అంటే అదీ లేదు. డ్రాయింగ్ ట్రెనింగ్ యాప్స్, ప్రొడక్ట్స్ ఆన్‌లైన్‌లో చాలా కొన్నాం. కానీ లాభం లేకుండా పోయింది. అప్పుడే అనిపించింది సబ్జెక్ట్స్‌తో పాటూ నైపుణ్య శిక్షణ ఇచ్చే ప్రొడక్ట్స్ మార్కెట్లో లేవని! అందుకే 2015లో రూ.20 లక్షల పెట్టుబడితో అనంతపురం కేంద్రంగా ఐయాప్స్ ట్రాక్ సాఫ్ట్‌వేర్ ప్రై.లి.ను ప్రారంభించాం. 5 నుంచి 16 సంవత్సరాల పిల్లల్లో సృజనాత్మకత, విశ్లేషణాత్మక, జిజ్ఞాసలను పెంపొందించే విద్యా సంబంధమైన ఉత్పత్తులను అభివృద్ధి చేయడమే మా కంపెనీ ప్రత్యేకత.





డ్రీమ్ వీఆర్ కళ్లద్దాలు..

ఐయాప్స్ ట్రాక్ సాఫ్ట్‌వేర్ నుంచి తొలి ఉత్పత్తి డ్రీమ్ వీర్ (వర్చువల్ రియాలిటీ). డ్రీమ్ వీఆర్ కళ్లద్దాలను 2016 నవంబర్‌లో మార్కెట్లోకి రిలీజ్ చేశాం. సుమారు 2 వేల యూనిట్లు విక్రయించాం. ఏ వీఆర్ వీడియోలనైనా సరే ఈ డ్రీమ్ వీఆర్ కళ్లద్దాల ద్వారా వీక్షించే వీలుండటమే వీటి ప్రత్యేకత. వీటి ధర రూ.2,999. ప్రస్తుతం మాకు 2–3 వేల మంది యూజర్లున్నారు. వచ్చే ఏడాది ముగిసేసరికి 50 వేల మంది యూజర్లకు, రూ.3 కోట్ల ఆదాయాన్ని చేరుకోవాలన్నది మా లక్ష్యం.

అంతర్జాతీయ స్కూళ్లతో ఒప్పందం..

ప్రస్తుతం మై జీనియస్ స్టార్ అనే అగ్‌మెంటెడ్ రియాలిటీ యాప్‌ను అభివృద్ధి చేస్తున్నాం. ఫిబ్రవరిలో మార్కెట్లోకి తెస్తాం. దీన్లో రూబిక్స్ క్యూబ్, అబాకస్, డ్రాయింగ్, హ్యాండ్ రైటింగ్ వంటి ఉత్పత్తులుంటాయి. వీటిల్లో ఏ యాప్‌నైనా సరే డౌన్‌లోడ్ చేసుకుని మై జీనియస్ ద్వారా సులువుగా నేర్చుకునే వీలుంటుందన్నమాట. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేంత వరకే ఇంటర్నెట్ అవసరం. తర్వాత నెట్ లేకున్నా యాప్ సేవలను అందుకోవచ్చు. ఫిబ్రవరిలో హైదరాబాద్, బెంగళూరులోని పలు అంతర్జాతీయ పాఠశాలల్లో మై జీనియస్ స్టార్‌ను ప్రారంభించనున్నాం. చిరెక్, జీ గ్రూప్ వంటి వందకు పైగా స్కూళ్లలో దీన్ని అందుబాటులోకి తెస్తాం. ఒక్క యాప్ ఇన్‌స్టలేషన్‌కు రూ.5 వేలు చార్జీ ఉంటుంది.

రూ.4 కోట్ల నిధుల సమీకరణ..

ఇప్పటివరకు రూ.3 కోట్ల పెట్టుబడి పెట్టాం. 4 నెలల్లో ప్రోగ్రామింగ్, పజిల్, సుడోకో, మెమొరీ బూస్టర్ వంటి అగ్‌మెంటెడ్ రియాలిటీ ప్రొడక్ట్‌లను మార్కెట్లోకి తెస్తాం. ''ప్రస్తుతం మా కంపెనీలో 10 మంది ఉద్యోగులున్నారు. త్వరలో 25 శాతం వాటా విక్రయంతో రూ.4 కోట్ల నిధులను సమీకరించనున్నాం''

అద్భుతమైన స్టార్టప్‌ల గురించి అందరికీ తెలియజేయాలనుకుంటే startups@sakshi.com కు మెయిల్ చేయండి...

ఆరంభ లాభాలు ఆవిరి..

- ద్వితీయార్థంలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణ
- సెన్సెక్స్ 169 పాయింట్లు డౌన్

ద్వితీయార్థంలో ఇన్వెస్టర్లు భారీగా అమ్మకాలకు దిగడంతో శుక్రవారం దేశీ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 169 పాయింట్లు, నిఫ్టీ 69 పాయింట్లు నష్టపోయాయి. సెషన్ ప్రథమార్థంలో సెన్సెక్స్ 250 పాయింట్ల పైగా ఎగిసి 36,474 పాయింట్ల స్థాయిని తాకినప్పటికీ .. ద్వితీయార్థంలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు దిగడంతో ఒక దశలో 35,953 పాయింట్ల కనిష్ట స్థాయికి కూడా పడిపోయింది. చివరికి 0.47 శాతం నష్టంతో 36,026 పాయింట్ల వద్ద క్లోజయ్యింది. ఇక 10,932–10,756 పాయింట్ల మధ్య తిరుగాడిన నిఫ్టీ చివరికి 0.64 శాతం క్షీణించి 10,781 పాయింట్ల వద్ద క్లోజయ్యింది. యస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ, ఐటీసీ, టీసీఎస్ వంటి దిగ్గజాల షేర్లు లాభాలతో ఊతమిచ్చినప్పటికీ.. గణనీయంగా వెయిటేజి ఉన్న ఆటోమొబైల్ దిగ్గజం మారుతీ సుజుకీ ఏకంగా 7.4 శాతం క్షీణించడం సెన్సెక్స్‌పై ప్రతికూల ప్రభావం చూపింది. మొత్తం మీద ఈ వారంలో సెన్సెక్స్ 361 పాయింట్లు, నిఫ్టీ 126 పాయింట్లు క్షీణించాయి.

మూడో త్రైమాసికంలో మారుతీ సుజుకీ లాభాలు 17 శాతం పైగా పడిపోవడం.. మార్కెట్ సెంటిమెంటును దెబ్బతీసిందని బ్రోకింగ్ వర్గాలు పేర్కొన్నాయి. ఐటీ, ఫార్మాలోని కొన్ని స్టాక్స్ మినహా మిగతా అన్ని రంగాల షేర్లపై అమ్మకాల ఒత్తిడి కనిపించిందని ఆషికా గ్రూప్ ఈక్విటీ రీసెర్చ్ విభాగం ప్రెసిడెంట్ పారస్ బోత్రా చెప్పారు.

వార్తల్లోని షేర్లు..:

కొత్త సీఈవోగా రవ్‌నీత్ సింగ్ గిల్ నియామకం వార్తలతో శుక్రవారం మరో పది శాతం పైగా ఎగిసిన యస్ బ్యాంక్.. ఆ తర్వాత ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు దిగడంతో చివరికి 3 శాతం లాభంతో రూ. 220 వద్ద క్లోజయ్యింది. సెన్సెక్స్‌లో అత్యధికంగా మారుతీ సుజుకీ షేరు నష్టపోగా అత్యధికంగా లాభపడిన షేరు యస్ బ్యాంక్‌దే. ఇక, కార్యాలయాల్లో సీబీఐ దాడుల వార్తలతో రియల్టీ సంస్థ డీఎల్‌ఎఫ్ షేరు 11.5 శాతం క్షీణించి రూ. 157 వద్ద క్లోజయ్యింది. ఒక దశలో 18 శాతం కూడా పడిపోయింది. కంపెనీ మార్కెట్ విలువ రూ. 3,640 కోట్లు క్షీణించి రూ. 28,025 కోట్లకు పడిపోయింది.

4 శాతం పడిన రియల్టీ సూచీ

హీరో మోటోకార్ప్, ఐసీఐసీఐ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, ఎంఅండ్‌ఎం, టాటా స్టీల్, టాటా మోటార్స్, ఎస్‌బీఐ మొదలైనవి 4.23 శాతం దాకా క్షీణించాయి. మరోవైపు యస్ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్, భారతీ ఎయిర్‌టెల్, టీసీఎస్ తదితర స్టాక్స్ 2.71% దాకా పెరిగాయి. రంగాలవారీగా చూస్తే బీఎస్‌ఈ రియల్టీ సూచీ అత్యధికంగా 4.09% క్షీణించింది. ఆటో ఇండెక్స్ 3.14% , మెటల్ 1.08%, క్యాపిటల్ గూడ్స్ 1.02% పడ్డాయి. అయితే, కన్జూమర్ డ్యూరబుల్స్, ఐటీ, ఆయిల్ అండ్ గ్యాస్ సూచీలు లాభాల్లో ముగిశాయి. స్మాల్ క్యాప్ సూచీ 1.58% , మిడ్ క్యాప్ సూచీ 1.20% క్షీణించాయి.



ముంబైలోని బీఎస్‌ఈలో బుల్ విగ్రహంతో పోజిస్తున్న మారిషస్ ప్రధాని ప్రవీణ్ జగన్నాథ్, బీఎస్‌ఈ చైర్మన్ ఎస్ రవి, బీఎస్‌ఈ ఎండీ ఆశీష్ చౌహాన్

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	2,952
ఎన్ఎస్ఈ	35,103
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	7,24,057
ఎఫ్ఐఐ	689
డీఐఐ	- 147

లిస్టింగ్‌లోనే లోయర్ సర్క్యూట్..

మెప్పించని స్పెన్సర్స్, సీఈఎస్‌ఈ వెంచర్స్

ఆర్‌పీ సంజీవ్ గోయెంకా గ్రూప్‌లో భాగమైన స్పెన్సర్స్ రిటైల్, సీఈఎస్‌సీ వెంచర్స్.. లిస్టింగ్ రోజున లోయర్ సర్క్యూట్స్‌కి పడిపోయాయి. బీఎస్‌ఈలో రూ. 230 వద్ద లిస్టయిన స్పెన్సర్స్ రిటైల్ ఆ తర్వాత రూ. 212.80 లోయర్ సర్క్యూట్‌కి పడిపోయింది. అటు రూ. 520.60 వద్ద లిస్టయిన సీఈఎస్‌సీ వెంచర్స్.. రూ. 520.60 స్థాయికి క్షీణించింది. గ్రూప్ ప్రధాన సంస్థ సీఈఎస్‌సీ నుంచి ఈ రెండింటిని విడగొట్టి లిస్ట్ చేశారు. రాబోయే రోజుల్లో వీటి పనితీరు మరింత మెరుగుపడగలదని గ్రూప్ చీఫ్ గోయెంకా ఆశాభావం వ్యక్తం చేశారు.

నిఫ్టీ 50

టాప్ 10 గెయినర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
INFRATEL	280	6.46
HCLTECH	975	3.02
YESBANK	219.95	2.11
CIPLA	508.4	1.54
BHARTIARTL	305.5	1.28
UPL	755	1.02
TCS	1,919.50	0.94
TITAN	978	0.86
VEDL	195	0.78
WIPRO	354.2	0.7

టాప్ 10 లూజర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
ZEEL	299.7	-30.92
MARUTI	6,469.90	-8.11
ULTRACEMCO	3,528.00	-6.93
HEROMOTOCO	2,671.00	-4.27
IBULHSGFIN	743.95	-3.82
GRASIM	759.65	-3.33
JSWSTEEL	274.45	-3.24
ASIANPAINT	1,371.60	-2.16
M&M	683.55	-1.97
ICICIBANK	358.25	-1.8

కార్పొ బ్రీఫ్స్...

డెన్ నెట్‌వర్క్స్ డీల్‌కు సీసీఐ గ్రీన్ సిగ్నల్

హాత్‌వే కేబుల్స్ అండ్ డాటాకామ్, డెన్ నెట్‌వర్క్స్ సంస్థల్లో మెజారిటీ వాటాను కొనుగోలు చేసేందుకు.. రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) శుక్రవారం అనుమతి ఇచ్చింది. డెన్ నెట్‌వర్క్స్‌లో 66 శాతం, హాత్‌వే కేబుల్స్‌లో 51 శాతం వాటాను ఆర్ఐఎల్ కొనుగోలు చేయనుంది. ఈ మొత్తం డీల్ విలువ రూ.5,230 కోట్లు.

జైడస్ వెల్‌నెస్ వాటా విక్రయానికి ఓకే..

వాటాల అమ్మకానికి జైడస్ వెల్‌నెస్ సీసీఐ నుంచి అనుమతి పొందింది. క్యాడిలా హెల్త్‌కేర్ రూ.1,174.99 కోట్లు, ట్రూ నార్త్ ఫండ్ రూ.999.99 కోట్లు, జైడస్ ఫ్యామిలీ ట్రస్ట్ రూ.299.99 కోట్లు, పయనీర్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ రూ.99.99 కోట్లను పెట్టుబడి పెట్టడం ద్వారా ఈ జైడస్ వెల్‌నెస్‌లో వాటాలను కొనుగోలుచేయనున్నాయి. రూ.10 ముఖవిలువ కలిగిన షేర్లను ప్రిఫరెన్షియల్ పద్ధతిలో కొనుగోలుచేయనుండగా.. ఈ డీల్‌కు సీసీఐ అనుమతి లభించింది.

హెచ్‌యూఎల్ జీఎస్‌కేసీహెచ్‌ల విలీనానికి పచ్చజెండా..

గ్లాక్సో స్మిత్ క్లెన్ కన్జూమర్ హెల్త్‌కేర్ లిమిటెడ్, హిందుస్తాన్ యూనిలీవర్ (హెచ్‌యూఎల్) సముపార్జనకు సీసీఐ అనుమతి ఇచ్చింది. వీలినం తరువాత మెర్జర్ సంస్థ మొత్తం వ్యాపారం విలువ రూ.31,700 కోట్లకు చేరుకోనుంది. ఈక్విటీ వాటాల బదాలాయింపుతో డీల్ పూర్తికానుంది.

పన్ను చెల్లింపుదారుల పట్ల 'అత్యుత్సాహం' వద్దు!

- అధికారులకు ఆర్థికమంత్రి పియుష్ గోయెల్ విజ్ఞప్తి
- వ్యాపారాల్లో నైతిక విలువలు అవసరమని పరిశ్రమకు విజ్ఞప్తి

న్యూఢిల్లీ: నిజాయితీగా పన్ను చెల్లించేవారిపట్ల అనవసర 'అత్యుత్సాహం' చూపించవద్దని పన్ను శాఖ అధికారులకు ఆర్థికశాఖ ఇన్‌చార్జ్ మంత్రి పియుష్ గోయెల్ విజ్ఞప్తి చేశారు. ''కొందరు అధికారుల చర్యలు పన్ను చెల్లింపుదారులకు ఆగ్రహం కలిగిస్తాయి. ప్రతి వ్యాపారవేత్తా పన్ను చెల్లింపుల విషయంలో మోసం చేస్తారని భావించరన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి'' అని గోయెల్ అన్నారు. అలాగే పన్ను చెల్లింపుల విషయంలో నైతికంగా వ్యవహరించాలని వ్యాపారవేత్తలకూ ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఇంటర్నేషనల్ కస్టమ్స్ డే సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆయన పరోక్ష పన్నుల కేంద్ర బోర్డ్ (సీబీఐటీ) అధికారులను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో ముఖ్యాంశాలు...

- నిజాయితీగా పన్ను చెల్లించేవారి పట్ల స్నేహపూర్వక వైఖరి అవసరం. ఇందుకు తీసుకోవాల్సిన చర్యల పట్ల సంబంధిత వర్గాల నుంచే ఆదాయపు పన్ను శాఖ సలహాలు తీసుకోవాలి.
- అదే సమయంలో పేదల జీవన ప్రమాణాలు పెంచడానికి, దేశ ఆర్థిక వృద్ధికి సంబంధించి ప్రభుత్వానికి తగిన ఆదాయ వనరులను తీసుకురావడానికి మనం పనిచేస్తున్నామన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. రెవెన్యూ నష్టం జరక్కుండా మనం తగిన చర్యలు తీసుకోవాలి.
- పన్ను శాఖ అధికారులు... 80,000 మంది బాధ్యతతో వ్యవహరించండి. ప్రతి ఒక్కరూ తాను మిగిలిన 79,999 మంది సహచరుల ప్రతిష్టను ఇనుమడించేలా బాధ్యతలు నిర్వహించాలని కోరుకోండి. ఇది శాఖ ప్రతిష్టను పెంచుతుంది.



- నిజాయితీగా పన్ను చెల్లించేవారిపట్ల స్నేహపూర్వకంగా ఉండడానికి కేంద్రం గడచిన నాలుగేళ్లలో తగిన చర్యలు తీసుకుంది. అదే సమయంలో పన్ను ఎగవేతదారులపై కఠిన చర్యలకూ వెనుకాడలేదు. పన్ను నిబంధనల సరళతరంలోనూ కేంద్రం తగిన చొరవలు తీసుకుంది.
- వ్యాపారాల నిర్వహణ, పన్ను చెల్లింపుల్లో నైతిక మార్గాన్ని వీడవద్దు. అధిక పన్నులు, అధిక దిగుమతి సుంకాలు కాలం ఇప్పుడు పోయింది. అందువల్ల ఇప్పుడు పన్ను ఎగవేతల మార్గంలోకి వెళ్లే ప్రయత్నం చేయక్కర్లేదు.

అరుణ్‌జైట్లీ ఆరోగ్యంపై ఆందోళన వద్దు

అమెరికాలో చికిత్స పొందుతున్న ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ ఆరోగ్యంపై ఆందోళన చెందాల్సింది ఏమీ లేదని గోయెల్ తెలిపారు. ఆయన ఆరోగ్యం బాగుందని, త్వరితగతిన కోలుకుంటున్నారని వివరించారు.

235 ఉడాన్ రూట్ల కేటాయింపు..

న్యూఢిల్లీ: ప్రాంతీయంగా చిన్న పట్టణాలకు కూడా విమాన సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు ఉద్దేశించిన ఉడాన్ స్కీమ్‌లో మూడో విడతలో కొత్తగా 235 రూట్లను ఎయిర్‌లైన్స్‌కు కేటాయించినట్లు పౌర విమానయాన శాఖ మంత్రి సురేష్ ప్రభు వెల్లడించారు. వీటిలో 18 రూట్లలో సీప్లేన్స్‌కి కూడా అనుమతినిచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. దీంతో ప్రస్తుతం విమాన సర్వీసుల నిర్వహణ లేని 16 ఎయిర్‌పోర్టులు, ఆరు వాటర్ ఏరోడ్రోమ్స్ వినియోగంలోకి రానున్నట్లు తెలిపారు. రూట్లు దక్కించుకున్న సంస్థల్లో టర్బో మేఘా, జెక్సస్ ఎయిర్ సర్వీసెస్, స్పైస్‌జెట్, ఇండిగో, జెట్ ఎయిర్‌వేస్, మొదలైన సంస్థలు ఉన్నాయి. ఉడాన్ ఫ్లయిట్స్‌తో అనుసంధానం చేసే ఆరు వాటర్ ఏరోడ్రోమ్స్‌లో తెలంగాణలోని నాగార్జున సాగర్ కూడా ఉంది. 235 రూట్లలో వార్షికంగా 69.30 లక్షల సీట్లు, సీ ప్లేన్స్‌లో 1 లక్ష పైగా సీట్లు అందుబాటులో ఉంటాయని సురేష్ ప్రభు తెలిపారు. మొత్తం మీద 11 ఆపరేటర్లు సమర్పించిన 73 ప్రతిపాదనలను ఆమోదించినట్లు వివరించారు. మూడో విడత ఉడాన్ స్కీమ్ కింద 89 విమానాశ్రయాలను అనుసంధానించడం జరుగుతుందన్నారు.



రూ.979కే ఎయిరిండియా టికెట్

న్యూఢిల్లీ: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా బంపర్ ఆఫర్‌ను ప్రకటించింది. 'ఆర్–డే సేల్' పేరిట అందిస్తున్న ఈ ఆఫర్ జాతీయ, అంతర్జాతీయ ప్రయాణాలకు సైతం వర్తిస్తోంది. జనవరి 26 నుంచి 28 వరకు బుకింగ్స్ చేసుకునేందుకు వెసులుబాటును ఇచ్చిన సంస్థ.. నేటి నుంచి ఈ ఏడాది సెప్టెంబర్ 30 వరకు ప్రయాణాలకు సంబంధించి ఈ మూడు రోజుల్లోనే బుకింగ్స్ పూర్తిచేసుకోవాల్సి ఉంటుందని వివరించింది. దేశీ రూట్లలో ఒకవైపు ఎకానమీ జర్నీ టికెట్ ప్రారంభ ధర రూ.979 కాగా, బిజినెస్ క్లాస్ టికెట్ రూ.6,965. అంతర్జాతీయ సేవల్లో అమెరికాకు రిటర్న్ జర్నీతో కలుపుకుని రూ.55,000.. యూకే, యూరప్‌లకు రూ.32,000, ఆస్ట్రేలియాకు రూ.50,000 టికెట్ ధరలను నిర్ణయించినట్లు ప్రకటించింది. తూర్పు ఆసియా, దక్షిణ తూర్పు ఆసియా ప్రాంతాల టికెట్ ధర రూ.11,000 నుంచి ప్రారంభంకానుందని వెల్లడించింది.



డీహెచ్‌ఎఫ్‌ఎల్ నికర లాభం 37 % డౌన్



న్యూఢిల్లీ: దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ (డీహెచ్‌ఎఫ్‌ఎల్).. ప్రస్తుత ఆర్థిక సంవత్సరపు మూడో త్రైమాసికంలో (క్యూ3, అక్టోబర్–డిసెంబర్) రూ.314 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.495 కోట్లతో పోల్చితే నికర లాభం 37 శాతం క్షీణించింది. కంపెనీ ఆదాయం ఈ క్యూ3లో ఏడాది ప్రాతిపదికన 13 శాతం వృద్ధితో రూ.2,897 కోట్ల నుంచి రూ.3,256 కోట్లకు ఎగసింది. స్థూల నిరర్థక ఆస్తులు 0.96 శాతం నుంచి 1.12 శాతానికి పెరిగినట్లు కంపెనీ స్టాక్ ఎక్స్చేంజీలకు అందించిన సమాచారంలో పేర్కొంది. నికర వడ్డీ ఆదాయం 2.91 శాతంగా తెలిపింది.

గతి లాభం రూ.4.2 కోట్లు



డిసెంబరు క్వార్టరు కన్సాలిడేటెడ్ ఫలితాల్లో గతి నికరలాభం క్రితంతో పోలిస్తే రూ.4.8 కోట్ల నుంచి రూ.4.21 కోట్లకు వచ్చి చేరింది. టర్నోవరు రూ.450 కోట్ల నుంచి రూ.483 కోట్లకు ఎగసింది. ఏప్రిల్–డిసెంబరు కాలంలో రూ.1,412 కోట్ల టర్నోవరుపై రూ.12.4 కోట్ల నికరలాభం పొందింది.

ఇంటెలిజెన్స్ ఇండియాతో ఏక్యూస్ ఒప్పందం

హైదరాబాద్: కర్నాటకకు చెందిన ఏరోస్పేస్ మ్యానుఫాక్చరింగ్ కంపెనీ ఏక్యూస్.. హైదరాబాద్‌కు చెందిన ఇంటెలిజెన్స్ ఇండియా సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌తో ఒప్పందం చేసుకుంది. సాప్ ఎస్/4 హెచ్‌ఏఎన్‌ఏ ఈఆర్పీ నవీకరణతో కోసం ఈ ఒప్పంద చేసుకున్నామని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. సాప్ ఈఆర్పీతో నిర్వహణ వ్యయంతో తగ్గడంతో పాటూ డిజిటల్ వేదికగా వివిధ వ్యాపార మాధ్యమాలను సులువుగా నిర్వహించే వీలుంటుందని ఏక్యూస్ సీఈవో రాజీవ్ కౌల్ తెలిపారు.

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9, 10గ్రా)	33,310	0
బంగారం (99.5, 10గ్రా)	31,720	0
వెండి (కిలో)	42,200	▲ 100
చెన్నై		
బంగారం (24 క్యారెట్లు)	32,470	▲ 40
బంగారం (22 క్యారెట్లు)	30,920	▲ 30
వెండి (కిలో)	42,200	▲ 100
హైదరాబాద్		
బంగారం (24 క్యారెట్లు)	32,470	▲ 40
బంగారం (22 క్యారెట్లు)	30,920	▲ 30
వెండి (కిలో)	42,200	▲ 100
ప్రొద్దుటూరు		
బంగారం (24 క్యారెట్లు)	33,150	▼ 50
బంగారం (22 క్యారెట్లు)	30,710	0
వెండి (కిలో)	40,000	0
విశాఖపట్నం		
బంగారం (24 క్యారెట్లు)	33,200	▲ 300
బంగారం (22 క్యారెట్లు)	30,880	▲ 130
వెండి (కిలో)	40,500	▲ 500
విజయవాడ (గురువారం అందిన ధరలు)		
బంగారం(24 క్యారెట్లు)	33,500	--
బంగారం (22 క్యారెట్లు)	30,750	--
వెండి (కిలో)	40,000	--
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	33,430	▲ 30
బంగారం (22 క్యారెట్లు)	30,920	▲ 30
వెండి (కిలో)	40,000	▲ 100

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	53.66 (రాత్రి 11.30కు)	$53.13 (గురువారం ముగింపు)
బ్రెంట్	61.56 (రాత్రి 11.30కు)	$61.09 (గురువారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 26-01-2019

విశాఖ	417-00
చిత్తూరు	423-00
వరంగల్	404-00
చెన్నై	430-00
ముంబై	457-00
విజయవాడ	417-00
నమక్కల్	420-00
గోదావరి	417-00
25-01-2019 ఫామ్ ధర...	
హైదరాబాద్	402-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.60
బెంగళూరు	420-00
కోల్‌కత్త	448-00
ఢిల్లీ	430-00

స్లీప్‌వెల్ లక్ష్యం రూ.2,000 కోట్ల ఆదాయం



భూషణ్ పాటక్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: స్లీప్‌వెల్ బ్రాండ్ పేరుతో పరుపుల తయారీలో ఉన్న షీలా ఫోమ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.2,000 కోట్ల టర్నోవర్ లక్ష్యంగా చేసుకుంది. 2017–18లో రూ.1,500 కోట్ల టర్నోవర్ నమోదు చేశామని హోమ్ కంఫర్ట్ విభాగం బిజినెస్ హెడ్ భూషణ్ జి పాటక్ శుక్రవారం తెలిపారు. స్లీప్‌వెల్ నూతన శ్రేణి ఉత్పత్తులను ఇక్కడ ప్రవేశపెట్టిన సందర్భంగా మీడియాతో మాట్లాడారు. 'హైదరాబాద్‌తోసహా దేశవ్యాప్తంగా 11 ప్రాంతాల్లో కంపెనీకి తయారీ కేంద్రాలున్నాయి. 15 ఏళ్ల క్రితం నెలకొల్పిన భాగ్యనగరి యూనిట్‌ను విస్తరిస్తాం. మధ్య భారత్‌లో మరో ప్లాంటు ఏర్పాటు చేసే పనిలో ఉన్నాం. పరుపుల ధర రూ.8 వేలతో మొదలై రూ.1.4 లక్షల వరకు ఉంది. వ్యవస్థీకృత రంగంలో స్లీప్‌వెల్ తొలి స్థానంలో ఉంది' అని వివరించారు.

రూ.100 కోట్లతో నాట్కో అగ్రోకెమ్ ప్లాంటు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీ కంపెనీ నాట్కో ఫార్మా అగ్రి కెమికల్ విభాగంలోకి ప్రవేశిస్తోంది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాలో తయారీ కేంద్రాన్ని నెలకొల్పుతోంది. దీనికోసం రూ.100 కోట్లు వెచ్చిస్తున్నట్టు కంపెనీ శుక్రవారం వెల్లడించింది. అగ్రి కెమికల్ టెక్నికల్, ఫార్ములేషన్స్‌ను ఈ కేంద్రంలో ఉత్పత్తి చేస్తారు. 2019 చివరికల్లా ప్లాంటులో ఉత్పత్తి ప్రారంభం అవుతుందని నాట్కో తెలిపింది.

తెలుగురాష్ట్రాల్లో అతిపెద్ద 'సెలెక్ట్' స్టోర్ ప్రారంభం

అత్తాపూర్‌లో ఏర్పాటు

హైదరాబాద్: ప్రముఖ మొబైల్ రిటైల్ సంస్థ సెలెక్ట్.. తెలుగురాష్ట్రాల్లోనే అతిపెద్ద మొబైల్ స్టోర్‌ను శుక్రవారం ప్రారంభించింది. అత్తాపూర్‌లో ఏర్పాటు చేసిన ఈ స్టోర్ మూడు అంతస్థుల విస్తీర్ణంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మురళి రేతినేని మాట్లాడుతూ.. ''మొబైల్ రక్షణ ప్లాన్, అధనపు వారెంటీ కోసం రూపొందించిన 'సీ–సేఫ్'కు విశేష ఆదరణ లభించింది. అలాగే, ఎక్సేంజ్ ఆఫర్ ద్వారా పాత ఫోన్‌ను మార్చుకునే ప్లాన్‌కు సైతం కస్టమర్ల నుంచి విశేష ఆదరణ వచ్చింది''అని తెలిపారు. ఇక గణతంత్ర దినోత్సవం సందర్భంగా 26 శాతం క్యాష్‌బ్యాక్ వంటి అనేక ఆఫర్లు అందిస్తున్నట్లు వెల్లడించారు.



స్టోర్‌ను ప్రారంభిస్తున్న మురళి రేతినేని

వాణిజ్య ఉద్రిక్తతలే ప్రధాన సవాలు!

- డబ్ల్యూఈఎఫ్ సదస్సు ఆందోళన
- పర్యావరణ సమస్యలపైనా చర్చ
- ముగిసిన ఐదు రోజుల సదస్సు

దావోస్: అమెరికా–చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు, వాతావరణ మార్పులు, ఆదాయ అసమానతలు, యువతకు ఉపాధి కల్పన... ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న ప్రస్తుత ప్రధాన సవాళ్లని వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) సదస్సు హెచ్చరించింది. ఐదు రోజుల పాటు ఇక్కడ జరిగిన 40వ డబ్ల్యూఈఎఫ్ 2019 వార్షిక సమావేశాలు శుక్రవారం నాడు ముగిశాయి. 'సంధికాలంలో అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ' అనే అంశంపై చివరిరోజు ప్లీనరీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) చీఫ్ క్రిస్టీనా లగార్డ్ సహా పలు దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. కీలక సవాళ్లపై ప్రపంచం సమన్వయ పోరాటం చేయాలని ఈ సమావేశంలో ఐఎంఎఫ్ చీఫ్ సూచించారు. వృద్ధి పురోగతిలో మహిళలకు మరింత భాగస్వామ్యం అవసరమని ప్రపంచబ్యాంక్ సీఈఓ క్రిస్టలినా జార్జియోవా పేర్కొన్నారు.

ఈ–కామర్స్‌పై అంతర్జాతీయ నిబంధనలకు అంగీకారం!

ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న ఈ–కామర్స్ విషయంలో అంతర్జాతీయంగా సమగ్ర నియమ నిబంధనలు రూపొందించే దిశలో కీలక అవగాహన కుదరింది. దీనిపై చర్చించడానికి అమెరికా, చైనా సహా 75 దేశాల మంత్రులు అంగీకరించారు. యూరోపియన్ యూనియన్ ఉన్నతస్థాయి వాణిజ్య ప్రతినిధి సిసిలియా మాల్మ్‌స్ట్రోమ్ ఈ విషయాన్ని తెలిపారు. అంతర్జాతీయ వాణిజ్య సహకారానికి సంబంధించి దావోస్‌లో చోటుచేసుకున్న కీలక, సానుకూల అంశమిది. వేగంగా వృద్ధి చెందుతున్న ఈ–కామర్స్ కోసం అంతర్జాతీయ బహుళపక్ష ఒప్పందం అవసరమని డబ్ల్యూటీఓ చీఫ్ రాబర్టో అజెవెడో అన్ని దేశాలకూ విజ్ఞప్తి చేసిన నేపథ్యంలోనే తాజా పరిణామం చోటుచేసుకుంది. వారంపాటు ఇక్కడ జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) సమావేశాల్లో పలు దేశాల ప్రతినిధులు అమెరికా రక్షణాత్మక విధానాలను తీవ్రంగా నిరసించిన సంగతి తెలిసిందే. 'కీలక అంశాలపై దావోస్‌లో పలు దేశాల మధ్య ఏకాభిప్రాయం కుదరింది. 21వ దశాబ్దంలో సవాళ్లను ఎదుర్కొనడంపై చర్చలు ప్రారంభించడం ఇందులో ఒకటి. మార్చిలో ఈ చర్చలు ప్రారంభమవుతాయి. ఆన్‌లైన్ బిజినెస్‌కు అంతర్జాతీయంగా తగిన ప్రమాణాలు రూపొందించి సురక్షిత కొనుగోలు, అమ్మకం ఇందులో ఒకటి' అని యూరోపియన్ యూనియన్ ఉన్నతస్థాయి వాణిజ్య ప్రతినిధి సిసిలియా మాల్మ్‌స్ట్రోమ్ ఒక ట్వీట్‌ద్వారా తెలిపారు.



దావోస్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సు సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కార్యకర్త గ్రేటా థంబర్గ్‌తో కరచాలనం చేస్తున్న ఐఎంఎఫ్ ఎండీ క్రిస్టీన్ లగార్డ్

చాలా నేర్చుకున్నాం: సీఐఐ

దావోస్ నుంచి భారత్ కార్పొరేట్ రంగం పలు అంశాలను నేర్చుకుందని సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వంటి కొత్త సాంకేతికత అంశం ఇందులో ఒకటని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆర్థిక, రాజకీయ అనిశ్చితి పరిస్థితులను ఎదుర్కొనే అంశాలపై సైతం సదస్సు ద్వారా అవగాహన కలిగిందన్నారు.

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PORT	373.85	380.95
ASIAN PAINT	1372.15	1401.85
AXIS BANK L	669.75	663.65
BAJAJ AUTO	2626.35	2651.65
BAJAJ FINSE	6321.55	6407.3
BAJAJ FINAN	2599.55	2635.65
BHARTI AIRT	307.5	301.65
BPCL	357.45	353.95
CIPLA LTD	507.65	500.7
COAL INDIA	220.95	223.85
EICHER MOTO	20049.95	20115.6
GAIL (INDIA	334.9	333.6
GRASIM INDU	759.6	785.8
HCL TECHNOL	969.4	946.45
HDFC LTD	1977.8	1971.1
HDFC BANK L	2096	2102.25
HERO MOTO	2670.15	2790.2
HINDALCO I	204.45	205.05
HPCL	241.8	243.1
HUL	1756.8	1759.5
INDIABULLS	744.5	773.5
ICICI BANK	357.2	364.8
INDUSIND BA	1484.9	1490.3
BHARTI INFR	279.75	263
INFOSYS LIM	730.35	732
INDIAN OIL	137.75	136.8
ITC LTD	279.2	278.9
JSW STEEL L	274.65	283.65
KOTAK MAHIN	1266.15	1267.75
LARSEN & T	1285.45	1295.35
MAHINDRA &M	683.5	697.3
MARUTI SUZU	6513.4	7040.6
NTPC LTD	138.3	140.05
OIL AND NAT	142	141.7
POWER GRID	185.85	186.75
RELIANCE IN	1246	1247.45
STATE BANK	285.4	288.05
SUN PHARMAC	422.4	423
TATA MOTORS	173.25	175.4
TATA STEEL	452.9	460.75
TCS	1920.8	1901.55
TECH MAHIND	729.05	727.75
TITAN COMPA	978	969.65
ULTRATECH C	3510.8	3790.7
UPL LIMITED	753.1	747.35
VEDANTA LIM	194.7	193.5
WIPRO LTD	353.45	351.75
YES BANK LI	219.6	215.4
ZEE ENTERTA	318.4	433.85


నిఫ్టీ నెక్ట్స్ ఫిఫ్టీ

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ABB INDIA L	1254.6	1258.35
ADITYA BIRL	87.2	89.45
ACC LIMITED	1375	1419.7
AMBUJA CEME	202.35	211.2
ASHOK LEYLA	82.6	84.8
BANDHAN BAN	424.45	413.9
BANK OF BAR	110.2	113
BHARAT ELEC	80.35	82.8
BHEL	66.4	69.05
BIOCON LIMI	664.7	670.1
BOSCH LIMIT	18526.25	19155.4
BRITANNIA I	3206.65	3216.85
CADILA HEAL	343.7	346.1
COLGATE PAL	1288.3	1321.9
CONTAINER C	660.4	664.05
DABUR INDIA	430	430.4
DLF LIMITED	158	177.75
AVENUE SUPE	1365.7	1391.55
GENERAL INS	245.3	250
GODREJ CONS	780.3	790.6
HAVELLS IND	708.15	702.6
HDFC STAND	359.4	361.2
HINDUSTAN Z	250.4	257.95
ICICI LOMBA	855.45	848.4
ICICI PRU L	299.4	303.8
VODAFONE ID	32.85	34.05
INTERGLOBE	1161.75	1178.55
L&T FINANCE	134.65	137.5
LIC HOUSING	453.05	469.6
LUPIN LIMIT	865.05	868.4
MARICO LIMI	369.9	373.95
UNITED SPIR	554.85	571.75
MOTHERSON S	150.8	154.05
MRF LTD	63920.95	64902.75
NHPC LTD	25	25.3
THE NEW IND	174.8	179
NMDC LTD.	90.5	90.1
ORACLE FIN	3708	3796.4
OIL INDIA L	171.85	170
PIRAMAL ENT	2299.2	2307.75
PETRONET LN	227.05	226.3
P&G HYGIENE	9928.85	9921.3
PIDILITE IN	1129.8	1109.35
STEEL AUTHO	47.25	48.25
SBI LIFE IN	619.6	618.25
SHREE CEMEN	15723.2	16170.55
SIEMENS LTD	1029.75	1027.95
SHRIRAM TRA	1120.15	1114.55
SUN TV NETW	505.85	527

బీఎస్‌ఈలో ఏపీ,టీఎస్ స్టాక్స్

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
AditSpin	5.41	5.69
Alphageo	465.8	470.05
Alu Flouride	102.15	112.5
Amar Raja Bat	765	775.35
And Bank	26.5	27
And Cemen	4.98	5.1
And Paper	421.4	432.65
And Petro	58.95	59.75
Anjani Portl	111.55	119.75
Aries Agro Ltd	90	92.85
Aurobindo Ph	784	787.8
Avantel Soft	222.1	222
Avanti Feeds	349.4	358.7
BN Rathi Sec	24.75	25.05
Bakelite	16.45	15.75
Balaji Amin	468	480.3
Bambino Agro	177.8	183
Bartronics	6.61	6.74
Bhagira Chem	430	430
Bhagya Nag	34.25	34.8
Bhagya Wood	19.5	19
Brilliant Sec	0.96	1.01
CIL Securi	14.8	15.15
Cont Coffee	269.55	273.75
CoroFert	437.5	443
Cosboard Ind	13.03	13.29
Country Club	6.97	7.29
Cubex Tub	14.2	14.62
Cybermate	1.95	1.96
DR Reddy	2666	2666.2
Danlaw Tec	90.2	94.5
DecCement	391	391
Divi's Lab	1493	1494.85
Divya Granit	98.05	102.9
Dredgin Corp	406.75	420.95
Empee Sugars	1.4	1.47
Everest Org	146.3	127.15
Fortune Info	37.1	38.5
Four Soft	38	37.85
GMR Infra	15.65	15.95
GVK Power	6.87	6.87
Gati Corpn	75.35	76.4
Gayatri Bio	2.44	2.56
Gayatri Proj	165.05	166.4
Gayatri Sugrs	2.92	2.79
Gennex Lab	3.25	3.49
GodavDru	21.95	22.05
Goldstn Tele	222.8	238.1
Goldstone Tech	13.25	13.7
Granules (I)	94.1	96
HBL Nife Pow	26.25	26.7
HYDIndus	1911.1	1927.75
Heritage Food	502	515.85
IDL Industrs	248	260.2
IQMS Soft	8.71	9.16
IVRCL Infras	0.94	0.96
Incap	40	38.85
IndoNationl	693	683.1
Infotech En	597.35	591.95
Invinex Lab	45.35	43.4
JSTL	34.5	36
KCP LTD	86.3	86.35
KNR Constructio	210.7	210.55
KakatiCem	186.5	188.35
Kallam Spg	17.3	16.95
Kernex Micro	26.2	25.65
Krebs Bio	117.45	112.1
LGS Global	2.95	3.03
LancoIndus	181	181.45
Lokesh Mach	44.05	44.15
Lotus Choc	24.35	23.25
MIC Elec	0.91	0.92
Madhucon Proje	6.3	6.73
Maytas Infra	12.5	12.75
Mold-tek	48.9	50.25
Moldtek Plastic	258.95	262.9
Moschip Semi	21.15	21.4
NCCBlue Wat	7.03	6.9
NCLInd	124.35	126.3
NETTLINX	45.5	44.65
NMDC Ltd	90.4	90.15
NagarAgrich	27.25	27.5
NagarConst	81.6	83.9
Natco Pharma	678.55	681.65
Nava Bh Ventur	111.25	111.65
Neha Inter	4.15	4.3
Neocure Ther	2.38	2.29
Neuland Lab	498	504.95
Nihar Info Glo	10.85	11.4
Nile	345	348.3
Northgate Tech	0.65	0.64
Oil Country	13.6	14
Ortin Lab	16.15	15
Padmalaya Tele	2.12	2.23
Panyam Cemen	11.5	11.92
Peeti Securt	5.78	5.51
PennInd	36	37
Pitti Lamin	56	55.85
Pokarna	163.95	172.75
Prajay Engs	8.18	8.5
PremiExpl	255.15	252.8
Prism Cement	76	79.4
Raasi Refrac	18.12	17.27
Ragsan Petro	59.05	56.25
Rain Industries	114.65	119.45
Raj Packagin	26.5	28.4
Ram Informat	43.15	41.45
RavilGr	13.05	13.7
Reg.Ceramic	4.28	4.25
Restile Cer	4.21	3.82
Sagar Cem	615	644
Sai Wires(I)	1.07	1.09
Samkrg Pist	187.4	182.75
Sampre Nutri	42.45	40.45
SangInd	57	57.5
Satvah. Ispat	9.01	9.11
Saven Techno	28	28.3
Sibar Auto	29	29.45
Softpro Sys	3.36	3.53
South Bio Tech	1.91	1.94
South Magnes	12.12	11.55
SrRayAlk	35.15	36.5
Srinivasa Ship	40	41.45
Starchik Sp	25.95	26
Sujana Metal	0.37	0.38
Sujana Towers	1.3	1.26
Sujana Univers	0.3	0.3
Surana Tele	4.19	4.05
Suryachakra Pow	0.27	0.28
Suryalata Sp	130	127.5
SuvarCem	66	69
Suven Pharma	193.4	202.1
TCI Finance	15.1	14.85
Taj Gvk Hotel	178.8	182.45
Tanla Solutions	31.7	32.85
Trans Biotek	5.7	5.81
Transport Co	290.1	290.3
Trendy Knit	0.22	0.23
Usher Agro	2.27	2.38
V&K Soft	4	4
VBC Ferro	40.35	38.5
VST Indus	3200	3208.5
Vamshi Rubb	29.2	31
Viceroy Hotels	3.95	3.83
VijayTextil	39	40.25
Vimta Labs	255.05	265.4
Virat Crane	31	32.5
Virinchi Con	73.05	77.4
VisakaInd	374.05	393.6
Vista Pharma	26.5	27.2
Vivimed Labs	23.2	25.35
Vjil Consult	38.95	38.95
ZenoTech Lab	30.25	32.4

మేరా బాలీవుడ్ మహాన్



● మదర్ ఇండియా

నీవొక సైనికురాలివి... నేనొక సైనికుడిని
ప్రత్యక్షంగా దేశాన్ని ప్రేమించి
గళమెత్తి యుద్ధం చేసే సైనికులం మనం
చేతిలో గన్ను లేకపోవచ్చు..
ఖడ్గం ఉండకపోవచ్చు
కానీ మన చప్పట్లతో వీర జవాన్ల గుండెల్లో
ధైర్యం నింపే సైనికులం మనం
కుర్చీ అంచున కూర్చుని దేశభక్తిని ధ్వనించే గుండె మనది.
సినిమా థియేటర్‌లో వినిపించే హోరు మనది



● బోస్ ది ఫర్గాటెన్ హీరో
● చక్ దే ఇండియా

స్వాతంత్ర్యం వచ్చింది. 'క్విట్ ఇండియా', 'వందే మాతరం', 'ఇంక్విలాబ్ జిందాబాద్', 'జైహింద్', 'స్వరాజ్ మేరా జన్మ సిధ్ అధికార్ హై' వంటి నినాదాలతో నాయకులు ప్రజలను ఉర్రూతలూగించి, లెక్కలేనన్ని త్యాగాలతో స్ఫూర్తి నింపి భారతమాత దాస్యశృంఖలాలను పెళ్ళగించి అవతల పారేయగలిగారు. దేశం ఉత్సాహంగా అడుగు ముందుకేసింది. 'ఆరామ్ హరామ్ హై' అంటూ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ విరామమెరగక దేశ నిర్మాణంలో పడ్డారు. మరోవైపు అప్పటికే యవ్వనంలోకి అడుగు పెట్టిన హిందీ సినిమా ఆ స్ఫూర్తిని, ఆ తర్వాత అవసరమైన మార్గదర్శనాన్ని, ఆనాటి త్యాగాలను వీలు వెంబడి వెండితెర మీద ప్రత్యక్షం చేస్తూ తాను నింపగల ఉత్సాహం తనూ నింపింది. ఎన్నో చిత్రాలు వచ్చాయి. కొన్ని మేలిమి ముత్యాలుగా నిలిచాయి.

ఉప్‌కార్... పూరబ్ ఔర్ పశ్చిమ్



● 'ఉప్‌కార్'

ఆ తర్వాత నటుడు మనోజ్ కుమార్ వచ్చి రెండు మూడు ముఖ్యమైన సినిమాలు తీశాడు. దేశం సుభిక్షంగా ఉండాలంటే ఇటు కిసాన్, అటు జవాన్ ఇద్దరూ శక్తిమంతంగా ఉండాలనే లాల్‌బహదూర్ శాస్త్రి నినాదాన్ని ఊతంగా తీసుకొని 'ఉప్‌కార్' (1967) సినిమా తీశాడు. 'ఏ దేశ్ కీ ధర్తీ'... పాట ఈ మట్టిలో మణులూ మాణిక్యాలు పండించడానికి స్వేదజలాన్ని చిందించే రైతుకు చేసిన శాల్యూట్ అని చెప్పవచ్చు. అదే సమయంలో మనోజ్ కుమార్ 'పూరబ్ ఔర్ పశ్చిమ్' (1970) సినిమా కూడా తీశాడు. స్వాతంత్ర్యం వచ్చిందనే అత్యుత్సాహంలో ఇబ్బడి ముబ్బడిగా పాశ్చాత్య ప్రభావానికి లోనై మన సంస్కృతిని దెబ్బ తీయడానికి యువత ప్రభావితం కావద్దని చెబుతూ తీసిన ఈ సినిమా ప్రేక్షకులకు గొప్పగా నచ్చింది.

మదర్ ఇండియా... నయా దౌర్



● నయా దౌర్

భారతదేశం అంటే రైతు. భారతదేశం అంటే పంటచేను. భారతదేశం అంటే పల్లెసీమ. స్వాతంత్ర్యం వచ్చాక భారతదేశ గ్రామీణ చిత్రం ఎలా ఉందో చూపుతూ, భారతీయ రైతు స్త్రీ విముక్తే అసలైన దాస్య విముక్తి అని ప్రతిపాదిస్తూ 'మదర్ ఇండియా' (1957) సినిమా వచ్చింది. నర్గిస్ నట జీవితంలో అత్యంత ముఖ్యమైన ఈ సినిమా సంఘ వ్యతిరేకం అయితే ఈ దేశం కోసం సొంత బిడ్డను కూడా బలి ఇవ్వడానికి భారత మాతృమూర్తి వెనుకాడదని చెప్పి తేజస్సుతో నిండిన సందేశాన్ని ఇచ్చింది. ఆ తర్వాత వచ్చిన 'నయా దౌర్' (1957) దేశంలో జరుగుతున్న యాంత్రికీకరణ, పారిశ్రామికీకరణ చర్చించింది. దేశీయ మూలాలను పదిలంగా ఉంచుతూ మార్పును స్వాగతించాలని సూచించింది. దిలీప్ కుమార్ నటించిన ఈ సినిమాలో ఓపి నయ్యర్ చేసిన 'సాథీ హాత్ బఢానా'... అనే పాట కలిసి మెలిసి ముందుకు అడుగువేసేందుకు స్ఫూర్తినిచ్చే ఒక గొప్ప బృందగీతం.

హకీకత్.. బోర్డర్... లక్ష్య



● 'బోర్డర్'

యుద్ధక్షేత్రం ఎలా ఉంటుందో తెలియకపోతే అసలైన దేశభక్తి ఎలా ఉంటుందో అర్థం కాదు. దేశం కోసం లేశమాత్రంగా ప్రాణం త్యాగం చేయడం ఎలా ఉంటుందో అర్థం కాదు. అందుకే బాలీవుడ్ మన దేశం ఎదుర్కొన్న యుద్ధాలను తన కథలుగా చేసుకుంది. 1962 వార్‌ను కథాంశంగా 'హకీకత్' (1964) తీసింది. ఇందులోని 'కర్ చలే హమ్ ఫిదా'... పాట ఇవాళ్టికీ పర్వ దినాలలో మొగుతూ నరనరాల ఉద్వేగం నింపుతూనే ఉంటుంది. ఆ తర్వాత 1971 భారత-పాకిస్తాన్‌ల యుద్ధ నేపథ్యంగా 'బోర్డర్' (1997) వచ్చింది. సన్నిడియోల్, అక్షయ్ ఖన్నా తదితరులు నటించిన ఈ సినిమాలో 'సందేశే ఆతేహై'.. పాట కుటుంబాలకు దూరంగా ఉండే సైనికుల వేదనను అశ్రువుల్లో చుట్టి వినిపిస్తుంది. ఇక దేశం చూపిన అతి గొప్ప సాహసం 'కార్గిల్' యుద్ధం. మన సైనికుల వీరత్వాన్ని చూపే ఈ యుద్ధం నేపథ్యంలో 'లక్ష్య' (2004) సినిమా వచ్చింది. ఫర్హాన్ అఖ్తర్ ఇందులో హీరో.


భగత్‌సింగ్... సుభాష్... మంగళ్‌పాండే



● ది లెజెండ్ ఆఫ్ భగత్‌సింగ్

దేశం దేశనాయకులను ఎలా మర్చిపోదో బాలీవుడ్ కూడా మర్చిపోదు. దేశం కోసం త్యాగం చేసిన ఆ అమరవీరులను బాలీవుడ్ తన శక్తిమేరకు చూపించే సగటు ప్రేక్షకుడికి వారిని మరింత చేరువ చేసింది. భగత్ సింగ్ జీవితం ఆధారంగా వచ్చిన 'ది లెజెండ్ ఆఫ్ భగత్‌సింగ్' (2002) అజయ్ దేవగణ్‌కు గొప్ప పేరు తెచ్చి పెట్టింది. సుభాస్ చంద్రబోస్ సమగ్ర జీవితాన్ని శ్యామ్ బెనగళ్ 'బోస్: ది ఫర్గాటెన్ హీరో' (2005)గా తీశాడు. ఇక ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ హీరో అయిన మంగళ్ పాండే జీవితాన్ని అదే పేరుతో 2005లో కేతన్ మెహతా ఆమిర్ ఖాన్ హీరోగా తెరకెక్కించాడు. సర్దార్ పటేల్ జీవితాన్ని పరేశ్ రావెల్ అభినయిస్తే దేశీయ భాషల్లో అంబేద్కర్ జీవితం వచ్చింది.

చక్ దే ఇండియా.. భాగ్ మిల్కా భాగ్... దంగల్



● 'దంగల్'

మరో వైపు క్రీడల ద్వారా దేశ భక్తిని నింపే ప్రయత్నం కూడా బాలీవుడ్‌లో జరిగింది. మహిళా హాకీ జట్టులో స్ఫూర్తి నింపే 'చక్ దే ఇండియా' (2007) సినిమా ఘన విజయం సాధించింది. షారుక్ ఖాన్ నటించడంతో ఈ సినిమా యువతను క్రికెట్ నుంచి ఆ ఆటవైపు చూసేలా చేసింది. 'ఫ్లయింగ్ సిక్'గా పేరుగాంచిన మిల్కాసింగ్ జీవితం 'భాగ్ మిల్కా భాగ్' (2013)గా రావడం ఒక ముఖ్య సన్నివేశం. ఫర్హాన్ అక్తర్ ఈతరం ప్రేక్షకులకు తెలియని మిల్కాసింగ్‌ను గొప్పగా తెర మీద చూపించగలిగాడు. ఇక ఏ దేశంలో అయితే స్త్రీలను వంటింటి పరిమితం చేస్తారనే పేరు ఉందో ఏ దేశంలో అయితే స్త్రీలను అణిచి ఉంచుతారనే ప్రచారం ఉందో ఆ దేశంలో నుంచి బాక్సింగ్ చేసే అమ్మాయిని 'మేరీ కోమ్' (2014)లో, కుస్తీ ఆడే ఆడపిల్లను 'దంగల్' (2016)లో చూపి దేశ మహిళల ఘనతకు ఒక నివాళి అర్పించగలిండి.

హిందూస్తానీ... వెడ్‌నెస్ డే



ఇక దేశంలోని అంతర్గత సమస్యలైన అవినీతి ఉగ్రవాదం వంటి సమస్యలను కూడా బాలీవుడ్ చర్చించింది. శంకర్ తీసిన 'హిందూస్తానీ' (1996), నసీరుద్దీన్ షా నటించిన 'వెడ్‌నెస్ డే' (2008) చాలా ప్రతిభావంతంగా ఆ సమస్యలను చర్చించి ప్రేక్షకులను ఆలోచింప చేశాయి

బాలీవుడ్ ఇంతటితో ఆగలేదు. సర్జికల్ స్ట్రయిక్స్‌ను కూడా కథాంశంగా తీసుకుని 'ఉడి' (2019) వంటి సినిమాలను ప్రేక్షకుల ముందుకు తెచ్చింది. రాబోయే రోజులలో మరెన్నో బయోపిక్‌లో గత కాలపు దేశ ఘనతలు వెండితెరను అలంకరించనున్నాయి. వాటిని చూసిన ప్రతిసారీ మనం మేరా భారత్ మహాన్ అనుకోవాలి. ఇండియా జిందాబాద్ అని గట్టిగా నినాదం ఇవ్వగలగాలి. ఈ దేశం పట్ల ప్రేమ, గౌరవం ఎప్పుడూ కొనసాగుతూనే ఉండాలని కోరుకుందాం.



● సిరివెన్నెల

పాట పరవశించింది

శుక్రవారం కేంద్ర ప్రభుత్వం పద్మ అవార్డులను ప్రకటించింది. తెలుగులో ప్రముఖ రచయిత 'సిరివెన్నెల' సీతారామశాస్త్రికు 'పద్మశ్రీ' అవార్డు ప్రకటించారు. నృత్యదర్శకుడు ప్రభుదేవా, బాలీవుడ్ నటుడు మనోజ్ బాజ్‌పేయి, గాయకులు శంకర్ మహదేవన్‌లకు పద్మశ్రీలను ప్రకటించారు. అలాగే మలయాళ నటుడు మోహన్ లాల్‌కు 'పద్మభూషణ్' ప్రకటించారు.

'అవును.. ఆలస్యం అయింది. అవార్డు అనేది విలువను గుర్తించేది, గౌరవించేది మాత్రమే కానీ విలువను నిరూపించేది కాదు' అని ప్రముఖ రచయిత 'సిరివెన్నెల' సీతారామశాస్త్రి ఓ సందర్భంలో అన్నారు. ఇండస్ట్రీకి వచ్చిన 35 ఏళ్లకు పద్మశ్రీ అందుకున్న ఆయన ఇండస్ట్రీకు రాకముందే తన పేరు ముందు పద్మను కలుపుకున్నారు. సిరివెన్నెల భార్య పేరు పద్మ. ఆ మధ్య 'సాక్షి' ఇంటర్వ్యూ చేసినప్పుడు పద్మ అవార్డు రాకపోవడం గురించి ప్రస్తావిస్తే ... 'నా పేరులోనే పద్మ ఉంది' అని చమత్కరించారు సిరివెన్నెల.

సిరి శక్తి

సమస్యను ఎదుర్కోమంటూ పాట ద్వారా ప్రేరేపించగలిగే శక్తి సిరివెన్నెల. మాట సైతం తన వెన్నెల ప్రసరించమని విన్నవించుకునే విన్నపం సిరివెన్నెల. ఆత్రేయ, వేటూరి తర్వాత తెలుగు పాట అంతలా పొంగిపోయేలా చేసింది సిరివెన్నెల.

కాకినాడ ఆంధ్రా యూనివర్శిటీలో బికామ్ పూర్తి చేసిన సీతారామశాస్త్రి 1984లో సినిమా సాహిత్యం వైపు అడుగులేశారు. మొట్టమొదట రాసింది జననీ జన్మభూమి(1984) సినిమాకే అయినా ఆ తర్వాత రాసిన 'సిరివెన్నెల' సినిమా పాటలు ఆయనకు ఇండస్ట్రీలో స్థానం ఇచ్చాయి. చెంబోలు సీతారామశాస్త్రి నుంచి 'సిరివెన్నెల' సీతారామశాస్త్రిగా మార్చింది ఆ చిత్రం. 'సిరివెన్నెల' తర్వాత శాస్త్రి వెనక్కు చూసుకునే పనిలేకుండా పోయింది. ఆ సినిమాలో రాసిన ప్రతీ పాట ఓ ఆణిముత్యం. అంత అర్థవంతంగా ఉండబట్టే ఆ ఏడాది బంగారు నంది శాస్త్రి ఇంటికి పరుగుతీసింది. తొలి సినిమాతోనే నంది అవార్డు అందుకున్న రికార్డు నెలకొల్పారాయన. ఆ తర్వాత అద్భుతమైన పాటలు రాస్తూ ఇండస్ట్రీలో తన మాటను పాటలా విస్తరిస్తూ సుస్థిరం చేసుకున్నారు. 'స్వయంకృషి, స్వర్ణకమలం, శ్రుతిలయలు, రుద్రవీణ, గాయం, సింధూరం, ప్రేమ కథ, నిన్నే పెళ్లాడతా, చక్రం, బొమ్మరిల్లు, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' వంటి సినిమాలకు అద్భుతమైన సాహిత్యాన్ని అందించారాయన. 'సింధూరం'లో అర్ధ శతాబ్దపు అజ్ఞానమే స్వాతంత్ర్యం అనుకుందామా? అని ప్రశ్నను సంధిస్తే దానికి సమాధానం నంది అవార్డు అయింది. 'దేవుడు కరుణిస్తాడనీ వరములు కురిపిస్తాడని..' ప్రేమ పాట రాయడం రాష్ట్ర ప్రభుత్వం నంది కురిపించడం జరిగిపోయింది. 'జగమంత కుటుంబం నాది.. ఏకాకి జీవితం నాది' అని 'చక్రం' సినిమాలో రాశారాయన. 'ఆయువనేది ఉండేవరకూ ఇంకేదో లేదని అనకూ' అనే జీవిత సారాన్ని చాలా తేలికైన పదాలతో కమర్షియల్ సినిమాలో చెప్పగల శక్తి, సామర్థ్యం ఉన్నది సిరివెన్నెలకే. 'సాహిత్యం అనేది అర్థం అయ్యేలానే రాయక్కర్లేదు. అర్థం చేసుకోవాలనే కుతూహలం రేకెత్తించేలా కూడా రాయొచ్చు. అలాంటి రచయిత సిరివెన్నెలగారు' అంటారు దర్శకుడు త్రివిక్రమ్. 3 వేలకు పైగా పాటలు, 11 రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డులు. 3 ఫిల్మ్ ఫేర్ అవార్డులు. 1986, 87, 88 సంవత్సరాలలో వరుసగా నంది అవార్డులను అందుకొని హ్యాట్రిక్ సృష్టించారు. ప్రస్తుతం ఉన్న అగ్ర పాటల రచయితలు కూడా సిరివెన్నెలను 'గురువు'గా భావిస్తారన్న సంగతి తెలిసిందే.

కళ, కళ యొక్క ముఖ్య ఉద్దేశం రేపటి మీద ఆశ కలిగించడం. సిరివెన్నెల పాటల్లో అది కనిపిస్తుంది. అదే కనిపిస్తుంది. చాలా సులువుగానే లోతుగా రాయడం ఆయన సొంతం. ఎన్ని అవార్డులు వరించినా ప్రేక్షకుడి పెదవి మీద కూనిరాగమే పెద్ద అవార్డు అంటారు సిరివెన్నెల. ఇప్పుడాయన పేరులో రెండు 'పద్మ'లున్నాయి. సతీమణి 'పద్మ'... కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'పద్మశ్రీ'. పాట ఆనందపడిన వేళ ఇది. పాట పరవశించిపోయిన వేళ ఇది.

స్టెప్పుకి మెప్పు



● ప్రభుదేవా

డ్యాన్స్‌లో సరికొత్త ట్రెండ్‌ని తీసుకొచ్చి దక్షిణాది, ఉత్తరాది తారలతో ఉర్రూతలూగించే స్టెప్పులేయించిన 'ఇండియన్ మైఖేల్ జాక్సన్' అనిపించుకున్నారు ప్రభుదేవా. తండ్రి సుందరం మాస్టారుని ఆదర్శంగా తీసుకుని, ఆయన దగ్గరే సహాయకుడిగా చేసి, ఆ తర్వాత నృత్యదర్శకుడిగా మారారు ప్రభుదేవా. 13 ఏళ్ల వయసులో తొలిసారి 'మౌనరాగం'(1986) చిత్రంలో ఫ్లూట్ వాయించే కుర్రాడిగా ఓ పాటలో కనిపించిన ప్రభుదేవా ఆ తర్వాత 'అగ్ని నక్షత్రం' అనే సినిమాలో బ్యాగ్రౌండ్ డ్యాన్సర్‌గా చేశాడు. 'ఇదయం' (1991) (తెలుగులో 'హృదయం')లో చేసిన స్పెషల్ సాంగ్ 'ఏప్రిల్ మేయిలే..' అప్పటి కుర్రకారుని ఉర్రూతలూగించింది. ఇక 'జెంటిల్ మేన్'లో 'చికుబుకు చికుబుకు రైలే...' సాంగ్‌లో ప్రభుదేవా వేసిన స్టెప్స్ సూపర్ అననివాళ్లు లేరు. ఇతర హీరోల చిత్రాల్లో ప్రత్యేక పాటలు చేయడంతో పాటు పలువురు అగ్రహీరోల చిత్రాలకు నృత్యదర్శకుడిగానూ చేశారు ప్రభుదేవా. 16 ఏళ్ల వయసులో తొలిసారి నృత్యదర్శకుడిగా కమల్‌హాసన్ 'వెట్రి విళా'కి చేసిన ప్రభుదేవా ఆ తర్వాత నుంచి వెనక్కి తిరిగి చూసుకోలేనంత బిజీగా అయ్యాడు. రజనీ 'దళపతి' లోని 'చిలకమ్మా చిటికెయ్యంట...', చిరంజీవి నటించిన 'రౌడీ అల్లుడు', 'జగదేకవీరుడు అతిలోక సుందరి'... వంటి చిత్రాలతో పాటు రీ-ఎంట్రీ మూవీ 'ఖైదీ నం. 150' వరకూ ప్రభుదేవా పలు చిత్రాలకు కొరియోగ్రఫీ చేశారు. నాగార్జునతో 'విక్రమ్, కెప్టెన్ నాగార్జున' వంటి చిత్రాలకు, బాలకృష్ణ, వెంకటేశ్ .. ఇలా అగ్రహీరోలందరితో కొత్త స్టెప్పులు వేయించారు. ఒకవైపు నృత్యదర్శకుడిగా కొనసాగుతూ నటుడిగా మారారు ప్రభుదేవా. దర్శకుడు పవిత్రన్ 'ఇందు' చిత్రంలో ప్రభుదేవా తొలిసారి లీడ్ రోల్ చేశారు. శంకర్ 'ప్రేమికుడు' హీరోగా ప్రభుదేవాకు పెద్ద బ్రేక్. ఆ సినిమాలో 'ముక్కాలా ముక్కాబులా..', 'ఊర్వశీ ఊర్వశీ.. టేకిట్ ఈజీ పాలసీ..' పాటలకు ప్రభుదేవా వేసిన స్టెప్స్‌ని నేటి తరం కూడా ఫాలో అవుతోంది. 'మెరుపు కలలు', 'సంతోషం'..వంటి చిత్రాలతో పాటు డ్యాన్స్ బేస్డ్ మూవీస్ 'స్టైల్', 'ఎబిసిడి' వంటి చిత్రాలు కూడా చేశారు.

డైరెక్షన్ మారింది

తండ్రి దగ్గర సహాయకుడిగా చేసి, నృత్యదర్శకుడిగా స్టెప్ వేసి, నటుడిగా మరో అడుగు వేసి, ఆ తర్వాత డైరెక్టర్‌గానూ తన కెరీర్ డైరెక్షన్ మార్చారు ప్రభుదేవా. సిద్ధార్థ్ హీరోగా ప్రభుదేవా దర్శకత్వం వహించిన తొలి చిత్ర 'నువ్వొస్తానంటే నేనొద్దంటానా' సూపర్ హిట్. ప్రభాస్‌తో 'పౌర్ణమి'ని తెరకెక్కించారు. చిరంజీవి 'శంకర్‌దాదా జిందాబాద్'కి కూడా దర్శకత్వం వహించారు. తెలుగు 'పోకిరి'కి రీమేక్‌గా తమిళంలో 'పోకిరి', హిందీలో 'వాంటెడ్'గా ప్రభుదేవా దర్శకత్వం వహించిన చిత్రాలు దర్శకుడిగా అతని ప్రతిభను నిరూపించాయి. ఆ తర్వాత పలు తమిళ, హిందీ చిత్రాలకు దర్శకత్వం వహించారు ప్రభుదేవా. నిర్మాతగా తమిళంలో దేవి, బోగన్‌తో పాటు మరో మూడు చిత్రాలను రూపొందించారు. మైసూర్‌లో 1973 ఏప్రిల్ 3న ముగూర్ సుందర్, మహదేవమ్మ సుందర్‌లకు జన్మించిన ప్రభుదేవా పెరిగింది చెన్నైలో. ధర్మరాజ్, ఉడుపి లక్ష్మీనారాయణన్ మాస్టార్ల దగ్గర క్లాసికల్ డ్యాన్స్ నేర్చుకుని టీనేజ్‌లోనే సినిమాల్లోకొచ్చారు. దాదాపు 30 ఏళ్ల కెరీర్‌ని సొంతం చేసుకున్న ప్రభుదేవా సినీ రంగంలో నృత్య దర్శకుడిగా చేసిన సేవలకు గాను 'పద్మశ్రీ' వరించింది.